


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 86

సోమవారం 17-6-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




## మిస్ ఇండియాగా సుమన్ రావ్

తెలంగాణకు చెందిన సంజనా(కుడి చివర) మిస్ ఇండియా రన్నరప్

- వివరాలు 5లో


DELL
PROUD TO BE INDIA'S MOST TRUSTED BRAND
Thank you for the honour.



www.dell.co.in


# నైరుతి నైరాశ్యం

## రుతుపవనాల సీజన్ మొదలై 15 రోజులైనా జాడలేని వానలు

- ఈ నెలలో సాధారణంకన్నా 46% లోటు వర్షపాతం
- రిజర్వాయర్లలో ఎన్నడూ లేనంత నీటి కొరత
- పూర్తిగా ఎండిన నిజాం సాగర్, సింగూరు, ఎస్సారెస్పీ
- శ్రీశైలం, సాగర్‌లో కనీస మట్టాలకు దిగువన నీటి వాడకం
- భూగర్భ జలాల్లో భారీ క్షీణత... మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో 20 మీటర్ల దిగువకు
- నోర్లెళ్లబెట్టిన చెరువులు.. కోటి ఎకరాల సాగుపై ప్రభావం
- ఈ నెల 20 నుంచి రాష్ట్రంలోకి రుతుపవనాల ప్రవేశం
- ప్రత్యామ్నాయ ప్రణాళికపై వ్యవసాయశాఖ సూచనలు




సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం అంతులేని సమస్యలు తెచ్చి పెడుతోంది. వర్షాకాల సీజన్ మొదలై 15 రోజులు కావస్తున్నా నైరుతి స్తంభించడంతో సాధారణంకన్నా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతూ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. రుతుపవనాల రాక ఆలస్యంతో వర్షాలు కురవక కోటి ఎకరాల్లో ఖరీఫ్ సాగుపై రైతులు దిగాలు చెందుతున్నారు. భారీ రిజర్వాయర్లలో నిల్వలు ఖాళీ కావడం, భూగర్భ జలాల్లోనూ మునుపెన్నడూ లేని రీతిలో భారీ తగ్గుదల కనిపిస్తుండటం ఆందోళన రేపుతోంది. ఇప్పటికే పట్టణ ప్రాంతాల్లో తాగునీటి ఇక్కట్లు మొదలవగా అవి మరింత ముదిరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఈ నెల 20 నుంచి రాష్ట్రంలోకి నైరుతి ప్రవేశం ఉంటుందన్న సంకేతాలు కొంత ఉపశమనం కల్గిస్తున్నాయి.

### 46 శాతం లోటు వర్షపాతం...

రాష్ట్రంలో మామూలుగా జూన్‌లో 136 మిల్లీమీటర్ల వర్షపాతం పడాల్సి ఉంది. కానీ రుతుపవనాల ఆలస్యంతో సాధారణంకన్నా 46 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ నెలలో సాధారణం కంటే 60–70% తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉంటాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. నిజానికి ఈ నెల 8నే నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకినా అరేబియా సముద్రంలో ఏర్పడిన వాయు తుపాను ప్రభావంతో అవి స్తంభించాయి. దీంతో రాష్ట్రంలో సాధారణంకంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదిలాబాద్, కొమురం భీం, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి, ఖమ్మం,

మిగతా 2వ పేజీలో ▶

అమెరికా ఐయోవా రాష్ట్రంలోని చంద్రశేఖర్ ఇంటి వద్ద పోలీసుల తనిఖీలు



# అమెరికాలో నలుగురు తెలుగువారు దుర్మరణం

## నెత్తుటి మడుగులో మృతదేహాలు శరీరంపై బుల్లెట్ గాయాలు

వెస్ట్‌డెస్ మోయిన్స్: అమెరికాలోని ఐయోవా రాష్ట్రంలో దారుణం చోటుచేసుకుంది. ఇక్కడి వెస్ట్‌డెస్ మోయిన్స్‌లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు తెలుగువారు అనుమానాస్పద స్థితిలో చనిపోయారు. మృతుల శరీరంపై తుపాకీ బుల్లెట్ల గాయాలున్నాయి. ఈ విషయమై నగర పోలీస్ సార్జంట్ డాన్ వేడ్ మాట్లాడుతూ..'యాష్‌వర్త్ రోడ్డు–అస్పెన్ డ్రైవ్‌ల మధ్య ఉన్న 65 స్ట్రీట్‌లోని ఓ ఇంట్లో సమస్య ఉందని శనివారం ఉదయం 10 గంటలకు(స్థానిక కాలమానం ప్రకారం) 911కు ఫోన్‌కాల్ వచ్చింది. దీంతో మా యూనిట్లు ఘటనాస్థలికి చేరుకున్నాయి. ఇంట్లో బుల్లెట్ గాయాలతో రక్తపు మడుగులో ఉన్న నలుగురి మృతదేహాలను గుర్తించాం. ఈ దుర్ఘటనలో

మిగతా 2వ పేజీలో ▶

# రోహిట్ హిట్ హుర్రే

## భారత్ పరాక్రమం.. పాక్ పాదాక్రాంతం..

మెగా టోర్నీకే తలమానికమైన పోరులో భారత్ జయభేరి మోగించింది. ఆదివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో భారత్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 89 పరుగుల తేడాతో గెలుపొందింది. ప్రపంచకప్‌లో భారత్ అజేయ 'చరిత్ర'లో మరో విజయం చేరగా.. పాక్‌కు మళ్లీ 'ఏడు'పే మిగిలింది. ముందుగా భారత్ 50 ఓవర్లలో 5 వికెట్లకు 336 పరుగుల స్కోరు సాధించింది. రోహిత్ శర్మ శతక్కొట్టగా... కోహ్లి, రాహుల్ ఫిఫ్టీలతో చితగ్గొట్టారు. పాక్ 40 ఓవర్లలో 6 వికెట్లకు 212 పరుగులే చేసింది. వర్షం వల్ల పాక్ లక్ష్యాన్ని 40ఓవర్లలో 302 పరుగులుగా సవరించారు.




రోహిత్ బాదుడు ఇలా..



పరుగులు 140(113)
ఫోర్లు 14
సిక్స్‌లు 3

- వివరాలు స్పోర్ట్స్‌లో

**బీజేపీతో జేడీయూ కటీఫ్?**

- వివరాలు 5లో


NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
Vencobb CHICKEN
ప్రతిపాదించిన నేటి గుడ్డు & చికెన్ హైదరాబాద్ జోన్ ధరలు

| గుడ్డు రిటైల్ ధర ₹ 52 డజన్ | ఫారం దగ్గర లైవ్ బర్డ్ | 140 కిలో | డ్రస్డ్ స్కిన్‌తో | 235 కిలో |
|---|---|---|---|---|
| | రిటైల్ లైవ్ బర్డ్ | 162 కిలో | స్కిన్‌లెస్ | 267 కిలో |

Conditions Apply.
వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది


# బిల్డర్లూ.. పారాహుషార్

## సౌకర్యాలు కల్పించకుంటే బ్లాక్‌లిస్టే

**కొత్త మున్సిపల్ చట్టంలో లే అవుట్లపై కఠిన నిబంధనలు**

- బిల్డర్లు, అధికారులను బాధ్యులను చేసేలా ముసాయిదా రూపకల్పన
- డాక్యుమెంట్లు సమర్పించాక భవన నిర్మాణ అనుమతులకు గడువు వారమే
- ఆలోగా తేల్చకుంటే అనుమతి ఇచ్చినట్లే.. అధికారులపైనా చర్యలు
- 200 చ.మీ.లోపు స్థలంలో భవన నిర్మాణానికి ఇక సెల్ఫ్ డిక్లరేషనే

సాక్షి, హైదరాబాద్: భూమి వినియోగంలో హేతుబద్ధత, భవన నిర్మాణాలకు సంబంధించి కొత్త మున్సిపల్ చట్టంలో కఠిన నిబంధనలు రూపొందిస్తున్నారు. ముఖ్యంగా లే అవుట్ల విషయంలో బిల్డర్లు, అధికారులను బాధ్యులను చేసేలా ముసాయిదా మున్సిపల్ చట్టాన్ని రూపొందించినట్లు తెలుస్తోంది. లే అవుట్లు చేశాక ప్లాట్లు, ఫ్లాట్ల రూపంలో అమ్ముకొని సొమ్ము చేసుకొనే బిల్డర్లు ఆయా లే అవుట్లను గాలికి వదిలేస్తే వారిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టేలా నిబంధనలు తయారవుతున్నాయి. లే అవుట్ ఆమోదం పొందిన రెండేళ్లలో కనీస సౌకర్యాలను కల్పించి సంబంధిత ఆధారాలను ఆన్‌లైన్‌లో పొందుపరచకుంటే ఆ బిల్డర్లను

మిగతా 2వ పేజీలో ▶








# షోకాజ్ ఇస్తారా?

- రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై టీపీసీసీ ఆచితూచి అడుగులు
- నేడు కాంగ్రెస్ క్రమశిక్షణా సంఘం భేటీ
- అవసరమనుకుంటేనే షోకాజ్ నోటీసు జారీ
- సస్పెండ్ చేస్తే ఆయన పార్టీ మారే స్వేచ్ఛ ఇచ్చినట్లే!
- పార్టీ మారితే ఫిరాయింపుల కింద ఫిర్యాదు చేసే అవకాశం
- జగ్గారెడ్డి, పొన్నం, మరికొందరితో రాజగోపాల్ సంప్రదింపులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తు లేదని, టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయేనంటూ సంచలన వ్యాఖ్యలు చేసిన మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి షోకాజ్ నోటీసు ఇస్తారా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. ఆయన వ్యాఖ్యలపై ఆరా తీసిన అధిష్టానం పెద్దలు... ఈ విషయంలో చాలా సీరియస్‌గా ఉన్నారని తెలుస్తోంది. పార్టీ అధ్యక్షుడు రాహుల్ సహా నేతలందరిపై విమర్శలు చేసిన రాజగోపాల్‌రెడ్డిపట్ల ఉదాసీనంగా వ్యవహరించొద్దని ఢిల్లీ పెద్దలు రాష్ట్ర నాయకత్వానికి దిశానిర్దేశం చేసినట్టు తెలుస్తోంది. అయితే ఈ విషయంలో ఆచితూచి అడుగులు

మిగతా 4వ పేజీలో ▶

## నేటి నుంచి కొత్త బీసీ గురుకులాలు

- నూతనంగా 119 పాఠశాలల ప్రారంభం
- ఏకకాలంలో ప్రారంభించనున్న బీసీ గురుకుల సొసైటీ
- ఈ విద్యా సంవత్సరంలో 5, 6, 7 తరగతులతో ఆరంభం

- 2లో

సాగు సంక్షోభం..

## నిరుద్యోగం

- అఖిలపక్ష భేటీలో లేవనెత్తిన విపక్షాలు
- కరువు, పత్రికా స్వేచ్ఛపై కూడా పార్లమెంటులో చర్చకు డిమాండ్
- నేటి నుంచి లోక్‌సభ.. నేడు ఎంపీల ప్రమాణ స్వీకారం

- 5లో

## నేడు విజయవాడకు కేసీఆర్

- కాళేశ్వరం ప్రారంభోత్సవానికి ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్‌ను ఆహ్వానించనున్న ముఖ్యమంత్రి
- విభజన సమస్యలపై ఇరువురు సీఎంల మధ్య మరో దఫా చర్చలకు అవకాశం

4లో








సతీశ్‌ ధవన్‌ స్పేస్‌ సెంటర్‌లో ప్రారంభోత్సవానికి సిద్ధంగా రెండో వెహికల్‌ అసెంబ్లింగ్‌ బిల్డింగ్‌

## చంద్రయాన్‌-2 ప్రయోగానికి ప్రధాని రాక?

### రెండో వెహికల్‌ అసెంబ్లింగ్‌ బిల్డింగ్‌ను ప్రారంభించే అవకాశం

**సూళ్లూరుపేట:** శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా సతీష్‌ ధవన్‌ స్పేస్‌ సెంటర్‌ (షార్‌) నుంచి జూలై 15న ఇస్రో నిర్వహించనున్న చంద్రయాన్‌-2 ప్రయోగాన్ని తిలకించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ రానున్నారని తెలిసింది. ఆయనతో పాటు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి, గవర్నర్‌ నరసింహన్‌ కూడా హాజరుకానున్నారు. గతంలో మంగళ్‌యాన్‌ ప్రయోగ సమయంలోనూ ప్రధాని వచ్చిన విషయం తెలిసిందే. గ్రహాంతర ప్రయోగం.. పైగా దేశానికి ప్రతిష్టాత్మకం కావడంతో ఆయన స్వయంగా వచ్చి తిలకించనున్నారు. ఈ ప్రయోగానికి ముందుగానే.. సుమారు 1500 మందితో శాస్త్రసాంకేతిక రంగానికి సంబంధించి ఓ సమావేశం నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. రూ.500 కోట్లతో నిర్మించిన రెండో వెహికల్‌ అసెంబ్లింగ్‌ బిల్డింగ్‌ను కూడా ప్రధాని చేతుల మీదుగా ప్రారంభింపజేసేందుకు ఇస్రో వర్గాలు సన్నాహాలు చేస్తున్నాయి. 2022 కంటే ముందుగానే గగన్‌యాన్‌ ప్రయోగాన్ని నిర్వహించాలని ప్రధానమంత్రి ఆదేశాలతో రెండో ప్యాబ్‌ను ప్రారంభించి అందుబాటులోకి తెచ్చేందుకు ఇస్రో కసరత్తు చేస్తోంది.

## ఎంపీడీఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా సత్తయ్య

**అనంతగిరి:** ఎంపీడీఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రాజేంద్రనగర్‌ ఎంపీడీఓ సత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా ప్రశాంతి ఎన్నికయ్యారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా పరిషత్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలకు న్యాయం చేస్తానన్నారు. సత్తయ్య రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపిక కావడంపై ఉద్యోగులు, జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# నైరుతి నైరాశ్యం

▶ మొదటి పేజీ తరువాయి

మహబూబ్‌నగర్, వరంగల్‌ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 నుంచి 43 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. అయితే గత రెండ్రోజులుగా నైరుతి రుతుపవనాలు నెమ్మదిగా రాష్ట్రంవైపు కదులుతున్నాయి. అవి ఈ నెల 20న రాష్ట్రాన్ని తాకే అవకాశం ఉందని వాతావరణ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జూలై నుంచి సాధారణంకంటే 60–70శాతం అధిక వర్షపాతం నమోదవుతుందని స్పష్టం చేస్తున్నారు.

**చుక్కలేని కొత్త నీరు...**

రాష్ట్రంలో ప్రధాన రిజర్వాయర్లన్నీ నోరెళ్లబెట్టాయి. ఏ రిజర్వాయర్‌లోనూ చెప్పుకోదగ్గ రీతిలో నీటి నిల్వలు లేవు. ఒక్క ఎల్లంపల్లిలో మాత్రం ఒకట్రెండు నెలల తాగునీటి అవసరాలకు సరిపడే నిల్వలు ఉండగా మిగతావన్నీ ఎండిపోయి కనిపిస్తున్నాయి. గోదావరి బేసిన్‌ ప్రాజెక్టుల్లో దారుణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. సింగూరు, నిజాంసాగర్‌లో చుక్కనీరు లేదు. ఎస్సారెస్పీది అదే పరిస్థితి. బేసిన్‌లో మొత్తంగా 215 టీఎంసీల నిల్వ ప్రాజెక్టులుండగా ఏకంగా 200 టీఎంసీల నీటి లోటు కనబడుతోంది. ప్రస్తుతం జూన్‌ మూడో వారంలోకి వస్తున్నా ఇంతవరకు చుక్క నీటి ప్రవాహాలు లేవు. సాధారణంగా గోదావరిలో జూన్‌ రెండో వారం నుంచి నీటి ప్రవాహాలు ఉండే అవకాశం ఉన్నా రుతుపవనాల ఆలస్యం కారణంగా ఇంతవరకు ప్రవాహాల జాడ కనిపించడం లేదు. ఈ ప్రభావం గోదావరి బేసిన్‌లోని 15–18 లక్షల ఎకరాలపై ప్రభావం చూపనుంది. కృష్ణా బేసిన్‌లోనూ ఇవే పరిస్థితులున్నాయి. నాగార్జునసాగర్, శ్రీశైలం, జూరాల ప్రాజెక్టుల్లో 537 టీఎంసీలకుగాను ప్రస్తుతం 375 టీఎంసీల నీటి లోటు ఉంది. ఇందులో సాగర్‌లో ప్రస్తుతం 128.63 టీఎంసీల నీటి లభ్యత కనబడుతున్నా ఇదంతా కనీస నీటి మట్టాలకు దిగువన ఉన్నదే. ఇక్కడ డెడ్‌ స్టోరేజీ 510 మీటర్లుకాగా ఇప్పటికే 508 మీటర్ల వరకు వెళ్లి హైదరాబాద్‌ తాగునీటి అవసరాలపై నీటిని అత్యవసర పంపింగ్‌ చేస్తున్నారు. శ్రీశైలంలో 215 టీఎంసీలకుగాను 32.24 టీఎంసీల లభ్యతగా ఉండగా ఇప్పటికే కనీస నీటి మట్టాలకు దిగువకు వెళ్లి ఇరు రాష్ట్రాలూ నీటిని తీసుకుంటున్నాయి. ఎగువన కర్ణాటక ప్రాజెక్టులైన ఆల్మట్టి, నారాయణపూర్, తుంగభద్ర ప్రాజెక్టుల్లో 225 టీఎంసీల నీరు చేరితేగానీ రాష్ట్ర ప్రాజెక్టులకు నీళ్లు రావు. సాధారణ వర్షపాతాలు నమోదయ్యే ఏడాదుల్లోనూ ఆగస్టు, సెప్టెంబర్‌ వరకు రాష్ట్ర ప్రాజెక్టులు నిండవు. ప్రస్తుతం రుతుపవనాల ఆలస్యం కారణంగా అక్టోబర్‌ వరకు ప్రాజెక్టులు నిండుతాయో లేదో చెప్పలేని పరిస్థితులున్నాయి. ఇదే జరిగితే జూరాల, సాగర్‌ కింద 11 లక్షల ఎకరాల ఆయకట్టుపై ప్రభావం పడే అవకాశం ఉంది. మధ్యతరహా ప్రాజెక్టుల్లోనూ ఎక్కడా నీళ్లు రాలేదు. రాష్ట్రంలో 40 వేలకుపైగా చెరువులు ఉండగా 90 శాతానికిపైగా చెరువులు ఎండిపోయి కనిపిస్తున్నాయి. దీంతో వీటి కింద సాగయ్యే 25 లక్షల ఎకరాలు సాగుక్లిష్టంగానే మారనుంది.

**భూగర్భ జలాలు దయనీయం..**

రాష్ట్రంలో భూగర్భ జలాలు రోజురోజుకూ పడిపోతున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. లోటు వర్షపాతం కారణంగా చాలా జిల్లాల్లో రబీ పంటల సాగుకు రైతులు బోర్లపై ఆధారపడటంతో మట్టాల్లో భారీగా తగ్గుదల కనిపిస్తోంది. గతేడాది మే నెలలో రాష్ట్ర సాగటు నీటిమట్టం 12.73 మీటర్లు ఉండగా ఈ ఏడాది అది 14.46 మీటర్లుగా నమోదైంది. గతేడాది మే నెల మట్టాలతో పోలిస్తే ఈ ఏడాది ఏకంగా 1.83 మీటర్ల దిగువకు పడిపోయాయి. మెదక్‌ జిల్లాలో ఏకంగా 26.47 మీటర్లకు భూగర్భ నీటిమట్టం పడిపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్‌ జిల్లాల్లో 20 మీటర్లకన్నా ఎక్కువగా నీటి మట్టాలు పడిపోగా కామారెడ్డి, సిరిసిల్ల, మహబూబ్‌నగర్‌ వంటి జిల్లాల్లోనూ గడ్డు పరిస్థితులే ఉన్నాయి. భూగర్భమట్టాలు తగ్గుతుండటంతో చాలా జిల్లాల్లోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నీటికి కటకట మొదలైంది. బోర్లు పనిచేయక పోవడంతో పట్టణాల్లో వాటర్‌ ట్యాంకర్లపై ఆధారపడుతున్నారు. ఈ దృష్ట్యానే సాగునీటి ప్రాజెక్టుల్లో తొలి ప్రాధాన్యం తాగునీటి అవసరాలకేనని తేల్చి చెబుతోంది. మిషన్‌భగీరథ అవసరాలకు రెండు బేసిన్‌ల ప్రాజెక్టుల నుంచి కనిష్టంగా 60 టీఎంసీల నీటిని పక్కన పెట్టాకే సాగు అవసరాలకు నీటి విడుదల ఉంటుందని స్పష్టంగా చెబుతోంది. ప్రస్తుతం ఈ రెండు బేసిన్‌ల పరిధిలోనూ నిల్వలు తగ్గుతున్న క్రమంలో వర్షాలపైనే భవిష్యత్‌ ఆధారపడి ఉంది.

**ఇప్పుడే వర్షాధార పంటలు వద్దు**

ఖరీఫ్‌ పంటల సాధారణ సాగు విస్తీర్ణం 1.07 కోట్ల ఎకరాలు కాగా, ఇప్పటివరకు సాగు లక్ష ఎకరాలకు మించింది లేదు. గతేడాది ఇదే సమయానికి 5 లక్షల ఎకరాలు సాగు జరిగినట్లు వ్యవసాయశాఖ నివేదికలు చెబుతున్నాయి. అంటే గతేడాది కంటే గణనీయంగా తక్కువ విస్తీర్ణంలోనే పంటలు సాగయ్యాయి. ఖరీఫ్‌ వరి సాధారణ సాగు విస్తీర్ణం 35 లక్షల ఎకరాలుకాగా ఇప్పటివరకు నార్లు పోసిన దాఖలాలు కనిపించడం లేదు. వర్షాలు కురిస్తే జూలై, ఆగస్టులో వరి నాట్లు పుంజుకోనున్నాయి. ఈ నేపథ్యంలో వాతావరణ పరిస్థితులపై అధ్యయనం చేసిన ఆచార్య జయశంకర్‌ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి పరిధిలోని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ, రాష్ట్ర వ్యవసాయ శాఖ ఈ మేరకు ఒక సంయుక్త ప్రణాళికను రూపొందించి శనివారం విడుదల చేశాయి. దాని ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల వర్షపాతం సాధారణం కంటే 60–70శాతం వరకు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉండగా జూలైలో 60–70 శాతం ఎక్కువ నమోదయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు రుతుపవన వర్షాలు కానందున వర్షాధార పంటలు విత్తుకోకూడదని సూచించింది. నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన తర్వాత తేలికపాటి నేలల్లో 50–60 మిల్లీమీటర్ల వర్షపాతం, బరువు నేలల్లో 60–70 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యాక వర్షాధార పంటలైన సోయా చిక్కుడు, మొక్కజొన్న, జొన్న, కంది, పెసర, పత్తి తదితర పంటలు విత్తుకోవాలని తెలిపింది. వరి సాగు చేసే పొలాల్లో తొలకరి వర్షాలను ఉపయోగించుకొని జనుము, జీలుగను పచ్చిరొట్ట పైరుగా, ఆలస్యంగా నీరు విడుదలయ్యే ప్రాంతాల్లో పెసరను పైరుగా లేక పచ్చిరొట్టగా విత్తుకోవాలని సూచించింది. పెసర, జొన్న ఈ నెల 30వ తేదీ వరకు, మొక్కజొన్న, పత్తి, సోయాచిక్కుడు జూలై 15 వరకు, కంది జూలై 31 వరకు, ఆముదం ఆగస్టు 15 వరకు విత్తుకోవడానికి అనువైన సమయమని వెల్లడించింది. వరినార్లు వేసుకోవడానికి దీర్ఘకాలిక రకాలను జూన్‌ 20 వరకు, మధ్యకాలిక రకాలు జూలై 10 వరకు, స్వల్పకాలిక రకాలకు జూలై 31 వరకు అనువైన సమయమని తెలిపింది.

**రాష్ట్రంలో మూడు రోజులు తేలికపాటి వర్షాలు**

కోస్తాంధ్ర తీరానికి దగ్గరలో పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో 4.5 కి.మీ నుంచి 5.8 కి.మీ మధ్య ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని హైదరాబాద్‌ వాతావరణ కేంద్రం ఆదివారం తెలిపింది. ఈ ప్రభావంతో రాగల 4–5 రోజుల్లో ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వివరించింది. రాగల మూడు రోజులు రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. అదే సమయంలో కొన్ని ప్రాంతాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని పేర్కొంది.



ఎస్సారెస్పీ పరిస్థితి ఇలా..

**ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు ఇలా.. (టీఎంసీల్లో)**

| ప్రాజెక్టు | వాస్తవ నీటి నిల్వ | ప్రస్తుత నిల్వ | లోటు |
|---|---|---|---|
| (కృష్ణా బేసిన్) | | | |
| జూరాల | 9.65 | 2.14 | 7.52 |
| శ్రీశైలం | 215.81 | 32.24 | 183.57 |
| సాగర్ | 312.05 | 128.63 | 183.42 |
| ఆల్మట్టి | 129.72 | 22.45 | 107.27 |
| నారాయణపూర్ | 37.64 | 18.55 | 19.09 |
| తుంగభద్ర | 100.86 | 2.21 | 98.65 |
| (గోదావరి బేసిన్..) | | | |
| సింగూర్ | 29.91 | 0.49 | 29.56 |
| నిజాంసాగర్ | 17.80 | 0.03 | 17.77 |
| ఎస్సారెస్పీ | 90.31 | 5.66 | 84.65 |
| కడెం | 7.60 | 2.34 | 5.26 |
| లోయర్ మానేరు | 24.07 | 3.73 | 20.34 |
| ఎల్లంపల్లి | 20.18 | 5.02 | 15.16 |
| మిడ్‌మానేరు | 25.87 | 3.48 | 22.39 |

# సీబీసీఎస్ అమలులో గందరగోళం

- ఇంకా కొనసాగుతున్న డిగ్రీ వార్షిక పరీక్షలు
- మరోవైపు కొత్త విద్యా సంవత్సరం తరగతులు

**సాక్షి, హైదరాబాద్:** డిగ్రీలో ఛాయిస్‌ బేస్డ్‌ క్రెడిట్‌ సిస్టం (సీబీసీఎస్‌) నిర్వహించడంలో వైస్‌ చాన్సలర్లు అనుసరిస్తున్న ఇష్టారాజ్య విధానాలు విద్యార్థులను గందరగోళంలో పడేస్తున్నాయి. ఫలితంగా కొన్ని యూనివర్సిటీల్లో ఇంకా డిగ్రీ వార్షిక పరీక్షలు కొనసాగుతుండగా మరికొన్ని యూనివర్సిటీల్లో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభించేందుకు చర్యలు మొదలు పెట్టాయి. కొన్ని యూనివర్సిటీలు అయితే ఇటు పరీక్షలు నిర్వహిస్తూనే.. అటు కొత్త విద్యా సంవత్సర తరగతుల ప్రారంభానికి ప్రకటనలు చేస్తుండటంతో విద్యార్థుల్లో గందరగోళం నెలకొంది. గత విద్యా సంవత్సరంలో సీబీసీఎస్‌ అమలులో వైఫల్యం కారణంగానే డిగ్రీ పరీక్షలు మే నెలలో మొదలై ఇప్పటికీ పూర్తి కాకుండా జూలై వరకు కొనసాగించే పరిస్థితి నెలకొంది. ఉస్మానియాలో జూలై 8వ తేదీ వరకు, కాకతీయలో జూలై 2 వరకు, తెలంగాణ విశ్వవిద్యాలయంలో జూలై 6 వరకు, పాలమూరు వర్సిటీలో జూన్‌ 29 వరకు, శాతవాహన వర్సిటీలో జూన్‌ 24 వరకు, మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో జూన్‌ 22వ తేదీ వరకు 2018–19 విద్యా సంవత్సర డిగ్రీ వార్షిక పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలు పూర్తి కాకుండానే డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులకు శాతవాహన, కాకతీయ, ఉస్మానియా, మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయాలు జూన్‌ 17వ తేదీ నుంచి, పాలమూరు విశ్వవిద్యాలయం జూన్‌ 19వ తేదీ నుంచి, తెలంగాణ విశ్వవిద్యాలయం 26వ తేదీ నుంచి ఈ విద్యా సంవత్సరాన్ని ప్రారంభిస్తున్నట్టు ప్రకటించాయి. దీంతో విద్యార్థులే కాదు.. అధ్యాపకుల్లోనూ గందరగోళం నెలకొంది.

**విద్యార్థుల్లో అయోమయం..**

ఓవైపు పరీక్షలు పూర్తి కాకుండానే యూనివర్సిటీలు మరుసటి విద్యాసంవత్సరం ప్రారంభించబోతున్నట్టు ప్రకటించడం చూసి విద్యార్థులు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు. విశ్వవిద్యాలయ అధికారుల అసమర్థత వల్ల మండుటెండల్లో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు అసలు పరీక్షలు పూర్తి కాకుండా తరగతులకు ఎలా హాజరవుతారని వారు ప్రశ్నిస్తున్నారు. ఒక విద్యాసంవత్సరం పూర్తి చేసి పరీక్షలు రాసిన విద్యార్థులకు కనీసం రెండు వారాలైనా సెలవులు ఉండాలని ఆ తర్వాతే తరగతులు ప్రారంభించాలని వారు కోరుతున్నారు. పరీక్షల నిర్వహణలో అసమర్థత వల్ల డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో పీజీ ఎంట్రన్స్‌ రాయలేకపోయారని, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఐసెట్, లాసెట్‌ లాంటి పరీక్షలకు కూడా పూర్తి స్థాయిలో సన్నద్ధం కాలేకపోయామని, ఫలితంగా నష్టపోవాల్సి వచ్చిందని వాపోతున్నారు.

**ఈసారి అయినా పక్కా చర్యలు చేపట్టాలి**

కామన్‌ అకడమిక్‌ క్యాలెండర్‌ అన్ని యూనివర్సిటీల్లో అమలు చేసేలా చూడాలని ఉన్నత విద్యా మండలిని మే మొదటి వారంలోనే తెలంగాణ ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్‌ అధ్యాపక సంఘం కోరింది. అయినప్పటికీ ఉన్నత విద్యా మండలి పూర్తిస్థాయిలో శ్రద్ధ కనబరచడం లేదని సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్‌ సంజీవయ్య, డాక్టర్‌ కె.సురేందర్‌రెడ్డి ఆరోపించారు. యూనివర్సిటీ అధికారులు కూడా నిర్ణయాలు తీసుకోవడంలో తమకు స్వేచ్ఛ ఉందని, ఎవరి విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదని నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారని వారు ఆరోపించారు. *–తెలంగాణ ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్‌ అధ్యాపక సంఘం*

# నేటి నుంచి కొత్త బీసీ గురుకులాలు

- నూతనంగా 119 పాఠశాలల ప్రారంభం
- ఏకకాలంలో ప్రారంభించనున్న బీసీ గురుకుల సొసైటీ
- ఈ విద్యా సంవత్సరంలో 5, 6, 7 తరగతులతో ఆరంభం
- తాజా స్కూళ్లతో ప్రతి నియోజకవర్గంలో బాల, బాలికల గురుకులం



**సాక్షి, హైదరాబాద్:** 2019–20 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం మంజూరు చేసిన 119 బీసీ గురుకులాలను నేడు (17న) ప్రారంభించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ గురుకులాలన్నింటినీ సోమవారం ఏక కాలంలో ప్రారంభించాలని నిర్ణయించింది. వీటి ప్రారంభంతో మహాత్మా జ్యోతిభాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్‌) పరిధిలో పాఠశాలల సంఖ్య 257కు చేరనుంది. రాష్ట్ర ఏర్పాటుకు ముందు ఈ ప్రాంతంలో కేవలం 19 బీసీ గురుకుల పాఠశాలలు మాత్రమే ఉండేవి. తెలంగాణ ఏర్పాటు తర్వాత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కేజీ టు పీజీ మిషన్‌ కింద గురుకుల పాఠశాలలను తెరుస్తూ వచ్చింది. ఇందులో భాగంగా 2017–18 విద్యా సంవత్సరంలో 119 గురుకుల పాఠశాలలను మంజూరు చేసింది. అయితే జనాభాలో సగభాగం ఉన్న బీసీలకు ఆ ఏడాది ప్రారంభించిన గురుకులాల సంఖ్య తక్కువే. గురుకులాలకు డిమాండ్‌ అధికంగా ఉండటం... పాఠశాలల్లో సీట్ల సంఖ్య పరిమితంగా ఉండటంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించిన ప్రభుత్వం గతేడాది మరో 119 గురుకుల పాఠశాలలకు గ్రీన్‌ సిగ్నల్‌ ఇచ్చింది. వీటిని 2019–20 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించనున్నట్లు స్పష్టం చేసింది. ఈ క్రమంలో చర్యలు చేపట్టిన బీసీ గురుకుల సొసైటీ యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు పూర్తి చేసింది.

**సవాళ్లను అధిగమించి...**

కొత్త గురుకుల పాఠశాలల ఏర్పాటులో ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్‌ పలు సవాళ్లను ఎదుర్కొంది. గత మూడేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 400 గురుకులాలను ప్రభుత్వం ప్రారంభించింది. దీంతో కొత్తగా మరో 119 మంజూరు చేయగా... వాటి ఏర్పాటుకు భవనాల గుర్తింపు పెను సవాలుగా మారింది. అందుబాటులో ఉన్న దాదాపు అన్ని భవనాలు అప్పటికే గురుకులాల ఏర్పాటు కోసం అద్దెకు తీసుకోవడంతో భవనాల కొరత విపరీతమైంది. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం.. భవనాల లభ్యత లేకపోవడంతో అధికారులు సైతం తలపట్టుకున్నారు. దాదాపు ఏడాది పాటు భవనాల కోసం పరిశీలించారు. పలుచోట్ల యజమానులతో దఫాల వారీగా చర్చలు జరిపి, మరమ్మతులకు ఒప్పించి మొత్తంగా అవసరమైన మేర అద్దె భవనాలను గుర్తించారు. కొన్ని చోట్ల మాత్రం అనువైన భవనాలు లేని కారణంగా ప్రస్తుతమున్న గురుకుల పాఠశాలల్లోనే ఏర్పాట్లకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో బాల, బాలికల బీసీ గురుకుల పాఠశాలలున్నాయి. 2017–18లో ప్రారంభించిన 119 గురుకులాలను డిమాండ్‌ను బట్టి బాల బాలికలుగా విభజించినప్పటికీ... తాజాగా ప్రారంభిస్తున్న గురుకులాలతో బ్యాలెన్సింగ్‌ పద్ధతితో బాలబాలికల పాఠశాలలను ఏర్పాటు చేశారు. మొత్తం 257 బీసీ గురుకులాల్లో 94,800 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మరో రెండేళ్లలో విద్యార్థుల సంఖ్య లక్ష దాటనుంది. గురుకులాల్లో జూనియర్‌ కాలేజీలు ప్రారంభిస్తే విద్యార్థుల సంఖ్య రెట్టింపు కానుంది. కొత్త గురుకులాల ప్రారంభంతో ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్‌ అతి పెద్ద గురుకుల సొసైటీగా అవతరించింది. ఇప్పటివరకు 238 గురుకుల పాఠశాలలతో పెద్ద సొసైటీగా ఉన్న సాంఘీక సంక్షేమ గురుకుల సొసైటీ రికార్డును బీసీ గురుకుల సొసైటీ అధిగమించింది. వచ్చే ఐదేళ్లలో అత్యధిక విద్యార్థులున్న విద్యా సంస్థగా బీసీ గురుకుల సొసైటీ రూపుదాల్చనుంది.

## అమెరికాలో నలుగురు తెలుగువారు దుర్మరణం

▶ మొదటి పేజీ తరువాయి

చంద్రశేఖర్‌ సుంకర(44), లావణ్య సుంకర(41)తో పాటు 15, పదేళ్ల వయసున్న ఇద్దరు అబ్బాయిలు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన ఎలా జరిగిందన్న విషయమై ఇంకా స్పష్టత రాలేదు. వీరి ఇంటికి వచ్చిన బంధువుల్లో ఒకరు నలుగురి మృతదేహాలను చూడగానే భయంతో బయటకు పరుగులు తీశారు. అనంతరం అటుగా వెళుతున్నవారి సాయంతో పోలీసులకు సమాచారం అందించారు'అని తెలిపారు. రియల్‌ ఎస్టేట్‌ రికార్డుల ప్రకారం లావణ్య–చంద్రశేఖర్‌ ఈ ఇంటిని 2019, మార్చి 25న కొనుగోలు చేశారని వెల్లడించారు. పోస్ట్‌మార్టం తర్వాతే మరణానికి గల కారణాన్ని అధికారికంగా చెప్పగలమన్నారు. ఈ దుర్ఘటనపై విచారణ కొనసాగుతోందని పేర్కొన్నారు. వెస్ట్‌డెస్‌ మోయిన్స్‌లో శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయనీ, ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని చెప్పారు. కాగా, ముగ్గురు కుటుంబ సభ్యులను చంద్రశేఖరే కాల్చిచంపాడనీ, అనంతరం తనను తాను కాల్చుకున్నాడని కొందరు స్థానికులు తెలిపారు. ఆయన గతకొంతకాలంగా మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నారని వెల్లడించారు. అయితే ఈ విషయాన్ని పోలీసులు ధ్రువీకరించలేదు.



కిరణ్‌కుమార్‌శర్మతో పూజలు నిర్వహింపచేస్తున్న మహాస్వామి

## ఆధ్యాత్మిక శోభ.. పండిత సభ

### శాస్త్రోక్తంగా శారదా పీఠ ఉత్తరాధికారి సన్యాస స్వీకరణ

**సాక్షి, విజయవాడ/తాడేపల్లి రూరల్:** కృష్ణా తీరంలో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. పండిత సభ మహోన్నతంగా సాగింది. శారదా పీఠం ఆధ్వర్యంలో ఉత్తరాధికారి సన్యాసాశ్రమ దీక్షా స్వీకరణ మహోత్సవ రెండో రోజు కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పలువురు ప్రముఖులు, భక్తులు తరలి రావడంతో గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సచ్చిదానంద స్వామీజీ ఆశ్రమం భక్తజన సందోహంగా మారింది. విశాఖలోని శ్రీ శారదా పీఠం ఉత్తరాధికారిగా కిరణ్‌ కుమార్‌శర్మ (కిరణ్‌ బాలస్వామి) సన్యాస స్వీకరణ మహోత్సవం మూడు రోజులపాటు నిర్వహిస్తున్న విషయం విదితమే. రెండవ రోజైన ఆదివారం సన్యాసాంగ అష్ట శ్రాద్ధాలు నిర్వహించారు. ఇందులో భాగంగా కూష్మాండ, పురుష సూక్త, ప్రాజాపత్య, వైశ్వానర హోమాలు, షోడశ మహాదానాలు జరిపారు. స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి శారదా చంద్రమౌళీశ్వరులకు అర్చన, అభిషేకాలను నిర్వహించగా, భారీగా హాజరైన భక్తులు కన్నుల పండువగా వీక్షించారు. బాలస్వామి సన్యాసాశ్రమ దీక్షా స్వీకరణ సందర్భంగా శాస్త్ర, అహితాగ్ని, వాక్యార్థ శాస్త్ర మహాసభలు నిర్వహించగా.. వ్యాకరణ, తర్క, మీమాంస సహా ఆరి శాస్త్రాలను ఔపోసన పట్టిన పండితులు పాల్గొన్నారు. సన్యాస దీక్ష ఫలితం ఏమిటి? సన్యాసం దేనికోసం తీసుకోవాలి? సన్యాసం తీసుకుంటే ఎలా ఉండాలి? నియమాలు ఏమిటనే అంశాలపై పండితులు చర్చాగోష్టి చేశారు.

**సన్యాస జీవితం చాలా గొప్పది**

ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి ప్రవచనం చేస్తూ.. సన్యాసం గురించి ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, భగవద్గీత, యోగ శాస్త్రాల్లో చాలా గొప్పగా చెప్పారని వివరించారు.

# బిల్డర్లూ.. పారాహుషార్

▶ మొదటి పేజీ తరువాయి

బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడంతోపాటు భవిష్యత్తులో ఎలాంటి లే అవుట్లు వేయకుండా అనర్హులుగా ప్రకటించేలా కఠిన నిబంధనలతో చట్టాన్ని తయారు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. భవన నిర్మాణాల విషయంలోనూ నిర్మాణదారులు, అధికారులను జవాబుదారీలను చేయడంతోపాటు నిర్మాణదారులకు కొంత వెసులుబాటు కల్పిస్తూ నిబంధనలు రూపొందుతున్నాయి. భవన నిర్మాణానికి సంబంధించి అన్ని డాక్యుమెంట్లు సమర్పించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత వారం రోజుల్లోగా అనుమతి ఇచ్చేదీ లేనిదీ తేల్చేయాలనే నిబంధనను పొందుపరచనున్నారు. ఒకవేళ దరఖాస్తును తిరస్కరించాలనుకుంటే ఎందుకు తిరస్కరిస్తున్నామో కారణాలను వివరిస్తూ అధికారులు లిఖితపూర్వకంగా దరఖాస్తుదారునికి తెలియజేయాలని లేదంటే అనుమతి ఇచ్చినట్లే భావించాల్సి ఉంటుందని చట్టంలో పేర్కొననున్నారు. అదేవిధంగా గతంలో ఉన్న నిబంధనలకు కొంత మార్పు చేసి 200 చదరపు మీటర్లలోపు స్థలంలో భవనం నిర్మించాలనుకుంటే గతంలోలాగా అనుమతులు అవసరం లేదని, సెల్ఫ్‌ డిక్లరేషన్‌ సరిపోతుందని, దరఖాస్తుదారుల స్వయం పూచీకత్తుతో భవనాలు నిర్మించుకునే వెసులుబాటు ఉంటుందని కొత్త చట్టంలో పేర్కొంటున్నారు.

**భూమి వినియోగంలో హేతుబద్ధత, భవన నిర్మాణాల విషయంలో ముసాయిదా చట్టంలో పేర్కొంటున్న ముఖ్యాంశాలివే...**

**1. లే అవుట్లకు సంబంధించి...**

- చట్టంలో పేర్కొన్న విధంగా లే అవుట్ల అనుమతి కోసం సదరు లే అవుట్‌లో కల్పించనున్న మౌలిక సదుపాయాలను వివరిస్తూ ఆన్‌లైన్‌లో లేదా లిఖితపూర్వకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
- ఆ లేఅవుట్‌ను అనుమతిస్తే అందుకు సంబంధించిన సమాచారాన్ని పొందుపరుస్తూ లే అవుట్‌ వివరాలను ఆన్‌లైన్‌లో అధికారులు ఉంచాలి.
- లే అవుట్‌ అనుమతులను నిర్దేశిత సమయంలో ఇవ్వలేకపోయిన పక్షంలో బాధ్యులైన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు.
- అనుమతి పొందిన లే అవుట్లలో రెండేళ్లలో డెవలపర్‌ లేదా బిల్డర్‌ కనీస సౌకర్యాలు కల్పించి ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. లేదంటే సదరు డెవలపర్‌ లేదా బిల్డర్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెడతారు. భవిష్యత్తులో రాష్ట్రంలో ఎక్కడా ఎలాంటి లే అవుట్లు చేపట్టకుండా అనర్హులుగా ప్రకటిస్తారు.
- లే అవుట్‌లో పార్కులు, గ్రీన్‌బెల్ట్, ఆట స్థలాల కోసం కేటాయించిన ఖాళీ స్థలాలను ఉచితంగా మున్సిపాలిటీలకు బదిలీ చేయాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి అధికారులు స్పష్టమైన రికార్డు నిర్వహించాల్సి ఉంటుంది.
- ఇందుకోసం కేటాయించిన ఖాళీ స్థలాల్లో మళ్లీ క్రయవిక్రయ లావాదేవీలు నిర్వహిస్తే జరిమానా విధించడంతోపాటు మూడేళ్ల వరకు శిక్ష విధించే అవకాశం ఉంటుంది.

**2. వన నిర్మాణాలకు సంబంధించి...**

- కమిషనర్‌ లేదా వైస్‌ చైర్‌పర్సన్‌ అనుమతి లేకుండా భవన నిర్మాణాల కోసం ఎలాంటి భూమిని వినియోగించకూడదు. అప్పటికే ఉన్న భవనాలను ఆధునీకరించకూడదు.
- 200 చదరపు మీటర్లలోపు స్థలంలో భవన నిర్మాణానికిగాను ఆన్‌లైన్‌లో సదరు యజమాని సెల్ఫ్‌ డిక్లరేషన్‌ ఇస్తే సరిపోతుంది. దీంతోపాటు అన్ని డాక్యుమెంట్లు ఆన్‌లైన్‌లో సమర్పించిన వెంటనే అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది.
- ఒకవేళ అనుమతి నిరాకరిస్తే ఎందుకు నిరాకరించాల్సి వచ్చిందో వారం రోజుల్లోగా సదరు యజమానికి లిఖితపూర్వకంగా తెలియజేయాలి. అలా చేయకుండా సదరు దరఖాస్తుపై వారం రోజుల్లోగా ఎలాంటి నిర్ణయాన్ని తీసుకోకపోతే అనుమతి ఇచ్చినట్లే పరిగణించాల్సి ఉంటుంది. అందుకు బాధ్యులైన అధికారులపై కూడా చర్యలు తీసుకుంటారు.
- 200 చదరపు మీటర్లలోపు స్థలాల్లో భవన నిర్మాణానికి ఇచ్చే సెల్ఫ్‌ డిక్లరేషన్‌కు సదరు యజమాని బాధ్యత వహించాల్సి ఉంటుంది. తప్పుడు డిక్లరేషన్‌ ఇస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌ అవసరం ఉండదు.
- భవన నిర్మాణానికి అనుమతి వచ్చిన 18 నెలల్లోగా నిర్మాణ పనులు ప్రారంభించి మూడేళ్లలోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. భవన నిర్మాణం పూర్తయ్యాక ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌ ఇస్తారు.
- ఒకవేళ నిర్ణీత సమయంలో నిర్మాణం పూర్తి చేయకపోతే ఆ భవనానికి ఇచ్చిన అనుమతిని రద్దు చేస్తారు. మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
- కొత్తగా నిర్మించే భవనాల్లోని ఖాళీ స్థలాల్లో ప్రభుత్వం నిర్ణయించిన సంఖ్యలో చెట్లు నాటాలి. అన్ని భవనాల్లో పార్కింగ్‌ స్థలాలను ఉంచాలి. అక్కడ ఎలక్ట్రిక్‌ వెహికిల్‌ చార్జింగ్‌ సదుపాయం కల్పించాలి.
- భవన నిర్మాణ సమయంలో ఎవరైనా మరణిస్తే నిర్మాణాన్ని నిలిపివేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది.

**ఇదం జగత్**



## టీఆర్‌ఎస్‌వి గలీజు రాజకీయాలు



### టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**చింతలపాలెం (హుజూర్‌నగర్):** రాష్ట్రంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం అభివృద్ధిపై నేటికీ దృష్టి సారించలేదని, గలీజు రాజకీయాలకు పాల్పడుతోందని నల్లగొండ ఎంపీ, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని పట్టించుకోకుండా.. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను పార్టీలో చేర్చుకునే పనిలో ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా ఆదుకుంటామని ఎవరూ అధైర్య పడొద్దని భరోసానిచ్చారు. పోలీసులు చట్టం ప్రకారం నడుచుకోవాలని సూచించారు. కాంగ్రెస్ కార్యకర్తలపై కేసులు బనాయిస్తే ప్రజాస్వామ్య పద్ధతిలో తగిన బుద్ధి చెబుతామన్నారు. హుజూర్‌నగర్‌లో రామస్వామి గుట్ట వద్ద కాంగ్రెస్ హయాంలో రూ.200 కోట్లతో 4 వేల ఇళ్ల నిర్మాణాల పనులను అప్పట్లోనే 80 శాతం పూర్తి చేస్తే.. ఈ ఐదేళ్లలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం వాటిని పూర్తి చేయలేదని విమర్శించారు. దీని గురించి ముఖ్యమంత్రి, హౌసింగ్ మంత్రి, జిల్లా మంత్రికి లేఖ రాసినా సమాధానం లేదన్నారు.

## వర్షం కోసం ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు



**కాశిబుగ్గ:** రాష్ట్రంలో వర్షాలు కురవాలని కోరుతూ వరంగల్ నగరంలోని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వర్షాకాలం ప్రారంభమైనా చినుకు జాడ లేకపోవడంతో సామాన్య ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వరుణుడు కరుణించి వానలు కురిపించాలని కోరుతూ వరంగల్, హన్మకొండ, కాజీపేట ప్రాంతాల్లోని ముస్లిం సోదరులు వెయ్యి మంది వరకు ఆదివారం ఉదయం వరంగల్ ఓసిటీ మైదానానికి చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## శిశువును విక్రయించేందుకు యత్నం

### తల్లీబిడ్డలు ఐసీడీఎస్‌కు అప్పగింత

**మెట్‌పల్లి (కోరుట్ల):** పోషించే స్థోమత లేకపోవడంతో నెల రోజుల వయసున్న ఆడ శిశువును రూ.20 వేలకు అమ్మకానికి పెట్టింది ఓ తల్లి. ఆదివారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. నిర్మల్ జిల్లా కడెంకు చెందిన పుట్ట గంగజ్యోతికి మహారాష్ట్రకు చెందిన నవీన్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లయిన కొద్ది రోజులకే వీరు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు వలస వచ్చారు. నవీన్ స్థానికంగానే కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. వీరికి కూతురు స్నేహ (4) ఉంది. గంగజ్యోతి రెండోసారి గర్భం దాల్చిన తర్వాత నవీన్ ఆమెకు చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. పట్టించుకునే వారు లేకపోవడంతో నెలరోజుల క్రితం ఆమె ఆర్మూర్ బస్టాండ్ సమీపంలో ఆరు బయటే మరో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనారోగ్యంతోపాటు ఆర్థిక కష్టాలు ఆమెకు ఎక్కువ కావడంతో బిడ్డల పోషణ భారంగా మారింది. దీంతో చిన్న బిడ్డను విక్రయించాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం మెట్‌పల్లికి వచ్చి స్థానిక కళానగర్‌లో తన బిడ్డను రూ.20 వేలకు విక్రయిస్తానని పలువురికి చెప్పింది. ఈ విషయం కాస్త పోలీసులకు తెలియడంతో వెంటనే వారు వచ్చి గంగజ్యోతిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం జిల్లా ఐసీడీఎస్ అధికారులకు వారిని అప్పగించారు. శిశువు విక్రయంపై విచారణ జరుపుతున్నామని ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

# అదనంగా 2,660 సీట్లు

- మహిళల కోసం ప్రత్యేకంగా 2,059 సీట్లు
- ఐఐటీ, ఎన్‌ఐటీ, ట్రిపుల్‌ఐటీ, జీఎఫ్‌టీఐల్లో సీట్లు పెంచిన కేంద్ర ప్రభుత్వం
- మొత్తంగా 45,244కి చేరిన సీట్ల సంఖ్య
- మొదలైన జోసా ఉమ్మడి ప్రవేశాల కౌన్సెలింగ్
- ఈ నెల 25 వరకు చాయిస్ ఫిల్లింగ్‌కి అవకాశం



**సాక్షి, హైదరాబాద్:** ఐఐటీ, ఎన్‌ఐటీ, ట్రిపుల్‌ఐటీ, ప్రభుత్వ ఆర్థిక సహకారంతో కొనసాగే జాతీయ స్థాయి విద్యా సంస్థల్లో (జీఎఫ్‌టీఐ) 2019–20 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఉమ్మడి ప్రవేశాల కౌన్సెలింగ్ ఆదివారం ప్రారంభమైంది. ముందస్తు షెడ్యూల్ ప్రకారం ఈ నెల 19 నుంచి విద్యార్థుల నుంచి చాయిస్ ఫిల్లింగ్‌కు (వెబ్ ఆప్షన్లు) అవకాశం కల్పిస్తామని జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా) ప్రకటించినా.. ఆదివారం నుంచే ప్రారంభించింది. మొత్తంగా ఏడు దశల్లో ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహణకు చర్యలు చేపట్టింది. జూలై 23 వరకు ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహించేలా ఆదివారం షెడ్యూల్‌ను విడుదల చేసింది. కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు రిపోర్టు చేయాల్సిన రిపోర్టింగ్ కేంద్రాల వివరాలను జోసా వెబ్‌సైట్‌లో ( https://josaa.nic.in) అందుబాటులో ఉంచింది. రిపోర్టింగ్ కేంద్రాల్లో నిర్ణీత తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్, సీట్ యాక్సెప్టెన్స్/సీట్ విత్‌డ్రాకు అవకాశం ఉంటుందని వివరించింది.

**అదనంగా 4,719 సీట్లు..**

ఐఐటీ, ఎన్‌ఐటీ, ట్రిపుల్‌ఐటీల్లో కేంద్రం ఈసారి సీట్లను భారీగా పెంచింది. ఎకనామికల్లీ వీకర్ సెక్షన్స్ (ఈడబ్ల్యూఎస్) కోసం 10 శాతం రిజర్వేషన్లను అందుబాటులోకి తెచ్చిన కేంద్రం ప్రత్యేకంగా సీట్లను పెంచింది. మరోవైపు ఐఐటీ, ఎన్‌ఐటీల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచేందుకు సూపర్ న్యూమరీ కోటా కింద ఏటేటా సీట్లను పెంచుతోంది. దీనిలో భాగంగా ఈసారి కూడా 2,059 సీట్లను పెంచింది. మరోవైపు ఈడబ్ల్యూఎస్ కింద 2,660 సీట్లను అదనంగా పెంచింది. ఇలా మొత్తంగా 4,719 సీట్లను ఈసారి అదనంగా పెంచింది.

**107 విద్యా సంస్థల్లో 45,244 సీట్లు..**

ఐఐటీలతోపాటు ఎన్‌ఐటీ, ట్రిపుల్‌ఐటీ, జీఎఫ్‌ఐటీలలో ఈసారి సీట్లు ఎక్కువగా పెరిగాయి. మహిళల సూపర్ న్యూమరీ సీట్లతోపాటు ఈడబ్ల్యూఎస్ కోటా అదనంగా రావడంతో సీట్లు ఎక్కువగా పెరిగాయి. దేశంలోని 23 ఐఐటీలు, 31 ఎన్‌ఐటీలు, 25 ట్రిపుల్‌ఐటీ, 28 జీఎఫ్‌టీఐలు మొత్తంగా 107 విద్యా సంస్థల్లో గతేడాది 41 వేల వరకు అందుబాటులో ఉండగా, ఈసారి వాటి సంఖ్య 45,244కి పెరిగింది.

**ఎన్‌ఐటీల్లో ఎక్కువగా పెరుగుదల..**

ఈడబ్ల్యూఎస్ కోటా కింద ఈసారి ఎన్‌ఐటీల్లో సీట్లు ఎక్కువగా పెరిగాయి. గతేడాది కంటే ఈసారి 1,384 సీట్లు అదనంగా వచ్చాయి. ఐఐటీల్లో ఈడబ్ల్యూఎస్ కోటాలో 638 సీట్లు పెరిగాయి. ఎన్‌ఐటీల్లో 50 శాతం సీట్లు హోంస్టేట్ కోటా కింద ఉన్నందున ఆయా రాష్ట్రాల వారికి ఈడబ్ల్యూఎస్ కోటా పెరిగిన సీట్లతో అధిక ప్రయోజనం చేకూరనుంది. మరోవైపు మహిళల భాగస్వామ్యం కోసం అదనంగా ఇస్తున్న సూపర్ న్యూమరీ సీట్ల సంఖ్య ఐఐటీల్లో ఎక్కువగా పెరిగింది. ఈసారి 1,221 సీట్లు ఐఐటీల్లోనే పెరిగాయి.

**విద్యా సంస్థల వారీగా సీట్ల వివరాలు..**

| కేటగిరీ | జనరల్ | మహిళలు (సూపర్ న్యూమరీ) | మొత్తం |
|---|---|---|---|
| ఐఐటీ | 12,362 | 1,221 | 13,583 |
| ఎన్‌ఐటీ | 20,437 | 705 | 21,142 |
| ట్రిపుల్‌ఐటీ | 4,617 | 96 | 4,713 |
| జీఎఫ్‌టీఐ | 5,769 | 37 | 5,806 |
| మొత్తం | 43,185 | 2,059 | 54,244 |

**మొత్తం సీట్లలో ఈడబ్ల్యూఎస్ కోటా సీట్లు..**

| కేటగిరీ | జనరల్ | వికలాంగులు | మొత్తం |
|---|---|---|---|
| ఐఐటీ | 611 | 27 | 638 |
| ఎన్‌ఐటీ | 1,309 | 75 | 1,384 |
| ట్రిపుల్‌ఐటీ | 290 | 15 | 305 |
| జీఎఫ్‌టీఐ | 321 | 12 | 333 |
| మొత్తం | 2,531 | 129 | 2,660 |

**కౌన్సెలింగ్ షెడ్యూల్..**

**21-6-2019:** ఆర్కిటెక్చర్ ఆప్టిట్యూట్ టెస్టు రాసే వారికి చాయిస్ ఫిల్లింగ్ ప్రారంభం
**25-6-2019:** ఏఏటీ, ఇతరులందరికీ సాయంత్రం 5 గంటలకు చాయిస్ ఫిల్లింగ్ ముగింపు
**27-6-2019:** ఉదయం 10 గంటలకు మొదటి దశ సీట్ల కేటాయింపు
**28-6-2019 నుంచి జూలై 2 వరకు:** రిపోర్టింగ్ కేంద్రాల్లో డాక్యుమెంట్ల వెరిఫికేషన్, సీట్ యాక్సెప్టెన్స్, రిపోర్టింగ్
**3-7-2019:** ఉదయం 10 గంటలకు భర్తీ అయిన సీట్లు, మిగిలిన సీట్ల డిస్‌ప్లే
**3-7-2019:** సాయంత్రం 5 గంటలకు రెండో దశ సీట్ల కేటాయింపు
**4-7-2019 నుంచి 5-7-2019 వరకు:** రిపోర్టింగ్ కేంద్రాల్లో డాక్యుమెంట్ల వెరిఫికేషన్, సీట్ యాక్సెప్టెన్స్/విత్‌డ్రా
**6-7-2019:** ఉదయం 10 గంటలకు భర్తీ అయిన సీట్లు, మిగిలిన సీట్ల డిస్‌ప్లే
**6-7-2019:** సాయంత్రం 5 గంటలకు మూడో దశ సీట్ల కేటాయింపు
**7-7-2019 నుంచి 8-7-2019 వరకు:** రిపోర్టింగ్ కేంద్రాల్లో డాక్యుమెంట్ల వెరిఫికేషన్, సీట్ యాక్సెప్టెన్స్/విత్‌డ్రా
**9-7-2019:** ఉదయం 10 గంటలకు భర్తీ అయిన సీట్లు, మిగిలిన సీట్ల డిస్‌ప్లే
**9-7-2019:** సాయంత్రం 5 గంటలకు నాలుగో దశ సీట్ల కేటాయింపు
**10-7-2019 నుంచి 11-7-2019 వరకు:** ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు రిపోర్టింగ్ కేంద్రాల్లో డాక్యుమెంట్ల వెరిఫికేషన్, సీట్ యాక్సెప్టెన్స్/విత్‌డ్రా
**12-7-2019:** ఉదయం 10 గంటలకు భర్తీ అయిన సీట్లు, మిగిలిన సీట్ల డిస్‌ప్లే
**12-7-2019:** సాయంత్రం 5 గంటలకు ఐదో దశ సీట్ల కేటాయింపు
**13-7-2019 నుంచి 14-7-2019 వరకు:** రిపోర్టింగ్ కేంద్రాల్లో డాక్యుమెంట్ల వెరిఫికేషన్, సీట్ యాక్సెప్టెన్స్/విత్‌డ్రా
**15-7-2019:** ఉదయం 10గంటలకు భర్తీ అయిన సీట్లు, మిగిలిన సీట్ల డిస్‌ప్లే, అదే రోజు సాయంత్రం 5 గంటలకు 6వ దశ సీట్లు కేటాయింపు
**16-7-2019 నుంచి 17-7-2019:** రిపోర్టింగ్ కేంద్రాల్లో డాక్యుమెంట్ల వెరిఫికేషన్, సీట్ యాక్సెప్టెన్స్/విత్‌డ్రా (ఐఐటీల్లో సీట్ విత్‌డ్రాకు ఇదే చివరి అవకాశం)
**18-7-2019:** ఉదయం 10 గంటలకు భర్తీ అయిన సీట్లు, మిగిలిన సీట్ల డిస్‌ప్లే, అదే రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు 7వ దశ (చివరి) సీట్ల కేటాయింపు
**19-7-2019:** ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు రిపోర్టింగ్ కేంద్రాల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్, కాలేజీల్లో చేరికలు
**19-7-2019 నుంచి 23-7-2019 వరకు:** ఎన్‌ఐటీ ఇతర విద్యా సంస్థల్లో ప్రవేశాల కోసం సర్టిఫికెట్ల వెరిఫికేషన్, సీట్ యాక్సెప్టెన్స్, ప్రవేశాలు.

## విభజన సమస్యలకు పరిష్కారం

### టీఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

**హన్మకొండ:** వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయిన నేపథ్యంలో విభజన సమస్యలు పరిష్కారమవుతున్నాయని టీఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలో జరిగిన గెజిటెడ్ అధికారులు, ఉద్యోగులు, పెన్షనర్ల ఆత్మీయ సమావేశానికి రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కారం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ రెండు రాష్ట్రాల మధ్య ఆస్తుల పంపకం సామరస్యంగా జరుగుతుందన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం ముందుంచామని, త్వరలో సీఎం కేసీఆర్‌ను కలసి.. జేఏసీ సమావేశంలో చర్చించిన 18 అంశాలను త్వరగా పరిష్కరించాలని కోరుతామని చెప్పారు. పీఆర్సీ కమిటీ మూడు నెలల్లో ఇవ్వాల్సిన నివేదికను 13 నెలలవుతున్నా ఇవ్వలేదని, అయితే ఈ నెలాఖరులోపు ఉద్యోగుల సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం, ఉద్యోగుల మధ్య చిచ్చు పెట్టేలా ఓ పత్రిక పిచ్చి రాతలు రాసిందని, దానిని ఖండిస్తున్నామని చెప్పారు. తాము మాట్లాడని మాటలు మాట్లాడినట్లు రాసిందని, ఇలాంటి పద్ధతికి స్వస్తి పలకాలని హితవు పలికారు.

## విద్యుత్ స్తంభంపై రైతు మృతి

**నిజాంసాగర్:** వ్యవసాయ బోరు మోటార్‌కు కరెంట్ సరఫరా కోసం విద్యుత్ స్తంభంపైకి ఎక్కిన ఆకుల శ్రీనివాస్ (30) అనే రైతు విద్యుదాఘాతానికి గురై మరణించాడు. ఆదివారం సాయంత్రం కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం సింగితం గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. శ్రీనివాస్ స్థానిక ట్రాన్స్‌కో లైన్‌మన్ శ్రీధర్‌ను సంప్రదించి ఎల్‌సీ తీసుకున్నారని, స్తంభంపైకి ఎక్కి జంపర్లను సరిచేస్తున్న క్రమంలో విద్యుత్ ప్రసారమై షాక్‌తో చనిపోయాడని స్థానికులు తెలిపారు. ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం వల్లే శ్రీనివాస్ ప్రాణాలు కోల్పోయాడని ఆరోపించారు. అధికారులు వచ్చి న్యాయం చేసేంతవరకు మృతదేహాన్ని కిందకు దించనివ్వబోమని పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## యాదాద్రికి పోటెత్తిన భక్తులు

**యాదగిరికొండ:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సుమారు 30 వేల మంది స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానికి 4 గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా కొండపైకి ఎలాంటి వాహనాలను అనుమతించలేదు.

## భూమి కోసం ఆత్మహత్యాయత్నం!

**పిట్లం:** తండ్రి భూమి పంచివ్వడం లేదని మనస్తాపం చెందిన ఓ కుమారుడు కుటుంబంతో సహా ఆత్మహత్యకు యత్నించాడు. ఆదివారం కామారెడ్డి జిల్లా పిట్లం మండలం అన్నారం గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నారం గ్రామానికి చెందిన బాయికాడి సాయిలుకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కొన్నాళ్ల క్రితం సాయిలు తన చిన్న కుమారుడు కృష్ణ పేరిట ఐదెకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేశాడు. పెద్ద కుమారుడు రాములు తనకూ భూమి రాసివ్వాలని తండ్రిని కోరినా ఆయన స్పందించలేదు. దీంతో రాములు అధికారులకు అర్జీ పెట్టుకున్నాడు. ఇక తండ్రి తనకు భూమి రాసివ్వడని నిరాశకు గురైన రాములు.. ఆదివారం తెల్లవారుజామున భార్య భాగవ్వ, కుమార్తెలు రాణి, సుమలత, కుమారుడు సాయి అందరూ ఇంట్లో ఉండగానే ఇంటిపై కిరోసిన్ పోసి నిప్పంటించాడు. మంటలను గమనించిన స్థానికులు వారిని కాపాడారు. బాన్సువాడ నుంచి అగ్నిమాపక యంత్రం వచ్చేసరికే ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఆర్‌ఐ అలీం, వీఆర్వో శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. రూ.4.50 లక్షల ఆస్తి నష్టం జరిగిందని అంచనా వేశారు. ఒక వ్యక్తికి ఇద్దరు కుమారులు ఉన్నప్పుడు సమానంగా ఆస్తి పంచాలే కానీ ఒక కుమారుడిపైనే ఆస్తి రిజిస్ట్రేషన్ చేస్తుంటే ఎలా ఒప్పుకున్నారని రెవెన్యూ అధికారులను స్థానికులు ప్రశ్నించారు. దీంతో సీఐ టాటాబాబు గ్రామస్తుల సమక్షంలో రాములు తండ్రి సాయిలుతో మాట్లాడి తన ఇద్దరు కుమారులకు సమానంగా ఆస్తి పంచుతానని హామీ పత్రం రాసివ్వడంతో గొడవ సద్దుమణిగింది.



ఆత్మహత్యకు యత్నించిన రాములు కుటుంబ సభ్యులు

## పర్యాటక కేంద్రాలుగా చారిత్రక ప్రదేశాలు

### పర్యాటక మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**పాలకుర్తి/కొడకండ్ల:** తెలంగాణ ప్రజల సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన చారిత్రక ప్రదేశాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖల మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం జనగామ జిల్లా పాలకుర్తిలో చేపట్టిన పర్యాటక కేంద్రాల అభివృద్ధి పనుల ప్రగతిపై సంబంధిత అధికారులతో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలసి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టి పడేలా హస్త కళల ఉత్పత్తులను తయారు చేసి విక్రయించేందుకు వరంగల్–హైదరాబాద్ రహదారిపై పెంబర్తి వద్ద క్రాఫ్ట్ విలేజ్ నిర్మించాలన్నారు. ఇందుకు అవసరమైన స్థలాన్ని సేకరించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డికి సూచించారు. ఈ సమావేశంలో ఇన్‌టాక్ సంస్థ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఎం.సత్యనారాయణ, ఈఈ నాగేందర్‌రావు, ఆర్‌డీఓ రమేశ్, తహసీల్దార్ డి.పుల్లయ్య పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్. పక్కన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**త్వరలో ‘నీరా’ డ్రింక్ ప్రవేశపెడతాం**

గీత కార్మికుల సంక్షేమం, వృత్తి దారులకు చేయూత అందించడంలో భాగంగా త్వరలో ‘నీరా’ డ్రింక్‌ను ప్రవేశపెట్టబోతున్నామని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆదివారం జనగామ జిల్లా కొడకండ్ల మండలం ఏడునూతుల గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో పాటు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గౌడ సామాజిక వర్గానికి చెందిన శాఖను సీఎం కేసీఆర్ తనకు అప్పగించారని, గీత వృత్తిని కాపాడడంతోపాటు కార్మికుల సంక్షేమానికి పాటుపడుతానని అన్నారు. ప్రజలు కోలా, పెప్సీలను కాకుండా నీరాను ఆదరించాలని కోరారు. గీత కార్మికుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

# సౌదీ నుంచి స్వదేశానికి..

- నేడు రాష్ట్రానికి చేరుకోనున్న 39 మంది కార్మికులు
- ఏడాదిన్నరగా క్యాంపులో అవస్థలు
- విదేశాంగ శాఖ చొరవతో ఇంటిబాటలో వలస కార్మికులు

**మోర్తాడ్:** సౌదీ అరేబియాలోని జేఅండ్‌పీ కంపెనీ క్యాంపులో దాదాపు ఏడాదిన్నర కాలంగా పనిలేక మగ్గిపోయిన తెలంగాణకు చెందిన 39 మంది కార్మికులు సోమవారం స్వదేశానికి రానున్నారు. విదేశాంగ శాఖ చొరవతో హైదరాబాద్ చేరుకోనున్నారు. జేఅండ్‌పీ కంపెనీ సౌదీ అరేబియాలో నిర్మాణరంగంలో పనులు నిర్వహిస్తోంది. ఈ పనుల కోసం వివిధ దేశాల నుంచి కార్మికులను రప్పించుకుంది. ఇందులో భాగంగా తెలంగాణకు చెందిన ఎంతో మంది కార్మికులు జేఅండ్‌పీ కంపెనీలో పని చేయడానికి వెళ్లారు. 2018 ఏప్రిల్ వరకు కంపెనీ కార్యకలాపాలు బాగానే నడిచాయి. ఆ తర్వాత కంపెనీ ఆర్థిక సంక్షోభంలో చిక్కుకోవడంతో కార్మికులకు పని కల్పించలేదు. అంతేకాకుండా నెలల తరబడి వేతనాలు కూడా ఇవ్వలేదు. కార్మికుల అకామాలను రెన్యూవల్ చేయకపోవడంతో వారు బయట తిరగలేకపోయారు. కంపెనీ యాజమాన్యం క్యాంపుల్లో ఉన్న కార్మికులకు భోజన సదుపాయాన్ని కల్పించినా నాసిరకం భోజనాలను అందించిందని కార్మికులు పేర్కొంటున్నారు. కనీసం ఇళ్లకు పంపించడానికి కూడా జేఅండ్‌పీ కంపెనీ యాజమాన్యం చొరవ తీసుకోలేదని ఆరోపించారు. కంపెనీ తీరుతో కార్మికులు విదేశాంగ శాఖ అధికారుల సహకారంతో సౌదీ లేబర్ కోర్టులో ఫిర్యాదు చేశారు. కార్మికుల వేతన బకాయిలు చెల్లించడానికి కొంత సమయం ఇచ్చిన లేబర్ కోర్టు.. కార్మికులను ఇళ్లకు పంపించడానికి ఎగ్జిట్ వీసా ఇవ్వాలని కంపెనీ యాజమాన్యాన్ని ఆదేశించింది. దీంతో విదేశాంగ శాఖ కార్మికులకు టికెట్లు సమకూర్చడంతో సోమవారం 39 మంది కార్మికులు సౌదీ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రానున్నారు.

**ఒక్కో కార్మికుడికి రూ.వెయ్యి సహాయం**

విదేశాంగ శాఖ చొరవతో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్న కార్మికులు ఎయిర్‌పోర్టు నుంచి వారి సొంత గ్రామాలకు చేరుకోవడానికి తెలంగాణ ఎన్‌ఆర్‌ఐ సెల్ ఒక్కో కార్మికుడికి రూ.వెయ్యి ఆర్థిక సహాయం అందించనుంది. గతంలో కార్మికులకు రవాణా చార్జీల కోసం రూ. 500 చొప్పున చెల్లించేవారు. ఆ మొత్తాన్ని ప్రస్తుతం రెట్టింపు చేశారు. ఎయిర్‌పోర్టులో కార్మికులు అడుగిడిన వెంటనే వారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎన్‌ఆర్‌ఐ సెల్ ప్రతినిధులు ఆర్థిక సహాయం అందిస్తారు.

**పునరావాసం కల్పించాలి**

బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి అక్కడ పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఇంటిదారి పడుతున్న కార్మికుల సంక్షేమం కోసం కేరళ తరహాలో తెలంగాణ ప్రభుత్వం పునరావాస చర్యలు తీసుకోవాలి. పునరావాసం కోసం శాశ్వత ప్రాతిపదికన ఒక సంస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. స్వగ్రామాలకు కార్మికులు వచ్చిన తరువాత తగిన ఉపాధి లేకపోవడంతో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఆర్థికంగా చితికిపోయి.. కుటుంబ పోషణ భారంకావడంతో కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలూ చోటు చేసుకుంటున్నాయి. అలాగే గల్ఫ్ దేశాల్లో కార్మికులు సంపాదించుకున్న నైపుణ్యాన్ని రాష్ట్రాభివృద్ధి కోసం వినియోగించుకోవాలి. ఈ దిశగా ప్రభుత్వం చొరవ చూపాలి.

– మంద భీంరెడ్డి, ఇమిగ్రెంట్స్ వెల్ఫేర్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు

## ఇన్‌ఫార్మర్ నెపంతో హత్య

**చర్ల:** ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లాలో మావోయిస్టులు ఇన్‌ఫార్మర్ నెపంతో ఓ గిరిజనుడిని హతమార్చారు. సుకుమా జిల్లా గొల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని చినవంకమడుగు గ్రామానికి చెందిన మడకం నంద (45) ఇంటికి శనివారం రాత్రి వచ్చిన మావోయిస్టులు.. ఇంట్లో నిద్రిస్తున్న నందాను లేపి మాట్లాడే పని ఉందంటూ పిలిచారు. నందా బయటకు రాగా, అతడితో మాట్లాడుతూనే గొడ్డళ్లతో నరికి చంపారు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.

ACHARYA NAGARJUNA UNIVERSITY
CENTRE FOR DISTANCE EDUCATION, NAGARJUNANAGAR-522510, Guntur,A.P.
ADMISSION NOTIFICATION FOR THE ACADEMIC YEAR 2019-20
On-line Admissions under Open Distance Learning (Distance Mode) for the Academic Year 2019-20 under year-end pattern in Centre for Distance Education, Acharya Nagarjuna University will commence from 1-7-2019. Detailed notification is available on our website: www.anucde.info.
Place: Nagarjunanagar e-mail: DIRECTOR
Date: 17-6-2019 anucdedirector@gmail.com Centre for Distance Education

Professor Jayashankar Telangana State Agricultural University
Administrative Office: Rajendranagar: Hyderabad-30, Telangana State, India
ADMISSION NOTIFICATION
Advt. No. 5998/EXAMS/2019(1) Date:15-06-2019
ONLINE Applications are invited from eligible candidates for admission into MPC stream courses viz., B.Tech. (Agricultural Engineering) and B.Tech. (Food Technology) under Farmers Quota for the academic year 2019-20. The last date for submission of online application is 12-07-2019 (4 PM). For details visit University website www.pjtsau.edu.in
Dr. S. SUDHEER KUMAR, REGISTRAR

తెలంగాణ ప్రభుత్వం
సాగు నీటి పారుదల వలయము నిర్మల్, నిర్మల్ జిల్లా
టెండరు ప్రకటన
టెండరు నోటీసు నంబర్లు No. 01/2019-20, 02/2019-20,03/2019-20,06/2019-20, మరియు 04/2019-20, 05/2019-20, Dated: 12.06.2019 పనులకు గాను రూ.205.555 లక్షలకు లభ్యమగు తేది: 12.06.2019 నుండి 26.06.2019 మరియు తేది: 12.06.2019 నుండి 19.06.2019 వరకు టెండర్లు ఆహ్వానించనైనది. మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ https://tender.telangana.gov.in లో చూడగలరు. పర్యవేక్షక అభియంత, సాగు నీటి పారుదల వలయము, నిర్మల్
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ I&CADD, ఇరిగేషన్ సర్కిల్, నిర్మల్.
DIPR RO.No.158-PP/CL/Advt/1/2019-20, Dt: 15.06.2019

తెలంగాణ స్టేట్
పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్
(తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థ)
ఇ-ప్రొక్యూర్‌మెంట్ - టెండరు ప్రకటన-05
06 పనుల కోసం టెండరు నం.లు T37 నుండి T42/2019-20 తేది 13-06-2019 కొరకు సివిల్ పనుల కోసం టెండర్లు కోరబడుచున్నవి : టెండరు నం.లు, జిల్లాలలో గల పని & మొత్తం ECV (రూ.లక్షలలో) వరుసగా దిగువ విధంగా ఉన్నాయి : T37- మహబూబ్‌నగర్ -1 - 11.40 ; T38- సంగారెడ్డి-1 - 14.30 ; T39- నల్గొండ -1 - 10.96 ; T40- రంగారెడ్డి-1- 19.36 ; T41- మేడ్చల్ -1-24.00 ; T42- హైదరాబాద్-1- 48.35 ; టెండరు నం. T42 కోసం బిడ్ల దాఖలుకు ఆఖరి తేదీ / సమయం : 18.06.19న సా.5.00గం. టెండరు నం. T37, T38, T39, T40 & T41 కోసం బిడ్ల దాఖలుకు ఆఖరు తేదీ / సమయం : 20.06.2019న సా.5.00గం.కు. తదుపరి వివరాలను వెబ్‌సైట్ @www.eprocurement.gov.in లో చూడవచ్చును.
సం/- మేనేజింగ్ డైరెక్టర్
DIPR RO.No.160-PP/CL/Advt/1/2019-20, Dt:15.06.2019.









## మీ నిర్ణయం అభినందనీయం

- పార్టీ ఫిరాయింపులపై ఏపీ సీఎం జగన్‌కి సీఎల్పీ నేత భట్టి లేఖ



సాక్షి, హైదరాబాద్: ప్రజాస్వామ్య పరిరక్షణకు చీడ పురుగులా మారిన ప్రజాప్రతినిధుల పార్టీ ఫిరాయింపుల విషయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వెలిబుచ్చిన అభిప్రాయం పట్ల తాము హర్షం వ్యక్తం చేస్తున్నామని కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) నేత భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ మేరకు జగన్‌కు ఆదివారం ఆయన ఓ లేఖ రాశారు. పార్టీ ఫిరాయింపులు జరిగితే వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని అసెంబ్లీలో జగన్ చేసిన ప్రసంగంలో చెప్పిన అంశంతో ఏకీభవిస్తున్నామని, ఆ నిర్ణయం అభినందనీయమని భట్టి కొనియాడారు. తెలుగు రాష్ట్రాలు ఈ విషయంలో ఆదర్శప్రాయంగా నిలవాలని తాము కోరుతున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్ ఆహ్వానం మేరకు కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి రావద్దని ఆయన జగన్‌ను కోరారు. సాగునీటి ప్రాజెక్టుల టెండర్లకు సంబంధించిన అన్ని విషయాలను జ్యుడీషియల్ కమిషన్ ముందుంచుతామని తీసుకున్న నిర్ణయాన్ని కూడా స్వాగతిస్తున్నామని చెప్పారు. తెలంగాణలోని అన్ని ప్రాజెక్టులతోపాటు కాళేశ్వరం విషయంలో ఇలాంటి జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలని తాము డిమాండ్ చేస్తున్నామని, ఈ డిమాండ్‌పై సంపూర్ణ మద్దతు కావాలని భట్టి జగన్‌ను కోరారు.

## టీఆర్‌ఎస్‌కు కాంగ్రెస్సే ప్రత్యామ్నాయం: మల్లు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి గ్రామస్థాయిలో బలమైన పునాదులున్నాయని, టీఆర్‌ఎస్‌కు కాంగ్రెస్సే ప్రత్యామ్నాయమని, బీజేపీ బలపడే అవకాశాలే లేవని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి పేర్కొన్నారు. పార్టీలోని సీనియర్లు మాట్లాడే ముందు అన్నీ ఆలోచించుకోవాలని, పార్టీలో అన్ని పదవులు అనుభవించిన తర్వాత కేడర్‌ను అయోమయానికి గురి చేసే విధంగా మాట్లాడడం సరైంది కాదని ఆదివారం ఒక ప్రకటనలో రాజగోపాల్‌రెడ్డిని ఉద్దేశించి అభిప్రాయపడ్డారు. మొన్నటి ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌కు 30 శాతం ఓట్లు వచ్చాయని, కాంగ్రెస్ ప్రజల నుంచి దూరమయ్యే పార్టీ కాదని తెలిపారు. పార్టీలో ఉండి బలోపేతం చేయాల్సిన బాధ్యత కలిగిన నేతలు ఇలా మాట్లాడటం సరైంది కాదని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

### ‘వడ్డెర్ల మహాగర్జన’లో ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్: చట్ట సభల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. రవీంద్రభారతిలో ఆదివారం వడ్డెర సంఘం ఆధ్వర్యంలో జరిగిన వడ్డెర మహాగర్జన సభలో ఆర్.కృష్ణయ్య పాల్గొని మాట్లాడారు. వడ్డెరులకు సముచిత స్థానం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వడ్డెర్లకు నామినేటెడ్, చట్టసభల్లో స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి టి.రాజయ్య మాట్లాడుతూ.. వడ్డెరుల సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల వెంకటేష్ మాట్లాడుతూ.. వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని, ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.1000 కోట్లు బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. రూ.10 లక్షల బీమాను, పిల్లలకు ఉచిత విద్య కల్పించాలని డిమాండ్ చేశారు. ఇటీవల విజయం సాధించిన వడ్డెర కులానికి చెందిన సర్పంచులు, ఉప సర్పంచులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీలను మున్సిపల్ మేయర్లను, కార్పొరేటర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ సీనియర్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహనరావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జకృష్ణ, బీసీ విద్యార్థినేత వేముల రామకృష్ణ, జాతీయ కోశాధికారి బత్తుల లక్ష్మీకాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేతన్నల చలో ఢిల్లీకి సహకరించండి

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సురేశ్ వినతి

సాక్షి, హైదరాబాద్: ఈనెల 24 నుంచి దేశ రాజధాని ఢిల్లీలో తలపెట్టిన ‘నేతన్నల సమరనాదం’కార్యక్రమానికి సహకరించాలని నేతన్నల చలో ఢిల్లీ జేఏసీ చైర్మన్ దాసు సురేశ్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యతో కలసి ఆయన ఆదివారం దిల్‌కుషా అతిథిగృహంలో కిషన్‌రెడ్డిని కలసి వినతిపత్రం అందజేశారు. విదేశీ వస్త్ర బహిష్కరణ నినాదంతో భారతజాతిని ఏకం చేసి స్వాతంత్య్ర ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన చేనేత రంగం నేడు సంక్షోభంలో పడి కుదేలవుతోందని సురేశ్ చెప్పారు. కార్మికులు మార్కెట్ సదుపాయాల లేమితో ఆర్థిక సంక్షోభంలో పడి ఆత్మహత్యల పాలవుతున్నారని ఆయన కిషన్‌రెడ్డికి వివరించారు. కేంద్ర జౌళి శాఖ మంత్రి స్మృతీ ఇరానీ, ఇతర ప్రభుత్వ ముఖ్యులను కలసి తమ సమస్యలు నివేదించేందుకు సహకరించాలని కోరారు. దీనిపై స్పందించిన కిషన్‌రెడ్డి నేతన్నల పట్ల బీజేపీకి సానుకూల దృక్పథం ఉందని చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, తెలంగాణ వీవర్స్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ అధ్యక్షుడు తాటి ఎల్లయ్య, జేఏసీ సభ్యుడు మండల రణధీర్, బీసీ యువజన సంఘం అధ్యక్షుడు నీలం వెంకటేష్, విద్యార్థి సంఘం నేతలు రామకృష్ణ, అంజి తదితరులు పాల్గొన్నారు.

# నేడు విజయవాడకు కేసీఆర్

- కాళేశ్వరం ప్రారంభోత్సవానికి ఏపీ సీఎం జగన్‌ను ఆహ్వానించనున్న ముఖ్యమంత్రి
- విభజన సమస్యలపై ఇరువురు సీఎంల మధ్య మరోదఫా చర్చలకు అవకాశం
- వివాదాల స్థితిగతులపై నివేదికలు సమర్పించిన సంబంధిత శాఖలు
- అంతకు ముందు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కొత్త క్వార్టర్లను ప్రారంభించనున్న సీఎం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విభజన వివాదాల పరిష్కారం దిశగా తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ముఖ్యమంత్రులు కె. చంద్రశేఖర్‌రావు, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సోమవారం మరోసారి సమావేశమై చర్చలు జరిపే అవకాశముంది. ఈ నెల 21న నిర్వహించనున్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్. జగన్‌మోహన్ రెడ్డిని ఆహ్వానించడానికి కె.చంద్రశేఖర్ రావు సోమవారం విజయవాడకు వెళ్లనున్నారని తెలిసింది. తొలుత కేసీఆర్ సోమవారం ఉదయం 6 గంటల నుంచి ఆర్‌అండ్‌బీ, శాసనసభా వ్యవహారాల మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో గృహవాస్తు పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని హైదర్‌గూడలో కొత్తగా నిర్మించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ నివాస గృహాల సముదాయాన్ని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితో కలసి ప్రారంభిస్తారు. ఆ తర్వాత నేరుగా విజయవాడకు బయలుదేరి వెళ్లి వైఎస్ జగన్‌ను కలవనున్నారు. ఈ క్రమంలో ఇరువురు ముఖ్యమంత్రులు రాష్ట్ర విభజన వివాదాలపై మరోసారి చర్చలు జరపనున్నారు. ఈ సమావేశాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర విభజన వివాదాల స్థితిగతులపై సంబంధిత శాఖలు ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాయి. ఏపీ, తెలంగాణ మధ్య సత్సంబంధాలు నెలకొల్పే దిశగా ఇప్పటికే ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రెండు దఫాలుగా చర్చలు జరిపారు. ఇచ్చిపుచ్చుకొనే పద్ధతిలో సమస్యలను పరిష్కరించుకోవాలనే ధోరణితో ఇద్దరు సీఎంలు సహృద్భావ వాతావరణంలో ఈ చర్చలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లో ఏపీ కార్యాలయాల నిర్వహణ కోసం కేటాయించిన భవనాలు గత నాలుగేళ్లుగా నిరుపయోగంగా ఉండటంతో వాటిని తెలంగాణకు అప్పగిస్తూ రెండు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. రెండు రాష్ట్రాల సీఎంల మధ్య ఇప్పటి వరకు జరిగిన చర్చల ఫలితంగానే ఈ మేరకు ముందడుగు పడింది. ప్రధానంగా షెడ్యూల్ 9, 10లోని ప్రభుత్వ రంగ సంస్థల విభజన, విద్యుత్ ఉద్యోగుల పంపకాలు, విద్యుత్ బిల్లుల బకాయిలు తదితర సమస్యలను రెండు రాష్ట్రాలూ పరిష్కరించుకోవాల్సి ఉంది. సోమవారం ఇరు రాష్ట్రాల సీఎంల సమావేశంలో వీటిలో కొన్నింటికి పరిష్కారం లభించే అవకాశాలున్నాయి.

### శారదాపీఠం ఉత్తరాధికారి ఆశ్రమ దీక్షకు కేసీఆర్

విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి ఆశ్రమ దీక్షా స్వీకార కార్యక్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొననున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని ఆహ్వానించేందుకు సోమవారం విజయవాడకు వెళ్తున్న కేసీఆర్... ఈ సందర్భంగా కనకదుర్గ అమ్మవారి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేయనున్నారు. అనంతరం విశాఖపీఠం ఉత్తరాధికారి నియామకానికి సంబంధించిన కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఉదయం బేగంపేట విమానాశ్రయం నుంచి కేసీఆర్ ప్రత్యేక విమానంలో విజయవాడకు పయనమవుతారు. మధ్యాహ్నం 1.25కు ది గేట్‌వే హోటల్‌కు చేరుకొని అక్కడి నుంచి 1.45కు దుర్గామల్లేశ్వర స్వామి ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకొని పూజల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.15 గంటల వరకు కేసీఆర్ అక్కడే ఉంటారు. అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు ఏపీ సీఎం వైఎస్ జగన్ నివాసానికి చేరుకొని ఆయనకు కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికను అందించనున్నారు. అక్కడే భోజనం చేసి సాయంత్రం 4.15కు గేట్‌వే హోటల్‌కు చేరుకొని తిరిగి సాయంత్రం 5 గంటలకు కృష్ణా తీరంలోని గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో జరిగే శారదాపీఠం ఉత్తరాదికారి ఆశ్రమ దీక్షా స్వీకార కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం హైదరాబాద్‌కు తిరిగి పయనమవుతారు.

# షోకాజ్ ఇస్తారా?



▶ మొదటి పేజీ తరువాయి

వేయాలని టీపీసీసీ భావిస్తున్నట్టు సమాచారం. రాజగోపాల్‌పై చర్యలు తీసుకుంటే పార్టీ మారేందుకు ఆయనకు అవకాశం ఇచ్చిన వారవుతామనే భావనలో ఉన్న గాంధీ భవన్ వర్గాలు ఇప్పుడు ఏం చేస్తాయనేది హాట్‌టాపిక్‌గా మారింది.

**నేడు కమిటీ భేటీ...**

వాస్తవానికి ఎంపీపీ, జెడ్పీ ఎన్నికల్లో పార్టీ విప్‌ను ధిక్కరించారంటూ కొందరిపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించేందుకు సోమవారం భేటీ కావాలని పార్టీ క్రమశిక్షణా సంఘం గతంలోనే నిర్ణయించింది. ఈలోగా రాజగోపాల్ వ్యవహారం కూడా తెరపైకి వచ్చినందున సోమవారం జరగనున్న భేటీలో ఈ అంశం కూడా చర్చకు రానుంది. రాజగోపాల్ వ్యాఖ్యలను సమావేశంలో క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం అవసరమనుకుంటేనే ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. షోకాజ్ జారీ చేసి రాజగోపాల్‌పై చర్యలకు ఉపక్రమిస్తే ఆయనకు పార్టీ మారే స్వేచ్ఛను తామే ఇచ్చినట్టు అవుతుందని, ఆ వ్యూహంతోనే ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారని, రాజగోపాల్ ట్రాప్‌లో తాము ఎలా పడతామని టీపీసీసీ ముఖ్య నేత ఒకరు ‘సాక్షి’తో మాట్లాడుతూ వ్యాఖ్యానించడం గమనార్హం. తమపై ఆరోపణలు చేసే ముందు రాజగోపాల్ ఆత్మవిమర్శ చేసుకోవాలని, సొంత మండలంలో తన సోదరుడిని జెడ్పీటీసీగా గెలిపించుకోలేకపోవడంలో బాధ్యులెవరని ఆ నేత ప్రశ్నించారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో రాజగోపాల్‌రెడ్డికి 19 వేల మెజారిటీ వస్తే ఎంపీ ఎన్నికల్లో మునుగోడు నియోజకవర్గంలో వెంకట్‌రెడ్డికి కేవలం 4 వేల మెజారిటీయే వచ్చిందని, దీనికి బాధ్యులెవరో రాజగోపాల్‌రెడ్డి తనను తాను ప్రశ్నించుకోవాలన్నారు. రాజగోపాల్ వ్యూహాన్ని తిప్పికొడతామని, పార్టీ మారితే ఫిరాయింపుల చట్టం కింద స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తామని, అప్పుడు స్పీకర్‌దే తుది నిర్ణయం అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాజగోపాల్ వ్యవహారంపై పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న విషయమై టీపీసీసీ వర్గాల్లో పలు రకాల చర్చలు జరుగుతున్నాయి. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా వ్యూహాత్మకంగా మౌనం వహిస్తున్నారు. రాజగోపాల్ వ్యాఖ్యలపై స్పందించాల్సిన పని లేదని ఆయన భావిస్తున్నట్టు సమాచారం.

**ముఖ్యులతో రాజగోపాల్ సంప్రదింపులు...**

పార్టీ నేతలపై తీవ్ర విమర్శలు చేసి వార్తల్లోకెక్కిన మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఆదివారం పలువురు కాంగ్రెస్ ముఖ్యులతో సంప్రదింపులు జరిపినట్టు తెలుస్తోంది. సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్‌లతో పాటు రాష్ట్రవ్యాప్తంగా తనతో సన్నిహిత సంబంధాలున్న నేతలతో ఆయన మాట్లాడినట్టు సమాచారం. పార్టీపై తాను ఎందుకు వ్యాఖ్యలు చేయాల్సి వచ్చిందనేది వారికి వివరిస్తూనే భవిష్యత్తులో తీసుకోబోయే నిర్ణయాలకు అండగా ఉండాలని ఆయన కాంగ్రెస్ ముఖ్యులను కోరుతున్నట్టు తెలుస్తోంది.

### కాంగ్రెస్‌లోనే ఉంటా...



తన సోదరుడు చేసిన వ్యాఖ్యలపై భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా బహిరంగంగా ఎక్కడా స్పందించలేదు. రాజగోపాల్ వ్యాఖ్యలతో తనకేం సంబంధం లేదని, తాను కాంగ్రెస్‌లోనే ఉంటానని మొదటి నుంచీ చెబుతున్నానని, దానికే కట్టుబడి ఉంటానని వెంకట్‌రెడ్డి తన సన్నిహితులతో చెప్పినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సోదరులిద్దరూ చెరో బాట పడతారా? కాంగ్రెస్ పార్టీ రాజగోపాల్‌పై చర్యలు తీసుకుంటుందా.. కనీసం షోకాజ్ నోటీసు అయినా ఇస్తుందా లేక రాజగోపాల్ వ్యూహాన్ని తిప్పికొట్టేలా వ్యవహరించి ఆయన పార్టీ మారితే ఫిరాయింపుల చట్టం కింద ఫిర్యాదు చేస్తుందా? అన్నది కాలమే నిర్ణయించాల్సి ఉంది.

## బీసీ బిల్లు పెట్టాలి

### కిషన్‌రెడ్డితో ఆర్.కృష్ణయ్య చర్చలు



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కృష్ణయ్య

హైదరాబాద్: పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్ట సభల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆర్.కృష్ణయ్య నేతృత్వంలోని బీసీ సంక్షేమ సంఘం నేతలు ఆదివారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డిని కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. ఇంతవరకు అసెంబ్లీ, పార్లమెంటు గడప తొక్కని బీసీ కులాల వారికి నామినేటెడ్ పద్ధతిలో ఆంగ్లో ఇండియన్లకు ఇచ్చిన మాదిరిగా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించి, రాజ్యాంగ సవరణ చేయాలని కోరారు. పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 34% నుంచి 50 శాతానికి పెంచాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్సీ,ఎస్టీ, బీసీలకు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు పెట్టాలని, కేంద్ర, ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న 14 లక్షల ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నీల వెంకటేష్, దాసు సురేశ్, సి.రాజేందర్, జి. అంజి, వేముల రామకృష్ణ, జి. కృష్ణ యాదవ్, నరేష్‌గౌడ్, బర్క కృష్ణ, మహేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆ నిర్ణయాన్ని ఉపసంహరించాలి

- మెడికల్ ప్రొఫెసర్ల రిటైర్మెంట్ వయసు పెంపుపై జూడాల ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: మెడికల్ ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయసు పెంపు ప్రకటనను వ్యతిరేకిస్తున్నట్టు జూనియర్ డాక్టర్లు స్పష్టం చేశారు. పదవీ విరమణ వయసును 58 నుంచి 65 ఏళ్లకు పొడగించనున్నట్టు ప్రకటన వెలువడిన నేపథ్యంలో జూనియర్ డాక్టర్లు సమ్మె నోటీసులిచ్చారు. నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే, సోమవారం నుంచి విధులు బహిష్కరించి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఇప్పటికే కొన్నేళ్లుగా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయడం లేదని, ఇప్పుడీ పదవీ విరమణ వయసు పెంపుతో మరో పదేళ్ల వరకు యువ వైద్యులకు అవకాశం రాదని జూడాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్‌ను కలిసి, ఆ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. అయితే, మంత్రి తమకు ఎలాంటి హామీ ఇవ్వలేదని జూడా అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ విజయేందర్ తెలిపారు. ఇదే అంశంపై ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు కూడా మంత్రిని కలిశారు. నిర్ణయం అమలుపై చర్చించేందుకు కమిటీ వేయాలని కోరారు. ఈనెల 18న నిరుద్యోగ డాక్టర్లతో హైదరాబాద్‌లోని ధర్నాచౌక్ వద్ద ‘నిరుద్యోగ సభ’ నిర్వహించనున్నట్లు హెచ్‌ఆర్డీఏ ప్రకటించింది. ఆదివారం, మంత్రి ఈటలను కలిసి ప్రొఫెసర్ల వయసు పెంపుపై తమకున్న అభ్యంతరాలను తెలియజేశామని హెచ్‌ఆర్డీఏ ప్రెసిడెంట్ డాక్టర్ మహేశ్ తెలిపారు. అయితే, మంత్రి నుంచి ఎలాంటి హామీ రాకపోవడంతో నిరసనలు కొనసాగించాలని నిర్ణయించామన్నారు.

## ఉద్యోగుల వ్యతిరేక ప్రభుత్వమని అనలేదు

### ఉద్యోగుల సంఘం జేఏసీ ప్రతినిధులు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగులు, ప్రభుత్వానికి మధ్య అగాధం సృష్టించేందుకు కొందరు కుట్రలు పన్నుతున్నారని, వారి ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఫలించవని తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జేఏసీ ప్రతినిధులు కారం రవీందర్‌రెడ్డి, వి.మమతలు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగులకు సంబంధించిన డిమాండ్ల పరిష్కారం కోసం శనివారం నిర్వహించుకున్న జేఏసీ సమావేశంలో కొందరు ప్రతినిధులు తమ సమస్యలు, కొన్ని పరిస్థితులకు సంబంధించి కొంత ఆవేదన వ్యక్తం చేస్తూ మాట్లాడారని, కానీ సమస్యలను సామరస్యపూర్వకంగానే పరిష్కరించుకోవాలని తీర్మానించుకున్నట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగుల వ్యతిరేక ప్రభుత్వమని కొందరు అన్నట్లుగా ఆదివారం ఓ పత్రిక తప్పుడు కథనాన్ని ప్రచురించిందని వారు ఆ ప్రకటనలో ఆరోపించారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులు అనని మాటలు అన్నట్లుగా ఆ కథనంలో చిత్రీకరించటం బాధ కలిగించిందని పేర్కొన్నారు. దీనిని జేఏసీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. రెవెన్యూ శాఖ ప్రక్షాళన నేపథ్యంలో ఆ శాఖ ఉద్యోగులు కొంత ఆవేదనకు గురైన మాట వాస్తవమేనని తెలిపారు. ఒకవేళ పరిపాలనా సౌలభ్యం కోసం శాఖల విలీనంచేస్తే ఉద్యోగుల సర్వీసు సమస్యలను పరిష్కరించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని, ఉద్యోగ సంఘాల జేఏసీతో చర్చించాలని సూచించినట్లు వెల్లడించారు. డిమాండ్లు తీర్చుకునేందుకు సామరస్యంగానే ఉంటూనే ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని స్పష్టం చేశారు.

## ఆత్మగౌరవ జాతరకు రండి

### ఏచూరిని కోరిన మందకృష్ణ

సాక్షి, న్యూఢిల్లీ: ఎమ్మార్పీఎస్ 25వ వార్షికోత్సవం సందర్భంగా జూలై 7న ప్రకాశం జిల్లా ఈదుమూడిలో జరగనున్న మాదిగల ఆత్మగౌరవ జాతరకు హాజరుకావాల్సిందిగా సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరిని సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ కోరారు.

# అన్ని హంగులతో కొత్త ఎమ్మెల్యే క్వార్టర్స్

- నాలుగున్నర ఎకరాల్లో రూ.166 కోట్లతో నిర్మాణం
- నేడు ప్రారంభించనున్న ముఖ్యమంత్రి కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: సకల హంగులతో నిర్మితమైన శాసనసభ్యుల నివాస గృహ సముదాయాలను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సోమవారం ప్రారంభించబోతున్నారు. నిర్మాణంలో తీవ్ర ఆలస్యం జరిగినా ఎట్టకేలకు తెలంగాణ రాష్ట్రం రెండో శాసనసభ కొలువుదీరిన తర్వాత ఈ భవనాలు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. నాలుగున్నర ఎకరాల సువిశాల విస్తీర్ణంలో దాదాపు రూ.166 కోట్ల వ్యయంతో వీటిని నిర్మించారు. ఎమ్మెల్యేలతో పాటు సిబ్బంది, సర్వెంట్ల కుటుంబాలు కూడా ఉండేందుకు వీలుగా ఈ సముదాయాన్ని సిద్ధం చేశారు. 119 మంది ఎమ్మెల్యేలతోపాటు మరో నియమిత ఎమ్మెల్యే... వెరసి 120 మంది సభ్యులు ఉండేందుకు వీలుగా వీటిని నిర్మించారు.

**36 స్టాఫ్ క్వార్టర్లు:** ఆరు అంతస్తుల్లో స్టాఫ్ క్వార్టర్లు నిర్మించారు. ఇందులో మొత్తం 36 ఫ్లాట్లు ఉంటాయి. 810 చ.అ. విస్తీర్ణం ఉండే రెండు పడక గదుల ఫ్లాట్లు 12, 615 చ.అ.విస్తీర్ణంలో ఉండే సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లు 24 ఉంటాయి. 12 అటెండెంట్ల ఫ్లాట్లు ఉన్నాయి. ఈ సముదాయం కూడా ఆరు అంతస్తుల్లో ఉంది. ఒక్కో ఫ్లాట్‌ను 325 చ.అ.విస్తీర్ణంలో నిర్మించారు. ఐటీ అండ్ ఎమినిటీస్ బ్లాక్ నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు. ఇది ఐదు అంతస్తుల్లో ఉంటుంది. గ్రౌండ్‌ఫ్లోర్‌లో 4 వేల చ.అ.విస్తీర్ణంలో సూపర్ మార్కెట్, క్యాంటీన్ ఉంటాయి. మొదటి అంతస్తులో కార్యాలయం, హెల్త్ సెంటర్ ఉంటాయి. సెకండ్ ఫ్లోర్‌లో ఆఫీస్, ఇండోర్ గేమ్స్, స్టోర్ రూమ్ ఉంటాయి. 0.73 ఎమ్మెల్డీ సామర్థ్యంతో భూగర్భ సంప్, ఓ ఎస్టీపీ, 1,000 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఉంటాయి. ఇప్పటికే ఉన్న పాత, కొత్త ఎమ్మెల్యే క్వార్టర్లలో ఉండాలనుకుంటున్న ఎమ్మెల్యేలు వాటిల్లోనే కొనసాగే అవకాశముంది.

### 12 అంతస్తుల్లో...

వాహనాలు నిలిపేందుకు సెల్లార్‌లో మూడంతస్తులు నిర్మించారు. ఇందులో 276 కార్లను నిలిపే స్థలం ఉంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో 23 విజిటర్స్ గదులు నిర్మించారు. తమను కలిసేందుకు వచ్చే వారితో ఎమ్మెల్యేలు ఈ గదుల్లో భేటీ అవుతారు. ఓ క్లబ్ హౌస్, ఒక వ్యాయామశాల కూడా సిద్ధం చేశారు. ఈ భవనాలు 12 అంతస్తుల్లో నిర్మించారు. ఎమ్మెల్యేలకు 120 ఫ్లాట్లు ఉన్నాయి. ఒక్కోటి 2,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుంది. ఇందులో మూడు పడక గదులు, హాలు, వంటగది, డ్రాయింగ్‌రూమ్, విజిటర్ రూమ్ ఉంటాయి. ఆరు లిఫ్టులు, 5 మెట్ల దారులు ఏర్పాటు చేశారు.

## ఆగస్టు 7న జాతీయ ఓబీసీ మహాసభ

### బీసీ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జస్టిస్ ఈశ్వరయ్య



హైదరాబాద్: దీర్ఘకాలికంగా, అపరిష్కృతంగా ఉన్న ఓబీసీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 7న జాతీయ ఓబీసీ మహాసభను హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఆలిండియా బీసీ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జస్టిస్ వంగాల ఈశ్వరయ్య తెలిపారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడ నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల్ కమీషన్ ఆమోదం పొందిన ఆగస్టు 7న ప్రతి ఏడాది జాతీయ మహాసభ నిర్వహిస్తున్నామని చెప్పారు. జనాభా ప్రాతిపదికన ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, క్రీమీలేయర్ ఎత్తివేయాలని, ప్రైవేటు స్కూళ్లలో 50 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించాలని, బీసీ, ఎస్సీ, ఎస్టీల వర్గీకరణ చేయాలని, జాతీయస్థాయిలో ప్రత్యేక ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, ఓబీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, మండల్ కమిషన్ ఇచ్చిన 42 సిఫారసులను అమలు చేయాలనే డిమాండ్లతో ఈ మహాసభను నిర్వహించనున్నామని తెలిపారు. దేశంలోని 29 రాష్ట్రాలు, 6 కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ఓబీసీ ప్రతినిధులు ఈ మహాసభలో పాల్గొంటారన్నారు.

**చరిత్రలో నిలిచిపోయే విధంగా...**

జాజుల శ్రీనివాస్ మాట్లాడుతూ సమసమాజ స్థాపన కోసం హైదరాబాద్‌లో నిర్వహించే జాతీయ ఓబీసీ మహాసభ చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉంటుందన్నారు. ఈ మహాసభకు ఆరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల జాతీయ, రాష్ట్ర నేతలు పాల్గొంటారని తెలిపారు. ఓబీసీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకువస్తామని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు మహాసభకు హాజరవుతారని పేర్కొన్నారు. జాతీయ ఓబీసీ మహాసభ నిర్వహణ కమిటీ చైర్మన్‌గా జాజుల శ్రీనివాస్‌గౌడ్‌ను నియమిస్తున్నట్లు జస్టిస్ ఈశ్వరయ్య తెలిపారు.

# బంగారు కాదు.. బాధల తెలంగాణ

- సీఎం కేసీఆర్ పాలనపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ మండిపాటు
- రైతు సంక్షేమం కోసం పెట్టిన నీతి ఆయోగ్ సమావేశానికి కేసీఆర్ గైర్హాజరుపై విమర్శ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కోరుకునే బంగారు తెలంగాణ అంటే వివిధ రంగాల అభివృద్ధి, ప్రతి ఒక్కరి సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉన్నా సీఎం కేసీఆర్ పట్టించుకోవడం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయానికి పెద్దపీట వేయడానికి దేశంలోని 70 శాతం మంది ప్రజలు ఆధారపడిన వ్యవసాయంపై చర్చించేందుకు నీతి ఆయోగ్ సమావేశం పెడితే కేసీఆర్ దానికి గైర్హాజరు అయ్యారని పేర్కొన్నారు. ఆయన పాలనలో బంగారు తెలంగాణ ఏమో కాని బాధల తెలంగాణగా మారిపోయిందని దుయ్యబటారు. నిధులు, సంక్షేమం గుర్తుకొచ్చినప్పుడు మాత్రమే కేసీఆర్‌కు ప్రధాని మోదీ గుర్తుకొస్తారని, అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరానికి అన్ని అనుమతులు మోదీ ఇచ్చారని, అనేక రకాలుగా తెలంగాణను ఆదుకుంటున్నా నీతి ఆయోగ్ సమావేశానికి ఎందుకు హాజరు కాలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం కోసం మహారాష్ట్రకు వెళ్లారని, ఢిల్లీకి వెళ్లినా మోదీని ఆహ్వానించలేదన్నారు. మోదీ దగ్గర కేసీఆర్‌కు ముఖం చెల్లకే ఆయన దగ్గరకు వెళ్లలేదన్నారు. కేసీఆర్ కుమార్తె కవిత, వినోద్‌ల ఓటమి, బీజేపీ నాలుగు స్థానాలు గెలవడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. కారు, సారు, పదహారు రాలేదని కేసీఆర్ బేజారు అయ్యారన్నారు. ఫ్రంట్ టెంట్ ఎక్కడ పోయిందో అక్కడికి రాలేదన్నారు. ఏపీ సీఎం జగన్ కూడా ఢిల్లీకి వెళ్లి ప్రత్యేక హోదా అడిగారని, సంప్రదాయాన్ని కాపాడటానికి సమావేశానికి హాజరయ్యారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించిందని, కాని రాష్ట్రంలో కేసీఆర్ వారి సంక్షేమాన్ని గాలికి వదిలేశారని, ఉద్యోగులను పక్కన పడేశారన్నారు. వాటిపై ఈనెల, వచ్చే నెలల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయబోతున్నామన్నారు. కార్పొరేట్ స్కూళ్లలో ఫీజులు పెరిగాయని, వాటిని కట్టడి చేయడం లేదన్నారు. నిరుద్యోగ సమస్య అలాగే ఉందన్నారు. స్కాలర్‌షిప్స్ లేవని, ఫీజు రీయింబర్స్‌మెంట్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏటా పదవీ విరమణలు పెరుగుతున్నాయని, ఖాళీలు పెరుగుతున్నాయని, అయినా ఒక్క ఉద్యోగం కూడా భర్తీ చేయడం లేదన్నారు.

### 17న రౌండ్‌టేబుల్ సమావేశం..

ఫీజుల నియంత్రణపై ఈనెల 17న పిల్లల తల్లిదండ్రులతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. 24వ తేదీన పాఠశాల విద్యాకమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని, ఆ తరువాత ర్యాలీ నిర్వహిస్తామన్నారు. జూలై 6 నుంచి కొత్తగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడతామన్నారు. డిసెంబర్ నాటికి సంస్థాగతంగా కమిటీల ఏర్పాటును పూర్తి చేస్తామన్నారు. తమ జాతీయ పార్టీ పశ్చిమ బెంగాల్, తెలంగాణపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఈ రెండు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున సభ్యత్వాల నమోదు చేపడతామన్నారు. చాలా మంది బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎవరు ఏ పదవిలో ఉన్నారో చూసి జాతీయ పార్టీ ఆలోచించి తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలో సచివాలయ భవనానికి వాస్తు దోషం ఉంటే సరిదిద్దుకోవాలే కానీ దాన్ని కూల్చి కొత్తది కట్టడం ఎందుకని ప్రశ్నించారు.

## ఆత్మ విమర్శ చేసుకోండి

### రాజగోపాల్‌కు నిరంజన్ హితవు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్‌లో నాయకత్వ లోపం ఉందని, ఆ కారణంగానే పార్టీ పరిస్థితి దిగజారిందని వ్యాఖ్యానించిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆ పరిస్థితికి తానెంత కారణమో ఆత్మ విమర్శ చేసుకోవాలని టీపీసీసీ ఎన్నికల సమన్వయ కమిటీ కన్వీనర్ జి.నిరంజన్ హితవు పలికారు. ఇతర పార్టీల్లోకి వెళ్లాలనుకునే వారు కాంగ్రెస్ గురించి నీచంగా మాట్లాడటం ఫ్యాషన్‌గా మారిందని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో ఉన్నప్పుడు అన్ని పదవులు అనుభవించి, వరుసగా వచ్చిన ఎన్నికల్లో ఎవరికీ అవకాశం ఇవ్వకుండా తామే పోటీ చేసిన రాజగోపాల్‌రెడ్డి లాంటి నేతలు ఇలా మాట్లాడటం సరికాదని విమర్శించారు. ఎలాంటి వ్యాఖ్యలు చేసేందుకైనా కాంగ్రెస్‌లో ఉన్న స్వేచ్ఛ ఏ పార్టీలోనూ ఉండదని, రాజగోపాల్‌రెడ్డి లాంటి నేతలు ఇతర పార్టీల్లోకి వెళ్తే కానీ నోటి దురదకు అడ్డుకట్ట పడదని నిరంజన్ ఎద్దేవా చేశారు.



సుమన్‌రావుకు కిరీటాన్ని అలంకరిస్తున్న 2018 మిస్ ఇండియా అనుకీర్తి వాస్

# మిస్ ఇండియాగా సుమన్ రావ్

## తెలంగాణకు చెందిన సంజనా మిస్ ఇండియా రన్నరప్

**ముంబై:** రాజస్తాన్‌కు చెందిన సీఏ విద్యార్థిని మిస్ ఇండియా–2019 విజేతగా నిలిచారు. ముంబైలోని సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఇండోర్ స్టేడియంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. మిస్ ఇండియా టైటిల్ గెలుచుకోవడం సంతోషంగా ఉందని ఆమె తెలిపారు. పరిస్థితులు ఎప్పటికీ చేజారవని, తనలాగే కలలు కంటున్న ఇతర మహిళలు భయపడకుండా కలలను సాకారం చేసుకోవచ్చన్న నమ్మకం ఈ టైటిల్ అందుకోవడం ద్వారా కలిగిందన్నారు. తన కుటుంబం, మిత్రులతో సంబరాలు జరుపుకోవడానికి వేచి ఉండలేకపోతున్నానని అన్నారు. డిసెంబర్‌లో బ్యాంకాక్‌లో జరుగనున్న మిస్ వరల్డ్ పోటీల్లో కూడా పాల్గొననున్నారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఇంజినీర్ శివాని జాదవ్ మిస్ గ్రాండ్ ఇండియాగా నిలిచారు. బిహార్‌కు చెందిన మేనేజ్‌మెంట్ విద్యార్థిని శ్రేయా శంకర్ మిస్ ఇండియా యునైటెడ్ కాంటినెంట్స్‌గా నిలిచారు. తెలంగాణకు చెందిన సంజనా విజ్ మిస్ ఇండియా రన్నరప్‌గా నిలిచారు. ప్రముఖ డిజైనర్ ద్వయం ఫాల్గుని షేన్ పీకాక్, మిస్ వరల్డ్ 2018 వెనెస్సా పొన్కా డి లియోన్, నటులు హుమా ఖురేషి, చిత్రాంగ సింగ్, ఆయుష్ శర్మ, కొరియోగ్రాఫర్, చిత్రనిర్మాత రెమో డి సౌజా, స్ప్రింటర్ ద్యుతి చంద్, ఫుట్‌బాల్ టీం కెప్టెన్ సునీల్ ఛెత్రితో కూడిన బృందం విజేతలను ఎంపిక చేసింది.

**ఎంటెక్ చదువుతున్న సంజన...**

తెలంగాణకు చెందిన సంజనా విజ్ మిస్ ఇండియా రన్నరప్‌గా నిలిచారు. దీనితోపాటు మిస్ తెలంగాణ 2019 టైటిల్‌ను అందుకున్నారు. ఈమె యూపీలోని అమిటీ యూనివర్సిటీలో బయో టెక్నాలజీలో ఎం.టెక్ చదువుతున్నారు.



సెకండ్ రన్నరప్‌తో తెలంగాణ అమ్మాయి సంజన (ఎడమ)

# సాగు సంక్షోభం .. నిరుద్యోగం

## అఖిలపక్ష భేటీలో లేవనెత్తిన విపక్షాలు

- కరువు, పత్రికా స్వేచ్ఛపై కూడా పార్లమెంటులో చర్చకు డిమాండ్
- జమ్మూ కశ్మీర్‌లో త్వరగా ఎన్నికలు నిర్వహించాలన్న కాంగ్రెస్
- మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించాలని కోరిన టీఎంసీ
- నేటి నుంచి లోక్‌సభ.. నేడు ఎంపీల ప్రమాణ స్వీకారం

**న్యూఢిల్లీ:** జమ్మూ కశ్మీర్ ఎన్నికలు, నిరుద్యోగం, సాగు సంక్షోభం, కరువు, పత్రికా స్వేచ్ఛ వంటి అంశాలను ఆదివారం నాటి అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రధానంగా లేవనెత్తింది. జమ్మూ కశ్మీర్‌లో త్వరగా ఎన్నికలు నిర్వహించాలని కోరింది. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలకు ఒకరోజు ముందు కేంద్రం నిర్వహించిన ఈ భేటీలో.. ఈ అంశాలన్నిటినీ పార్లమెంటులో చర్చించాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఇది ఇప్పటికీ ఒక సైద్ధాంతిక పోరాటమేనని కాంగ్రెస్ పేర్కొంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రాజ్యసభలో విపక్ష నేత గులాంనబీ ఆజాద్, కాంగ్రెస్ ఎంపీలు అధీర్ రంజన్ చౌదరి, కె.సురేష్, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, తృణమూల్ కాంగ్రెస్ నేత డెరెక్ ఒబ్రీన్ తదితరులు పాల్గొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అంశాన్ని కూడా విపక్షాలు గట్టిగా ప్రస్తావించాయి. కాగా ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ఈ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని టీఎంసీ నేతలు సుదీప్ బంద్యోపాధ్యాయ్, ఒబ్రీన్‌లు నొక్కిచెప్పారు. అదే సమయంలో సమాఖ్యవాదం బలహీనపడుతుండటంపై ఆందోళన వ్యక్తం చేస్తూ..రాష్ట్రాలను ఉద్దేశపూర్వకంగా టార్గెట్ చేయడం ఆమోదనీయం కాదని విపక్షాలు స్పష్టం చేశాయి. 'అధికారంలోకి వచ్చినందుకు ప్రభుత్వాన్ని అభినందించాం. ఇది సైద్ధాంతిక పోరాటం, గతంలోనూ సైద్ధాంతిక పోరాటమే. సైద్ధాంతిక పోరాటంగానే ఉంటుంది కూడా..' అని ప్రభుత్వానికి చెప్పినట్లు సమావేశం తర్వాత ఆజాద్ విలేకరులకు తెలిపారు. లౌకిక శక్తులకు కాంగ్రెస్ పార్టీ పునాది వంటిదని, ప్రభుత్వంలో ఉన్నా, విపక్షంలో ఉన్నా ఆ స్ఫూర్తిని సజీవంగా ఉంచేందుకు తమ పార్టీ కృషి చేస్తుందని చెప్పారు. అధికారంలో లేకపోయినా రైతులు, కార్మికులు, మహిళల అభ్యున్నతికి కృషి కొనసాగిస్తామని అన్నారు. దేశంలో భారీ నిరుద్యోగిత, కరువు పరిస్థితులు, సాగు సమస్యలు, తాగునీటి కొరత వంటి అంశాలపై దృష్టి పెట్టాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. 'పత్రికా స్వేచ్ఛ గురించి కూడా లేవనెత్తాం. జర్నలిస్టుల విషయంలో అధికార పార్టీ కార్యకర్తలు వ్యవహరిస్తున్న తీరును ప్రస్తావించాం. వారిని కొడుతున్నారు. వారి గొంతును అణిచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనిని ఖండిస్తూ ఈ విషయాన్ని పరిశీలించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరాం..' అని ఆజాద్ తెలిపారు. కశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన అవసరం లేదని, త్వరగా ఎన్నికలు నిర్వహించాలని కోరినట్లు చెప్పారు. పంచాయతీ ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించగలిగినప్పుడు, అసెంబ్లీ ఎన్నికలు ఎందుకు నిర్వహించకూడదన్నారు. ఎన్నికలకు రాష్ట్రాల నిధులు, బ్యాలెట్ పేపర్ల వంటి ఎన్నికల సంస్కరణలను టీఎంసీ లేవనెత్తింది. ప్రతిదానికీ ఆర్డినెన్సును ఉపయోగించడాన్ని కూడా టీఎంసీ ప్రస్తావించింది. దురదృష్టవశాత్తూ 16వ లోక్‌సభలో గత 70 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా దానిని మితిమీరి ఉపయోగించారని బంద్యోపాధ్యాయ, ఒబ్రీన్ చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలు వి. విజయసాయిరెడ్డి, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, టీఆర్‌ఎస్ ఎంపీలు కే కేశవరావు, నామా నాగేశ్వరరావు అఖిలపక్ష భేటీలో పాల్గొన్నారు.



అఖిల పక్ష సమావేశంలో ప్రధాని మోదీ, రాజ్‌నాథ్, ప్రహ్లాద్ జోషి, గులాం నబీ ఆజాద్‌తోపాటు తెలుగు రాష్ట్రాల ఎంపీలు నామా నాగేశ్వరరావు, కేశవరావు, మిథున్‌రెడ్డి తదితరులు

### నేడు ఏపీ ఎంపీల ప్రమాణస్వీకారం

సాక్షి, న్యూఢిల్లీ: ఇటీవలి ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు సోమ, మంగళవారాల్లో లోక్‌సభ సభ్యులుగా ప్రమాణం చేయనున్నారు. ప్రొటెం స్పీకర్ వీరేంద్ర కుమార్ వీరితో ప్రమాణం చేయిస్తారు. ఆంధ్రప్రదేశ్ నుంచి గెలిచిన ఎంపీల ప్రమాణస్వీకారం సోమవారం మధ్యాహ్నానికి పూర్తికానుంది. అక్షర క్రమంలో మొదటగా అండమాన్ నికోబార్ ఎంపీలు, తర్వాత ఏపీ ఎంపీలు ప్రమాణం చేయనున్నారు. తెలంగాణ ఎంపీలు మంగళవారం ప్రమాణం చేస్తారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఎన్నికైన వైఎస్సార్‌సీపీ ఎంపీలందరూ సోమవారం ఉదయం వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి నివాసంలో భేటీ కానున్నారు.

**అఖిలపక్ష భేటీ ఫలప్రదం: మోదీ**

'ఎన్నికల ఫలితాల తర్వాత, పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు ముందు ఒక ఫలప్రదమైన అఖిలపక్ష భేటీ జరిగింది. విలువైన సూచనలిచ్చిన నేతలకు కృతజ్ఞుడినై ఉంటా' అంటూ అఖిలపక్ష భేటీ అనంతరం మోదీ ట్వీట్ చేశారు. మరోవైపు బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం, అలాగే ఎన్డీయే భేటీ ఆదివారం ఢిల్లీలో జరిగాయి.

### బడ్జెట్, ట్రిపుల్ తలాక్ ప్రభుత్వ ప్రధాన ఎజెండా

పదిహేడవ లోక్‌సభ మొదటి సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. కేంద్ర బడ్జెట్‌కు ఆమోదం, ట్రిపుల్ తలాక్ వంటి ఇతర కీలక చట్టాలు ప్రభుత్వ ఎజెండాలో అగ్రభాగాన ఉండనున్నాయి. మొదటి రెండురోజులు సభ్యుల ప్రమాణ స్వీకారానికి వినియోగిస్తారు. 19న స్పీకర్ ఎన్నిక ఉంటుంది. మరుసటి రోజు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. జూలై 5న బడ్జెట్ ప్రవేశ పెడతారు. 26 వరకు సమావేశాలు కొనసాగుతాయి. జూన్ 20 నుంచి రాజ్యసభ సమావేశాలు ప్రారంభం కానున్నాయి.

# జమిలి ఎన్నికలపై 19న అఖిలపక్ష భేటీ

## తెలుగు రాష్ట్రాల సీఎంలు వైఎస్ జగన్, కేసీఆర్‌లకు కేంద్రం పిలుపు

**సాక్షి, న్యూఢిల్లీ:** కేంద్రంలో రెండోసారి అధికారాన్ని చేపట్టిన ఎన్డీయే ప్రభుత్వం మరోసారి జమిలి ఎన్నికలపై చర్చకు తెరలేపింది. 'ఒకే దేశం ఒకే ఎన్నిక' (జమిలి ఎన్నికలు (లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించడం) అంశంతో పాటు ఇతర ముఖ్యాంశాలపై చర్చించేందుకు ఈ నెల 19న ఢిల్లీలో అఖిలపక్ష భేటీకి హాజరుకావాల్సిందిగా ప్రధాని నరేంద్ర మోదీ అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించారు. ఆదివారం నాటి అఖిలపక్ష సమావేశానికి ప్రధాని అధ్యక్షత వహించారు. ప్రస్తుత లోక్‌సభలో చాలామంది కొత్త వారున్నారంటూ.. పార్లమెంటు దిగువ సభ మొదటి సమావేశాలు నూతనోత్సాహం, కొత్త ఆలోచనలతో ప్రారంభం కావాలని మోదీ ఆకాంక్షించారు. కాగా 19న భేటీకి హాజరుకావాల్సిందిగా కోరుతూ పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులకు ఆదివారం లేఖలు రాశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కె.చంద్రశేఖరరావు, ఏపీ ప్రతిపక్ష నేత చంద్రబాబుకు కూడా లేఖలు రాశారు. అఖిలపక్ష భేటీ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్లమెంటు ఉభయ సభలూ సాఫీగా సాగేందుకు సహకరించాల్సిందిగా అన్ని పార్టీలను ముఖ్యంగా విపక్షాన్ని ప్రభుత్వం కోరిందన్నారు. జమిలి ఎన్నికలతో పాటు దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 2022లో 75 ఏళ్లు పూర్తయ్యే సందర్భంగా వేడుకలు, ఈ ఏడాది మహాత్మాగాంధీ 150వ జయంతి ఉత్సవాల నిర్వహణ, పార్లమెంటు పనితీరు మెరుగుపరచడం, వెనుకబడిన జిల్లాల అభివృద్ధిపై చర్చించేందుకు అఖిలపక్ష భేటీ నిర్వహిస్తున్నట్టు జోషి తెలిపారు. కాగా ఉభయ సభల ఎంపీలు ప్రభుత్వంతో స్వేచ్ఛగా మాట్లాడేందుకు, అభిప్రాయాలు ఇచ్చి పుచ్చుకునేందుకు వీలుగా ఈ నెల 20న రాత్రి విందు సమావేశం జరుగుతుందని చెప్పారు.

# కాంగ్రెస్ పక్ష నేత నియామకం సందిగ్ధం

**న్యూఢిల్లీ:** 17వ లోక్‌సభ తొలి సమావేశం సోమవారం నుంచి ప్రారంభమవుతున్నా సభలో కాంగ్రెస్ పక్ష నేతగా ఎవరు ఉండాలనేదానిపై ఇప్పటి వరకూ నిర్ణయం తీసుకోలేదు. అలాగే సభలో ప్రభుత్వాన్ని ఎదుర్కొనేందుకు వివిధ ప్రతిపక్ష పార్టీలను సమన్వయం చేసుకునే విషయంలోనూ ముందడుగు పడలేదు. ఎన్నికల ఫలితాలు విడుదలైన తర్వాత ప్రతిపక్ష పార్టీల సమావేశమే జరగలేదు. దీనిపై కాంగ్రెస్ నేత ఒకరు మాట్లాడుతూ చాలా ప్రతిపక్ష పార్టీలు సభలో తమ పార్టీ పక్ష నాయకుడిని ఎంపిక చేయలేదనీ, ఆ పని పూర్తయిన అనంతరం ప్రతిపక్ష పార్టీల భేటీ ఉండొచ్చని అన్నారు. ఆదివారం జరిగిన అఖిలపక్ష సమావేశానికి రాజ్యసభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నేత గులాం నబీ ఆజాద్‌తో పాటు కాంగ్రెస్ నుంచి పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఆధిర్ రంజన్ చౌధురీ, కేరళ కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు సురేశ్ హాజరయ్యారు. దీంతో వీరిద్దరిలో ఎవరో ఒకరిని లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేతగా నియమించే అవకాశం ఉందంటున్నారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి మనీశ్ తివారీ, ఎదురుగాలిలోనూ తిరువనంతపురం నుంచి వరుసగా మూడుసార్లు కాంగ్రెస్ తరపున గెలిచిన శశి థరూర్‌ల పేర్లు కూడా ఈ రేసులో ఉన్నాయి.



## రామాలయంపై ఆర్డినెన్స్ తెస్తారు: ఉద్ధవ్



**అయోధ్య:** అయోధ్యలో రామాలయ నిర్మాణం కోసం ఆర్డినెన్స్ తెచ్చే ధైర్యం ప్రధాని మోదీకి ఉందని, ఈ విషయంలో ఆయన్ను ఎవరూ ఆపలేరని శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే వ్యాఖ్యానించారు. అయోధ్యలో రామ్‌లల్లా ఆలయంలో ఆదివారం ఆయన కుమారుడు ఆదిత్య, కొత్తగా ఎన్నికైన 18 ఎంపీలతో కలిసి పూజలు చేశారు. అనంతరం ఉద్ధవ్ మీడియాతో మాట్లాడారు. ఎన్నికలయ్యాక మళ్లీ అయోధ్యకు వస్తానని గత ఏడాది నవంబర్‌లో ఇక్కడికి వచ్చిన సమయంలో రామునికి మొక్కుకున్నానని, ఆ మొక్కు తీర్చుకునేందుకే వచ్చినట్లు ఉద్ధవ్ తెలిపారు. 'రామాలయంపై ఎన్నో ఏళ్లుగా కోర్టులో కేసు నడుస్తోంది. ఈ విషయంలో అంతిమ నిర్ణయం తీసుకునే ధైర్యం ప్రధాని మోదీకి ఉంది. ఆలయం కోసం మోదీ ఆర్డినెన్స్ తెస్తే ఎవరూ అడ్డుకోలేరు. శివసేన మాత్రమే కాదు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువులంతా ప్రధాని వెంట ఉంటారు. సాధ్యమైనంత త్వరగా ఆలయాన్ని నిర్మించాలి' అని అన్నారు. 'రామాలయం విశ్వాసానికి సంబంధించిన అంశం. రాజకీయాలతో సంబంధం లేదు. బీజేపీ కానీ, శివసేన కానీ హిందుత్వ బలోపేతానికే పనిచేస్తున్నాయి. దీనిని అర్థం చేసుకుని ప్రజలు మళ్లీ భారీ మెజారిటీతో అధికారమిచ్చారు. వారి ఆకాంక్షలను గౌరవించాల్సి ఉంది' అని ఉద్ధవ్ అన్నారు. ఆలయ నిర్మాణంపై బీజేపీపై ఒత్తిడి పెంచేందుకు ఎన్డీయే కూటమి నుంచి వైదొలుగుతారా అన్న ప్రశ్నకు ఆయన.. మంచి పని కోసం, మంచి ఆలోచన చేయాలన్నారు. ఈ ఏడాది చివర్లో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బీజేపీపై ఒత్తిడి పెంచేందుకే ఉద్ధవ్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు పరిశీలకులు భావిస్తున్నారు.

## ఇజ్రాయెల్ ప్రధాని భార్యకు జరిమానా

**జెరుసలేం:** ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేసిన కేసులో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు భార్య సారాకు ఓ న్యాయస్థానం జరిమానా విధించింది. ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేసిన కేసులో సారా రూ.10 లక్షల (15,000 డాలర్లు) జరిమానా చెల్లించాలని తీర్పు వెలువరించింది. ప్రధాని కుటుంబంపై కోర్టుల్లో ఏళ్లుగా నడుస్తున్న అవినీతి కేసుల్లో ఇది ఒకటి. 2010–2013 సంవత్సరాల్లో ప్రధాని అధికార నివాసంలో పూర్తి స్థాయి చెఫ్ ఉన్నప్పటికీ విలాసవంతమైన హోటళ్లలో తినేవారని, ఇందుకోసం లక్ష డాలర్ల వరకు వెచ్చించారని సారాపై ఆరోపణలున్నాయి. వాదనలు విన్న కోర్టు రూ.10 లక్షలు (15వేల డాలర్లు) చెల్లించాలని సారాను ఆదేశించింది. విలాసవంతమైన జీవనం, సిబ్బందితో అనుచిత ప్రవర్తన వంటి ఆరోపణలతో సారా(60) ఇజ్రాయెల్ ఇమెల్డా మార్కోస్‌గా పేరుతెచ్చుకున్నారు. ఫిలిప్పీన్స్ ఒకప్పటి నియంత ఫెర్డినాండ్ మార్కోస్ భార్యే ఇమెల్డా. ప్రజాధనంతో విలాసవంతమైన జీవితం గడిపిన ఆమె ఒకప్పుడు వార్తల్లోకి ఎక్కారు.

## ఐఎస్ఐ చీఫ్‌గా ఫైజ్ హమీద్



**ఇస్లామాబాద్:** పాక్ నిఘా సంస్థ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్(ఐఎస్ఐ)కు నూతన అధిపతిగా లెఫ్టినెంట్ జనరల్ ఫైజ్ హమీద్‌ను నియమిస్తున్నట్లు పాక్ ఆర్మీ తెలిపింది. ప్రస్తుత ఐఎస్ఐ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ అసిమ్ మునీర్ స్థానంలో ఆయన బాధ్యతలు స్వీకరిస్తారని వెల్లడించింది. మునీర్‌ను గుజ్రన్‌వాలా కోర్ కమాండర్‌గా నియమించినట్లు పేర్కొంది. ఫైజ్ హమీద్ గతంలో ఐఎస్ఐ కౌంటర్ ఇంటెలిజెన్స్ వింగ్‌లో పనిచేసినట్లు సమాచారం.

## ఎంపీలకు 400 కొత్త ఇళ్లు

**న్యూఢిల్లీ:** ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందిన ఎంపీలకు ఇళ్లు నిర్మించాలని కేంద్రం యోచిస్తోంది. ప్రస్తుతమున్న 400 పాత ఇళ్లను పడగొట్టి ఆ వ్యర్థాలతో వాటి స్థానంలోనే కొత్తవి నిర్మించాలని నిర్ణయించింది. 60 ఏళ్ల కిందట నిర్మించిన రాష్ట్రపతి భవన్‌కు ఇరువైపులా ఉన్న నార్త్ ఎవెన్యూ, సౌత్ ఎవెన్యూల్లో ఈ కొత్త భవనాలను నిర్మించనున్నట్లు కేంద్ర ప్రజా పనుల విభాగాధికారి ఒకరు తెలిపారు. పాత ఇళ్లనన్నింటినీ పడగొట్టి, ఆ వ్యర్థాలను కొత్త ఇళ్ల నిర్మాణానికి ఉపయోగిస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల 36 డూప్లెక్స్ ఇళ్లను రూ.80 కోట్ల వ్యయంతో నిర్మించింది. వీటిని కొత్త ఎంపీలకు ఇవ్వనున్నారు. కాగా, ఇటీవలి ఎన్నికల్లో దాదాపు 300 మంది మొదటిసారిగా ఎంపీలుగా గెలిచారు.



# 2022 యూపీ ఎన్నికలపై ప్రియాంక గురి!

**న్యూఢిల్లీ:** ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాభవాన్ని మూటగట్టుకున్న కాంగ్రెస్ తిరిగి పుంజుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఉత్తర ప్రదేశ్‌లో 2022లో జరిగే అసెంబ్లీ ఎన్నికలపై పట్టుసాధించాలనే దిశగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నారు. ఇందులో భాగంగా ఆ రాష్ట్రంలో పార్టీ కార్యకర్తలతో వారంలో కనీసం రెండు సార్లు సమావేశమవ్వాలని ఆమె యోచిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. 'లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఓటమికి గల కారణాలను సమీక్షించినప్పుడు పార్టీ నేతలకు, కార్యకర్తలకు మధ్య సమన్వయం కొరవడిందనేది స్పష్టమైంది. దీంతో ప్రియాంక గాంధీ కార్యకర్తలతో నేరుగా మాట్లాడాలని నిశ్చయించుకున్నారు' అని కాంగ్రెస్ నేత ఒకరు తెలిపారు. గత బుధవారం ప్రియాంక.. ఆమె తల్లి, యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీతో కలిసి రాయ్‌బరేలీ నియోజకవర్గాన్ని సందర్శించారు.

# మెత్తబడ్డ ప్రభుత్వ వైద్యులు

- బహిరంగ చర్చ ఏర్పాటు చేయాలని షరతు
- అంగీకరించిన మమతా బెనర్జీ

**న్యూఢిల్లీ/కోల్‌కతా:** పశ్చిమబెంగాల్‌లో గత 6 రోజులుగా ఆందోళన చేస్తున్న ప్రభుత్వ వైద్యులు, జూనియర్ డాక్టర్లు ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో చర్చల విషయంలో ఆదివారం కాస్త మెత్తబడ్డారు. చర్చలు ఎక్కడ నిర్వహించాలన్న విషయమై తుది నిర్ణయాన్ని మమతా బెనర్జీకే వదిలిపెట్టామని వైద్యులు తెలిపారు. అయితే ఈ చర్చావేదిక మీడియా సమక్షంలో బహిరంగంగా ఉండాలనీ, గదిలో ఉండకూడదని షరతు విధించారు. కోల్‌కతాలో ఆదివారం దాదాపు రెండున్నర గంటలపాటు సమావేశమైన వైద్యుల గవర్నింగ్ బాడీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. 'ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ ఆందోళనను వీలైనంత త్వరగా ముగించాలని మేమెంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నాం. రాష్ట్రంలోని అన్ని మెడికల్ కాలేజీలు, ఆసుపత్రుల ప్రతినిధులతో చర్చించేందుకు వీలుగా సీఎం మమత చర్చావేదికను ఏర్పాటు చేయాలి' అని సూచించారు. ఆందోళన చేస్తున్న వైద్యులతో సోమవారం సమావేశమయ్యేందుకు సీఎం అంగీకరించారని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. సచివాలయం పక్కనే ఉన్న ఆడిటోరియంలో ఈ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. ఒక్కో ఆసుపత్రి నుంచి ఇద్దరు ప్రతినిధుల చొప్పున ఈ కార్యక్రమానికి ఆహ్వానించామని పేర్కొన్నారు. ఈ చర్చకు మీడియాను ఆహ్వానించాలన్న డాక్టర్ల ప్రతిపాదనపై మమత సుముఖంగా లేరని స్పష్టం చేశారు.

**నేడు దేశవ్యాప్త సమ్మె..**

బెంగాల్‌లో వైద్యులపై దాడికి నిరసనగా సోమవారం దేశవ్యాప్త సమ్మెకు దిగుతున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ప్రకటించింది. ఈ ఆందోళన నేపథ్యంలో సోమవారం ఉదయం 6 గంటల నుంచి మంగళవారం ఉదయం 6 గంటల వరకు అన్నిరకాల వైద్యసేవలు(అత్యవసర సేవలు మినహా) నిలిచిపోతాయని తెలిపింది. ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బందిపై దాడిచేసే వ్యక్తులను శిక్షించేందుకు కేంద్రం సమగ్రమైన చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేసింది. శిక్షాస్మృతిని సవరించాలని కోరింది. గత సోమవారం ఎన్ఆర్ఎస్ మెడికల్ కాలేజీలో ఓ రోగి చనిపోవడంతో అతని బంధువులు ఇద్దరు డాక్టర్లను చితకబాదారు. ఈ దాడికి నిరసనగా బెంగాల్‌లోని వైద్యులంతా ఆందోళనకు దిగగా, దేశవ్యాప్తంగా ఉన్న డాక్టర్లు సంఘీభావం తెలిపారు. మరోవైపు, ఆందోళన కారణంగా బెంగాల్‌లో అత్యవసర సేవలకూ ఇబ్బంది కలుగుతోంది. ఈ ఆందోళనల కారణంగా కోల్‌కతాలోని ఎస్ఎస్‌కేఎం ప్రభుత్వ ఆసుపత్రిలో శామ్యూల్ అనే వ్యక్తి గుండె ఆపరేషన్ ఆగిపోయింది. తామంతా చాలా దూరప్రాంతాల నుంచి ఆసుపత్రులకు వచ్చామనీ, ఇప్పుడు చికిత్స తీసుకోకుండా స్వస్థలాలకు తిరిగి వెళ్లలేమని రోగులు, వారి కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బికనీర్‌లో కొవ్వొత్తులతో వైద్యుల ర్యాలీ

# కశ్మీర్‌లో అలజడికి ఉగ్ర కుట్ర

## భారత్‌ను హెచ్చరించిన పాకిస్తాన్

**న్యూఢిల్లీ:** జమ్మూకశ్మీర్‌లో విధ్వంసం సృష్టించేందుకు ఉగ్రవాదులు సిద్ధమైనట్లు పాకిస్తాన్ హెచ్చరించింది. పుల్వామా జిల్లాలోని అవంతిపోరలో ఉగ్రవాదులు దాడికి ప్రణాళిక రచించినట్లు తమ నిఘావర్గాలు గుర్తించాయని వెల్లడించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 14న పుల్వామా జిల్లాలో జరిగిన ఆత్మాహుతి దాడి తరహాలోనే కారులో అత్యాధునిక పేలుడు పదార్థాలను(ఐఈడీ)లను పేర్చుకుని ఉగ్రవాదులు ఆత్మాహుతి దాడి చేయబోతున్నారని పేర్కొంది. షాంఘై సహకార సదస్సు(ఎస్‌సీవో)కు కొన్నిరోజుల ముందు ఈ సమాచారాన్ని భారత్, అమెరికాలతో పంచుకున్నట్లు పాక్ చెప్పింది. ఉగ్రవాదం విషయంలో భారత్‌తో పాటు అంతర్జాతీయ సమాజం నుంచి తీవ్రమైన విమర్శలు, నిందలను తప్పించుకునేందుకే పాక్ ఈ నిర్ణయం తీసుకుందని కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. పాక్ హెచ్చరికల నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌లో భద్రతాబలగాలన్నీ హైఅలర్ట్‌గా ఉండాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. మోస్ట్‌వాంటెడ్ ఉగ్రవాది జకీర్‌మూసాను భద్రతాబలగాలు కాల్చి చంపినందుకు ప్రతీకారంగానే ఈ దాడికి ఉగ్రమూకలు కుట్ర పన్నాయని వ్యాఖ్యానించారు. పుల్వామాలో ఫిబ్రవరి 14న సీఆర్పీఎఫ్ కాన్వాయ్‌పై జరిగిన ఆత్మాహుతి దాడిలో 40 మంది జవాన్లు, ఓ పోలీస్ అధికారి అమరులయ్యారు.

# బీజేపీతో జేడీయూ కటీఫ్?

## ఎన్నికల తర్వాత మారిన నితీశ్ వైఖరి • స్పందించని కమలనాథులు



**సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ:** రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరన్న నానుడి బీజేపీ, జేడీయూ విషయంలో మరోసారి నిజమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఇటీవలి ఎన్నికల్లో బిహార్‌లో నితీశ్ కుమార్ నాయకత్వంలో కలిసి పోటీ చేసిన జేడీయూ, బీజేపీ మెజారిటీ సీట్లు సాధించాయి. ఇదే మైత్రి ఈ రెండు పార్టీల మధ్య కొనసాగుతుందని అంతా భావించారు. అయితే, తాజాగా మారిన నితీశ్ వైఖరి ఎన్డీయేకు గుడ్‌బై చెప్పేందుకేనా అన్నట్లుగా ఉందని పరిశీలకులు అంటున్నారు.

**కేంద్ర కేబినెట్ ఏర్పాటు నుంచి..**

రెండోసారి అధికారంలోకి వచ్చిన మోదీ మంత్రివర్గంలో జేడీయూకు ఒక్క మంత్రి పదవినే ఇవ్వజూపడం నుంచి నితీశ్‌కు అసంతృప్తి మొదలైంది. అనంతరం రాష్ట్ర కేబినెట్ విస్తరించిన సీఎం నితీశ్ బీజేపీకి కూడా ఒకే ఒక్క మంత్రిపదవి ఇవ్వజూపారు. అదేవిధంగా, తగిన మార్పులు చేయకుంటే ట్రిపుల్ తలాక్, ఉమ్మడి పౌరసత్వ బిల్లులను రాజ్యసభలో అడ్డుకుంటామని నితీశ్ అంటున్నారు. 370వ అధికరణ, రామాలయ నిర్మాణం వంటి అంశాల్లోనూ ఎన్డీయే వైఖరికి భిన్నంగా నితీశ్ మాట్లాడుతున్నారు. బీజేపీతో తమ మైత్రి కేవలం బిహార్‌కే పరిమితమని, ఇతర రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోరాడుతామని జేడీయూ నేతలు అంటున్నారు. ఎన్నికల విశ్లేషకుడు, జేడీయూ ఉపాధ్యక్షుడు ప్రశాంత్ కిశోర్ పశ్చిమ బెంగాల్ సీఎం మమతతో కలిసి పని చేస్తామని ప్రకటించడమూ బీజేపీని ఇరుకున పెట్టడానికేనంటున్నారు.

**గొడవల్లేవంటున్న జేడీయూ:** ఇటీవల ఆర్జేడీ అధినేత లాలూ ఇచ్చిన ఇఫ్తార్ విందులో నితీశ్ పాల్గొనడంపై బీజేపీ నేత గిరిరాజ్ సింగ్ చేసిన వ్యాఖ్యలను జేడీయూ తప్పుపడుతోంది. బీజేపీయే గిరిరాజ్‌తో ఈ పని చేయించిందంటోంది. అయితే, కమలనాథులతో విభేదాల్లేవని జేడీయూ అంటోంది. కీలక అంశాలపై ఎన్డీయే పక్షాల అభిప్రాయాన్ని తెలుసుకోవాలని చెబుతున్నామే తప్ప ప్రభుత్వాన్ని వ్యతిరేకించడం లేదంటోంది. బీజేపీతో సంబంధాలు పటిష్టంగా ఉన్నాయని నితీశ్ అంటున్నారు.



### సొంత ప్రయోజనాలే ముఖ్యం

నితీశ్‌కు సొంత ప్రయోజనాలే ముఖ్యమని, దాని కోసం ఎలాంటి నిర్ణయాలైనా తీసుకునేందుకు వెనుకాడరని విశ్లేషకులు అంటున్నారు. 2005లో బీజేపీతో కలిసి ఆయన బిహార్‌లో లాలూ ప్రసాద్ ప్రభుత్వాన్ని పడగొట్టారు. కొంతకాలం బీజేపీతో ఆయన స్నేహం నడిచింది. అనంతరం ఎన్డీయేను వీడి 2014 లోక్‌సభ, 2015 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో తలపడ్డారు. 2017లో తిరిగి ఎన్డీయే గూటికి చేరారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఇద్దరూ కలిసి రాష్ట్రంలో ఉన్న 40 సీట్లలో 39 సొంతం చేసుకున్నారు. వచ్చే ఏడాది చివర్లో బిహార్ శాసన సభకు ఎన్నికలు జరగనున్నాయి. అయితే, ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో అప్పటి దాకా వారి మైత్రి కొనసాగేది అనుమానమేనని విశ్లేషకులు అంటున్నారు. అయితే, ఈ పరిణామాలపై బీజేపీ నాయకత్వం నుంచి ఎటువంటి స్పందనా వ్యక్తం కాలేదు.



## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారినామ సంవత్సరం. ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు. జ్యేష్ఠ మాసం. తిథి పౌర్ణమి ప.1.36 వరకు, తదుపరి బ.పాడ్యమి. నక్షత్రం జ్యేష్ఠ ఉ.10.55 వరకు, తదుపరి మూల. వర్జ్యం రా.7.10 నుంచి 8.50 వరకు. దుర్ముహూర్తం ప.12.26 నుంచి 1.18 వరకు, తదుపరి ప.3.02 నుంచి 3.54 వరకు. అమృత ఘడియలు తె.5.04 నుంచి 6.54 వరకు (తెల్లవారితే మంగళవారం)

సూర్యోదయం : 5.30, సూర్యాస్తమయం : 6.31
రాహుకాలం : ఉ.7.30 నుంచి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుంచి 12.00 వరకు

### నమాజ్ వేళలు

ఫజర్ : 4.20
జొహర్ : 12.17
అసర్ : 4.54
మగ్రీబ్ : 6.52
ఇషా : 8.14

## ఈవారం పుస్తకాలు

### రెక్కల పిల్ల
(కథలు)



రచన: శ్రీసుధ మోదుగు; పేజీలు: 260; వెల: 210; ప్రచురణ: అభ్యోదయ బుక్స్; ప్రతులకు: మంచి పుస్తకం, 12–13–439, వీధి నం.1, తార్నాక, సికింద్రాబాద్– 500017. ఫోన్: 9490746614

### వ్యక్తిత్వమే కవిత్వం
(వరవరరావు కవిత్వ విశ్లేషణ)



రచన: పాణి; పేజీలు: 112; వెల: 100; ప్రతులకు: మలుపు బుక్స్, 3-6-677/2, ఫ్లాట్ నం. 302, ఎం.ఎస్.కె. టవర్స్, స్ట్రీట్ నం. 11, హిమాయత్ నగర్, హైదరాబాద్–29. ఫోన్: 9866559868

### ఉద్యమం ఉద్యమమే
(కవిత్వం)



రచన: డాక్టర్ ఎస్వీ సత్యనారాయణ; పేజీలు: 118; వెల: 100; ప్రచురణ: కన్నా–బన్ను ప్రచురణలు, ఎస్ఆర్‌టీ 23, ఆజామాబాద్, రాంనగర్, హైదరాబాద్–20. ఫోన్: 9618032390

### సి.ఉమాదేవి కథలు



పేజీలు: 188; వెల: 120; రచయిత్రి చిరునామా: వింగ్స్, ఫ్లాట్ నం. 501, శ్రీనగర్ కాలనీ, హైదరాబాద్–73. ఫోన్: 9885809250

### కాళీ పదములు



రచన: పాలపర్తి ఇంద్రాణి; పేజీలు: 56; వెల: 60; ప్రచురణ: వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా; ప్రతులకు: పాలపర్తి సువర్ణలత, 502, ఏపీహెచ్‌బీ టవర్స్, జీవీఆర్ మ్యూజిక్ కాలేజీ ఎదురుగా, దుర్గాపురం, విజయవాడ–520003

### కొత్త తొవ్వ
(కవిత్వం)



రచన: మహబూబాబాద్ జిల్లా కవులు; పేజీలు: 102; వెల: 100; ప్రచురణ: దబరకమే–ఐక్యవేదిక; ప్రతులకు: కె.సీతారాములు, అధ్యక్షులు, ఇంటి నం.11–781, టీఎన్జీవో కాలనీ, ఖమ్మం. ఫోన్: 8374793374

## అదో ప్రపంచం




## కథాసారం

# పుట్టింటికొచ్చి...

**డాక్టరు గారు కేంపుకెళ్లారు. ఊర్లో దొంగాటకం ఎక్కువగా వుందని సీతమ్మ పెద తమ్ముడు చినబాబు తుపాకి పట్టుకుని, ఆ రోజు ఇంట్లో వుండటానికి వచ్చి తూర్పు గదిలో పడుకున్నాడు.**

రాబ కొండల్నించి బావగారికి బుచ్చిబాబు ఒక అడవి పంది పిల్లని తెచ్చాడు. అది ముచ్చటగా వుండేది. ఆ పిల్లముండ కళ్లతో మాటాడేది.

నన్నేం చెయ్యకండ్రా! అంటున్నట్టుండేవి దాని కళ్లు. ఆకలేస్తున్నాది, పాలు బువ్వ కలిపి పట్టుకు రండ్రా అనేవా కళ్లు.

బుచ్చిబాబు బావ పేరు డాక్టరు గోపాలరాజు. అప్పగారి పేరు సీతమ్మ. ఆరుగురు కొడుకులూ, ఒక కూతురూ వాళ్లకి.

లైకా అని ఒక కుక్క
ఒక జెర్సీ ఆవు.
ఒక నెమలీ, రెండు పిల్లులూ
రెండు జతల చౌకీ బాతులు
ఓ రెండు డజన్ల గిన్నీ కోళ్లు
ఓ ఇరవై నాటుకోళ్లు
మూడెకరాల స్థలంలో పెద్ద నాలుగిళ్ల లోగిలి చుట్టూ ప్రహరీ. ఇంటి చుట్టూ సపోటా, జామ, నిమ్మ, దబ్బ, రాచ ఉసిరి, కొబ్బరి, మామిడి, పనస చెట్లున్నాయి.

ఆ చెట్ల మీద పిట్టలున్నాయి. ఉడతలున్నాయి, మిడతలున్నాయి.

డాక్టరు గారికి ఇవన్నీ అంటే చాలా ఇష్టం. సీతమ్మగారికీ ఇష్టమేగానీ వాటికి పెట్టే తిండికీ, వాటివల్ల కలిగే లాభానికీ పొంతన లేనందుకు చిరాకుగా వుండేది.

పందిపిల్ల ఇంట్లో మనిషిలాగా అన్ని గదులూ తిరిగేది. పాలగచ్చు మీద కాలుజారి పడిపోయి చిన్న పిల్లలాగా ఏడిచేది. లైకాతో కలిసి సాటి పందిపిల్లతో ఆడినట్టు ఆడేది. ఆ కుక్క ఎందుకనోగానీ పందిపిల్లని దయగా చూసేది.

పెరిటిలో జెర్సీ ఆవు దగ్గరకు వెళ్లి, దాని కుడితి గోళెంలోకి దిగిపోయి, అడుగునున్న దాణా, చిట్టు, అన్నం మెతుకులూ కలబడి తినేసి, ఆవుకు ఒట్టి కుడితి నీళ్లు మిగిల్చేది.

చవికీ బాతుల మీదకి దూకుడుగా పరిగెత్తి వెళ్లేది. పెరటిలోను, ఇంటిముందూ పిల్లలు వేసిన కరివేపాకు మొక్కల్నీ, వంగ మొక్కల్నీ ఉత్త పుణ్యానికి పీకి పారేసేది.

డాక్టరుగారి పిల్లలు దాన్ని 'కొండీ' అని పిలిచేవారు. అందరూ ముద్దు చేసేవారు.

క్రమంగా పెరిగి అది మూడున్నర జానలు ఎత్తయింది. కుర్రతనం మాయమైపోయింది.

మనుషుల సావాసం తగ్గించేసింది. వేళకు తినేది. కడమా అపుడు కూలిన ప్రహరీ గోడ సందులోంచి బైటకు వెళ్లి ఎక్కడెక్కడో తిరిగి వచ్చేది. గంటల తరబడి మామిడి చెట్ల మొదట నేలకి మోర ఆన్చి పడుకునేది. దాని కళ్లలోని తళుకు తగ్గిపోయింది.



ఓరోజు పొద్దునే కరివేపాకు కోయడానికి వచ్చిన డాక్టరుగారి అయిదో కొడుకు బగ్గీకి అది కనిపించలేదు. కొండీ కొండీ అని పిలిచాడు. అలికిడి లేదు.

బైటకు ఎక్కడికో వెళ్లి ఉంటుందని బగ్గీ లోపలికి వెళ్లిపోయాడు. ఆ మధ్యాహ్నమూ, ఆ సాయంత్రం కూడా అది రాలేదు. ఇంట్లో అందరూ కంగారు పడ్డారు. ఏ వేటకుక్కలో అందేసి వుంటాయేమోనని భయపడ్డారు.

మరునాటి ఉదయం బగ్గీ ఊరిలో వేటకుక్కలు పెంచే రాజుల ఇళ్లన్నీ తిరిగి, వాకబు చేశాడు.

జగ్గు అనే జ్ఞాతిని తీసుకుని కొవ్వాడ కొండలకు వెళ్లి గొంతెత్తి 'కొండీ' 'కొండీ' అని పిలిచాడు. ఆ పిలుపు కొండలో ఇంకిపోయింది.

''కుక్కలు గాకపోతే రేచులు పట్టేస్తాయి. లేదా ఎవరో వేటజట్టు ఈటె బెట్టి పొడిచేస్తారు. నేన్చెపుతూనే వున్నాను. మొన్న దసరాకి కోసేస్తే పోయేది'' అన్నాడు జగ్గు.

బగ్గీ మాటాడలేదు. అతని మనసు బాగాలేదు. ఊరి పొలిమేర చేరేసరికి వెనక ఏదో చప్పుడు.

'కొండీ' వెలిగిపోయింది బగ్గీ ముఖం. ఒళ్లంతా నిమిరాడు. సంబరంగా ఇంటికి తీసుకువెళ్లాడు.

డాక్టరు గారు దానికి కిలో బెల్లంముక్క చేత్తో తినిపించి తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.

మరో నాలుగు రోజుల తర్వాత మళ్లీ కొండి మాయమైపోయింది.

కొవ్వాడ కొండల్లో – లేనట్టుంది.
కొత్తవలస కొండల్లో – లేనట్టుంది.
గొడికొమ్మ కొండల్లో– లేనట్టుంది.

''ఉంటే మన బగ్గీగాడు పిలిస్తే రాకుండా వుండేదా... అడవులు పట్టేసుంటుంది'' అని సీతమ్మ సరిపెట్టుకుంటే,

''పంది మరుపంటారు. అదీపాటికి మనల్ని మరిచిపోయి వుంటుంది'' అన్నాడు బుచ్చిబాబు అన్న చినబాబు.

బగ్గీ కొవ్వాడ వేటదార్లకు, గంధవరం వేట జట్టుకు కబురు పెట్టాడు. ''మా కొండికి బోరమీద, కుడికాలు మీద వెంట్రుకలు తెల్లగుంటాయి. కనబడితే కొట్టీ కండి.''

ఫలితం లేకపోయింది.

రెండు నెలలు గడిచాయి.

అందరూ దాని గురించి మరిచిపోయారు.

డాక్టరు గారు కేంపుకెళ్లారు. ఊర్లో దొంగాటకం ఎక్కువగా వుందని సీతమ్మ పెద తమ్ముడు చినబాబు తుపాకి పట్టుకుని, ఆ రోజు ఇంట్లో వుండటానికి వచ్చి తూర్పు గదిలో పడుకున్నాడు.

తెల్లవారు రెండు గంటల వేళ–

ధడధడమనే శబ్దంతో వీధి తలుపులు ఊగిపోతున్నాయి. తలుపులు బలమైనవి కాకపోతే విరిగిపోయేవి. అందరూ లేచిపోయారు.

చినబాబు తుపాకీ పుచ్చుకుని వచ్చాడు.

సీతమ్మ, పిల్లలూ వెళ్లి అరుగు మీద నిల్చుని చూస్తున్నారు. 'ఎవరది?' కోపంగా అడిగాడు చినబాబు.

జవాబు లేదు.

తలుపులు విరగ్గొట్టడానికి ఎవరో ప్రయత్నిస్తున్నారు.

చినబాబు కుడిచేత్తో తుపాకి పట్టుకొని, ఎడమ చేత్తో తలుపు గెడ తీస్తుండగానే ఇంటిలోకి చొరబడిపోయింది కొండి.

అది ఫీమంటు నాలుగిళ్ల వాకిటిలో ఇటు అటూ పరుగెత్తింది. నీళ్ల గాబును ముట్టితో కొడితే పది బిందెల నీళ్లున్న అంత గాబూ తిరగబడిపోయింది.

పెళ్లరుగు మీద, ఈశాన్యం మూలనున్న తులసి కోటను ముట్టితో కొడితే ఆ ఇత్తడి తులసి కోట ఎగిరి అంతదూరం పడింది.

బైట నుంచి కోపంగా అరుస్తూ వచ్చిన లైకాను గోడకేసి నొక్కేసింది. అంత కుక్కా కుయ్యోమంది.

దాన్నొదిలేసి పెళ్లరుగుమీదున్న సీతమ్మ వైపు పరిగెట్టింది. పిల్లలూ, సీతమ్మా కంగారుగా చెదిరిపోయారు. కొండీ కొండీ అని బగ్గీ పిలుస్తుంటే దురుసుగా వాడి మీదికి వెళ్లిపోయింది. బగ్గీ చటాలున డైనింగ్ టేబుల్ ఎక్కిపోయాడు.

పనున్నట్లు అది ఇంట్లోంచి బైటకు పరిగెట్టింది.

''దానికి పిచ్చెక్కినట్టుందోయ్'' అంది సీతమ్మ భయంగా తమ్ముడితో.

చినబాబు బీడీ వెలిగించుకున్నాడు.

చినబాబు, బగ్గీ, సీతమ్మ, మిగిలిన పిల్లలూ ఇంట్లోంచి బైటకు వచ్చారు.

కోళ్లగూడు విరిగిపోయి వుంది. బాతులు అరుస్తున్నాయి. కొండీ పెళ్లగిస్తే పళ్లతో సహా ఒక బొప్పాయి చెట్టు విరిగిపోయింది.

తెల్లారి వెన్నెల్లో కొండీ దయ్యం పట్టినదానిలాగా కనిపిస్తోంది.

''ఎందుకైనా మంచిది మీరందరూ ఆ పిట్టగోడ మీద కూర్చోండి'' అన్నాడు చినబాబు.

లైకా భయపడి పోయి చినబాబు వెనక నిల్చుని భౌభౌమని గోలగా అరుస్తున్నది.

కొండి ఉన్నట్టుండి చినబాబు వంక పరిగెత్తుకు రావడం మొదలుపెట్టింది.

చినబాబు తుపాకీ ఎక్కుపెట్టాడు.

''ఒద్దోయ్ చినమావయ్యా... ఒద్దు'' అని బగ్గీ కేకలు వేసి పిట్టగోడ మీంచి దూకుతున్నప్పుడే చినబాబు ట్రిగ్గర్ నొక్కేశాడు.

చినబాబుకు ఒక అడుగు దూరంలో కొండీ కూలిపోయింది.

''దాన్ని చంపకపోతే మనం చస్తాం'' అని వివరించి చినబాబు మరో బీడీ ముట్టించాడు.

''రేపు బావొస్తే గొడవైపోతుంది'' అన్నది సీతాదేవి భయంగా.

''ఆ సంగతి నాకొదిలీ'' అన్నాడు చినబాబు తుపాకీ సీతమ్మకు అందిస్తూ.

మేనమామ, మేనల్లుళ్లూ కలిసి పట్టుకొని ఆ పందిని ఇంట్లోకి చేరేసి పెళ్లరుగు మీద పడేశారు.

చినబాబు పేల్చిన గుండు దాని నుదుటి మీద తగిలింది– నెత్తురు సన్నగా కారుతోంది.

గిన్నీ కోళ్లు, బాతులు అరుస్తూనే వున్నాయి. లైకా చచ్చిపడివున్న పంది పక్క కూర్చుని మోర ఎత్తి 'ఓ ఓ ఓ'మని ఏడిచింది.

ఛీ!ఛీ! అని తిట్టి దాన్ని వీధిలోకి తరిమి చినబాబు వీధి తలుపు వేసేశాడు.



పొద్దున్న యాతప్పన్నకి కబురు చేస్తే వచ్చి ఆ పందిని పెరటిలోకి చేర్చి దానిని కోశాడు.

''చూలుతో వుందండి బాబు... మూడు పిల్లలున్నాయి పొట్టలో'' అని చెప్పేడు, తన పని తాను చేసుకుంటూనే.

చినబాబు గుండెలో కలుక్కుమంది. విషయం అంతా అతనికి అర్థం అయిపోయింది.

ఆడపంది ఎదకొచ్చి జతకోసం అడవికి వెళ్లింది. చూలుతో కానుపు కోసం పుట్టింటికి వచ్చింది. ఆ సంబరంతో పిచ్చి పన్లు చేసింది. బుద్ధిహీనంగా తుపాకి బెట్టి నేను దాన్ని చంపేశాను... కళ్లలో నీళ్లు తిరిగాయి చినబాబుకు.

చెంపలు వాయించుకుని భగవంతుడికి క్షమాపణలు చెప్పుకుంది సీతమ్మ. •



కె.ఎన్.వై. పతంజలి

కె.ఎన్.వై.పతంజలి(1952–2009) 'సీతమ్మ లోగిట్లో' సంక్షిప్త కథ ఇది. ఆయన 'వేట కథ'ల్లో ఇదొకటి. 'ఇది మా ఇంట జరిగినది. ఆ డాక్టరు గారు మా తండ్రి గారు, ఆ సీతమ్మ మా అమ్మయ్య, ఆ చినబాబు మా రెండోమామ' అని ఆయనే రాసుకున్నారు. పతంజలి ప్రసిద్ధ జర్నలిస్టు, రచయిత. సాక్షి పత్రిక తొలి సంపాదకుడు. గోపాత్రుడు, రాజుగోరు, ఖాకీవనం, వీరబొబ్బిలి, ఓ దయ్యం ఆత్మకథ ఆయన రచనల్లో కొన్ని.

# మంచివాళ్లు చేయలేని న్యాయం

## కొత్త బంగారం





లీ కీహో

దక్షిణ కొరియా రాజధాని స్యోల్లో ఉండే పేరుండని యూనివర్సిటీ లెక్చరర్‌కు తన ఉద్యోగమంటే విసుగు. ఊర్లో ఉన్న భార్యాపిల్లల వద్దకి రెండు మూడు వారాలకొకసారి వెళ్తుంటాడు. అతనుండే అపార్టుమెంట్ల బ్లాక్, ఊరి శివార్లలో ఉంటుంది. అతను రచయిత కూడా. కానీ బద్ధకం వల్ల ఏదీ రాయలేకపోతాడు.

అతనికెప్పుడూ కోపమే. 'అమాయకులమీద నాకెందుకు కోపం వస్తుంది? కోపం రావాలని నాకెందుకనిపిస్తుంది?' అని తనని తాను ప్రశ్నించుకుంటాడు. నిద్రపట్టక, మిక్చొ అనే స్థానిక బీర్ తాగడానికి పక్కనున్న బార్‌కు వెళ్తుంటాడు. ఇలా 8 ఏళ్ళు కొనసాగుతుంది.

అతని యీ బండిగాడి వంటి జీవితం ఒకరోజు దిశ మళ్ళుతుంది. 'పనికెళ్ళే దారిలో కొండ ముందున్న ఖాళీ స్థలంలో రెండు దేవదారు చెట్లున్నాయి. స్తంభాల్లా నిలుచున్న ఆ చెట్లకి నీలి పందిరి వేళ్ళాడుతోంది. దానికింద చాపేసుకుని ఒక వ్యక్తి కూర్చున్నాడు. అతను రెండు పెద్ద విజ్ఞాపన పత్రాలను పట్టుకున్నాడు... ఒకదానిమీద రాసున్నది స్పష్టంగా చదవగలిగాను.'

'అపార్ట్‌మెంట్ బిల్డింగ్ 103లోని 502వ నంబర్ యూనిట్లో ఉండే వడ్డీ వ్యాపారైన శ్రీమాన్ కిమ్ సియోక్ నా ఏడు వేల వొన్లు వెనక్కియ్యాలి. నేను తీసుకున్న ఒకే అప్పుకి– నానుంచీ, నా మరణించిన తల్లినుంచీ కూడా డబ్బు రాబట్టాడు' అని రాసిన ఆ పత్రాన్ని పట్టుకున్నతను– కొరియన్ రచయితైన లీ కీహో రాసిన నవలిక పేరైన 'క్వాన్ సన్ చన్ అండ్ నైస్ పీపుల్'లోని క్వాన్ సన్ చన్. అయితే, 502లో ఉండేది వృద్ధురాలు. ఊతకర్రతో నడుస్తూ, బతుకుదెరువు కోసం చిత్తుకాగితాలు ఏరుకుంటుంది. 'అతను అదే చోట రోజుల తరబడి ఉండటం ఆశ్చర్యం కలగజేసింది. అతనొక్క మాటా మాట్లాడలేదు. బిల్డింగ్ లోపలికి కూడా రాలేదు. ఎవరితోనూ మాట్లాడలేదు.'

వ్యాపారి కనిపిస్తాడనే ఆశతో క్వాన్ నెలల తరబడి అక్కడినుండి కదలడు. మొదట చిరాకుతో అతన్ని వదిలించుకోవాలనుకున్న అపార్ట్‌మెంట్ నివాసులు చివరకు, 'తప్పుగా అనుకోకు. నీ ప్రవర్తన వల్ల ఏ పరిష్కారం దొరకదు. నీక్కావల్సిన వ్యక్తి 502లో లేడని నీకు తెలిసినదే. యువకుడివి. ఇలా ఆరుబయట పడుకోవడం బాలేదు. అక్టోబర్ వచ్చేసింది. చలి మొదలయింది' అని నచ్చజెప్పినప్పుడు, క్వాన్ మౌనం వహిస్తాడు.

'వేడి భోజనం తింటున్నప్పుడూ, వేణ్ణీళ్ళ స్నానం చేస్తున్నప్పుడూ అతని పలచని దేరాయే నా ముఖం ముందు మెదులుతోంది. అపార్టుమెంట్ల నివాసులకూ అలానే అనిపించింది కాబోలు. చందా పోగు చేయడం ప్రారంభించారు. నవంబర్ కల్లా ఏడు వొన్లకి మరి రెండు ఎక్కువే కూడాయి. డబ్బుని కవర్లో క్వాన్‌కు అందజేసి, నివాసులందరూ ఒకరొకరుగా అతనితో కరచాలనాలు చేస్తున్నప్పుడు సూపర్ మార్కెట్ యజమాని వీడియో తీయాలని నిర్ణయించుకుంటాడు' అంటాడు కథకుడు.

అయితే, క్వాన్ 'నేను వడ్డీ వ్యాపారితో సంగతేదో తేల్చుకుందామనుకున్నానంతే. నాకీ డబ్బొద్దు' అని నిరాకరించినప్పుడు, 'మన ఔదార్యాన్ని తోసిపారేస్తాడా!' అనుకుంటూ అందరూ వెళ్ళిపోతారు. క్వాన్ నిరసన కేవలం న్యాయం కోసమేనని వారికి తట్టదు.

కొద్ది రోజుల తరువాత పెద్ద సెడాన్ కార్ నుంచి ఒక మనిషి దిగి, అయిదవ అంతస్తుకి వెళ్తాడు. అతనే వడ్డీవ్యాపారి. అతను తన తల్లి ఫ్లాట్ నంబర్నే తన చట్టబద్ధమైన చిరునామాగా ఉపయోగించుకున్నాడని కథకుడు అర్థం చేసుకుంటాడు.

2015లో ఏష్యా పబ్లిషర్స్ ప్రచురించిన యీ 128 పేజీల నవలికను అనువదించినది స్టెల్లా కిమ్. లీ కీహో– 1972లో పుట్టారు. శైలి అసాధారణమైనదనీ కథకు కావల్సిన మర్యాదలను పాటించరనీ పేరుంది. ఆయన పాత్రలన్నీ సగటు జీవితాలపైన ఆధారపడినవే. యీ గందరగోళమైన లోకంలో జనాలకు ఇతరులతో తరచూ సంఘర్షణలు రగిలే కాలంలో ఇరుగు పొరుగు వారితో సఖ్యతగా ఉండటమెలా! అన్న ఆందోళనకరమైన అంశానికి రచయిత చమత్కారం, సూక్ష్మదృష్టితో కాల్పనిక రూపం ఇచ్చారు.

◆ కృష్ణ వేణి

## గ్రేట్ రైటర్

# డాంటే



భాషలో గొప్ప విప్లవం తెచ్చాడు డాంటే (1265–1321). మధ్యయుగాల యూరప్ రచయితలు లాటిన్‌లో రాసేవారు. దానికి భిన్నంగా ప్రాంతీయ భాషలకు పట్టం కట్టాలన్న కవి డాంటే. డివైన్ కామెడీని తను మాట్లాడే తుస్కన్ మాండలీకంలో రాశాడు. డాంటే అడుగుజాడలో మరెందరో కవులు నడవడంతో ఈ భాషే తర్వాత ఇటలీకి ప్రామాణిక భాష అయింది. డాంటేను సుప్రీమ్ పొయెట్ అంటారు. డివైన్ కామెడీ దీర్ఘకావ్యం ప్రపంచ సాహిత్యంలోనే ఎన్నదగిన రచనగా మన్నన పొందింది. స్వర్గం, నరకాల గురించిన ఆయన చిత్రణ పాశ్చాత్య కవులూ, కళాకారులూ ఎంతోమందిని ప్రభావితం చేసింది.

డాంటే జన్మించింది ఫ్లారెన్స్‌లో. ఇటలీలోని ఈ నగరం అప్పుడు స్వతంత్ర రిపబ్లిక్. పోప్ అధికారాలు నియంత్రించబడి, తమకు రోమ్ నుండి ఎక్కువ స్వేచ్ఛ కావాలని కోరుకున్న రాజకీయ వర్గం(వైట్ గెల్ఫ్స్)లో డాంటే ఉన్నాడు. పోప్‌కు మద్దతుగా ఉన్న వర్గం (బ్లాక్ గెల్ఫ్స్) పైచేయి సాధించినప్పుడు డాంటేకు దేశ బహిష్కార శిక్ష విధించబడింది. దీని ప్రకారం ఫ్లారెన్స్‌లో అడుగుపెడితే సజీవ దహనం చేస్తారు. తర్వాతి రాజకీయ పరిణామాల్లో ఈ బహిష్కృతులకు కొందరికి క్షమాభిక్ష లభించినా షరతులకు అంగీకరించని కారణంగా డాంటే దానికి నోచుకోలేదు. తన జన్మభూమిలో అడుగు పెట్టకుండానే రవెన్నా (ఇటలీలోని మరో నగరం)లో మరణించాడు. ఆయన మరణానంతరం తప్పు తెలుసుకున్న పాలకులు ఫ్లారెన్స్‌లో ఒక సమాధి నిర్మించారు, డాంటే దేహం లేకుండానే. 'మమ్మల్ని వదిలివెళ్లిన ఆయన ఆత్మ తిరిగొస్తుంది' అని ఆయన వాక్యమే చెక్కించి. 700 ఏళ్ల క్రితం జరిగిన తప్పుకు ఫ్లారెన్స్ మున్సిపాలిటీ 2008లో క్షమాపణ ప్రకటించింది.

## సాహిత్య మరమరాలు

# విప్లవం తర్వాత



రష్యా నాయకుడు నికిటా కృశ్చేవ్ ఒకసారి సైబీరియా ప్రాంత పర్యటనకు వెళ్లినప్పుడు, తొంబయి ఏళ్ల ముసలాయన దగ్గరకెళ్లి, ''తాతయ్యా! మన దేశంలో జరిగిన సామ్యవాద విప్లవం తరువాత నువ్వు ఎంతో సంతోషంగా ఉన్నావు కదా!'' అని అడిగాడట.

అందుకా ముసలాయన, ''బాబూ! నాకా విప్లవం గురించి వివరంగా తెలియదుగానీ గతంలో అంటే అక్టోబర్ విప్లవానికి ముందు నాకు రెండు జతల బూట్లూ, రెండు పైన తొడుక్కునే కోట్లూ, రెండు ఉన్ని సూట్లూ ఉండేవి. ఇప్పుడు వాటిలో ఒక్కొక్కటే మిగిలాయి. అవైనా బాగా చిరిగిపోయాయి'' అని చెప్పాడు వణుకుతున్న స్వరంతో.

ముసలాయన్ని ఎలాగైనా ఒప్పించాలని– ''తాతయ్యా! నీకీ విషయం తెలుసా? చైనా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా, ఇండియా మొదలైన దేశాల్లో ఉన్న ప్రజలకి నీకున్న సౌకర్యాలు కూడా లేక ఎంతో పేదరికంలో మగ్గిపోతున్నారు'' అని వివరించాడు కృశ్చేవ్.

''బహుశా ఆ దేశాల్లో మనకంటే ముందే అక్టోబర్ విప్లవం వచ్చుంటుంది'' అన్నాడా వృద్ధుడు తాపీగా.

◆ ఈదుపల్లి వెంకటేశ్వరరావు

## ప్రతిధ్వనించే పుస్తకం

# అక్కమహాదేవి వచనములు



గాలిలో సువాసన యుండగ
పూలచింత ఇంకెందు కయ్యా?
క్షమ దయ శాంతి ఓర్పులున్న
సమాధి చింత ఇంకెందుకయ్యా!
లోకమే తానైన పిదప
ఏకాంతపుచింత ఇంకెందుకయ్యా!
చెన్నమల్లి కార్జునయ్యా!

బసవేశ్వరుని వీరశైవ బోధనలు మారుమోగుతున్న 12వ శతాబ్దంలో జన్మించింది అక్కమహాదేవి. పుట్టిల్లు కర్ణాటక. మెట్టినిల్లు శ్రీశైలం. చెన్నమల్లికార్జునుడినే తన భర్తగా భావించుకుని, కుటుంబ బంధాలన్నీ త్యజించి, శ్రీశైలం వచ్చి కొండగుహలో తపస్సు చేసుకుంటూ గడిపింది.

మాకు మా లింగము చింత
మాకు మా భక్తుల చింత
మాకు మా ఆద్యుల చింత
మాకు మా చెన్నమల్లికార్జునుని చింత
లోకులచింత మాకెందు కన్నా

అక్కడే తన అంతరంగంలోంచి పొంగిపొరలిన వచనాలను పలికింది. అటు గద్యము ఇటు పద్యముగాని భావ గీతాలు ఈ వచనాలు. వీటిల్లో ఆత్మ విశ్లేషణ ఎక్కువ. వేదన, నివేదన వీటిల్లోని ప్రధాన గుణాలు. కన్నడంలోని ఆ వచనాలను రేకళిగె మఠం వీరయ్య తెలుగులోకి అనువదించారు. 1982 వచ్చిన ఆ పుస్తకాన్ని తెలంగాణ సాహిత్య అకాడమి ఇటీవల పునర్ముద్రించింది.

తెలియనివారితో చెలిమ చేసిన
రాళ్లను గొట్టి మిరుగుళ్లను తీసి నట్టులయ్యా!
తెలిసినవారితో చెలిమి చేసిన
చల్లను చిలికి వెన్నను దీసినట్టులయ్యా!
చెన్నమల్లికార్జునా మీ శరణులతో చెలిమి
కర్పూరము గిరిని జ్వాలలు మ్రింగి నట్టులయ్యా!

ఇందులో 343 వచనాలున్నాయి. వెల: 100. ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమి, రవీంద్రభారతి ప్రాంగణం, హైదరాబాద్–4. ఫోన్: 040–29703142

## రారండోయ్

- డాక్టర్ ఎస్వీ సత్యనారాయణ కవిత్వం 'ఉద్యమం ఉద్యమమే' గ్రంథావిష్కరణ జూన్ 18న మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్‌లోని పొ.శ్రీ. తెలుగు విశ్వవిద్యాలయ సమావేశ మందిరంలో జరగనుంది. ఆవిష్కర్త: కె.శివారెడ్డి. నిర్వహణ: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం భాషాభివృద్ధి పీఠం.
- డాక్టర్ సి.భవానీదేవి 'స్వాతంత్ర్యానంతర తెలుగు, హిందీ కవిత్వంలో స్త్రీ' ఆవిష్కరణ సభ జూన్ 20న సాయంత్రం 6 గంటలకు రవీంద్ర భారతి సమావేశ మందిరంలో జరగనుంది. గ్రంథ స్వీకర్త: ఎస్వీ రామారావు. నిర్వహణ: కిన్నెర ఆర్ట్ థియేటర్స్.
- కల్లూరి శ్యామల పుస్తకాల– 'కంచికి వెళ్లకూడని కథలు', 'రజనీగంధ'(పాపినేని శివశంకర్ కవిత్వ ఆంగ్లానువాదం), భావ విహంగాలు(టాగూర్ స్ట్రేబర్డ్స్ తెలుగు అనువాదం)– ఆవిష్కరణ సభ జూన్ 23న సాయంత్రం 6 గంటలకు విజయవాడ ప్రజాశక్తి నగర్‌లోని శిఖర స్కూల్‌లో జరగనుంది. ఆవిష్కర్త: ఎల్.వి.సుబ్రహ్మణ్యం. నిర్వహణ: సాహితీ మిత్రులు.
- పుష్యమీసాగర్ కవితా సంపుటి 'పునరావృత దృశ్యం' ఆవిష్కరణ జూన్ 23న సాయంత్రం 6 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనుంది. ఆవిష్కర్త: సుద్దాల అశోక్‌తేజ. నిర్వహణ: కవిసంగమం.
- డాక్టర్ పెద్దాడ వేంకట లక్ష్మీ సుబ్బారావు 'మరణానంతర జీవనం' ఆవిష్కరణ జూన్ 22న సాయంత్రం 6 గంటలకు త్యాగరాయ గానసభలో జరగనుంది. ఆవిష్కర్త: వోలేటి పార్వతీశం. ఈటెల సమ్మన్న, జనార్దనమూర్తి, భైస దేవదాస్, కూర చిదంబరం పాల్గొంటారు. నిర్వహణ: తెలుగు సాహిత్య కళాపీఠం.
- రాజాం రచయితల వేదిక ఆధ్వర్యంలో– సాహిత్యం–రంగస్థలం అంశంపై డాక్టర్ మీగడ రామలింగస్వామి జూన్ 23న ఉదయం 9:30కు రాజాంలోని విద్యానికేతన్ పాఠశాలలో ప్రసంగిస్తారు.
- 'జైనీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్' జీవన సాఫల్య పురస్కారాన్ని అంపశయ్య నవీన్‌కూ, జూన్19న సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి సమావేశ మందిరంలో ప్రదానం చేయనున్నారు. శకుంతలా జైనీ కళా పురస్కారాలను వీరికి ఇవ్వనున్నారు: వి. రాజారామ మోహనరావు, స్వాతి శ్రీపాద, విజయలక్ష్మి పండిట్, వెంకట్ గుడిపాటి, పత్తిపాక మోహన్, నగేశ్ బీరెడ్డి, శ్రీరాంసాగర్ కవచం, పెద్దింటి అశోక్ కుమార్, పసునూరి రవీందర్, మహమ్మద్ రఫీ, అన్వర్, జానీ చరణ్ బాషా తక్కెడశిల. డాక్టర్ ప్రభాకర్ జైనీ నవల 'నిఘా', కథాసంపుటి 'మీల్స్ టికెట్' ఆవిష్కరణ ఈ సభలోనే జరగనుంది. ముఖ్య అతిథి: మాడభూషి శ్రీధర్.

## పదం పలికింది - పాట నిలిచింది

# నవమి నాటి వెన్నెల నేను



స్త్రీ, పురుషుడు– విడిగా సగం సగం. అసంపూర్ణం. నవమి, దశమి నాటి వెన్నెలలాగే. ఏ సగమెవరో మరిచేంతగా వారు ఒకటైపోయినప్పుడు సంపూర్ణం అవుతారు. పున్నమి రేయి అవుతారు. శివరంజని కోసం వేటూరి సుందరరామ్మూర్తి రాసిన పాట ఇది. దీనికి సంగీతం రమేశ్ నాయుడు. పాడినవారు సుశీల, బాలసుబ్రహ్మణ్యం. 1978లో వచ్చిన ఈ చిత్రానికి దర్శకుడు దాసరి నారాయణరావు. జయసుధ, హరిప్రసాద్ నటీనటులు.

నవమి నాటి వెన్నెల నేను
దశమి నాటి జాబిలి నీవు
కలుసుకున్న ప్రతి రేయీ
కార్తీక పున్నమి రేయీ
నీ వయసే వసంత రుతువై
నీ మనసే జీవన మధువై

నీ పెదవే నా పల్లవిగా
నీ నగవే సిగ మల్లికగా
చెరి సగమై ఏ సగమేదో
మరచిన మన తొలి
కలయికలో
నీ ఒడిలో వలపును నేనై

నీ గుడిలో వెలుగే నేనై
అందాలే నీ హారతిగా
అందించే నా పార్వతిగా
మనమొకటై రసజగమేలే
సరస మధుర సంగమ
గీతికలో

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083

బి-సమ్మరీ!

# డ్యాన్స్ రూమ్

సాక్ష్యాధారాలు మరకల్లాంటివి. ఏళ్లు గడిచే కొద్దీ ఆనవాళ్లు లేకుండాపోతాయి. మనసుకు తగిలిన గాయం మచ్చలాంటిది. ఎన్నేళ్లు గడిచినా బాధను గుర్తు చేస్తూనే ఉంటుంది.

● మాధవ్ శింగరాజు

నానా పటేకర్ మీద తనుశ్రీ దత్తా పెట్టిన లైంగిక వేధింపుల కేసు తేలిపోయింది. పోలీసులే తేల్చేశారు! కేసును క్లోజ్ చేస్తున్నట్లుగా కోర్టుకు ‘బి సమ్మరీ’ రిపోర్ట్ కూడా ఇచ్చారు. బి సమ్మరీ రిపోర్టును ఇవ్వడం అంటే నిందితుడికి వ్యతిరేకంగా సాక్ష్యాధారాలు దొరకలేదని చేతులు ఎత్తేయడం. ఇక కేసును కొట్టేయడమా, కొనసాగించడమా అన్నది కోర్టు పరిధిలోని విషయం. సాక్ష్యాధారాలను ‘సేకరించలేక పోయిన’ పోలీసులు 51 పేజీల బి సమ్మరీలో కొన్ని అభిప్రాయాలను కూడా వెలిబుచ్చారు. మిస్అండర్‌స్టాండింగ్ కారణంగా, మలేషస్ ఇంటెంట్‌తోనూ తనుశ్రీ నానా పటేకర్ మీద కేసు పెట్టారట. అపార్థం కారణంగా, హాని తలపెట్టే ఉద్దేశంతో అని.

నానా పటేకర్‌తో పాటు మరో ముగ్గురిపైన కూడా తనుశ్రీ కేసు పెట్టారు. కొరియోగ్రాఫర్ గణేశ్ ఆచార్య, డైరెక్టర్ సమీ సిద్ధిక్, నిర్మాత రాకేశ్ సారంగ్. వీళ్లలో ప్రధాన నిందితుడు నానా పటేకర్. ‘హార్న్ ఓకే ప్లీజ్’ సినిమా సెట్స్ డ్యాన్స్ సీక్వెన్స్‌లో 2008 మార్చి 23–26 మధ్య.. సీన్‌ని అడ్డుపెట్టుకుని పటేకర్ తనను వేధించాడని, మిగతావాళ్లు అతడికి సహకరించారని తనుశ్రీ దత్తా ఫిర్యాదు. బి సమ్మరీ వచ్చింది కదా, ఇప్పుడు ఈ నిందితులంతా నిర్దోషులుగా విడుదల అవొచ్చు. అంతే కాదు, పోలీసులు తలచుకుంటే (పటేకర్ తలచుకుంటే అనాలి) రివర్స్‌లో తనుశ్రీ మీదే కేసు పెట్టొచ్చు. పటేకర్ గారి ప్రతిష్టకు ఆమె భంగం కలిగించిందని. తనుశ్రీ దత్తా పటేకర్ పై పెట్టిన కేసులోని ఆరోపణల కన్నా, కోర్టుకు సమర్పించిన రిపోర్టులో పోలీసులు తనుశ్రీ దత్తా మీద చేసిన ఆరోపణలే ఎక్కువ నమ్మేవిధంగా ఉన్నాయి! తనుశ్రీ కేసు ఫైల్ చేసింది గత ఏడాది అక్టోబర్ 6న. ఎఫ్.ఐ.ఆర్. నమోదు అయింది అక్టోబర్ 10న. అందులో నానా అండ్ టీమ్‌పై ఆమె చేసిన ఆరోపణలు.. పదేళ్ల క్రితం జరిగిందని ఆమె చెబుతున్న ఓ సంఘటనకు సంబంధించినవి. అప్పుడు కూడా ఆమె ఫిర్యాదు చేయకుండా ఏమీ లేరు. పోలీసులు కోర్టుకు ఇప్పుడు ఫైల్ చేసిన బి సమ్మరీ ప్రకారం.. తనుశ్రీ మొదటే 2008 మార్చిలో సినీ అండ్ టీవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (సింటా) దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. గుర్‌గావ్ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టారు. తను లైంగిక వేధింపుల కేసు పెడితే పోలీసులు దానిని వట్టి వేధింపుల కేసుగా నమోదు చేశారని కూడా అప్పట్లోనే ఆమె ఆరోపించారు. తర్వాత పదేళ్లకు.. గత ఏడాది అక్టోబర్‌లో ఒషివారా పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టారు. ఈ వివరాలన్నీ బి సమ్మరీలో పొందుపరుస్తూ.. ‘కనీసం పదమూడు మంది సాక్షుల్ని విచారిస్తే వాళ్లలో ఒక్కరు కూడా నానా పటేకర్‌కు వ్యతిరేకంగా సాక్ష్యం ఇవ్వలేదు’ అని ఫినిషింగ్ టచ్ ఇచ్చారు పోలీసులు.

తనుశ్రీ ఇచ్చిన ఎఫ్.ఐ.ఆర్. ప్రకారం.. నిర్మాత, డైరెక్టర్ ఆమెకు మొదట చెప్పింది.. సోలో ఐటమ్ సాంగ్‌కు మాత్రమే ఆమె చెయ్యాల్సి ఉంటుందని. చేస్తాను కానీ, స్టెప్పులు అశ్లీలంగా ఉంటే తను చెయ్యనని ఆమె అన్నారు. అశ్లీలం మాత్రమే కాదు, తనకు అసౌకర్యంగా ఉండే మూవ్‌మెంట్స్‌ని ఇవ్వలేనని కూడా ముందే స్పష్టంగా చెప్పేశారు. వాళ్లు ఒప్పుకున్నారు. సాంగ్‌లో పటేకర్‌కు మాత్రం సింగిల్ లైన్ ఉంటుందనీ, అది కూడా వేరుగా షూట్ చేసుకుంటామని అన్నారు. అయితే పాట షూటింగ్ జరుగుతున్న నాలుగు రోజులూ నానా పటేకర్ సెట్స్ లోపలికి వచ్చి తనుశ్రీకి డ్యాన్స్ నేర్పించే నెపంతో ఆమె ఒంటిని టచ్ చేస్తూనే ఉన్నాడు. అది బ్యాడ్ టచ్. అదంతా ఓ స్ట్రాటెజీతో జరుగుతోందని, మిగతా వాళ్లు అతడికి సహకరిస్తున్నారని గ్రహించిన వెంటనే సెట్స్‌లోంచి బయటికి వెళ్లిపోయారు తనుశ్రీదత్తా. అయితే పటేకర్ అసలలా ప్రవర్తించనేలేదని జూనియర్ ఆర్టిస్టులు చెప్పిన విషయానికి పోలీసులు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు! డైసీ షా స్టేట్‌మెంట్‌ను కూడా వాళ్లు తీసుకున్నారు. డైసీ డ్యాన్సర్, మోడల్. తనుశ్రీ వయసే. ‘‘నానా పటేకర్‌కి పెద్దగా డ్యాన్స్ రాదు. స్టెప్పులు ఎలా వేయాలో నేను, నా మేల్ కొరియోగ్రాఫర్స్ ఆయనకు నేర్పిస్తున్నాం. మార్చి 26 ఉదయాన్నే పటేకర్ సెట్స్‌కి వచ్చేశారు. తనుశ్రీ మధ్యాహ్నం వచ్చారు. అందరు డ్యాన్సర్‌లు సెట్‌లో ఉన్నారు. పటేకర్ తనుశ్రీ వెనుక ఉన్నారు. హఠాత్తుగా తనుశ్రీ అగ్నిపర్వతమే అయ్యారు. విసురుగా బయటికి వెళ్లిపోయారు. ఏమైందో మాకెవరికీ తెలియదు. నిర్మాత, దర్శకుడు ఎంత నచ్చజెప్పినా ఆమె వినలేదు. తన కారులో తను వెళ్లిపోయారు’’ అని డైసీ చెప్పారు.

పటేకర్‌కి అనుకూలంగా ఉన్న ప్రతి పాయింట్‌నీ పోలీసులు శ్రద్ధగా నోట్ చేసుకున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికైతే పటేకర్ బయటపడినట్లే. తనుశ్రీ బయటపడుతుందా అన్నది పటేకర్ దయాదాక్షిణ్యాలపై ఉంటుంది!

తనుశ్రీ నానా పటేకర్‌పై తప్పుడు కేసు పెట్టారని పోలీసులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు కనుక పటేకర్ ఆమెను వేధించాలనుకుంటే తిరిగి ఆమె మీదే కేసు పడేలా పోలీసుల్ని ప్రభావితం చేసే అవకాశాలు లేకపోలేదు. నానా పటేకర్‌కు క్లీన్ చిట్ వచ్చిందన్న వార్త యు.ఎస్.లో ఉన్న తనుశ్రీకి తెల్లవారుజామున ఐదు గంటలకు ఇండియాలోని ఆమె ఫ్రెండ్ ద్వారా తెలిసింది. పోలీసులు కేసు క్లోజ్ చెయ్యవచ్చు. కోర్టు కేస్ కొట్టేయవచ్చు. తను మాత్రం న్యాయపోరాటం చేస్తాననే అంటున్నారు తనుశ్రీ! దేవుడి నుంచి రావలసిన జడ్జ్‌మెంట్ ఇంకా మిగిలే ఉంది కదా అని ఆమె ఆశ.

ఆమె ఆశ పెట్టుకున్న దేవుడు, ఆమె అప్లికేషన్ పెట్టుకున్న న్యాయదేవత.. ఆ ఇద్దరూ ఇచ్చే తీర్పు ఎవరి వైపు ఉండబోతున్నప్పటికీ పటేకర్‌పై తనుశ్రీ చేసిన ఆరోపణల్లో మాత్రం అబద్ధం లేదని.. డ్యాన్స్ రాని పటేకర్, డ్యాన్స్ నేర్పించడానికి తనుశ్రీ మీద చెయ్యి వెయ్యడాన్ని బట్టే స్పష్టం అవుతోంది. దీన్ని ఇంకో యాంగిల్‌లో చూసేవాళ్లూ ఉండొచ్చు. డ్యాన్స్ రాని పటేకర్ తనుశ్రీకి డ్యాన్స్ నేర్పించడానికి ఎందుకు ట్రై చేస్తాడు, కేసు ఇక్కడే తేలిపోవడం లేదా అని! పళ్లు లేనివాడు కొరకలేడు నిజమే. పళ్లు లేనంత మాత్రాన కొరికే ఉద్దేశం లేకుండా పోతుందా? పాతికేళ్ల అమ్మాయి.. ఉద్దేశాలను గ్రహించలేకపోతుందా?! ●

> తనుశ్రీదత్తా నానా పటేకర్‌పై పెట్టిన కేసులోని ఆరోపణల కన్నా, కోర్టుకు సమర్పించిన రిపోర్టులో పోలీసులు తనుశ్రీ దత్తా మీద చేసిన ఆరోపణలే ఎక్కువ నమ్మేవిధంగా ఉన్నాయి!




నానా పటేకర్, తనుశ్రీ దత్తా : సాక్ష్యాధారాలు లేవని పోలీసులు తనుశ్రీ కేసును క్లోజ్ చేసేశారు. మరకల్లేవని మచ్చ కూడా లేకుండా పోతుందా? పటేకర్‌కి క్లీన్ చిట్ వచ్చిందని తనుశ్రీ పదేళ్ల ఆవేదన వట్టి అబద్ధమైపోతుందా?





● స్త్రీలపై హింసను, దాడుల్ని సంకేతపరుస్తున్న అంతరార్థ చిత్రం



● ఆడపిల్లపై అదనీ, ఇదనీ ముద్ర వేయకండి



● బాలలపై లైంగిక అకృత్యాలను ఆపండి

# ఊపిరి తీసుకోనివ్వండి

స్త్రీ అంటే దేహం మాత్రమేనా! ఆమెకూ మనసు ఉంటుందని.. ఆమె దేహం చుట్టూ మనం కప్పే ఆంక్షలన్నీ ఆమె మనసుకు ఊపిరి ఆడకుండా చేస్తాయని.. ఎందుకు గ్రహించలేం?! ఎందుకంటే.. దేహాన్ని తప్ప మనసును చూడలేం మనం! అందుకే ఆ మనసును దేహం పైకి తెచ్చి చూపిస్తున్నారు ఈ అమ్మాయిలు.

కొన్ని నెలల కిందట...

ఢిల్లీ.. జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీలోని ఆడిటోరియం.. జరగబోయే కార్యక్రమం ఏంటో అనే ఉత్కంఠను పంచుకుంటున్నారు ప్రేక్షకులు లోగొంతుకలతో. అంతలోనే ఆడిటోరియం లైట్లన్నీ ఆరిపోయి చీకటి అయిపోయి.. వేదిక మీద ఒక మహిళ నిలబడి ఉంది నగ్నంగా. ఆమె దేహం మాత్రమే ఫోకస్‌లో ఉంది. ఒక్కసారిగా ప్రేక్షకుల్లో నిశ్శబ్దం. దిగ్భ్రాంతిగా చూస్తున్నారు ఆ ఫోకస్ కేసి. నెమ్మదిగా వేదిక మీది స్త్రీ.. తన చుట్టూ తాను తిరగడం మొదలుపెట్టింది.. ప్రేక్షకుల కేసి చూస్తూ.. గుచ్చి గుచ్చి! దాదాపు అందరూ ఆమె మీద నుంచి తమ దృష్టి మరల్చుకోవడానికి ప్రయత్నించారు రకరకాలుగా.

అప్పుడు ఆమె మాట్లాడ్డం మొదలుపెట్టింది. ‘‘చిన్నప్పటి నుంచీ మా ఇంట్లో నా మీద స్పెషల్ అటెన్షనే’’ అంటూ పక్కనే ఓ కుర్చీమీద ఉన్న బట్టల బుట్టలోంచి ఓ చున్నీ తీసి నడుముకు బిగించుకుంది. ‘‘అన్నావాళ్లతో సమానంగా .. వాళ్లతో కలిసి ఆడుకుంటూంటే.. ఆడపిల్లవు.. మగపిల్లలతో కలిసి ఆ గంతులేంటి?’’ అని నా రెక్కలు పుచ్చుకుని బరబరా లోపలికి లాక్కెళ్లేవారు’’ అని చెప్తూ ఇంకో చున్నీ కట్టుకుంది. ‘‘ఫ్రెండ్స్‌తో కలిసి జోకులేసుకుంటూ మనసారా నవ్వుకుంటూంటే.. అమ్మాయిలు అంత బిగ్గరగా నవ్వొచ్చా’’ అని నోరు మూసేశారు అంటూ ఇంకో చున్నీ చుట్టుకుంది. ఇంట్లోంచి బయటకు వెళ్తుంటే.. చీకటి పడకముందే ఇంటికొచ్చేయ్.. అని హద్దు చెప్పారు అంటూ మరో చున్నీ, నచ్చిన డ్రెస్ వేసుకుంటుంటే.. ఇలా కాదు.. నిండుగా వేసుకోవాలి.. అంటూ భుజాల చుట్టూ దుపట్టా కప్పేశారు.. అని చెప్తూ ఇంకో చున్నీ, తలెత్తి.. ఛాతీ విరుచుకొని నడుస్తుంటే.. తల వంచి.. నెత్తి మీద నుంచి ఘూంఘట్ కప్పేశారు.. అంటూ మరో చున్నీ, బస్‌స్టాప్‌లో నిలబడ్డా.. కాలేజ్‌కి.. ఆఫీస్‌కు.. సినిమాకు.. ఇంకెక్కడికి వెళ్లినా సరే.. తల వంచే ఉండాలి.. నిండుగా బట్టలు వేసుకోవాలి.. ఈ ప్రయాణంలో ఎదురుపడ్డ మగవాళ్లను ‘అన్నా’ అనే పిలవాలి.. అలా అయితేనే నువ్వు సురక్షితంగా ఉంటావ్’’ అని చెప్పారు మా పెద్దలు’’ అంటూ గుక్క తిప్పుకోకుండా చెబుతూ ఆ కుర్చీ మీద బుట్టలో చున్నీలన్నీ చుట్టుకుంది. బట్టలన్నీ వేసుకుంది. పాదం నుంచి మెడ దాకా.. మేను కనిపించకుండా.. ఊపిరి తీసుకోవడం కష్టమయ్యేంతగా ! తల మీద హెల్మెట్ కూడా పెట్టుకుంది. కళ్లకు చలువ కళ్లజోడు ధరించింది. ‘‘కనిపించిన అందరినీ ‘అన్నా’ అనే పిలుస్తున్నా.. మనదేశ సంస్కృతీసంప్రదాయానికి ప్రతిరూపంలా ఉన్నావ్ అని కితాబూ అందుకుంటున్నా. ఇక నన్నెవడైనా టీజ్ చేసినా.. దాడి చేసినా.. వేధించినా నా బాధ్యత కాదు’’ అని ఆపేసింది ఆమె. శ్వాస తీసుకోవడం కష్టమై ఎగబీలుస్తోంది.. వెళ్లి గబగబా ఆ బట్టలన్నీ లాగిపడేస్తే కాని హాయిగా ఊపిరి పీల్చుకోదేమో అన్నట్టుంది పరిస్థితి. ఆమె.. ఆర్టిస్ట్ మల్లికా తనేజా.





మల్లికా తనేజా

## బట్టల్లో కాదు చూపుల్లో తేడా

అమ్మాయిలు వేసుకున్న బట్టలే వాళ్ల పట్ల నేరాలకు ప్రేరేపిస్తే.. అయిదేళ్ల పాపలనూ ఎందుకు రేప్ చేస్తున్నారు? సో.. బట్టలు కాదు.. చూసే చూపుల్లో తేడా ఉంది. తల వంచుకునే ఉండాలి అని అమ్మాయిలకు చెప్పే బదులు.. అమ్మాయిలనూ గౌరవించాలి.. వాళ్లూ మీకు ఈక్వలే.. సెక్సువల్ ఆబ్జెక్ట్స్ కాదు అని ఎందుకు నేర్పరు? నేర్పేందుకే ఇలాంటి ప్రదర్శనలు.. దేశంలోనే కాదు.. విదేశాల్లో కూడా ఇస్తున్నాను.

– మల్లికా తనేజా

* * *

ఈ మధ్యే..

హైదరాబాద్.. జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో.. దాదాపు 75 ఏళ్ల తర్వాత మొదటిసారిగా.. పెయింటింగ్ డిపార్ట్‌మెంట్ ఆర్ట్ ఫెస్టివల్‌ను నిర్వహించింది. ఆ పండగలో కనిపించిన బాడీ పెయింటింగ్స్‌ను వీక్షకుల మనసును తడి చేశాయి. మెదళ్లలో ఆలోచనలను రేకెత్తించాయి. పదేళ్ల చిన్నారి వీపు మీద అరచేయి ప్రింట్ ఉంటుంది. ‘‘చైల్డ్ అబ్యూజ్‌ని ఆపమన్నట్టు’’గా. చేతిలో లిప్‌స్టిక్‌తో ఉన్న పందొమ్మిదేళ్ల అమ్మాయి వీపు మీద లేబుల్ కనిపిస్తూంటుంది.. తనకు నచ్చినట్టుగా అలంకరించుకున్న అమ్మాయిని ‘ఫలానా’ అంటూ ముద్ర వేయడం బంద్ చేయమని. ఒక అబ్బాయి వీపు మీదున్న రెయిన్‌బో కలర్స్‌ను ‘‘ఎల్‌జీబీటీ హక్కులు’గా.. మరో అమ్మాయి వీపు మీదున్న వెజైనా విత్ వింగ్స్ బొమ్మ... సమానత్వానికి చిహ్నంగా, ఇరవై రెండేళ్ల యువతి వీపు మీద ఎర్రటి రంగు గీత.. రుతుక్రమం మీదున్న అపోహలను తొలగించుకోమన్నట్టుగా.. మరో యువతి వీపు మీద మల్టీ కలర్స్ అబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్ స్త్రీల మీద జరుగుతున్న దాడులు, హింసకు ప్రతిబింబంగా.. ఓ నడి వయసు మహిళ వీపుమీది గర్భస్థ శిశువు బొమ్మ భ్రూణ హత్యలను ఆపమని కోరుతూ ఉన్న పెయింటింగ్స్ అవి. ఆర్టిస్టులు.. సాహితీ కల్యాణం, విస్మయ వాసుదేవన్.



విస్మయ సాహితీ

## మానవత్వం.. శాంతే మా మనవి

మా పెయింటింగ్స్ ఇప్పుడున్న సోషల్ సిస్టమ్‌ను రిఫ్లెక్ట్ చేసేవే. మనోవికాసం, ఆత్మీయతానురాగాలు, అనుభూతులకు లింగభేదాలు లేవు. ఆడ, మగ, ఎల్‌జీబీటీ.. అందరికీ ఒకటే. సమాజానికి సమానత్వమే ప్రాతిపదిక కావాలి. మానవత్వం, ప్రేమ, శాంతికి మాత్రమే చోటుండాలి. మా పెయింటింగ్స్ ద్వారా మనవి చేయాలనుకున్నది ఇదే’’

– విస్మయ వాసుదేవన్, సాహితీ కల్యాణం



● ఎల్జీబీటీలకూ హక్కులున్నాయి

### అయితే...?

ఏం లేదు. మల్లికా ప్రదర్శన అయినా.. సాహితీ, విస్మయల పెయింటింగ్స్ అయినా ప్రకటిస్తున్నదొకటే.. నిరసన.. సమానత్వం కోసం తపన. సంస్కృతీ సంప్రదాయాలను మోసే భారం ఆడపిల్ల మీదే ఎందుకు? ఊపిరి తీసుకోలేనంతగా ఆమె మీద పరువు ప్రతిష్ఠల బరువును మోపడమెందుకు? ఆధిపత్య అహంకారంతో మగవాడు చేసే గాయాలను ఆడపిల్లల కట్టు, బొట్టుతో ఎందుకు లింక్ పెడ్తారు? ఆ కట్టుబాట్లలో ఎందుకు బందీ చేస్తారు.. అని సమాజానికి చేసిన హెచ్చరిక.. కొట్టిన చెంపదెబ్బ! ఆడవాళ్ల ఆత్మఘోషకిచ్చిన రూపం. దేశంలో ఏ అమ్మాయి మీద దాడి జరిగినా ఆ నేరాన్ని ఆమె వేసుకున్న బట్టలకో.. ఆమె ఉపయోగించుకున్న స్వేచ్ఛకో అంటగట్టే యాటిట్యూడ్‌కు చూపించిన సమాధానం. సమాజపు విపరీత ధోరణుల వల్ల ఫిమేల్ జెండర్ ఉనికే ప్రమాదంలో పడ్తున్న తీరును ఈ వ్యక్తీకరణలు చూపిస్తున్నాయి. అసమానతలను ప్రశ్నిస్తున్నాయి. నిలదీస్తున్నాయి. తారతమ్యాలు వద్దని కోరుతున్నాయి.

కాలం మారింది.. రహస్యంగా ఉంచడం, దాచడం.. చాలా పొరపాట్లకు, ఎన్నో తప్పిదాలకు కారణమని తెలుసుకుంటోంది యువత. దేన్నయినా.. చర్చించాలి.. భావాలను స్వేచ్ఛగా ప్రకటించాలి. అందుకు వాళ్లు కళను మంచి మాధ్యమంగా ఎంచుకుంటున్నారు. నిజానికి స్వాతంత్ర్య సమరం నుంచి ఎన్నో సామాజిక ఉద్యమాలకు ఆక్సిజన్‌లా పనిచేసి వాటిని ప్రాణాలతో నిలిపి ఉంచినవి కళలే. ఆ నిజాన్ని ఈ తరమూ గ్రహించింది. అందుకే వాళ్ల ఎక్స్‌ప్రెషన్స్‌కు.. వాళ్లకు తెలిసిన... అనుభవం ఉన్న కళలను వేదికగా మలచుకుంటున్నారు.నిర్భయంగా.. స్పష్టంగా ప్రదర్శిస్తున్నారు.. సమానత్వం పట్ల అవగాహన కల్పిస్తున్నారు. సైంటిఫిక్ అప్రోచ్ పెంచుతున్నారు.

– సరస్వతి రమ

తనయుడు

# హ్యాపీ మ్యారీడ్ లైఫ్ అమ్మా!

“అసలు ఇలాంటి ఒక నోట్ రాసేముందు నేను ఎంతగానో ఆలోచించాను. ఆధునిక సమాజంలో కూడా ఒక మహిళ రెండో పెళ్లి చేసుకుంటే వింతగా చూసే మనస్తత్వంలో మనం ఉన్నాం. ఎవరైతే అనుమానం, జాలి, వంటి భావనలు కలిగి ఉంటారో దయచేసి అటువంటి వాళ్లు ఈ పోస్టు వంక చూడకపోవడమే మంచిది. ఇది మా అమ్మ పెళ్లి గురించి.”

కేరళకు చెందిన గోకుల్ శ్రీధర్ అనే యువకుడు ఫేస్‌బుక్‌లో పెట్టిన పోస్టు ప్రారంభ వాక్యాలే పైన మీరు చదివినవి. వితంతువు, భర్త వదిలేసిన లేదా భర్తను వదిలేసిన స్త్రీ రెండో పెళ్లి చేసుకోవడాన్ని ఆమె సంతానం హర్షిస్తుందనడానికి తార్కాణంగా నిలిచిన పోస్ట్ అది. ఇప్పుడు అందర్నీ ఆలోచింపజేస్తోంది.

### తల్లిదండ్రులు మాత్రమేనా?!

దైవభూమిగా పేరుగాంచిన కేరళలోని కొల్లాంకు చెందిన గోకుల్ శ్రీధర్ తల్లిదండ్రులతో కలిసి జీవించేవాడు. అయితే వారిద్దరు తనకు తల్లిదండ్రులే ఉంటున్నారే తప్ప.. భార్యభర్తలుగా మెలగడం లేదని అర్థం చేసుకోవడానికి.. ఆ చిట్టి గుండెకు కొంత సమయం పట్టింది. తన భవిష్యత్తు కోసం.. భర్త పెట్టే చిత్రహింసలను సైతం చిరునవ్వుతో భరించే తల్లి ఆవేదన.. పెరిగి పెద్దవుతున్న కొద్దీ అర్థం చేసుకోసాగాడు. కేవలం తన కారణంగా.. స్త్రీని ఒక బొమ్మలా భావించే తండ్రి మూర్ఖత్వానికి అమ్మ జీవితం బలైపోతుందనే అపరాధ భావన... గోకుల్‌కు మనశ్శాంతి లేకుండా చేసింది. అయితే కొన్ని రోజుల క్రితం అతడి మానసిక సంఘర్షణకు తెరపడింది. హింసించే భర్త నుంచి విముక్తి పొందిన తన తల్లి.. రెండో పెళ్లి చేసుకోవడంతో గోకుల్ సంతోషంగా ఉన్నాడు. ఈ క్రమంలో తన తల్లి గురించి అతడు ఫేస్ బుక్‌లో రాసుకొచ్చిన మాటలు.. బిడ్డ భవిష్యత్తు కోసం ఒక తల్లి ఎన్ని త్యాగాలకైనా సిద్ధపడుతుందనే విషయాన్ని మరోసారి గుర్తుచేశాయి.

### రక్తం కారుతున్నా అమ్మ లెక్కచేయలేదు

‘‘అమ్మ.. నా కోసం తన జీవితాన్ని త్యాగం చేసింది. ఆమె తన వైవాహిక జీవితంలో ఎంతో హింసను భరించింది. భర్త కొట్టే దెబ్బలకు ఒక్కోసారి నుదుటి నుంచి రక్తం ధారాపాతంగా కారుతూ ఉండేది. అయినా ఆమె ముఖంలో బాధ కంటే భయమే ఎక్కువగా ఉండేది. ‘ఇవన్నీ ఎందుకు భరిస్తున్నావు?’ అని ఎన్నోసార్లు ఆమెను అడిగాను. ‘నీ కోసమే నాన్నా.. నువ్వు బాగుండాలంటే ఇవన్నీ భరించక తప్పదు’ అన్న ఆమె మాటలు నన్నెంతో అపరాధ భావానికి గురిచేసేవి. ఒకరోజు అమ్మతో కలిసి నేను కూడా నరకం లాంటి ఆ ఇంటిని వదిలి వచ్చేసాను. మేము ఇల్లు విడిచిన నాడే ఈ విషయం గురించి ఒక నిర్ణయానికి వచ్చేసాను. నా మాటపై అమ్మ పెళ్లి చేసుకున్నాక.. ‘అమ్మా.. కొత్త భాగస్వామి సాన్నిహిత్యంలో నువ్వు సంతోషంగా ఉండాలి. శుభాకాంక్షలు’ అంటూ.. గోకుల్ తన తల్లి, ఆమె రెండో భర్త ఫొటోను సగర్వంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. అమ్మ గొప్పదనం, ఆమె త్యాగం ఎరిగిన వాళ్లంతా ప్రస్తుతం గోకుల్ తల్లికి శుభాకాంక్షలు తెలుపుతూనే.. అతడి మనస్తత్వాన్ని అభినందిస్తున్నారు. నెటిజన్లను విపరీతంగా ఆకర్షిస్తున్న ఈ పోస్టు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. లైకులు, షేర్లతో దూసుకుపోతోంది.

– సుష్మారెడ్డి యాళ్ల, సాక్షి వెబ్‌డెస్క్






● గోకుల్ శ్రీధర్

ఏరువాక

# పున్నమిలో వెన్నెల ధ్యానం

అది జ్యేష్ఠ పున్నమి. మృగశిర కార్తె మధ్య రోజు. తొలకరి మేఘాల రాకను తెలియజేస్తూ ఆకాశం చల్లబడింది. హిమగిరుల్లో పుట్టిన రోహిణీ నదీ తీరంలో నీరెండన నది గట్టు మీద వరుసగా వేయి నాగళ్లు కదిలి వస్తున్నాయి. అన్ని నాగళ్ల కంటే ముందు ఉన్నది శాక్యరాజు శుద్ధోదనుడి నాగలి. రాజ వంశీకులు, రైతులు కదలి వచ్చి సువిశాల క్షేత్రంలో నాగళ్లు పన్నారు. తొలి కొండ్ర వేస్తూ శుద్ధోదనుడు నాగలిని నడిపించాడు. ఆ వెనుకే సాగాయి నాగళ్లు. శాక్య స్త్రీలూ పురుషులూ ప్రకృతిని ఆహ్వానిస్తూ గీతాలు పాడారు. నృత్యాలు చేశారు. ఆరోజు రైతులకు పండుగ. నేల దున్నే పండుగ. పొలం పనులు ప్రారంభించే ఆ రోజు ఏరువాక పున్నమి. ఏరువాక అంటే ‘తొలి దుక్కి’ అని అర్థం. ఆ పొలం పండుగను తిలకించడానికి అందరితోపాటు తానూ వచ్చాడు సిద్ధార్థుడు. అప్పుడు ఆయన వయస్సు పదేళ్లు. తల్లిదండ్రులు పొలం పనుల్లో మునిగి ఉంటే, పిల్లలంతా చేల గట్ల మీద ఆటపాటల్లో తేలిపోతున్నారు. సిద్ధార్థుడు కొంతసేపు ఆటలాడి దగ్గర్లో ఉన్న చెరువు గట్టు మీదకు చేరాడు. ఆ గట్టు మీది సాలవృక్షం నీడలో కూర్చొని చెరువులోకి చూస్తూ ఉండిపోయాడు. వర్షపు రాకను తెలియజేస్తూ తూనీగలు ఒక్కసారిగా లేచి ఆడుతున్నాయి. ఆ తూనీగల్ని చూడగానే చెరువులోని కప్పలకి ఎక్కడలేని ఆనందం వచ్చింది. గబగబా ఒడ్డుకు చేరి, తమ పొడవైన నాల్కలు చాచి తూనీగల్ని చప్పరిస్తున్నాయి. అంతలోనే కలుగులోంచి పాము వచ్చింది. తూనీగను మింగుతూ ఉన్న కప్పను పట్టుకుంది. దాన్ని చుట్టి, ప్రాణం ఉండగానే మింగేసింది. దూరంగా గట్టు మీద ఉన్న మరో కప్పను చూసి, గట్టెక్కి కప్ప కోసం తల పైకెత్తి చూస్తూ ఉండగానే చటుక్కున గద్ద వచ్చి ఆ పాముని గోళ్లతో రక్కి పట్టి ఆకాశంలో ఎగురుతూ తున్నుకు పోయింది.



ధ్యానంలో సిద్ధార్థుడు

దీన్నంతా చూస్తూ ఉన్న సిద్ధార్థుని మదిలో ఏవేవో ఆలోచనలు కలిగాయి. నిటారుగా కూర్చొని, కళ్లు మూసుకుని దీర్ఘాలోచనలో పడ్డాడు. అతని ఆలోచనలు ఎక్కడో.. ఎప్పుడో.. ఒకచోట ఆగిపోయాయి. తనకు తెలియకుండానే తను ఒక రకమైన ఏకాగ్రతలోకి జారిపోయాడు. ఆ ఏకాగ్రతలో ఈ ఆలోచనలకు ఏదో ఒక పరిష్కారం అస్పష్టంగా ఆవిష్కృతం అయింది. ఏదో ఆనందానుభూతి ఆవహించింది. ఎంత సమయం గడిచిందో తెలియనే లేదు. అలా సజీవ శిల్పంలా కూర్చుండిపోయాడు సిద్ధార్థుడు. తోటి పిల్లలు అతని వాలకం చూసి భయపడ్డారు. పరుగు పరుగున పోయి పెద్దలకు చెప్పారు. నాగళ్లు ఆపి వారంతా వచ్చారు. అందరూ వచ్చి చేరినా ఆయన కనులు తెరవలేదు. కానీ ముఖంలో ఏదో తేజస్సు. విజ్ఞాన పుష్పం వికసించినట్లు విప్పారిన వెలుగు. ప్రశాంతత. తన బిడ్డను చూడగానే చేతిలో చర్నాకోలను పక్కన పెట్టి, తను తెలియకుండానే చేతులు జోడించి నమస్కరించాడు శుద్ధోదనుడు. జ్ఞాన తొలకరిని గుర్తించి తండ్రి బిడ్డకు చేసిన తొలి నమస్కారం అది!

అలా ఏరువాక పున్నమి నాడు ఆ చెరువు గట్టు మీద, సాలవృక్షం నీడన సిద్ధార్థుడు తనకు తాను సాధించుకున్న ప్రక్రియే ధ్యానం. ఆనాటి నుండి అలాంటి ధ్యానానందం కోసం చాలాసార్లు ప్రయత్నించాడు. చివరికి ఆ ఆనందం ఆయనకు పాతికేళ్ల తర్వాత బుద్ధగయలో తిరిగి అనుభవానికి వచ్చింది. అదే బౌద్ధధ్యానంగా ఈ రోజున ప్రపంచ ప్రసిద్ధి పొందింది. ధ్యాన ప్రక్రియకు పునాది పడిన రోజు ఏరువాక పున్నమి రోజు. ఇది ప్రపంచవ్యాప్తంగా బౌద్ధులకు పర్వదినం.

– డా.బొర్రా గోవర్ధన్

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ సోమవారం
17-6-2019

## లవ్ డాక్టర్ | నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్..! నేను రెండేళ్లు ఓ అమ్మాయిని ప్రేమించి, పెళ్లి చేసుకున్నా. కానీ వాళ్ల మామ నాపైన రేప్ కేసు పెట్టించి, అమ్మాయిని బలవంతంగా కొట్టించి తీసుకుని వెళ్లిపోయారు. ఇప్పుడు ఆ అమ్మాయిని కాపాడటానికి ఏమైనా దారి చూపిస్తారా సార్? అమ్మాయి జీవితం మీద రేప్ కేసు ఉంటే ప్రాబ్లమ్ కదా సార్. వాళ్ళ మామకి ఎలా చెప్పినా అర్థం చేసుకోవడం లేదు. ఇప్పటికే.. మా ఊరు మొత్తానికి తెలిసిపోయింది మా విషయం. ప్లీజ్ సార్ ఏమైనా పరిష్కారం చెప్పండి.

– రెహ్మాన్

రెహ్మాన్ అన్నా..! వెరీ సారీ..!! నీకు అలా జరగడం చాలా బాధాకరం!! అయినా నువ్వు నీ గురించి కాకుండా అమ్మాయి గౌరవం గురించి ఆలోచించడం చాలా ఆనందం కలిగించింది. వెరీ ప్రౌడ్ ఆఫ్ యూ అన్నా..!!

'మరి ఇప్పుడు రెహ్మాన్ ఏం చెయ్యాలి సార్?'

పోలీస్ స్టేషన్‌కి వెళ్లి కంప్లైంట్ నమోదు చేసుకోవాలి నీలూ!!

'అవును సార్..! అదే కాకుండా ఆడవాళ్ల రైట్స్ కోసం పోరాడే సంస్థలు కూడా ఉంటాయి సార్.. వాళ్లను కూడా సంప్రదించాలి సార్!'

అవును నీలూ! అమ్మాయి వైపు వాళ్లకు కౌన్సెలింగ్ కూడా ఇప్పించాలి. ఆ అమ్మాయి కూడా చాలా స్ట్రెస్ అనుభవిస్తూ ఉంటుంది. అవసరమైతే సాక్షి రిపోర్టర్ హెల్ప్ కూడా తీసుకోవాలి..!!

'అవును రెహ్మాన్! నీ గురించి కాకపోయినా అమ్మాయి కోసం చెయ్యాలి!'

lovedoctorram@sakshi.com

## ఈ పాటకు ట్యూన్ తెలుసా?



కట్‌చేయ్...దాచేయ్...

**పల్లవి :**
నా చెలి రోజావే నాలో ఉన్నావే
నిన్నే తలిచేనే నేనే
కళ్ళల్లో నీవే కన్నీటా నీవే
కనుమూస్తే నీవే యదలో నిండేవే
కనిపించవో అందించవో తోడు
నా చెలి రోజావే నాలో ఉన్నావే
నిన్నే తలిచేనే నేనే

**చరణం 1:**
గాలి నన్ను తాకినా నిన్ను తాకు జ్ఞాపకం
గులాబీలు పూసినా చిలిపి నవ్వు జ్ఞాపకం
అలలు పొంగి పారితే
చెలియ పలుకు జ్ఞాపకం
మేఘమాల సాగితే మోహకథలు జ్ఞాపకం
మనసు లేకపోతే మనిషి ఎందుకంటా
నీవు లేకపోతే బతుకు దండగంటా
కనిపించవో అందించవో తోడు

నా చెలి రోజావే నాలో ఉన్నావే
నిన్నే తలిచేనే నేనే

**చరణం 2:**
చెలియ చెంత లేదులే చల్ల గాలి ఆగిపో
మమత దూరమాయనే చందమామ దాగిపో
కురుల సిరులు లేవులే పూల వనం వాడిపో
తోడు లేదు గగనమా చుక్క లాగ రాలిపో
మనసులోని మాట ఆలకించలేవా
విడిపోని నీడ నన్ను చేరనీవా
కనిపించవో అందించవో తోడు

నా చెలి రోజావే నాలో ఉన్నావే
నిన్నే తలిచేనే నేనే

**చిత్రం : రోజా**
**సంగీతం : ఏఆర్ రెహమాన్**
**గానం : ఎస్పీ బాలు, సుజాత**
**రచన: రాజశ్రీ**

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 4 | | 5 | | | | 6 | |
| 8 | | 9 | 1 | | | | | 3 |
| 7 | | | | | | 1 | 2 | |
| | | | | | 2 | 6 | | |
| 6 | 7 | 1 | 9 | 8 | 3 | 5 | 4 | 2 |
| | | 4 | 6 | | | | | |
| | 8 | 5 | | | | | | 1 |
| 2 | | | | | 5 | 4 | | 6 |
| | 9 | | | | 8 | | 3 | 5 |

**నిబంధనలు:**
ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 7 | 6 | 1 | 9 | 8 | 4 | 3 | 5 | 2 |
| 9 | 5 | 8 | 3 | 1 | 2 | 4 | 6 | 7 |
| 2 | 4 | 3 | 5 | 6 | 7 | 9 | 1 | 8 |
| 3 | 1 | 7 | 6 | 4 | 5 | 2 | 8 | 9 |
| 5 | 9 | 6 | 8 | 2 | 3 | 1 | 7 | 4 |
| 4 | 8 | 2 | 1 | 7 | 9 | 6 | 3 | 5 |
| 6 | 7 | 9 | 2 | 5 | 1 | 8 | 4 | 3 |
| 1 | 2 | 5 | 4 | 3 | 8 | 7 | 9 | 6 |
| 8 | 3 | 4 | 7 | 9 | 6 | 5 | 2 | 1 |


ప్రభాస్


ప్రభాస్, నీల్ నితిన్, శ్రద్ధ

# సాహోకు బై బై

రెండేళ్ల 'సాహో' ప్రయాణం పూర్తి కావస్తోంది. ఒక్కొక్కరుగా టీమ్‌కు బై బై చెబుతున్నారు. తాజాగా 'సాహో' చిత్రంలో విలన్‌గా నటించిన బాలీవుడ్ నటుడు నీల్ నితిన్ ముఖేష్ తన వంతు షూటింగ్ పూర్తి చేశారు. సుజిత్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'సాహో'. శ్రద్ధా కపూర్ కథానాయిక. యువీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్, విక్కీ నిర్మిస్తున్నారు. 300 కోట్ల భారీ వ్యయంతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో జాకీ ష్రాఫ్, అరుణ్ విజయ్, మురళీశర్మ, లాల్ కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు. ఇటీవల రిలీజ్ చేసిన 'సాహో' టీజర్‌కు దేశవ్యాప్తంగా అద్భుతమైన స్పందన లభిస్తోందని టీమ్ పేర్కొంది. 'సాహో' టీమ్‌కు నీల్ నితిన్ ముఖేష్ వీడ్కోలు పలుకుతూ– ''రెండేళ్లయింది ఈ అద్భుతమైన ప్రయాణం మొదలై. ఈ టీమ్‌తో వర్క్ చేయడం చాలా గర్వంగా ఉంది. టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్'' అన్నారు. ఈ సినిమా బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ బాధ్యతలను సంగీత దర్శకుడు జిబ్రాన్ తీసుకుంటున్నారని చిత్రబృందం తెలిపింది. ఈ ఏడాది ఆగస్ట్ 15న విడుదల కానున్న ఈ చిత్రానికి కెమెరా: మది.

# విజయ్‌కి జోడీ?


రకుల్

రకుల్ ప్రీత్‌సింగ్ వరుస సినిమాలు అంగీకరించడం లేదు. కానీ క్రమం తప్పకుండా క్రేజీ ప్రాజెక్ట్స్‌లో భాగం అవుతున్నారు. ప్రస్తుతం తెలుగులో నాగార్జునతో 'మన్మథుడు2'లో నటిస్తున్నారామె. తమిళంలో శివకార్తికేయన్‌తో ఓ సినిమా చేస్తున్నారు. హిందీలో 'మర్జావా' అనే చిత్రం చేస్తున్నారు. తాజాగా తమిళ స్టార్ హీరో విజయ్‌కి జోడీగా రకుల్ నటించనున్నారని తెలిసింది. తమిళ యంగ్ డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్‌తో విజయ్ ఓ సినిమా చేయబోతున్నారు. ఇందులో హీరోయిన్‌గా పలువురి పేర్లు వినిపించాయి. అయితే.. రకుల్‌ప్రీత్ అయితే బావుంటుందని చిత్రబృందం భావిస్తోందని కోలీవుడ్ సమాచారం. విజయ్‌తో నటిస్తే మాత్రం రకుల్ కోలీవుడ్‌లో టాప్ లీగ్‌లోకి ఎంటర్ అవడం ఖాయం అనే మాట వినిపిస్తోంది.

# వారికి ఆ అర్హత లేదు

''మంచి కంటెంట్ ఉన్న సినిమా చూడనప్పుడు రొటీన్ సినిమాలు ఎందుకు వస్తున్నాయని కామెంట్ చేసే అర్హత లేదని నా నమ్మకం. నాకు ఈ మూవీలో అవకాశం ఇచ్చిన మంజునాథ్‌గారికి థ్యాంక్స్. నన్ను సొంత కొడుకులా చూసుకున్నారు. ఆయనతో మళ్లీ మళ్లీ సినిమా చేయడానికి రెడీ'' అని చేతన్ అన్నారు. నరేశ్‌కుమార్ దర్శకత్వంలో చేతన్ మద్దినేని, కశిష్ ఓరా జంటగా తెరకెక్కిన చిత్రం 'ఫస్ట్ ర్యాంక్ రాజు'. 'విద్య 100%.. బుద్ధి 0%' అనేది ఉపశీర్షిక. మంజునాథ్ వి. కందుకూర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 21న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ– ''టైటిల్ లాగే సినిమా కూడా మంచి మార్కులు పొందాలి. టీమ్‌కి నా బెస్ట్ విషెష్'' అన్నారు. ''ఈ పాత్రకి చేతన్ తప్ప వేరెవరూ న్యాయం చేసేవారు కారు. చాలా పర్ఫెక్ట్‌గా ఫిట్ అయిపోయాడు. మంజునాథ్‌గారు, నరేష్‌గారు తెలుగులో కూడా మంచి సినిమాలు చేయాలని కోరుకుంటున్నా'' అన్నారు డైరెక్టర్ మారుతి. ''సినిమా పట్ల ఉన్న ప్యాషన్‌తోనే 'ఫస్ట్ ర్యాంక్ రాజు' చిత్రం చేశాను. ఒక మంచి సినిమాని తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తారనే ఈ సినిమా చేశాం'' అన్నారు నిర్మాత మంజునాథ్. ''లైఫ్‌లో విద్య మాత్రమే కాదు.. బుద్ధి కూడా ఉండాలి' అనే మెసేజ్‌తో ఈ సినిమా ఉంటుంది'' అన్నారు నరేశ్. ''నా కెరీర్‌లో చూసిన బెస్ట్ స్క్రిప్ట్ ఇది'' అన్నారు కాశీష్ ఓహ్రా.



చేతన్, కాశిష్, మంజునాథ్, నరేశ్‌కుమార్, అనిల్ రావిపూడి, మారుతి

# యూపీ యాసలో...


సన్నీ లియోన్

సినిమాల్లో కథానుగుణంగా, ప్రాంతానుగుణంగా హీరో హీరోయిన్లు ప్రవర్తిస్తుంటారు, ఆయా ప్రాంత యాసలో డైలాగులు కొడుతుంటారు. తాజాగా సన్నీ లియోన్ యూపీ యాసలో డైలాగులు చెప్పడానికి రెడీ అయ్యారు. తాజా చిత్రం 'కోకోకోలా'లో సన్నీ లియోన్ యూపీ మహిళగా కనిపిస్తారట. కొత్త యాస నేర్చుకోవడం గురించి సన్నీ మాట్లాడుతూ– ''కొత్త కొత్త విషయాలు నేర్చుకోవడం చాలా ఎగ్జైటింగ్‌గా ఉంటుంది. యాక్టర్‌గా నేనింకా ఎదగడానికి ఉపయోగపడుతుందనుకుంటున్నాను. సినిమాలో యూపీ యాస సరిగ్గా పలకడానికి చాలా కష్టపడుతున్నాను'' అని పేర్కొన్నారు సన్నీ.

# ఇండస్ట్రీలో నిర్మాతలది దైవస్థానం

– సప్తగిరి


సప్తగిరి,జి.ఎన్.రెడ్డి, అర్చన, అరుణ్ పవార్

''మా సినిమాకి తొలి రోజు మిక్స్‌డ్ టాక్ వచ్చింది. తర్వాత వెంటనే యావరేజ్ అన్నారు. చిన్నవాళ్లం.. అందరూ ఆశీర్వదించండి. మరిన్ని సినిమాలు చేసేలా ప్రోత్సహించండి'' అని సప్తగిరి అన్నారు. ఆయన హీరోగా, వైభవీజోషి కథానాయికగా నటించిన చిత్రం 'వజ్ర కవచధర గోవింద'. అర్చన కీలక పాత్రలో నటించారు. అరుణ్ పవార్ దర్శకత్వంలో నరేంద్ర, జి.ఎన్.రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలైంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సక్సెస్ మీట్‌లో సప్తగిరి మాట్లాడుతూ– ''మన బడ్జెట్‌ను, మన టార్గెట్‌ను రీచ్ అయ్యామని డిస్ట్రిబ్యూటర్ బ్రహ్మయ్యగారు చెప్పడంతో హ్యాపీ. పరిశ్రమలో నిర్మాతలది దైవస్థానం. మా నిర్మాతలు జి.ఎన్.రెడ్డి, నరేంద్రగారికి ధన్యవాదాలు. సెకండాఫ్‌లో 10 నిమిషాలు తగ్గిస్తున్నాం. ఇక 100 శాతం గ్రాండ్ సక్సెస్ అవుతుంది'' అన్నారు. ''ఈ సినిమా భారీ హిట్ అవ్వాలని మేం కోరుకోలేదు. కానీ మా శ్రమకు తగ్గ ప్రతిఫలం కావాలని మాత్రం కోరుకున్నాం.. అది దక్కినందుకు అందరం తృప్తిగా ఉన్నాం. సప్తగిరి లాంటి హీరోను నమ్ముకుంటే కచ్చితంగా 200 కుటుంబాలు బతుకుతాయి'' అన్నారు నిర్మాత నరేంద్ర. ''వజ్ర కవచధర గోవింద' సినిమాని 400 థియేటర్లలో విడుదల చేశాం. 2 రోజులకు రూ.90లక్షల గ్రాస్ వసూలు చేసింది'' అన్నారు బ్రహ్మయ్య. ''కాలేజ్, స్కూల్ ఓపెనింగ్ టైమ్‌లోనూ మా సినిమా ఇంత బాగా ఆడుతోంది. థియేటర్లలో జనాలు నవ్వుతుంటే ఆనందంగా ఉంది'' అని అరుణ్ పవార్ అన్నారు. ''ఈ సినిమాలో నల్లూరి ప్రసన్నలక్ష్మి అనే ఎమ్మెల్యేపాత్ర చేశాను'' అన్నారు అర్చన.

# ప్రేమికురాలు మోసం చేస్తే?


అక్షిత

''ప్రేమించిన అమ్మాయి మోసం చేస్తుంది. అందుకు కారణమైన వారిని తెలుసుకొని, వారిని మైండ్ రీడర్ ఎలా అంతం చేశాడు? అనే కథాంశంతో రూపొందిన చిత్రం 'స్పెషల్'. విలన్‌గా, సహనటుడిగా గుర్తింపు తెచ్చుకున్న అజయ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'స్పెషల్'. వాత్సవ్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా ఈ నెల 21 ప్రేక్షకుల ముందుకు రానుంది. వాస్తవ్ మాట్లాడుతూ– ''మైండ్ రీడర్ స్టోరీ ఇది. ఫెంటాస్టిక్ థ్రిల్లర్ నేపథ్యంలో ఉంటుంది. 'గజిని' టైప్ జోనర్ అయిన మా సినిమాలో లవ్, ఎమోషన్స్‌కి ప్రాధాన్యం ఇచ్చాం. ఇది చిన్న సినిమానేకానీ, మీరందరూ చూసిన తర్వాత పెద్ద సినిమాగా భావిస్తారు'' అన్నారు. ''చిన్నప్పటి నుంచి థ్రిల్లర్స్ అంటే ఇష్టం. ప్రస్తుతం తెలుగు ప్రేక్షకుల్లో మార్పువచ్చింది. హీరో, హీరోయిన్స్ కంటే కథకి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. తప్పకుండా మంచి హిట్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు హీరోయిన్ అక్షిత శ్రీనివాస్.

# ఆ టైటిల్ చూసి ఎవరొస్తారన్నారు?

**"డిటెక్టివ్ జానర్‌లో సినిమా చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నాను. తెలుగులో ఈ జానర్‌లో సినిమాలు ఈ మధ్య కాలంలో రాలేదు. దాంతో డిటెక్టివ్ థ్రిల్లర్ చేశాను" అని స్వరూప్ ఆర్.ఎస్.జె. అన్నారు. నవీన్ పొలిశెట్టి, శృతీశర్మ జంటగా స్వరూప్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఏజెంట్ సాయిశ్రీనివాస ఆత్రేయ'. నవీన్ యాదవ్ నక్కా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. ఈ సందర్భంగా స్వరూప్ పంచుకున్న విశేషాలు...**


స్వరూప్

- చిరంజీవిగారి 'చంటబ్బాయి' చిత్రం ఓ క్లాసిక్. డిటెక్టివ్ జానర్ కాబట్టి ఆ సినిమా ప్రభావం కొంచెం ఉంది. కానీ, చంటబ్బాయికి, మా ఆత్రేయకు ఎటువంటి సంబంధం లేదు. మా సినిమాలో ఓ ఆసక్తికరమైన అంశం ఉంది. అది సినిమా చూసే తెలుసుకోవాలి. ఒక్క కేసు కూడా తన దగ్గరకు రాని ఓ డిటెక్టివ్ ఓ పెద్ద కేస్ టేకప్ చేసి, ఎలా డీల్ చేశాడన్నది చిత్ర కథ. కథను కొంచెం రివీల్ చేసినా థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ మిస్ అవుతాయని చేయడం లేదు.
- ఈ కథ రాస్తున్నప్పుడే కొత్త హీరో అయితే బావుంటుంది అనుకున్నాను. ఆ సమయంలో నవీన్ యూట్యూబ్ వీడియోస్ కొన్ని చూశాను. తన టైమింగ్ బాగా నచ్చింది. సుమారు 7–8 నెలలు స్క్రిప్ట్‌పై కలిసి వర్క్ చేశాం. స్క్రిప్ట్‌లో తన హెల్ప్ చాలా ఉంది. స్క్రిప్ట్ కుదిరాకే నిర్మాతలను కలిశాము.
- హీరోహీరోయిన్ ఇద్దరూ బాగా చేశారు. మొదట మా సినిమాకు 'గూఢచారి' అని టైటిల్ పెట్టాలనుకున్నాం. అది అప్పటికే వచ్చేయడంతో టైటిల్ కొత్తగా, తెలుగులోనే ఉండాలని నిర్ణయించుకున్నాం. ఇలాంటి టైటిల్ పెడితే సినిమాకు ఎవరు వస్తారు? అని కూడా అన్నారు. అందుకే మా సినిమా టైటిల్ మీద మేమే ఫన్నీ వీడియోస్ చేశాం.
- ఈ సినిమా తర్వాత ఏం సినిమా చేయాలో ఇంకా అనుకోలేదు. కొన్ని ఆలోచనలు ఉన్నాయి. ఏ సినిమా చేసినా కామెడీ, థ్రిల్లర్ అంశాలు కచ్చితంగా ఉంటాయి. ఎందుకంటే అవే నా బలం.

# మళ్ళీ మళ్ళీ చూశా


అనురాగ్, విజయ్ ఆంటోనీ

అనురాగ్ కొణిదెన హీరోగా, శ్వేత అవస్తి, కైరవి తక్కర్ హీరోయిన్స్‌గా రూపొందిన చిత్రం 'మళ్ళీ మళ్ళీ చూశా'. హేమంత్ కార్తీక్ దర్శకత్వంలో క్రిషి క్రియేషన్స్ పతాకంపై కె. కోటేశ్వరరావు నిర్మించారు. శ్రవణ్ భరద్వాజ్ సంగీతం అందించిన ఈ సినిమాలోని 'ఈ క్షణమే...' లిరికల్ పాటని హీరో విజయ్ ఆంటోనీ విడుదల చేశారు. హేమంత్ కార్తీక్ మాట్లాడుతూ– ''మంచి కథతో వస్తున్న సినిమా ఇది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్నాయి. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి, త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాం'' అన్నారు. ''సినిమా చాలా బాగా వచ్చింది. జూలైలో ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. ఇప్పటికే విడుదలైన టీజర్, సాంగ్స్‌కి మంచి స్పందన వచ్చింది. ప్రేక్షకుల అంచనాలకు తగ్గకుండా మా సినిమా ఉంటుంది''అని కె. కోటేశ్వరరావు అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: కళ్యాణ్ సమి–సతీష్ ముత్యాల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : సాయి సతీష్ పాలకుర్తి.


రిషీ కపూర్

# తిరిగొస్తున్నా

ఆరోగ్య సమస్యలతో కొంతకాలంగా న్యూయార్క్‌లో ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నారు బాలీవుడ్ నటుడు రిషీ కపూర్. క్యాన్సర్ చికిత్స కోసమే వెళ్లారని సమాచారం. ఆ మధ్య దర్శకుడు రాహుల్ రవైల్ 'రిషీ కపూర్ క్యాన్సర్ నుంచి పూర్తిగా నయం అయ్యారు' అని పేర్కొన్నారు. తాజాగా రిషీ ఇండియా తిరిగి రావడానికి రెడీ అయ్యారని తెలిసింది. 'ఆగస్ట్ నెలాఖరుకల్లా నేను ఇండియా రావొచ్చు. డాక్టర్ ఏమంటారో చూడాలి. కోలుకుంటున్నాను, ఆరోగ్యంగా ఉన్నాను. తిరిగొచ్చేసరికల్లా 100శాతం ఫిట్‌గా ఉంటాను' అని పేర్కొన్నారు రిషీ. ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న కాలంలో ఆయన కుటుంబం, ఇండస్ట్రీ సభ్యులు ఎప్పటికప్పుడు ఆయన్ను న్యూయార్క్ వెళ్లి పలకరిస్తున్న సంగతి తెలిసిందే.


ధృవ్ విక్రమ్

# ఆదిత్య వర్మ రెడీ

'అర్జున్ రెడ్డి' తమిళ రీమేక్ పడాల్సిన ఇబ్బందులు పడింది. చూడాల్సిన చిక్కులు చూసేసింది. ఇక ఆడియన్స్ సినిమా చూడటమే తరువాయి. ఈ రీమేక్ ద్వారా విక్రమ్ కుమారుడు ధృవ్ విక్రమ్ హీరోగా పరిచయం అవుతున్నారు. తొలుత ఈ సినిమాని 'వర్మ' టైటిల్‌తో బాలా డైరెక్ట్ చేశారు. అవుట్‌పుట్ నచ్చలేదని నిర్మాణ సంస్థ మళ్లీ మొదటి నుంచి షూటింగ్ మొదలెట్టారు. ప్రస్తుతం వర్మ టైటిల్‌ను 'ఆదిత్య వర్మ'గా మార్చి గిరీశయ్య దర్శకత్వం వహిస్తున్నారు. ఒరిజినల్ 'అర్జున్ రెడ్డి' డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో గిరీశయ్య పని చేయడం విశేషం. ఇందులో బన్నితా సంధు, ప్రియా ఆనంద్ కథానాయికలు. ఈ చిత్రం ఫస్ట్ లుక్ రిలీజ్ అయింది. టీజర్ ఆదివారం రిలీజ్ అయింది. ఈ సినిమా షూటింగ్ పూర్తయిందట. రిలీజ్‌కు 'ఆదిత్య వర్మ' రెడీ అంటోంది చిత్రబృందం.

# అలా మాట్లాడటం తప్పు

బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్ రూటే సపరేటు. ఏ విషయాన్ని అయినా ఆమె ధైర్యంగా కుండ బద్దలు కొట్టినట్లు మాట్లాడుతుంటారు. ఒక్కోసారి ఆమె మాటలు వివాదంతో పాటు చర్చకు దారితీస్తుంటాయి. తాజాగా.. 'పదమూడేళ్ల క్రితం ఆదిత్య పంచోలీ మానసికంగా, లైంగికంగా నన్ను వేధించాడు' అంటూ కంగన రనౌత్ గతంలో షాకింగ్ కామెంట్స్ చేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై బాలీవుడ్ నటి, ఆదిత్య పంచోలీ భార్య జరీనా వాహబ్ స్పందించారు. ''నా భర్త గురించి నాకు బాగా తెలుసు. నాకంటే బాగా ఎవ్వరికీ తెలీదు. ఆయన ఏ తప్పూ చేయలేదు. ఏ విషయమైనా నా వద్ద రహస్యంగా ఉంచేవారు కాదు. గతంలో ఆదిత్య, కంగన మధ్య ఏం జరిగిందో నాకు తెలుసు. అయినా వివాహం అయిన వ్యక్తితో ఏళ్ల తరబడి డేటింగ్ చేసి, తీరా విడిపోయిన తర్వాత అత్యాచారం చేశాడని ఆరోపిస్తే ఎలా? అది చాలా తప్పు'' అంటూ మండిపడ్డారు. కాగా కంగన వ్యాఖ్యలపై ఆదిత్య పంచోలీ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే.


కంగనా రనౌత్

పరిచయం | ప్రమీలా బిసోయి, ఎంపీ

# దేవుడమ్మ



**దైవంతో మాట్లాడేందుకు మనిషికి..
మనిషితో మాట్లాడేందుకు దైవానికి..
భాషతో పనిలేదు!
పరిమా ఎంపీగా నిలబడినప్పుడు..
'హిందీ రాదు, ఇంగ్లిష్ రాదు.. పార్లమెంటులో నువ్వేం మాట్లాడతావు?' అని ప్రత్యర్థులు నిరుత్సాహపరిచినప్పుడు
తనకు తెలిసిన భాషలోనే మాట్లాడతానని ఆమె చెప్పారు.
ఆమెకు తెలిసిన భాష ఏదైనా..
ఆమెను దేవుడమ్మ అని పిలిచేవారికి అర్థమయ్యే భాషే.**

● ప్రమీలను చెరమరియా గ్రామస్థులు 'పరీమా' అని పిలుచుకుంటారు. పరీమా అంటే 'దేవుడమ్మ' అని అర్థం.

***ఒడిషా, గంజాం జిల్లా చెరమరియా గ్రామంలోని అప్పర్ ప్రైమరీ స్కూల్. గడచిన మార్చి నెలలో ఓ రోజు మధ్యాహ్నం. 'పరీమా' ఎప్పటిలాగే స్కూలు పిల్లల కోసం భోజనం వండి వారి కోసం ఎదురు చూస్తోంది. భోజనం గంట కొట్టగానే బిలబిల మంటూ వచ్చేస్తారు పిల్లలు. గంట చప్పుడు కోసం చెవులు రిక్కించుకుని గోడకు జేరగిల బడి కూర్చుని ఉందామె. బడి గంట మోగక ముందే పక్కనే కిటికీలో పెట్టిన సెల్‌ఫోన్ మోగింది. ఇప్పుడు ఫోన్ చేస్తున్నదెవరో అనుకుంటూ తీసింది పరీమా. అది సీఎం ఆఫీస్ నుంచి!!***

ఎవరు మాత్రం ఊహిస్తారు? ముఖ్యమంత్రి ఆఫీస్ నుంచి ఫోన్ వస్తుందని. సాధారణంగా ఆమెకు మండల అధికారుల నుంచి ఫోన్‌లు వస్తుంటాయి. 'ప్రభుత్వం స్వచ్ఛ భారత్ ప్రోగ్రామ్ పెట్టింది, ఊర్లో అందరి చేత టాయిలెట్‌లు కట్టించాలి, ఊరందరికీ నువ్వే చెప్పాలమ్మా' అని అడుగుతారు. 'టాయిలెట్‌లు ఎంతమంది కట్టించుకున్నారు, ఇంకా ఎంత మంది మిగిలి ఉన్నారు, అందరూ వాడుతున్నారా...' వంటి సమాచారం కోసం కూడా ఫోన్‌లు వస్తుంటాయి. 'వన సురక్ష్య సమితి పనులు ఎంత వరకు వచ్చాయి, మొక్కలన్నీ నాటారా, నాటిన మొక్కల్లో ఎన్ని మొక్కలు బతికాయి, పై అధికారులు తనిఖీ చేస్తామంటున్నారు, మీ ఊరికే తీసుకువస్తాం' అనీ ఫోన్ చేస్తుంటారు. అక్షరాస్యత కార్యక్రమం అయినా తనకే చెప్తారు. చంటి పిల్లలకు వ్యాక్సిన్‌లు వేయాలన్నా పిలుస్తారు. ఇంకా చెప్పాలంటే... 'ఊరికి నువ్వు చేసిన సేవకు గాను అవార్డు కోసం ప్రభుత్వానికి నీ పేరు పంపించాం, నీకు అవార్డు వచ్చింది' అనే ఫోన్ కాల్స్ కూడా అందుకుందామె. అయితే ఈ సారి ఏకంగా ముఖ్యమంత్రి ఆఫీస్ నుంచి ఫోన్! ''ముఖ్యమంత్రి మాట్లాడుతారు లైన్‌లో ఉండండి'' అన్నారెవరో. ఏమడుగుతాడాయన? ప్రభుత్వం ఏ స్కీమ్ పెట్టినా దానిని ఊరంతా ఆచరించే వరకు వెంటపడి మరీ పని చేయిస్తూనే ఉంది తను. 'మిషన్ శక్తి' ప్రోగ్రామ్‌లో ఆస్కా లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఏడు వందల సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు ఏర్పాటు చేయించింది తాను. ఈ రోజు రాష్ట్రంలో డెబ్బై లక్షల మంది మహిళలు మిషన్ శక్తిలో చేరడం వెనుక తన శ్రమ పెద్ద వాళ్లందరికీ తెలుసు. ఎక్కడైనా స్వయం సహాయక బృందాలు బలహీనంగా ఉన్నాయోమో మరి! ఒక సారి ఆ ఊళ్లకు వెళ్లి ఆడవాళ్లతో మాట్లాడమని చెప్పడానికి ఫోన్ చేశారా! అయినా ఆ మాట చెప్పడానికి అధికారులెంతోమంది ఉన్నారుగా? ముఖ్యమంత్రే ఫోన్ చేయడమేంటి?' ఆ నిమిషంలో ఆమె మెదడు ఇవన్నీ ఆలోచించింది. సీఎం లైన్‌లోకి వచ్చారు. ఫోన్‌లో నమస్కారం చెప్పి 'ఎందుకు ఫోన్ చేసిందీ ఆయనే చెబుతారు కదా! అంత పెద్ద హోదాలో ఉన్నాయన్ని ఎందుకు చేశారని అడగడం ఏమిటి' అనుకుంటూ... ఓ క్షణం ఆగిందామె. ''మీరు ఈ ఎన్నికల్లో లోక్‌సభకు పోటీ చేయాలమ్మా. చేస్తారు కదా'' అన్నారాయన. 'మన వాళ్లు పోటీ చేస్తున్నారు ప్రచారంలో వాళ్లకు అండగా ఉండండి... అని చెబుతున్నారేమో.. తానే పొరపాటుగా అర్థం చేసుకున్నట్లుంది' అనుకుంది పరీమా. ఆయన అవతలి నుంచి అంతే సౌమ్యంగా మళ్లీ అడిగారు ''మీలాంటి వాళ్లు రాజకీయాల్లో ఉండాలి. మన 'ఆస్కా' పార్లమెంట్ నియోజకవర్గం నుంచి మీరు పోటీ చేస్తే బావుంటుంది. పోటీ చేస్తారు కదమ్మా'' అన్నారు నవీన్ పట్నాయక్.

## ప్రత్యర్థులకు షాక్

సంబల్‌పురి చేనేత చీర కట్టుకుని కొంగు తల మీద కప్పుకుని, ముక్కుకు రెండు పెద్ద పుడకలు, నుదుట బొట్టు, పాపిడిలో సిందూరంతో మెరిసి పోతూ ఉండే ప్రమీలా బిసోయి (పరీమా) మార్చి 25వ తేదీన గంజాంలోని కలెక్టరేట్‌లో ప్రత్యక్షమైంది. స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థులు, బిజూ జనతాదళ్ సీనియర్ నాయకులు ఆమె వెంట ఉన్నారు. ప్రశ్నార్థకంగా చూసిన ఇతర పార్టీ వాళ్లలో చిన్న సందేహం. కొద్దిసేపటికి ఆమె కలెక్టర్ ఆఫీసులో నామినేషన్ ఫైల్ చేసి కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న మీడియా పాయింట్ వచ్చి మాట్లాడింది. 'ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తనకు ఇంత గొప్ప అవకాశం ఇచ్చినందుకు ఆయనకు కృతజ్ఞతలు' కూడా

### వందల పురుళ్లు పోసిన తల్లి

పరీమాకు ఐదేళ్లకే పెళ్లయింది. గ్రామాల్లో వైద్య సదుపాయం లేని రోజుల్లో ప్రసవాలు మంత్రసాని చేతుల మీద జరిగేవి. ప్రమీలమ్మ పరీమాగా గౌరవాలందుకోవడానికి ప్రధాన కారణం అదే. ఆమె మంత్రసానిగా చెరమరియా గ్రామంలో వందలాది పురుళ్లు పోసింది. హాస్పిటల్ సౌకర్యం వచ్చిన తర్వాత కూడా గర్భిణికి నొప్పులు మొదలైనప్పటి నుంచి బిడ్డ పుట్టే వరకు పక్కన పరీమా ఉండాల్సిందే. డాక్టర్ డెలివరీ చేస్తున్నా సరే, పరీమా చేతి చలువ ఉండాలని కోరుకుంటారు. ఆమె చేతి మీదుగా తల్లీబిడ్డలు లక్షణంగా ఇంటికి చేరుతారనే సెంటిమెంట్ ఊరి వాళ్లది. డెలివరీ తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సలహాల కోసం కూడా ఆమెనే సంప్రదిస్తుంటారు.



ఒడిషా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను ఆశీర్వదిస్తున్న పరీమా

తెలియచేసిందామె. సందేహం లేదు... ఆమె బిజూ జనతాదళ్ తరపున ఆస్కా పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బరిలో దిగింది... ప్రత్యర్థులకు క్లియర్ పిక్చర్ వచ్చేసింది. పిక్చరైతే వచ్చింది కానీ వాళ్లు షాక్ నుంచి తేరుకోవడానికి చాలా సమయమే పట్టింది. వాళ్లకది ఏ మాత్రం ఊహించని పరిణామం. ఆమె సెల్ఫ్‌హెల్ప్ గ్రూపు కార్యకలాపాల్లో చురుగ్గా ఉంటుంది ఓకే. కానీ ఐదో తరగతి కూడా చదవని ఒక గ్రామీణ మహిళ, పొలంలో పనులు చేసుకునే మహిళ, బడిలో పిల్లలకు అన్నం వండి పెట్టే ఓ డెబ్బై ఏళ్ల వృద్ధురాలిని ఏకంగా పార్లమెంట్ బరిలో దింపడం ఏమిటి? అని తర్జన భర్జన పడ్డారు. పట్నాయక్ వ్యూహం ఏమిటి అని కూడా అనుకున్నారు. కానీ పట్నాయక్ మాత్రం... ''2001లో నేను మహిళల కోసం ప్రారంభించిన 'మిషన్ శక్తి' పథకాన్ని లక్షలాది మంది మహిళలు అక్కున చేర్చుకున్నారు. పరీమాకు టిక్కెట్ ఇచ్చి గెలిపించుకోవడం ద్వారా మిషన్ శక్తిని సమర్థంగా నడిపించిన మహిళలందరికీ కృతజ్ఞతాపూర్వకమైన గౌరవ వందనాలు సమర్పించాలనుకుంటున్నాను. ఇరవై ఏళ్ల కిందట నేను నా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ఆస్కా నియోజకవర్గం నుంచి పరీమాకు అవకాశం కల్పిస్తున్నాను. నేటికింకా పార్లమెంట్‌లో మహిళా బిల్లు చట్టరూపం సంతరించుకోనే లేదు. మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించడం ఇంకా జరగలేదు. అయితే మహిళా సాధికారతలో భాగంగా నా రాష్ట్రం నుంచి నా వంతు బాధ్యతగా మూడవ వంతు సీట్లను మహిళలకు కేటాయిస్తున్నాను'' అన్నారు.

## ఆమె ఎందుకు ప్రత్యేకం?

ఆస్కా పార్లమెంట్ నియోజకవర్గంలో లక్షలాది మంది మహిళలుంటే వారిలో పరీమానే ఎందుకు ఎంచుకున్నారంటే... పరీమా కాలంతోపాటు ఎప్పటికప్పుడు తాను చైతన్యవంతమవుతోంది, తన ఊరి వారిని చైతన్యపరుస్తోంది. బహిరంగ మల విసర్జనను స్వచ్ఛందంగా నిషేధించేటట్లు ఊరంతటికీ చైతన్యవంతం చేసింది. ఊరిలో అందరూ టాయిలెట్‌లు కట్టుకునే వరకు వెంటపడింది, కట్టుకోవడమే కాక, వాటిని వాడేటట్లు చూసింది. గ్రామంలో పరిశుభ్రమైన నీటికోసం ప్రభుత్వంతో పోరాడింది. ప్రసవం సమయంలో మహిళల ఆరోగ్య రక్షణ పథకాలు చక్కగా అమలయ్యేలా చూసింది. పర్యావరణ పరిరక్షణ కోసం కూడా ఉద్యమించింది. వన సురక్ష్య సమితి, పీకాక్ ప్రొటెక్షన్ సమితిలో ఆమె క్రియాశీలకమైన సభ్యురాలు. పక్కిడి కొండ మీద నెమళ్లను కాపాడే బాధ్యత తీసుకుని పీకాక్ ప్రొటెక్షన్ ఉద్యమంలో గ్రామాన్ని నడిపించిన శక్తి ఆమె. అంతటి విశేషమైన సేవలకు గాను ప్రకృతి మిత్ర, ప్రకృతి బంధు అవార్డులను అందుకున్న ఘనత పరీమాది. చదివింది మూడో తరగతే కానీ ఒరియా సాహిత్యం పఠించే అలవాటు ఉందామెకి. ఆ అలవాటే ఆమెను మంచి వక్తగా మార్చింది. మహిళకు సాధికారత ఎంత అవసరమో తెలియచెప్పే పాటలు సొంతంగా రాసుకుని పాడేవారామె. ''ఒక మంచి సంగతిని పది మందికి పదిసార్లు చెప్పడం కంటే ఒకసారి పాట పాడి వినిపిస్తే వినే వాళ్ల మనసులను సులువుగా తాకుతుంది. అందుకే నేను గొప్ప గాయనిని కాకపోయినా విషయాన్ని పాటగా పాడుతుంటాను'' అని నవ్విందామె.

## సీఎంతో గగనయానం

రాజకీయాల్లోకి రాకముందు వరకు ఆమె అందరి మనిషి. ఆమెకు శత్రువులు లేరు. అయితే రాజకీయాల్లోకి అడుగు పెట్టిన తర్వాత అనివార్యంగా ప్రత్యర్థులు తయారవుతారు. వారిని శత్రువులు అనకూడదు. కానీ ప్రత్యర్థుల రాజకీయ దాడి తీవ్రత చూస్తే వారి మధ్య గతంలో ఏదో శత్రుత్వం ఉందేమో అనిపిస్తుంది. పరీమాకు కూడా రాజకీయ దాడులు తప్పలేదు. దేవుడమ్మగా ప్రేమించే మనుషుల మధ్య నుంచే చురకలు వచ్చి పడ్డాయి. వాటికి స్పందిస్తూ ''వాళ్లకు తోచినట్లు మాట్లాడనివ్వండి. నేను తల్లిని. అనే వాళ్లలో చాలామంది నేను పురుడు పోసిన వాళ్లే. ఎవరి మీద కోపం పెట్టుకోలేను. చేతనైంత మంచి చేయడమే నాకు తెలిసింది. గెలుపోటముల మీద నాకు పట్టింపు లేదు. ముఖ్యమంత్రి ఒక సాధారణ మహిళకు ఇంత గొప్ప అవకాశాన్ని ఇవ్వడమే మిక్కిలి సంతోషం'' అని వాతావరణాన్ని తేలిక పరిచిందా అమ్మ. పరీమా ఇటీవలి ఎన్నికల ప్రచారంలో ఒడిషా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో కలిసి హెలికాప్టర్‌లో ప్రయాణించింది. ఆమె గాల్లో ప్రయాణించడం అదే తొలిసారి. ఆ ప్రయాణం ఆమెను రెండు లక్షలకు పైగా ఓట్ల మెజారిటీతో గెలిపించి ఒడిషా నుంచి ఢిల్లీకి చేర్చింది. ''ఇప్పటి వరకు నాది చిన్న కుటుంబం. ఈ విజయంతో నా కుటుంబం పెద్దదైంది. నా కుటుంబం మీద పెట్టినంత శ్రద్ధ నా నియోజకవర్గ మీద పెడతాను'' అనడం ఆస్కా వాసులను ఆనందంలో ముంచెత్తింది.

### సగటు కుటుంబం

ప్రమీలా బిసోయి భర్త బంఛనిధి బిసోయి. లిఫ్ట్ ఇరిగేషన్ కార్పొరేషన్‌లో ఉద్యోగం చేసి రిటైర్ అయ్యాడాయన. ప్రస్తుతం తొంభై సెంట్ల పొలంలో వరి, రాగి పంటలు పండిస్తుంటాడు. పెద్ద కొడుకు దిలీప్... చెరమరియా గ్రామంలో టీ స్టాల్ నడుపుతున్నాడు. చిన్న కొడుకు రంజన్ బైక్ రిపేర్ చేసే గ్యారేజ్ నడుపుతున్నాడు. ఇద్దరు కూతుళ్లు రును, సులత. వాళ్లు పెళ్లి చేసుకుని అత్తగారిళ్లలో ఉన్నారు. ఈ కుటుంబం అంతా పని చేసినా నెలకు వచ్చేది పది నుంచి పన్నెండు వేల రూపాయలు మాత్రమే. తాము అత్యాశకు, ఆడండరాలకు పోకుండా నిరాడంబరంగా జీవించే సాధారణ మనుషులమని, తమ జీవికకు ఈ రాబడి చాలంటోంది పరీమా.



● భర్త బంఛనిధి బిసోయితో...

## నాయకత్వ లక్షణాలు

పరీమా అనేక సామాజిక కార్యక్రమాల నిర్వహణ ద్వారా నాయకత్వాన్ని ఎప్పుడో నిరూపించుకుంది. ఇతరులకు సహాయం చేసే గుణం ఆమెలో మెండుగా ఉందని చెబుతారు స్థానికులు. ప్రభుత్వ పథకాలను నిరక్షరాస్యులైన గ్రామీణులకు చేరవేస్తుంది. సారా నిషేధంతోపాటు ఆర్గానిక్ ఫార్మింగ్ పట్ల రైతులకు అవగాహన కల్పించడంలోనూ చురుగ్గా ఉంటుంది. ఆమె ఎంపీగా పార్లమెంట్‌లో ఒడిషాకు చెందిన మిషన్ శక్తి మహిళా సంఘాల ఉద్యమాన్ని ప్రతిబింబింపచేయాలని, మిగిలిన రాష్ట్రాల వారిని ప్రభావితం చేయగలుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు రాష్ట్ర సీఎం. ఎన్నికలు పూర్తయి ఆమె గెలిచిన తర్వాత కూడా ఆమెకు విమర్శల తాకిడి ఆగలేదు. 'ఆమెకు హిందీ రాదు, ఇంగ్లిష్ రాదు... పార్లమెంట్‌లో ఏం మాట్లాడుతుంది?' అనే విమర్శను ''ఒడియా భాషలో మాట్లాడతాను. నా మాతృభాషను పార్లమెంట్‌లో వినిపిస్తాను'' అని సమర్థంగా తిప్పి కొట్టిన ధీర పరీమా. ఎంపీగా తన తొలి ప్రాధాన్యత తిత్లి సైక్లోన్ బాధితులకు పునరావాసం కల్పించడమే అన్నది. అలాగే బరంపురం – నయాగర్ రైల్వే లైన్ ఆస్కా మీదుగా వెళ్తే ఆస్కా ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. కాబట్టి రైల్వే లైన్ కోసం పార్లమెంట్‌లో మాట్లాడి సాధిస్తాను'' అంటోంది పరీమా.

– వాకా మంజులారెడ్డి
(ఒడిషా రాజధాని భువనేశ్వర్‌లోని సామాజిక కార్యకర్త బిరూపాక్ష నందాతో కలిసి)

పరి | పరిశోధన

## వ్యాయామానికీ ఓ లెక్క ఉంది!



బిజిబిజీ జీవితాలలో కొంతమంది వేళపాళా లేకుండా వ్యాయామం చేస్తుంటారు. కానీ.. వ్యాయామం ద్వారా శరీరానికి మేలు జరగాలంటే ఏ సమయంలో చేస్తున్నామో కూడా ముఖ్యమే అంటున్నారు కోపెన్‌హెగన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. ఎలుకలపై తాము జరిపిన ప్రయోగాల్లో వ్యాయామం చేసే సమయాన్ని బట్టి ప్రయోజనాలు మారుతున్నట్లు స్పష్టమైందని చెప్పారు. ఉదయం వేళ చేస్తే.. అస్థిపంజర కండరాల్లో జీవక్రియల తీరు మారిందని, సాయంత్రం వేళల్లో చేసిన వ్యాయామం ఎక్కువ కాలంపాటు శరీరంలోని శక్తి ఖర్చు అయ్యేలా చేస్తుందని ఈ ప్రయోగాల్లో పాల్గొన్న శాస్త్రవేత్త జోనాస్ థుట్రీబాక్ తెలిపారు. మన శరీర గడియారానికి అనుగుణంగా చేసే వ్యాయామం ఎక్కువ మేలు చేస్తుందన్నది ఈ ప్రయోగాల సారాంశమని ఆయన వివరించారు. ఉదయం వేళ వ్యాయామం చేసినప్పుడు కండర కణాల్లోని జన్యువులు చైతన్యవంతమవుతాయని.. ఫలితంగా చక్కెరలు, కొవ్వులు ఎక్కువగా జీర్ణమవుతాయని తెలిపారు. ఊబకాయంతో ఉన్నవారు, లేదా టైప్ –2 మధుమేహంతో బాధపడేవారు ఉదయాన్నే వ్యాయామం చేయడం వల్ల ఎక్కువ ఫలితం ఉంటుందని చెప్పారు. అదే సమయంలో సాయంత్రం పూట చేసే వ్యాయామం శరీరంలోని శక్తిని ఎక్కువ సమయం పాటు ఖర్చయ్యేలా చేస్తుంది కాబట్టి దీనివల్ల కూడా మేలు జరుగుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో ఏ సమయం మెరుగైందన్న అంశంపై ఒక నిర్ణయానికి రాలేకపోతున్నామని చెప్పారు.

******

## పత్తి వ్యర్థాలతో బయో ప్లాస్టిక్!



జిన్నింగ్ తరువాత పత్తి విత్తనాల చుట్టూ ఉండే పోగులతో బయో ప్లాస్టిక్‌ను తయారు చేసే పద్ధతిని ఆవిష్కరించారు డైకిన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. ఆస్ట్రేలియాలోని ఈ యూనివర్సిటీ శాస్త్రవేత్తల పరిశోధన పుణ్యమా అని ప్రపంచవ్యాప్తంగా వృథా అవుతున్న దాదాపు కోటి టన్నుల వ్యర్థాలకు సరికొత్త అర్థం లభించే అవకాశమేర్పడింది. పత్తి రైతులకు అదనపు ఆదాయ వనరుగా ఉపయోగపడటంతోపాటు.. పర్యావరణ నష్టాలకు కారణమవుతున్న ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయం లభించడం ఈ పరిశోధన తాలూకూ ముఖ్యాంశం. కాటన్ లింట్‌గా పిలిచే ఈ వ్యర్థాల్లోని పోగులను వేరు చేసేందుకు చౌకైన, కాలుష్యరహిత రసాయనాలను వాడామని, విత్తనాలు, పత్తికాయల మొదళ్లను కూడా ఈ పద్ధతిలో ఉపయోగించుకోవచ్చునని ఈ పరిశోధనలకు నేతృత్వం వహించిన శాస్త్రవేత్త డాక్టర్ రచనా రమాదేవి అంటున్నారు. కొత్తగా ఉత్పత్తి అయిన ప్లాస్టిక్ సహజసిద్ధంగా నశించిపోయే గుణమున్నదని... పలుచటి పొరలా తయారు చేస్తే పొలాల్లోనే మల్చింగ్ వంటి వేర్వేరు అవసరాలకు వాడుకోవచ్చునని తెలిపారు. తయారీకి అయ్యే ఖర్చు చాలా తక్కువగా ఉండటం మరో ప్రయోజనం. పత్తితోపాటు ఇతర సేంద్రీయ వ్యర్థాలతోనూ ఈ రకమైన బయోప్లాస్టిక్‌ను తయారు చేసేందుకు తాము ప్రస్తుతం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. సింగపూర్‌లోని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ కూడా ఇటీవలే పత్తి వ్యర్థాలను ఏరోజెల్‌గా మార్చేందుకు ఓ వినూత్న పద్ధతిని ఆవిష్కరించిన విషయం ఇక్కడ ప్రస్తావనార్హం.

● రిస్క్ తెలుసుకోండి

# తండ్రుల స్మోకింగ్‌తో పిల్లల్లో క్యాన్సర్ ముప్పు



తండ్రులు హాయిగా పొగతాగేస్తారు. కానీ దాని వల్ల తమ పిల్లల ఆరోగ్యాన్ని చేతులారా తామే నష్టం చేస్తున్నామని ఎంతమంది తండ్రులకు తెలుసు. తమ వ్యసనం కోసం, తమ సరదా కోసం సొంత పిల్లల ప్రాణాలను పణంగా పెడుతున్నారని తండ్రులు గ్రహిస్తే మేలు. ఇటీవల కొంతకాలం కిందట బ్రాడ్‌ఫోర్ట్ యూనివర్సిటీ నిర్వహించిన అధ్యయనంలో తల్లిదండ్రుల్లో పొగతాగే అలవాటు ఉంటే పిల్లలకు క్యాన్సర్లు... అందునా ప్రధానంగా ల్యుకేమియా వచ్చే అవకాశం ఎక్కువని తేలింది.

తమ పొగతాగే అలవాటు కారణంగా తండ్రులు తమ పిల్లలకు దెబ్బతిన్న (డ్యామేజ్‌డ్) డీఎన్‌ఏ ను సంక్రమింపజేస్తున్నారని, దాంతో తండ్రి తప్పిదం వల్ల పిల్లలు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తోందని ఆ అధ్యయనం చెబుతోంది. దీనికి కారణాన్ని కూడా శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు.

పేరెంట్స్ తమ జన్యువులను పిల్లలకు అందిస్తారన్నది తెలిసిందే. పురుషుల వీర్యకణాల్లోని డీఎన్‌ఏ... పొగవల్ల తీవ్రంగా దెబ్బతింటుంది. దాంతో లోపభూయిష్టమైన ఆ డీఎన్‌ఏ కారణంగా పిల్లల్లో క్యాన్సర్ వచ్చే అవకాశాలు బాగా పెరిగిపోతాయి.

అయితే ఆందోళన చెందనక్కర్లేదు. ఈ ముప్పును తప్పించుకునే అవకాశం కూడా ఉంది. దంపతులు గర్భధారణకు ప్లాన్ చేసుకున్న సమయం కంటే...కనీసం మూడు నెలల ముందే పొగతాగే అలవాటు మానేస్తే ఆరోగ్యకరమైన పిల్లలు పుట్టే అవకాశం ఉందని చెబుతున్నారు ఈ పరిశోధనల్లో పాలుపంచుకున్న డాక్టర్ డయానా యాండర్సన్. ఒక వీర్యకణం ఉద్భవించాక అది పూర్తిస్థాయిలో పరిణతి చెందేందుకు కనీసం మూడు నెలల సమయం అవసరం. అందుకే కనీసం మూణ్ణెల్ల పాటు పొగతాగే అలవాటుకు దూరంగా ఉంటే డీఎన్‌ఏ దెబ్బతిన్న వీర్యకణాల స్థానంలో ఆరోగ్యకణాలు వస్తాయి కాబట్టి పిల్లల్లో క్యాన్సర్ అభివృద్ధి చెందే అవకాశాలు గణనీయంగా తగ్గిపోతాయంటున్నారామె. తాము కన్న సంతానం పూర్తిగా ఆరోగ్యంగా ఉండటానికి... పొగతాగకుండా ఉండాల్సిన అవసరాన్ని ఈ అధ్యయనం నొక్కి చెబుతోంది. తండ్రులూ ఆలోచించండి. మీ సంతానం ఆరోగ్యకరంగా ఉండాలా వద్దా అన్నది మీరే నిర్ణయించుకోండి.

కార్డియాలజి కౌన్సెలింగ్

## అయోర్టా సమస్యకు సర్జరీ లేకుండానే చికిత్స సాధ్యమేనా?

**మా అమ్మ వయసు 69 ఏళ్లు. ఏడాది కిందటి వరకూ ఆరోగ్యపరంగా ఆమెకు ఏ ఇబ్బందీ లేదు. కానీ... కొన్ని నెలలుగా రోజువారీ పనులు చేసుకోడానికి ఇబ్బంది పడుతోంది. తరచూ గుండెదడ, ఆయాసంతో బాధపడుతోంది. చాలా నీరసంగా కూడా ఉంటోంది. తొందరగా అలసిపోతోంది. ఒక్కోసారి ఛాతీలో నొప్పి. ఊపిరి ఆడటం లేదంటూ ఆందోళన చెందుతోంది. జనరల్ ఫిజీషియన్‌కు చూపించాం. ఆయన కొద్దిరోజులు మందులు ఇచ్చినా తగ్గకపోవడంతో గుండెవైద్యనిపుణుడికి చూపించమన్నారు. ఆయనకు చూపిస్తే ఈజీసీ, 2–డి ఎకో, రక్తపరీక్షలు మొదలైనవి చేసి గుండె కవాటంలో ఇబ్బంది అని చెప్పారు. బృహద్ధమని క్షీణించిందనీ, తొందరగా హైదరాబాద్‌లో పెద్దాసుపత్రికి తీసుకెళ్లి కవాట మార్పిడి చేయించుకొమ్మని చెప్పారు. సర్జరీగానీ లేదా ఏదో కొత్త విధానం వచ్చిందని అదిగానీ చేయించుకొమ్మని చెబుతున్నారు. లేదంటే చాలా ప్రమాదమని అంటున్నారు. మా అమ్మకు 20 ఏళ్లుగా బీపీ, షుగర్ కూడా ఉన్నాయి. అసలు ఈ సమస్య ఏమిటి? సుమారు 70 ఏళ్ల వయసులో మహిళకు సర్జరీ ప్రమాదం కాదా? ఈ కొత్త విధానం ఏమిటి? చాలా ఆందోళనగా ఉన్నాము. దయచేసి వివరంగా తెలియజేయండి.**

**– పి. సుధాకర్ యాదవ్, కరీంనగర్**

మన శరీరంలో గుండె చాలా ప్రధాన అవయవం. ఇది పూర్తిగా కండరాలతో నిర్మితమై ఉండి, నిరంతరాయంగా మనిషి జీవించినంతకాలం గుండె పనిచేస్తూనే ఉంటుంది. మన జీవితకాలంలో గుండె మొత్తం మీద 8 లక్షలకు పైగా లీటర్ల రక్తాన్ని శరీరంలోని అన్ని ప్రధాన భాగాలకు పంప్ చేస్తుంది. గుండె నుంచి అవయవాలన్నింటికీ రక్తాన్ని చేర్చే ప్రధాన బాధ్యతను శరీరంలో అతి పెద్దదైన బృహద్ధమని (అయోర్టా) నిర్వహిస్తుంటుంది. ఈ దృఢమైన, శక్తిమంతమైన భారీ ధమని అసాధారణమైన పని ఒత్తిడిని తట్టుకొని గుండె నుంచి శుద్ధ రక్తాన్ని తలపై భాగం మొదలుకొని, అరికాళ్ల వరకూ ప్రతి భాగానికీ చేరేలా చూస్తుంది. ఈ అయోర్టా వాల్వ్‌తో పాటు గుండెలో



నాలుగు కవాటాలు (వాల్వ్స్) ఉంటాయి. రక్తప్రసరణ వ్యవస్థలో ఇవి చాలా కీలకం. మానవ జీవిత మనుగడకు గుండె పనిచేయడానికి ఇవి చాలా ప్రధానం. దీర్ఘకాలికంగా బీపీ, షుగర్ వంటి వ్యాధిగ్రస్తుల్లోనూ, వయసుతో పాటు వచ్చే మార్పుల వల్ల, రుమాటిక్ ఫీవర్లు, ఇతర ఇన్ఫెక్షన్లు, పుట్టుకతో వచ్చే కొన్ని లోపాల వల్ల గుండె కవాటాల్లో సమస్యలు వస్తాయి.

మీకు మీ గుండెవైద్యనిపుణులు నిర్ధారణ చేసిన సమస్య తర్వాత చాలా జాగ్రత్తగా ఉండాలి. కొంత కాలం పాటు మందులతో నియంత్రణ చేసినప్పటికీ గుండెలోకి 'ఇంటర్వెన్షన్' చికిత్స తప్పనిసరి. అశ్రద్ధ చేస్తే గుండె ఫెయిల్యూర్‌కు, ఆ తర్వాత హార్ట్‌ఎటాక్‌కూ... మరణానికి సైతం దారితీసే ప్రమాదం ఉంది. ఈ కవాటం సమస్యలతో బాధపడే మీ అమ్మగారి లాంటి పేషెంట్లకు 'కవాట మార్పిడి' చికిత్సే శాశ్వత పరిష్కారం. ఈ కవాటం మార్చాల్సివచ్చినప్పుడు దాన్ని రీప్లేస్ చేయడానికీ, కొన్ని సందర్భాల్లో వాల్వ్ రిపేర్ చేయవలసి వచ్చినా కూడా గుండెను పూర్తిగా తెరచి నిర్వహించాల్సిన 'ఓపెన్ హార్ట్ సర్జరీ'ని తప్పనిసరిగా చేయాల్సి వచ్చేది. అయితే 60 ఏళ్లు పైబడిన వారికి ఈ సర్జరీలో రిస్క్ శాతం ఎక్కువ. పైగా మీ అమ్మగారి లాంటి వాళ్లకు బీపీ, షుగర్ దీర్ఘకాలంగా ఉంటే ఆ రిస్క్ పాళ్లు మరింత ఎక్కువ. అందుకే ఇలాంటివాళ్లకు ఇప్పుడు సర్జరీ అవసరం లేకుండానే చేసే కొత్త 'ఇంటర్వెన్షనల్' ప్రక్రియ అయన అత్యాధునిక కార్డియాలజీ వైద్యప్రక్రియ అందుబాటులోకి వచ్చింది. దీన్ని ట్రాన్స్ కాథెటర్ అయోర్టిక్ వాల్వ్ ఇంప్లాంటేషన్ (టావీ) లేదా ట్రాన్స్ కాథెటర్ ఆయోర్టిక్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ (టావర్) అని అంటారు.

ఈ ప్రక్రియలో సర్జరీ అవసరం లేకుండా తొడ, ఛాతీ దగ్గర కేవలం చిన్న గాట్లు పెట్టి ధమనిలోకి కాథటర్ ప్రవేశపెట్టడం ద్వారా వాల్వ్‌ను (కవాటాన్ని) మరమ్మతు చేస్తారు. కవాటాన్ని తొలగించకుండా రిపేర్‌గానీ లేదా రీప్లేస్ గానీ చేస్తారు. ఇది చాలా సురక్షితమైన, చాలా ప్రభావవంతమైన చికిత్స ప్రక్రియ. దెబ్బతిన్న పాత వాల్వ్‌ను తొలగించకుండానే చేసే ఈ చికిత్స ప్రక్రియ... శస్త్రచికిత్సకు మంచి ప్రత్యామ్నాయం. ఈ ప్రక్రియ ద్వారా కొత్త వాల్వ్‌ను అమర్చిన తర్వాత వాల్వ్ కణజాలాన్ని, రక్తప్రసరణను నియంత్రించడం జరుగుతుంది. తద్వారా పేషెంట్ ఆరోగ్యపరిస్థితిని మెరుగుపరుస్తూ పూర్తిగా కోలుకునేలా మందులు ఇస్తారు. ఇది ఒకరకంగా స్టెంట్ వేయించుకోవడం లాంటిదే అని చెప్పవచ్చు. డబ్బయి ఏళ్లు పైబడి, శస్త్రచికిత్సకు అనువుగా లేని మీ అమ్మగారి లాంటి వాళ్లకు ఇది పూర్తిగా సురక్షితం. చికిత్స తర్వాత వాళ్ల జీవననాణ్యత కూడా పెరుగుతుంది. కాబట్టి మీరు ఎలాంటి ఆందోళన లేకుండా అమ్మగారికి ఈ కొత్త ప్రక్రియ ద్వారా చికిత్స చేయించవచ్చు.

## గుండె దడతో చాలా ఆందోళన!

**నా వయసు 57 ఏళ్లు. ఒక్కోసారి నా గుండె చాలా స్పీడ్‌గా కొట్టుకున్నట్లు అనిపిస్తోంది. అది ఫాస్ట్‌గా దడదడలాడటం నాకు తెలుస్తోంది. ఆ సమయంలో నాకు కళ్లు తిరిగినట్లుగా ఉంటుంది. విపరీతమైన ఆయాసం, బాగా నీరసంగా ఉంటోంది. నాకు బీపీ కూడా ఉంది. నా బీపీ డౌన్ అవ్వడం వల్ల ఇలా జరుగుతోందా లేక ఇంకేమైనా కారణాలు ఉన్నాయా? దయచేసి నా సమస్యకు తగిన పరిష్కారం చెప్పండి.**

**– డి. అప్పారావు, విశాఖపట్నం**

మన శరీరంలో నిర్విరామంగా గుండె కొట్టుకోడానికి ఎలక్ట్రికల్ వ్యవస్థ ఒకటి పనిచేస్తుంది. ఇందులో ఏమైనా మార్పులు చోటుచేసుకుంటే గుండె దడలో కూడా మార్పులు సంభవిస్తాయి. సాధారణంగా గుండె 70–80 సార్లు కొట్టుకోవాలి. అలా కాకుండా అసాధారణంగా గుండెదడ పెరిగినా లేక తగ్గినా దానిని ప్రమాదంగా పరిగణించాలి. తగిన చికిత్స చేయించుకోవాలి. నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ముప్పు. గుండె నిమిషానికి 100 కంటే ఎక్కువసార్లు కొట్టుకుంటే దానిని 'ట్యాకి కార్డియా' అంటారు. గుండె నిమిషానికి 60 సార్ల కంటే తక్కువ సార్లు కొట్టుకుంటే దానికి 'బ్రాడీ కార్డియా' అని పేర్కొంటారు. గుండెదడలో మార్పులను ఈసీజీ, ఎకోకార్డియోగ్రామ్, ఎలక్ట్రో ఫిజియాలజీ స్టడీ (ఈపీ స్టడీ) పరీక్షల ద్వారా నిర్ధారణ చేస్తారు. మీ విషయానికి వస్తే మీ గుండె స్పీడుగా కొట్టుకోవడం, కళ్లు తిరగడం, ఆయాసం, నీరసం రావడం లాంటివి చోటు చేసుకున్నాయని అంటున్నారు. ఇవి 'ట్యాకీకార్డియా' లక్షణాలను సూచిస్తున్నాయి. కాబట్టి బీపీ డౌన్ అవ్వడం వల్ల మీకు అలా జరిగి ఉండదు. మీరు వెంటనే మంచి నిష్ణాతులైన వైద్యులను సంప్రదిస్తే వారు అన్ని పరీక్షలూ నిర్వహించి, మీరు ఏ సమస్యతో బాధపడుతున్నారో నిర్ధారణ చేస్తారు. దానికి అనుగుణంగా చికిత్స అందిస్తారు. ఒకవేళ మీరు ట్యాకీకార్డియాతో బాధపడుతున్నట్లు నిర్ధారణ చేస్తే మీలో గుండెదడ పెరగడానికి కారణమైన అవాంఛిత ఎలక్ట్రికల్ సర్క్యూట్లను తొలగించి క్రమబద్ధీకరిస్తారు. కాబట్టి మీరు ఎలాంటి అనవసరం భయాలూ పెట్టుకోకుండా వెంటనే మంచి డాక్టర్‌ను కలిసి, మీ సమస్యకు తగిన చికిత్స పొందండి. ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా ప్రాథమిక దశలోనే మీ సమస్యకు తగిన చికిత్సను తీసుకొని, నిర్భయంగా ఉండండి.

ఫ్యామిలీ డాక్టర్



**డా. వరద రాజశేఖర్,**
సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ అండ్ ఎలక్ట్రోఫిజియాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్,
సికింద్రాబాద్

సాక్షి భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

సోమవారం
17-6-2019

# నీట్ కౌన్సెలింగ్-2019




**దేశవ్యాప్తంగా వైద్య విద్యలో 15 శాతం నేషనల్ కోటా సీట్లకు నీట్ కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. రెండు రౌండ్లలో అఖిల భారత స్థాయిలో కౌన్సెలింగ్ ప్రక్రియ జరగనుంది. దేశంలోని అన్ని మెడికల్ కాలేజీల్లోని ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి నీట్ 2019 స్కోర్ తప్పనిసరి. మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా సీట్ల భర్తీ ప్రక్రియ చేపట్టనుంది. నీట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు కౌన్సెలింగ్ ప్రక్రియ అత్యంత కీలకమైనది. రిజిస్ట్రేషన్ దగ్గర నుంచి ప్రాథమ్యాలు ఇవ్వడం, చాయిస్ లాకింగ్, కాలేజీకి రిపోర్టింగ్ చేయడం వరకూ.. అడుగడుగునా అప్రమత్తంగా ఉండాలి. జూన్ 19 నుంచి ఆలిండియా కోటాకు కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. అలాగే త్వరలోనే తెలుగు రాష్ట్రాల్లోనూ మెడికల్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వైద్య విద్య ప్రవేశాలు, కౌన్సెలింగ్ తీరుతెన్నులు, కాలేజీలు, సీట్లు, అర్హతలు, అవసరమైన ధ్రువపత్రాలు తదితర పూర్తి వివరాలు..**

### నీట్ ఆలిండియా కోటా 15 శాతం/డీమ్డ్/సెంట్రల్ యూనివర్సిటీలు/ఈఎస్ఐసీ అండ్ ఏఎఫ్ఎంసీ (ఎంబీబీఎస్/బీడీఎస్) సీట్లకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్ తేదీలు (2019)

**మొదటి రౌండ్**

| | రిజిస్ట్రేషన్/పేమెంట్, చాయిస్ ఫిల్లింగ్ | చాయిస్ ఫిల్లింగ్/లాకింగ్ | సీట్ అలాట్‌మెంట్ ప్రక్రియ | ఫలితాలు | రిపోర్టింగ్ |
|---|---|---|---|---|---|
| 1. | జూన్ 19–24 | జూన్ 25 | జూన్ 26 | జూన్ 27 | జూన్ 28–జూలై 3 |

- జూన్ 25 మధ్యాహ్నం 2 గం. వరకు పేమెంట్ సౌకర్యం అందుబాటులో ఉంటుంది.

**రెండో రౌండ్**

| | రిజిస్ట్రేషన్/పేమెంట్, చాయిస్ ఫిల్లింగ్ | చాయిస్ ఫిల్లింగ్/లాకింగ్ | సీట్ అలాట్‌మెంట్ ప్రక్రియ | ఫలితాలు | రిపోర్టింగ్ |
|---|---|---|---|---|---|
| 2. | జూలై 6–8 | జూలై 9 | జూలై 10, 11 | జూలై 12 | జూలై 13–22 |

- జూలై 9 మధ్యాహ్నం 12 గం. వరకు పేమెంట్ సౌకర్యం అందుబాటులో ఉంటుంది.

3. రిపోర్ట్ చేయని, ఖాళీగా ఉన్న సీట్లు స్టేట్ కోటాకు బదిలీ: జూలై 23, 2019 (ఆలిండియా కోటా 15 శాతం సీట్లు మాత్రమే)

**సెంట్రల్/డీమ్డ్ యూనివర్సిటీలు/ఈఎస్ఐసీలకు సంబంధించి మాప్-అప్ రౌండ్**

| | రిజిస్ట్రేషన్/పేమెంట్, చాయిస్ ఫిల్లింగ్ | చాయిస్ ఫిల్లింగ్/లాకింగ్ | సీట్ అలాట్‌మెంట్ ప్రక్రియ | ఫలితాలు | రిపోర్టింగ్ |
|---|---|---|---|---|---|
| 4. | ఆగస్టు 13–15 | ఆగస్టు 16 | ఆగస్టు 17 | ఆగస్టు 18 | ఆగస్టు 20–26 |

- ఆగస్టు 16 మధ్యాహ్నం 2 గం. వరకు పేమెంట్ సౌకర్యం అందుబాటులో ఉంటుంది.

5. రిపోర్ట్ చేయని/ఖాళీగా ఉన్న సీట్లను డీమ్డ్/సెంట్రల్ యూనివర్సిటీలు/ఈఎస్ఐసీలకు బదిలీ: ఆగస్టు 27, 2019.

అఖిల భారత వైద్య విద్య 15 శాతం కోటాకు జూన్ 19 నుంచి 24 వరకూ మొదటి రౌండ్‌కు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుంది. మొదటి దశలో సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 28 నుంచి జూలై 3వ తేదీ వరకు సంబంధిత కాలేజీలో రిపోర్ట్ చేయాలి. మొదటి రౌండ్ కౌన్సెలింగ్‌లో భర్తీ కాకుండా మిగిలిపోయిన సీట్ల కోసం... జూలై 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకూ రెండో రౌండ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. రెండో రౌండ్‌లో అడ్మిషన్ లభించిన విద్యార్థులు జూలై 13 నుంచి 22వ తేదీ వరకూ.. కాలేజీలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. అఖిల భారత కోటా కింద రెండు రౌండ్లలోనూ భర్తీ కాకుండా మిగిలిపోయిన వైద్య విద్య సీట్లను జూలై 23న రాష్ట్రాలకు అప్పగిస్తారు. సెంట్రల్/డీమ్డ్ యూనివర్సిటీలు/ఈఎస్ఐసీలకు సంబంధించి మాప్ అప్ రౌండ్ ఆగస్టు 13 నుంచి ఆగస్టు 15 వరకూ జరుగుతుంది. ఇందులో సీటు పొందిన విద్యార్థులు ఆగస్టు 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. మాప్ అప్ రౌండ్ తర్వాత మిగిలిపోయిన సీట్లను ఆగస్టు 27న సంబంధిత ఇన్‌స్టిట్యూట్‌లకు అప్పగిస్తారు.

#### అర్హతలు

- ఇంటర్మీడియెట్ బైపీసీ ఉత్తీర్ణత.
- ఆలిండియా కోటా వైద్య కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు విద్యార్థి తప్పనిసరిగా నీట్ 2019లో అర్హత సాధించాలి. కనీస పర్సంటైల్ పొంది ఉండాలి.
- తప్పనిసరిగా కౌన్సెలింగ్ ప్రక్రియకు ఆన్‌లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి
- కౌన్సెలింగ్ ప్రక్రియలో చాయిస్‌ను సబ్మిట్ చేయడం తప్పనిసరి. అలా చేస్తేనే సీటు అలాట్‌మెంట్‌కు పరిగణనలోకి తీసుకుంటారు.



#### అవసరమైన ధ్రువపత్రాలు

పదో తరగతి మార్కుల మెమో, ఇంటర్మీడియెట్ మార్కుల మెమో, నీట్ అడ్మిట్ కార్డ్, నీట్ స్కోర్ కార్డ్, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్(టీసీ), కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, 8 పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, అలాట్‌మెంట్ లెటర్, ఆధార్/పాన్/డ్రైవింగ్ లైసెన్స్/పాస్‌పోర్ట్, రెండు సెట్ల జిరాక్స్ కాపీలు తదితర పత్రాలను సిద్ధం చేసుకోవాలి.

#### ఆలిండియా కోటాకు రిజిస్ట్రేషన్ ఇలా..

- రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం అయ్యాక సంబంధిత వెబ్‌సైట్ https://mcc.nic.inలో లింక్ అందుబాటులోకి వస్తుంది. ఇందులో కోరిన విధంగా విద్యార్థులు తమ వ్యక్తిగత వివరాలతో పాటు అకడెమిక్ డిటెయిల్స్‌ను పొందుపరచాలి.
- రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక రిఫండబుల్, నాన్ రిఫండబుల్ కౌన్సెలింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అభ్యర్థులు జూన్ 25వ తేదీ వరకూ ఆన్‌లైన్ విధానంలో డెబిట్ కార్డ్/క్రెడిట్ కార్డ్/నెట్ బ్యాంకింగ్ విధానాల ద్వారా ఫీజు చెల్లించేందుకు వీలుంది.
- మొదటి రౌండ్‌కు సంబంధించి చాయిస్ ఫిల్లింగ్, చాయిస్ లాకింగ్ సౌకర్యం జూన్ 25వ తేదీ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ అందుబాటులో ఉంటుంది. స్క్రీన్‌లో కనిపిస్తున్న కాలేజీల జాబితాలో నుంచి విద్యార్థులు తమ ప్రాథమ్యాలను పేర్కొనాల్సి ఉంటుంది. ఎన్ని ప్రాథమ్యాలనైనా పేర్కొనవచ్చు. అభ్యర్థులు తమ ప్రాథమ్యాలను లాక్ చేయడం తప్పనిసరి.
- మొదటి రౌండ్‌కు సీట్ అలాట్‌మెంట్ ఫలితాలను జూన్ 27వ తేదీన ప్రకటిస్తారు. ఇందులో సీట్ అలాట్‌మెంట్ లిస్ట్, సీట్ అలాట్‌మెంట్ లెటర్ ఉంటాయి. ఇది చాలా ముఖ్యమైన సమాచారం. సీట్ అలాట్‌మెంట్ లిస్ట్‌లో విద్యార్థి పేరు, కేటగిరీ, అలాట్ చేసిన కాలేజీ, కోర్సు తదితర వివరాలు ఉంటాయి. కాలేజీలో రిపోర్ట్ చేసేందుకు ఇతర ధ్రువ పత్రాలతోపాటు సీట్ అలాట్‌మెంట్ లెటర్‌ను తప్పనిసరిగా తీసుకెళ్లాలి.
- మొదటి రౌండ్‌లో సీటు అలాట్‌మెంట్ రిజల్ట్‌లో సీటు పొందిన అభ్యర్థులు జూన్ 28 నుంచి జులై 3వ తేదీలోపు కాలేజీలో రిపోర్ట్ చేసి అడ్మిషన్ ప్రక్రియను పూర్తిచేసుకోవాల్సి ఉంటుంది.
- రిజిస్ట్రేషన్ చేసుకొని మొదటి రౌండ్‌లో సీటు పొందని విద్యార్థులు, సీటు లభించినా కాలేజీలో రిపోర్ట్ చేయని వారు రెండో రౌండ్‌లో పాల్గొనొచ్చు. వీరికి జులై 6వ తేదీ నుంచి కొత్తగా ప్రాథమ్యాలు ఇచ్చే సౌకర్యం అందుబాటులో ఉంటుంది. మొదటి రౌండ్‌లో రిజిస్టర్ చేసుకున్న, ఫీజు చెల్లించిన విద్యార్థులు మళ్లీ రిజిస్ట్రేషన్, ఫీజు చెల్లింపు చేయాల్సిన అవసరంలేదు. ఇలాంటి అభ్యర్థులు కొత్తగా మళ్లీ తమ ప్రాథమ్యాలను పొందుపరచాల్సి ఉంటుంది.
- దేశంలో ప్రస్తుతం ఎంసీఐ అనుబంధంగా ఉన్న మొత్తం 529 కళాశాలల్లో 70,878 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. డెంటల్ విభాగంలో 313 కళాశాలల్లో 26,620 సీట్లు అందుబాటులో ఉన్నాయి

#### పూర్తి వివరాలకు వెబ్‌సైట్

15 శాతం ఆలిండియా కోటా సీట్లు/డీమ్డ్/సెంట్రల్ యూనివర్సిటీలు/ఈఎస్ఐసీ, ఏఎఫ్ఎంసీ (ఎంబీబీఎస్/బీడీఎస్) కాలేజీలు, సీట్లు, కౌన్సెలింగ్ ప్రక్రియ సమాచారం కోసం వెబ్‌సైట్: https://mcc.nic.in/UGCounselling/home/homepage

#### స్టేట్ కోటా 85 శాతం సీట్లు

ప్రభుత్వ కళాశాల్లోని స్టేట్ కోటా 85 శాతం సీట్లతోపాటు ప్రైవేటు కాలేజీల్లోని 50 శాతం వైద్య సీట్లను సంబంధిత రాష్ట్రాల వైద్య విద్య అధికార యంత్రాంగం నీట్‌లో స్కోర్ సాధించిన స్థానిక అభ్యర్థులతో కన్వీనర్ కోటా కింద భర్తీచేస్తుంది. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌టీఆర్ హెల్త్‌యూనివర్సిటీ, విజయవాడ; తెలంగాణలో కాళోజీ నారాయణ రావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్‌సైన్సెస్, వరంగల్ కౌన్సెలింగ్ ప్రక్రియ చేపడతాయి. అందుకోసం ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నోటిఫికేషన్ విడుదల చేస్తాయి.





## తెలంగాణలో కాలేజీలు, సీట్లు

రెండు తెలుగు రాష్ట్రాల్లో వైద్యవిద్య చదవాలనే అభిలాష ఉన్నవారికి అత్యంత ఆసక్తికరం.. ఇక్కడున్న మెడికల్ సీట్ల సంఖ్య. తమ పిల్లలకు ఇక్కడ కాలేజీలో సీటు లభిస్తుందా! లేదా అనే సందిగ్ధం.. తల్లిదండ్రుల్లో ఎక్కువగా ఉంటుంది. తెలంగాణలో 48,996 మంది నీట్‌కు హాజరైతే వీరిలో 33,044 మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఏపీలో 39,039 మంది ఉత్తీర్ణులయ్యారు.

#### 4,600 ఎంబీబీఎస్ సీట్లు

- తెలంగాణలో ప్రభుత్వ,ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 2019–20 విద్య సంవత్సరానికి 4,600 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. 10 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 1,500 ఎంబీబీఎస్ సీట్లు, 21 ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 3,100 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ఇవికాక 10 ప్రైవేటు, ఒక ఆర్మీ, మరో ప్రభుత్వ డెంటల్ కాలేజీల్లో 1,106 డెంటల్ సీట్లున్నాయి. గతేడాది కంటే ఈసారి ఎంబీబీఎస్ సీట్లు ఏకంగా 1,000 పెరిగాయి.
- ప్రభుత్వంలోని అన్ని సీట్లు, ప్రైవేటు కాలేజీల్లోని 50 శాతం సీట్లు కన్వీనర్ కోటాలో భర్తీ చేస్తారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఉన్న 1,500 సీట్లలో 15 శాతం అంటే 225 సీట్లు అఖిల భారత కోటా కింద కేంద్రం భర్తీ చేస్తుంది. వాటిలో రెండు విడతల కౌన్సెలింగ్ తర్వాత సీట్లు మిగిలితే తిరిగి వాటిని మన రాష్ట్రానికే ఇస్తారు. మరోవైపు కేంద్రం అగ్రవర్ణ పేదలకు(ఈడబ్ల్యూఎస్)కు 10 శాతం రిజర్వేషన్ అమలుచేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఆ రిజర్వేషన్ అమలు చేయాలంటే ప్రస్తుత రిజర్వేషన్లు దెబ్బతినకుండా ఉంచాలి. అందుకు 25 శాతం సీట్లు పెంచాలి. ఆ మేరకు ప్రస్తుత సీట్లకు అదనంగా 375 సీట్లు పెరగాల్సి ఉంటుంది. అవే పెరిగితే మొత్తంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో 1,875 సీట్లు అవుతాయి. వాస్తవంగా ఈడబ్ల్యూఎస్ కోటా సీట్ల పెంపుపై ప్రతిపాదనలు పంపాలని కేంద్రం రాష్ట్రాన్ని కోరింది. ఈ మేరకు ప్రతిపాదనలు పంపే పనిలో వైద్యవిద్య డైరెక్టరేట్ ఉంది. ఈడబ్ల్యూఎస్ కోటా అమలు చేయాలంటే నోటిఫికేషన్ విడుదలలోపు దీనిపై కేంద్రం ఓ నిర్ణయం తీసుకోవాలి. అప్పుడే ఆ సీట్లు అందుబాటులోకి వస్తాయి. అందుకోసమే నోటిఫికేషన్‌ను కొంత ఆలస్యంగా జారీచేయాలని ఆరోగ్య విశ్వవిద్యాలయం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

#### ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్ల వివరాలు

| | కాలేజీ పేరు | సీట్లు |
|---|---|---|
| 1. | ఉస్మానియా మెడికల్ కాలేజీ, హైదరాబాద్ | 250 |
| 2. | గాంధీ మెడికల్ కాలేజీ, హైదరాబాద్ | 200 |
| 3. | కాకతీయ మెడికల్ కాలేజీ, వరంగల్ | 200 |
| 4. | మహబూబ్‌నగర్ మెడికల్ కాలేజీ | 150 |
| 5. | నల్లగొండ మెడికల్ కాలేజీ | 150 |
| 6. | నిజామాబాద్ మెడికల్ కాలేజీ | 100 |
| 7. | సిద్దిపేట మెడికల్ కాలేజీ | 150 |
| 8. | సూర్యాపేట మెడికల్ కాలేజీ | 150 |
| 9. | రాజీవ్‌గాంధీ కాలేజీ, ఆదిలాబాద్ | 100 |
| 10. | ఈఎస్ఐ, హైదరాబాద్ | 50 |
| | మొత్తం | 1,500 |

#### ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్ల వివరాలు

| | కాలేజీ పేరు | సీట్లు |
|---|---|---|
| 1. | అపోలో, హైదరాబాద్ | 100 |
| 2. | అయాన్, రంగారెడ్డి జిల్లా | 150 |
| 3. | భాస్కర్ మెడికల్ కాలేజీ, ఎంకపల్లి | 150 |
| 4. | చల్మడ ఆనందరావు మెడికల్ కాలేజీ, కరీంనగర్ | 150 |
| 5. | డెక్కన్ మెడికల్ కాలేజీ, హైదరాబాద్ | 150 |
| 6. | పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కాలేజీ, చేవెళ్ల | 150 |
| 7. | వీఆర్‌కే ఉమెన్స్ మెడికల్ కాలేజీ, అజీజ్‌నగర్ | 100 |
| 8. | కామినేని అకాడమీ, హైదరాబాద్ | 150 |
| 9. | కామినేని మెడికల్ కాలేజీ, నార్కట్‌పల్లి | 200 |
| 10. | మహవీర్ మెడికల్ కాలేజీ, వికారాబాద్ | 150 |
| 11. | మల్లారెడ్డి మెడికల్ కాలేజీ, హైదరాబాద్ | 150 |
| 12. | మల్లారెడ్డి ఉమెన్స్ మెడికల్ కాలేజీ, హైదరాబాద్ | 150 |
| 13. | మమత మెడికల్ కాలేజీ, బాచుపల్లి | 150 |
| 14. | మమత మెడికల్ కాలేజీ, ఖమ్మం | 150 |
| 15. | మెడిసిటీ మెడికల్ కాలేజీ, ఘన్‌పూర్ | 150 |
| 16. | ఎంఎన్ఆర్ మెడికల్ కాలేజీ, సంగారెడ్డి | 100 |
| 17. | ప్రతిమ మెడికల్ కాలేజీ, కరీంనగర్ | 200 |
| 18. | ఆర్వీఎం మెడికల్ కాలేజీ, మెదక్ | 150 |
| 19. | షాదన్ మెడికల్ కాలేజీ, పటాన్‌చెరు | 150 |
| 20. | సురభి మెడికల్ కాలేజీ, సిద్దిపేట | 150 |
| 21. | ఎస్వీఎస్ మెడికల్ కాలేజీ, మహబూబ్‌నగర్ | 150 |
| | మొత్తం | 3,100 |

## ఏపీలో ఎంబీబీఎస్ సీట్లు

**ప్రభుత్వ కళాశాలలు**

| | కాలేజ్ పేరు | సీట్లు |
|---|---|---|
| 1. | ఆంధ్రా మెడికల్ కాలేజ్, విశాఖపట్నం | 200 |
| 2. | గుంటూరు మెడికల్ కాలేజ్, గుంటూరు | 200 |
| 3. | రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, శ్రీకాకుళం | 100–150 |
| 4. | రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఒంగోలు | 100 |
| 5. | రంగరాయ మెడికల్ కాలేజ్, కాకినాడ | 200 |
| 6. | సిద్ధార్థ మెడికల్ కాలేజ్, విజయవాడ (స్టేట్‌వైడ్) | 150 |
| 7. | ఏసీఎస్ఆర్ గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, నెల్లూరు | 150 |
| 8. | గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, అనంతపురం | 150 |
| 9. | కర్నూల్ మెడికల్ కాలేజ్, కర్నూలు | 200 |
| 10. | రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, కడప | 150 |
| 11. | ఎస్‌వీ మెడికల్ కాలేజ్, తిరుపతి | 200 |
| 12. | శ్రీపద్మావతి మెడికల్ కాలేజ్, తిరుపతి (ఉమెన్) | 150 |

- 12 ప్రభుత్వ కాలేజీల్లో 2000 వరకు సీట్లు అందుబాటులో ఉన్నాయి.

**ప్రైవేటు కళాశాలలు**

| | కాలేజ్ పేరు | సీట్లు |
|---|---|---|
| 1. | అల్లూరి సీతారామరాజు అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఏలూరు | 150 |
| 2. | కాటూరి మెడికల్ కాలేజ్, గుంటూరు | 150 |
| 3. | కోనసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్, అమలాపురం | 150 |
| 4. | మహారాజ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, విజయనగరం | 150 |
| 5. | ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజ్, చినకాకాని | 200 |
| 6. | డా. పిన్నమనేని సిద్దార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, గన్నవరం | 150 |
| 7. | జీఎస్ఎల్ మెడికల్ కాలేజ్, రాజమండ్రి | 200 |
| 8. | ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్,విశాఖపట్నం | 150 |
| 9. | జీఈఎంఎస్ మెడికల్ కాలేజ్, రాగోలు, శ్రీకాకుళం | 150 |
| 10. | గాయత్రి విద్యా పరిషత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌కేర్ అండ్ మెడికల్ టెక్నాలజీ, విశాఖపట్నం | 150 |
| 11. | పీఈఎస్ మెడికల్ కాలేజ్, కుప్పం | 150 |
| 12. | శాంతిరామ్ మెడికల్ కాలేజ్, నంద్యాల | 100 |
| 13. | అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్, చిత్తూరు | 150 |
| 14. | నారాయణ మెడికల్ కాలేజ్, నెల్లూరు | 250 |
| 15. | విశ్వభారతి మెడికల్ కాలేజ్, కర్నూలు | 150 |
| | మొత్తం | 2400 |
| | **మైనారిటీ కళాశాలలు** | |
| 16. | ఫాతిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, కడప | 100 |
| 17. | నిమ్రా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఇబ్రహీంపట్నం, కృష్ణా జిల్లా | 150 |

గమనిక: ఏపీలోని మెడికల్ కాలేజీల్లో ఈడబ్ల్యూఎస్ కోటా కింద 25 శాతం సీట్ల సంఖ్య పెరిగే అవకాశముంది. కాబట్టి ఈ కోటా అనంతరం పెరిగే సీట్ల సంఖ్యను అదనంగా పరిగణనలోకి తీసుకోవాలి.

## 'ఈడబ్ల్యూఎస్' జీవో వచ్చాక నోటిఫికేషన్ విడుదల

పూర్తిగా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తాం. తొలుత నీట్‌లో అర్హత సాధించిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తాం. తర్వాత ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుంది. ఈ ప్రక్రియతో రాష్ట్ర అభ్యర్థుల తుది మెరిట్ జాబితా తయారవుతుంది. దాదాపు మూడు దశల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తాం. వాస్తవానికి ఈనెల 25 నుంచి తొలి విడత కౌన్సెలింగ్ జరపాల్సి ఉంది. ఈడబ్ల్యూఎస్ కోటాకు సంబంధించిన జీవో రావాల్సి ఉన్నందున జాప్యం జరుగుతోంది. ఈ జీవో వచ్చాక కౌన్సెలింగ్ ప్రక్రియకు నోటిఫికేషన్ జారీచేస్తాం. ఈలోగా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తాం. ఆలిండియా కోటాకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు స్టేట్ కోటాకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆలిండియా కోటాలో సీటు పొందిన అభ్యర్థి మొదటి విడత కౌన్సెలింగ్ తర్వాత అక్కడి సీటును వదులుకొని ఇక్కడ చేరొచ్చు. రెండో విడత కౌన్సెలింగ్ తర్వాత చేరాలంటే కట్టిన ఫీజులు వదిలేసుకొని రావాల్సి ఉంటుంది. దీనికి సంబంధించిన సమాచారం అధికారిక వెబ్‌సైట్లో చూడొచ్చు. ఆలిండియా కోటాలో మంచి ప్రభుత్వ కళాశాలలు ఉంటాయి. వాటిలో చేరొచ్చు. ఫీజులకు సంబంధించిన నిబంధనలను https://mcc.nic.in వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు. డీమ్డ్ యూనివర్సిటీల్లో సీట్లకు కౌన్సెలింగ్ ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం చేపడుతుంది. వాటికి స్టేట్ కోటా వర్తించదు. విద్య, ఓబీసీ రిజర్వేషన్, నీట్ కార్డు వంటివి సిద్ధం చేసుకోవాలి. ఈడబ్ల్యూఎస్ కింద అన్ని ప్రభుత్వ కళాశాలల్లో 25 శాతం సీట్లు పెరుగుతాయి. దీనిద్వారా రాష్ట్రంలో దాదాపు 500 సీట్లు పెరగనున్నాయి.



డాక్టర్ సీవీ రావు

– డాక్టర్ సీవీ రావు, వైస్ చాన్సలర్, డాక్టర్ ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్.

గమనిక: గతేడాది కౌన్సెలింగ్ ప్రక్రియతోపాటు ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారాన్ని క్రోడీకరించి విద్యార్థుల ప్రయోజనార్థం ఈ వివరాలు అందిస్తున్నాం. ఇందులో మార్పులు చేర్పులూ ఉండొచ్చు. కాలేజీలు, సీట్లు, కౌన్సెలింగ్ ప్రక్రియ, ఇతర సందేహాల కోసం ఎప్పటికప్పుడు అధికార వెబ్‌సైట్స్‌ను https://mcc.nic.in, http://ntruhs.ap.nic.in/, https://knruhs.in/ సందర్శించగలరు.

సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో...
❖ జనరల్ స్టడీస్ మోడల్ పేపర్లు ❖ కెరీర్ కౌన్సెలింగ్
❖ బ్యాంకు పరీక్షల సమగ్ర మెటీరియల్ ❖ కరెంట్ అఫైర్స్ బిట్‌బ్యాంక్
విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS
యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

సాక్షి స్పోర్ట్స్
సోమవారం
17-6-2019

**1**
ప్రపంచ కప్‌లో పాక్‌పై ఏ జట్టుకైనా ఇదే అత్యధిక స్కోరు (336/5). ఇదే టోర్నీలో ఇంగ్లండ్ (334/9) నమోదు చేసిన రికార్డును భారత్ సవరించింది.

**2**
అత్యధిక వన్డేలు ఆడిన భారత క్రికెటర్ల జాబితాలో ద్రవిడ్ (340)ను దాటి ధోని (341) రెండో స్థానానికి చేరాడు. సచిన్ (463) టాపర్‌గా ఉన్నాడు.

**3**
ప్రపంచకప్ అరంగేట్రం మ్యాచ్‌లో తొలి బంతికే వికెట్ తీసిన మూడో బౌలర్ విజయ్ శంకర్. గతంలో హార్వే (ఆస్ట్రేలియా; పాక్‌పై 2003లో), మలాచీ జోన్స్ (బెర్ముడా; భారత్‌పై 2007లో) ఈ ఘనత సాధించారు.

**9**
వన్డేల్లో 11 వేల పరుగులు పూర్తి చేసుకున్న తొమ్మిదో క్రికెటర్ కోహ్లి. సచిన్, గంగూలీ తర్వాత భారత్ నుంచి ఈ ఘనత సాధించిన మూడో బ్యాట్స్‌మన్.

### రోహిత్ ఇన్నింగ్స్ అత్యద్భుతం

మా ఇన్నింగ్స్ సగం పూర్తయ్యాక బంతి స్పిన్ తిరగడం మొదలైంది. టాస్ గెలిస్తే బౌలింగే తీసుకునేవాళ్లం. రోహిత్ మరోసారి అత్యుత్తమ ఇన్నింగ్స్ ఆడాడు. రాహుల్ ఉత్తమ వన్డే ఆటగాడినని చాటాడు. బాబర్ ఆజమ్‌ను ఔట్ చేసిన కుల్దీప్ బంతి అద్భుతం. చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో మనల్ని ఓడించారని... ఈ మ్యాచ్‌ను అతి భావోద్వేగంతో తీసుకుంటే చేదు ఫలితం రావొచ్చు. అందుకని ఆ ఓటమి గురించి ఆలోచించలేదు. ఆటలో ఇలాంటివి భాగమని భావించి ముందుకెళ్లాం. దానికి తగ్గ ఫలితమే ఇది.

–విరాట్ కోహ్లి, భారత కెప్టెన్

### ప్రపంచకప్‌లో నేడు

వెస్టిండీస్ X బంగ్లాదేశ్
వేదిక: టాంటన్
మధ్యాహ్నం 3 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం

# భారత్ పరాక్రమం
# పాక్ పాదాక్రాంతం

ప్రపంచకప్‌లో పాకిస్తాన్‌ను ఏడోసారి చిత్తు చేసిన భారత్

- 89 పరుగులతో ఘన విజయం
- రోహిత్ శర్మ అద్భుత సెంచరీ
- టీమిండియా సమష్టి ప్రదర్శన



ప్రపంచకప్‌లో పాకిస్తాన్‌పై భారత జెండా మళ్లీ సగర్వంగా ఎగిరింది. 27 ఏళ్లుగా సాగుతున్న సినిమానే టీమిండియా ఆటగాళ్లు దాయాదికి మళ్లీ చూపించారు. ఆటగాళ్లు మారినా, మైదానాలు మారినా విశ్వ వేదికపై మనల్ని ఓడించే సత్తా ఆ జట్టుకు లేదని మరోసారి నిరూపించారు. మ్యాచ్‌కు ముందు ఎన్ని అంచనాలు ఉన్నా, 'మ్యాచ్ ఆఫ్ ద టోర్నీ' అంటూ ఇరు దేశాల్లో హడావిడి చేసినా అసలు పోరుకు వచ్చే సరికి భారత్ బలం ముందు పాక్ ఏమాత్రం నిలబడలేదని ఈ మ్యాచ్ కూడా నిరూపించింది. రెండేళ్ల క్రితం చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ విజయాన్ని చూసి మురిసిపోతూ అదే ప్రదర్శనను పునరావృతం చేయాలని ఆశించిన పాకిస్తాన్‌కు గర్వభంగమైంది. సమష్టి తత్వంతో చెలరేగిన కోహ్లి సేన వరల్డ్ కప్ ముఖాముఖీ పోరులో తమ ఆధిపత్యాన్ని 7-0కు పెంచుకొని ప్రత్యర్థికి అందనంత ఎత్తులో నిలిచింది.

వన్డే కెరీర్‌లో ఎన్ని శతకాలు బాదినా ప్రపంచకప్‌లో పాకిస్తాన్‌పై సెంచరీ అంటే ఆ కిక్కే వేరు... రోహిత్ శర్మ అదే జోష్‌తో ఆడటంతో భారత్ భారీ స్కోరుకు బాటలు పడ్డాయి. సహాయక పాత్రలో కెప్టెన్ కోహ్లి, ఓపెనర్‌గా వచ్చిన రాహుల్ కూడా ఒదిగిపోవడంతో ధావన్ లేని లోటు తెలియకుండా భారత్ దూసుకుపోయింది. పెద్ద లక్ష్యాలను ఛేదించడంలో పేలవ రికార్డు ఉన్న పాకిస్తాన్‌కు ఇది శక్తికి మించిన పనే అయింది. బుమ్రా, భువీ ఒక్క వికెట్ తీయకపోయినా... ఎవరినైనా ఓడించగల బౌలింగ్ మనకుందని చూపిస్తూ కుల్దీప్, హార్దిక్ పాండ్యా చెలరేగిపోయారు. అనూహ్య అవకాశాన్ని అద్భుతంగా వాడుకున్న విజయ్ శంకర్ కూడా వీరికి జత కలవడంతో ప్రత్యర్థి కుప్పకూలిపోయింది. మొత్తంగా భయపెట్టిన వర్షం సరైన సమయానికి పక్కకు తప్పుకోవడంతో భారత్ రికార్డు చెక్కు చెదరలేదు.

**మాంచెస్టర్:** ప్రపంచకప్ టోర్నీ ప్రతిష్టాత్మక పోరులో భారత్ మరోసారి పైచేయి సాధించింది. ఆదివారం ఇక్కడి ఓల్డ్ ట్రఫోర్డ్ మైదానంలో జరిగిన పోరులో భారత్ 89 పరుగుల (డక్‌వర్త్–లూయిస్ ప్రకారం) తేడాతో పాకిస్తాన్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 336 పరుగులు చేసింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' రోహిత్ శర్మ (113 బంతుల్లో 140; 14 ఫోర్లు, 3 సిక్సర్లు) సెంచరీకి తోడు కోహ్లి (65 బంతుల్లో 77; 7 ఫోర్లు), కేఎల్ రాహుల్ (78 బంతుల్లో 57; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించారు. అనంతరం పాక్ 35 ఓవర్లు ముగిసేసరికి 6 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. ఈ దశలో వర్షం కారణంగా మ్యాచ్ నిలిచిపోయింది. దాంతో డక్‌వర్త్–లూయిస్ ప్రకారం పాక్ లక్ష్యాన్ని 40 ఓవర్లలో 302 పరుగులుగా నిర్దేశించారు. పాక్ తర్వాతి 5 ఓవర్లలో మరో 46 పరుగులు జోడించి చివరకు 212 పరుగుల వద్ద ఆట ముగించింది. ఫఖర్ జమాన్ (75 బంతుల్లో 62; 7 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. భారత్ తమ తదుపరి మ్యాచ్‌లో ఈనెల 22న అఫ్గానిస్తాన్‌తో ఆడుతుంది.





### టపటపా...

భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఏ దశలోనూ పాకిస్తాన్ గెలుపు దిశగా సాగలేదు. పేలవమైన ఆరంభం, మధ్య ఓవర్లలో స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కోలేకపోవడం, ఒక్క బ్యాట్స్‌మన్ కూడా దూకుడుగా ఆడలేకపోవడంతో పాక్ సహజంగానే ఓటమిని ఆహ్వానించింది. తొలి పది ఓవర్లలో ఆ జట్టు 38 పరుగులే చేయగలిగింది. బాబర్ ఆజమ్ ఔటయ్యే సమయానికి చేయాల్సిన రన్‌రేట్ 8.46 పరుగులకు చేరిపోయింది. కొద్దిసేపటికే హార్దిక్ వరుస బంతుల్లో హఫీజ్ (9), షోయబ్ మాలిక్ (0)లను ఔట్ చేయడంతో ఆ జట్టుకు ఉన్న దారులు మూసుకుపో యాయి. ఆ తర్వాత మిగతా ఆటంతా లాంఛనమే అయింది. చివర్లో ఇమాద్ వసీమ్ (39 బంతుల్లో 46 నాటౌట్; 6 ఫోర్లు) కొద్దిగా ప్రతిఘటించాడు.

### భువీకి గాయం... విజయ్‌కు వికెట్...

'3D' ప్లేయర్‌గా వరల్డ్ కప్ జట్టులోకి వచ్చిన విజయ్ శంకర్‌పై సగటు అభిమానికి మాత్రం పెద్దగా అంచనాలు లేవు. ధావన్ గాయంతో తుది జట్టులో అవకాశం దక్కించుకున్న అతను ఒత్తిడిలో ధాటిగా ఆడలేక బ్యాటింగ్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. అయితే ప్రపంచకప్‌లో తొలి మ్యాచ్ ఆడుతున్న అతను, తొలి బంతికే వికెట్ తీసి వహ్వా అనిపించాడు. ప్రధాన పేసర్ భువనేశ్వర్ తన మూడో ఓవర్లో నాలుగు బంతులు వేసిన తర్వాత కండరాలు పట్టేయడంతో మైదానం నుంచి వెళ్లిపోయాడు. ఆ ఓవర్‌ను పూర్తి చేసేందుకు వచ్చిన శంకర్ తొలి బంతికే ఇమాముల్ హఖ్ (7)ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. అతను ఈ రకంగా వికెట్ తీయడం కెప్టెన్ కోహ్లితో సహా అందరినీ ఆశ్చర్యపరచింది. వారంతా అతడిని అభినందనలతో ముంచెత్తారు. **గాయంతో భువీ రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు.**



### అద్భుతం ఆ బంతి

పాక్ ఆశలన్నీ ఆ జట్టు టాప్ బ్యాట్స్‌మన్ బాబర్ ఆజమ్ (57 బంతుల్లో 48; 3 ఫోర్లు, 1 సిక్స్) పైనే ఉన్న దశలో కుల్దీప్ వేసిన బంతి ఒక్కసారిగా పాక్ పతనానికి శ్రీకారం చుట్టింది. ఆఫ్‌స్టంప్ మీదుగా పడిన బంతి అనూహ్యంగా టర్న్ తీసుకొని లోపలికి దూసుకొచ్చింది. బయటి వైపు ఆడేందుకు ప్రయత్నించిన బాబర్ పూర్తిగా అంచనా తప్పాడు. దాంతో బ్యాట్, ప్యాడ్ మధ్యనుంచి దూసుకుపోయిన బంతి బెయిల్స్‌ను ఎగరగొట్టింది. బాబర్ షాక్‌లో ఉండిపోగా... టీమిండియా సంబరాలు చేసుకుంది. అతని తర్వాతి ఓవర్లోనే ఫఖర్ కూడా ఔట్ కావడంతో పాక్ పరిస్థితి మరింత దిగజారింది.

### స్కోరు వివరాలు

**భారత్ ఇన్నింగ్స్:** రాహుల్ (సి) బాబర్ (బి) రియాజ్ 57; రోహిత్ (సి) రియాజ్ (బి) హసన్ 140; కోహ్లి (సి) సర్ఫరాజ్ (బి) ఆమిర్ 77; పాండ్యా (సి) బాబర్ (బి) ఆమిర్ 26; ధోని (సి) సర్ఫరాజ్ (బి) ఆమిర్ 1; విజయ్ శంకర్ (నాటౌట్) 15; జాదవ్ (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (50 ఓవర్లలో 5 వికెట్లకు) 336.**
**వికెట్ల పతనం:** 1-136, 2-234, 3-285, 4-298, 5-314.
**బౌలింగ్:** ఆమిర్ 10-1-47-3, హసన్ అలీ 9-0-84-1, వహాబ్ రియాజ్ 10-0-71-1, ఇమాద్ 10-0-49-0, షాదాబ్ 9-0-61-0, మాలిక్ 1-0-11-0, హఫీజ్ 1-0-11-0.

**పాకిస్తాన్ ఇన్నింగ్స్:** ఇమామ్ ఉల్ హఖ్ (ఎల్బీ) (బి) విజయ్ శంకర్ 7; ఫఖర్ జమాన్ (సి) చహల్ (బి) కుల్దీప్ 62; బాబర్ ఆజమ్ (బి) కుల్దీప్ 48; హఫీజ్ (సి) శంకర్ (బి) పాండ్యా 9; సర్ఫరాజ్ (బి) విజయ్ శంకర్ 12; షోయబ్ మాలిక్ (బి) పాండ్యా 0; ఇమాద్ (నాటౌట్) 46; షాదాబ్ (నాటౌట్) 20; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (40 ఓవర్లలో 6 వికెట్లకు) 212.**
**వికెట్ల పతనం:** 1-13, 2-117, 3-126, 4-129, 5-129, 6-165.
**బౌలింగ్:** భువనేశ్వర్ 2.4-0-8-0, బుమ్రా 8-0-52-0, విజయ్ శంకర్ 5.2-0-22-2, హార్దిక్ పాండ్యా 8-0-44-2, కుల్దీప్ 9-1-32-2, చహల్ 7-0-53-0.

### డబుల్ సెంచరీపై ఆలోచించలేదు

చక్కటి ప్రారంభం మీద ఇన్నింగ్స్‌ను నిర్మించాం. జట్టుగా మేం ఆడిన తీరు పట్ల సంతోషంగా ఉన్నాం. నేను ఔటైన తీరుకు అసంతృప్తి చెందా. ఆ షాట్ ఎంపిక నా నిర్ణయ లోపమే. నిలదొక్కుకున్నాక సాధ్యమైనన్ని పరుగులు చేయాలి. మంచి భాగస్వామ్యం నెలకొల్పాక, మ్యాచ్‌ను వశం చేసుకోవాలనుకుంటున్న సందర్భంలో ఔటవడం సరైనది కాదు. నిజంగా చెబుతున్నా... డబుల్ సెంచరీ గురించి నేను ఆలోచించలేదు. రాహుల్ చాలా బాగా ఆడాడు. అతడు సమయం తీసుకున్నా, నేరుగా షాట్లు ఆడలేని పరిస్థితిలో అది అవసరమే.

- భారత ఓపెనర్ రోహిత్ శర్మ

### రోహిత్ సూపర్

టోర్నీ తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై సెంచరీ సాధించిన రోహిత్ మళ్లీ పాక్‌పై సత్తా చాటి శతకంతో చెలరేగాడు. పాక్‌పై అతనికి ఇది వరుసగా రెండో సెంచరీ కావడం విశేషం. ఆరంభంలో అతను హసన్ అలీ బౌలింగ్‌లో చెలరేగిపోయాడు. హసన్ తొలి రెండు ఓవర్లలో ఒక్కో ఫోర్ కొట్టిన రోహిత్, తర్వాతి ఓవర్లో మరో ఫోర్, సిక్స్ బాదాడు. స్పిన్నర్ షాదాబ్ తొలి ఓవర్లో వరుస బంతుల్లో 6, 4 కొట్టిన రోహిత్ 34 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాతా అతని జోరు కొనసాగింది. హసన్ తర్వాతి స్పెల్‌లో కూడా మళ్లీ ఫోర్, సిక్స్ కొట్టిన భారత ఓపెనర్ 90ల్లోకి అడుగు పెట్టాడు. షాదాబ్ బౌలింగ్‌లో సింగిల్‌తో రోహిత్ సెంచరీ (85 బంతుల్లో) పూర్తయింది. ఆ తర్వాత వహాబ్ బౌలింగ్‌లో ఒంటికాలిపై బ్యాక్‌వర్డ్ స్క్వేర్‌లెగ్ దిశగా కొట్టిన ఫోర్ ఇన్నింగ్స్‌కే హైలైట్‌గా నిలిచింది. 38 ఓవర్లు ముగిసే సరికే రోహిత్ స్కోరు 136. అతని జోరు చూస్తే మరో డబుల్ సెంచరీ ఖాయమనిపించింది. అయితే హసన్ బౌలింగ్‌లో స్కూప్ ఆడేందుకు ప్రయత్నించి షార్ట్ ఫైన్‌లెగ్‌లో క్యాచ్ ఇవ్వడంతో అద్భుత ఇన్నింగ్స్ ముగిసింది. 140 పరుగులు చేసినా... తాను ఔటైన తీరు పట్ల రోహిత్ తనపై తానే తీవ్ర అసంతృప్తిని ప్రదర్శిస్తూ పెవిలియన్ చేరాడు.



### రాణించిన రాహుల్

రాహుల్ ఆరంభంలో కొంత తడబడ్డా చివరకు అర్ధ సెంచరీతో భారీ స్కోరులో కీలక పాత్ర పోషించాడు. అతనికి ఆమిర్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్ 'మెయిడిన్'గా ముగిసింది. ఎదుర్కొన్న 11వ బంతికి తొలి ఫోర్ కొట్టిన రాహుల్... అనంతరం కొన్ని చక్కటి షాట్లు ఆడాడు. సిక్సర్‌తో 69 బంతుల్లో అతని అర్ధ సెంచరీ పూర్తయింది.

మరోసారి బ్యాటింగ్ ఆర్డర్‌లో ప్రమోట్ అయిన హార్దిక్ పాండ్యా (19 బంతుల్లో 26; 2 ఫోర్లు, 1 సిక్స్) ఉన్నంత సేపు దూకుడుగా ఆడాడు. హసన్ ఓవర్లో అతను కొట్టిన ఫోర్, సిక్స్ హైలైట్‌గా నిలిచాయి. ధోని (1) మాత్రం ఎక్కువ సేపు నిలవలేకపోయా డు. ఈ రెండు వికెట్లు ఆమిర్‌కే దక్కాయి.





### విరాట్ జోరు

కోహ్లి నిలదొక్కుకునేందుకు కొంత సమయం తీసుకున్నాడు. సింగిల్స్ పైనే దృష్టి పెట్టి రోహిత్‌కు సహకరిస్తూ వచ్చాడు. అతను ఎదుర్కొన్న తొలి 39 బంతుల్లో ఒకే ఒక ఫోర్ ఉంది. రోహిత్ ఔటైన తర్వాతే విరాట్ దూకుడు పెంచి చకచకా బౌండరీలు బాదాడు. ఆమిర్ బౌలింగ్‌లో రెండు పరుగులు తీయడంతో 51 బంతుల్లో కెప్టెన్ హాఫ్ సెంచరీ మార్క్‌ను చేరుకున్నాడు. వ్యక్తిగత స్కోరు 57 వద్ద కోహ్లి వన్డేల్లో 11 వేల పరుగులు పూర్తి చేసుకోవడం విశేషం. వర్షం ఆగిన తర్వాత మరో బౌండరీ కొట్టిన అతని ఇన్నింగ్స్ ఆమిర్ బౌలింగ్‌లో ముగిసింది.

### ఆ 20 బంతుల్లో...

ఊహించినంత ఎక్కువసేపు కాకపోయినా కొన్ని నిమిషాలు వర్షం మ్యాచ్‌కు కొంత అంతరాయం కలిగించింది. భారత ఇన్నింగ్స్‌లో 46.4 ఓవర్లు ముగిసిన తర్వాత వర్షం వల్ల ఆట ఆగిపోయింది. దాదాపు 40 నిమిషాల తర్వాత మళ్లీ ఆట మొదలైంది. వర్షానికి ముందే పాక్ ప్రతిఘటనతో భారత ఇన్నింగ్స్‌లో వేగం తగ్గింది. మిగిలిన 20 బంతుల్లో కోహ్లి ఔట్ కాగా... విజయ్ శంకర్ (15 నాటౌట్), కేదార్ జాదవ్ (9 నాటౌట్) ఆశించినంత వేగంగా ఆడలేకపోయారు. దాంతో మొత్తం 31 పరుగులు వచ్చాయి. చివరి పది ఓవర్లలో భారత్ 88 పరుగులు చేసింది.





### కోహ్లిని ఔట్ చేసిన కోహ్లి

కోహ్లిని ఔట్ చేయడం పాక్ బౌలర్ల వల్ల కాకపోయినా కోహ్లి వల్లనే అవుతుంది... తాజా ఘటన దీనికి ఉదాహరణ. ఆమిర్ వేసిన బౌన్సర్‌ను కోహ్లి పుల్ చేయబోగా అది కీపర్ చేతుల్లో పడింది. అంతే...కోహ్లి వెంటనే తల వంచుకొని పెవిలియన్ వైపు బయల్దేరాడు. అప్పటికి అంపైర్ ఔట్‌గా కూడా ప్రకటించలేదు. రీప్లే చూస్తే కోహ్లి బ్యాట్‌కు బంతి తగల్లేదని తేలింది. అతని బ్యాట్ హ్యాండిల్ చివర కొంత లూజ్‌గా ఉండటం వల్ల వచ్చిన శబ్దంతో అతను ఔటైనట్లుగా భావించినట్లు అంచనా. నిజానికి భారత్‌కు ఒక రివ్యూ మిగిలే ఉంది. దానిని విరాట్ వాడే ప్రయత్నం చేయకుండా తనంతట తాను వెళ్లిపోవడం విశేషం.

# మళ్లీ రజతమే

ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్



**డెన్ బాస్చ్ (నెదర్లాండ్స్):** ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో భారత్ 'బంగారు' స్వప్నం సాకారమవలేదు. 14 ఏళ్ల తర్వాత ఈ మెగా ఈవెంట్‌లో ఫైనల్‌కు చేరిన భారత పురుషుల రికర్వ్ జట్టు మళ్లీ రజతంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఆదివారం జరిగిన ఫైనల్లో తరుణ్‌దీప్ రాయ్, అతాను దాస్, ప్రవీణ్ జాదవ్‌లతో కూడిన భారత్ 2–6 పాయింట్ల తేడాతో చైనా చేతిలో ఓడింది. ఈ టోర్నీలో భారత్ ఒక రజతం, రెండు కాంస్యాలు గెలిచింది.



## రన్నరప్ బోపన్న జంట

**స్టుట్‌గార్ట్:** మెర్సిడెస్ కప్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నమెంట్‌లో రోహన్ బోపన్న (భారత్)–డెనిస్ షపోవలోవ్ (కెనడా) జోడీ రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో బోపన్న–షపోవలోవ్ ద్వయం 5–7, 3–6తో టాప్ సీడ్ బ్రూనో సొరెస్ (బ్రెజిల్)–జాన్ పీర్స్ (ఆస్ట్రేలియా) జంట చేతిలో ఓడిపోయింది. 68 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న ద్వయం ఐదు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయింది. రన్నరప్‌గా నిలిచిన బోపన్న జోడీకి 19,680 యూరోల (రూ. 15 లక్షల 43 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 150 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



## భారత్ రెండో విజయం

**హిరోషిమా (జపాన్):** అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) మహిళల సిరీస్ ఫైనల్స్ టోర్నమెంట్‌లో భారత్ రెండో విజయం నమోదు చేసింది. శనివారం ఉరుగ్వేపై ప్రదర్శించిన జోరును పోలాండ్‌పైనా చూపింది. ఆదివారం జరిగిన పూల్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో 5–0తో పోలాండ్‌పై ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున గుర్జీత్ కౌర్ (28వ, 35వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేయగా... జ్యోతి (21వ నిమిషంలో), వందనా కటారియా (26వ నిమిషంలో), నవ్‌నీత్ కౌర్ (56వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు.ఇతర లీగ్ మ్యాచ్‌ల్లో రష్యా 6–0తో మెక్సికోపై, చిలీ 3–1తో జపాన్‌పై, ఉరుగ్వే 4–0తో ఫిజీపై గెలుపొందాయి. భారత్ గ్రూప్‌లోని తన చివరి మ్యాచ్‌ను మంగళవారం ఫిజీతో ఆడనుంది.

### పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | ర | నె.ర.రే. | పా |
|---|---|---|---|---|---|---|
| ఆస్ట్రేలియా | 5 | 4 | 1 | 0 | 0.812 | 8 |
| న్యూజిలాండ్ | 4 | 3 | 0 | 1 | 2.163 | 7 |
| భారత్ | 4 | 3 | 0 | 1 | 1.029 | 7 |
| ఇంగ్లండ్ | 4 | 3 | 1 | 0 | 1.557 | 6 |
| శ్రీలంక | 5 | 1 | 2 | 2 | -1.778 | 4 |
| వెస్టిండీస్ | 4 | 1 | 2 | 1 | 0.666 | 3 |
| దక్షిణాఫ్రికా | 5 | 1 | 3 | 1 | -0.208 | 3 |
| బంగ్లాదేశ్ | 4 | 1 | 2 | 1 | -0.714 | 3 |
| పాకిస్తాన్ | 5 | 1 | 3 | 1 | -1.933 | 3 |
| అఫ్గానిస్తాన్ | 4 | 0 | 4 | 0 | -1.638 | 0 |

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, ర–రద్దు, నె.ర.రే–నెట్ రన్‌రేట్, పా–పాయింట్లు



సాక్షి ప్రాఫిట్ ప్లస్

సోమవారం
17-6-2019


## స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 289 ▼ | 91 ▼ |
| 39,452 | 11,823 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు**

| సూచీ | ముగింపు | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 7,797 | ▼ 40 |
| డోజోన్స్ | 26,090 | ▼ 17 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,346 | ▼ 23 |
| డాక్స్ | 12,096 | ▼ 73 |
| షాంఘై | 2,882 | ▼ 29 |
| నికాయ్ | 21,117 | ▲ 85 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | కరెన్సీ | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 68.78 | 70.42 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 86.63 | 89.79 |
| € | యూరో | ఎస్‌బీఐ | 77.00 | 79.93 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 63.05 | 65.48 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 46.98 | 49.15 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 50.00 | 51.76 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 17.84 | 19.60 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.27 | 19.82 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.46 | 10.81 |

# బంగారు బాట ఎటు..?






## పెట్టుబడి కోసం అయితే భౌతిక బంగారం వద్దు

- ఆభరణాలు, కాయిన్లపై చార్జీల రూపంలో ఎంతో నష్టం
- అందుబాటులో ఎన్నో డిజిటల్ సాధనాలు
- వీటిలో పారదర్శకత ఎక్కువ
- కోరుకున్నప్పుడు నగదు చేసుకునే సౌలభ్యం
- కేంద్రం అందించే సార్వభౌమ బాండ్లు ఆకర్షణీయం
- వీటిపై అదనంగా ఏటా 2.5 శాతం వడ్డీ



బంగారం గతంలో ఆభరణంగానే ప్రసిద్ధి పొందగా, నేడు ఓ పెట్టుబడి సాధనంగానూ ఎక్కువ డిమాండ్ సంతరించుకుంటోంది. ఇతర పెట్టుబడి సాధనాల్లో ఉండే రిస్క్‌ను ఎదుర్కొనేందుకు గాను సురక్షిత సాధనంగా బంగారాన్ని అంతర్జాతీయంగా ఇన్‌స్టిట్యూషన్లతో పాటు, కేంద్ర బ్యాంకులూ దీనికి పెద్దపీట వేస్తున్నాయి. ముఖ్యంగా మన దేశంలో ఇప్పటికీ ఆభరణాల రూపంలో బంగారానికి డిమాండ్ ఎక్కువగా ఉంది. అయితే, ఇందులో నిజంగా ఆభరణాలను ధరించేందుకే వాటిని అందరూ కొనుగోలు చేస్తున్నారని భావించడం పొరపాటే అవుతుంది. దాన్నొక పెట్టుబడిగానూ భావించి ఆభరణాలను కొనేవారున్నారు. బంగారం కాయిన్లను కొనేవారు ఉన్నారు. అవసరంలో అక్కరకు వస్తుందన్న భావనతోనూ మిగులు నిధులు ఉన్నప్పుడు భౌతిక బంగారాన్ని ఆశ్రయించే వారూ ఉన్నారు.

హైదరాబాద్‌కు చెందిన దంతవైద్యురాలు శశిరేఖ (35) కొన్నేళ్ల క్రితం వరకు బంగారు ఆభరణాలు, బంగారం కాయిన్ల కొనుగోలుకే మొగ్గు చూపించేవారు. ఆమె దృష్టిలో అదొక పెట్టుబడి. కానీ, ఇటీవలి కాలంలో ఆమెలో మార్పు వచ్చింది. బంగారం ఆధారిత పెట్టుబడి సాధనాలవైపు ఆమె తన విధానాన్ని మార్చుకున్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసే సార్వభౌమ బంగారం బాండ్లు తదితర వాటిల్లో ఆమె పెట్టుబడులు పెడుతూ, ఆభరణాలను, కాయిన్లను కొనడం ఆపేశారు. "బంగారం నాణ్యత, దాన్ని భద్రంగా దాచుకోవాలన్న ఆందోళన వీటి విషయంలో ఉండదు" అన్నది ఆమె అభిప్రాయం. ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) అంచనాల ప్రకారం భారత్ వద్ద 24,000-25,000 టన్నుల బంగారం ఉంటుంది.

### భౌతికమా, డిజిటలా...?

బంగారాన్ని ఓ పెట్టుబడి సాధనంగా భావించే వారు ఫైనాన్షియల్ ఇన్‌స్ట్రుమెంట్ రూపంలోనే దాన్ని కొనుగోలు చేయాలన్నది నిపుణుల సూచన. ఎందుకంటే ధరల్లో ఎంతో పారదర్శకత ఉంటుంది. కావాలనుకున్నప్పుడు ఈ సాధనాలను విక్రయించి బంగారంగానూ మార్చుకోవచ్చంటున్నారు. పిల్లల వివాహం కోసం ముందు నుంచే బంగారాన్ని కొనుగోలు చేయాలనుకునే వారు, దీనికి బదులు బంగారంతో ముడిపడిన ఆర్థిక సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలని, లక్ష్యానికి సమయం సమీపించినప్పుడు వాటిని విక్రయించి నగదుగా మార్చుకుని, బంగారం ఆభరణాలు కొనుగోలు చేసుకోవడం సరైనదని నిపుణులు సూచిస్తున్నారు. కేవలం బంగారాన్ని అలంకరించుకోవాలనుకుంటేనే ఆభరణాల రూపంలో కొనుగోలు చేయాలని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కమోడిటీస్ హెడ్, అసోసియేట్ డైరెక్టర్ కిషోర్ నార్నే సూచించారు. ఈక్విటీ మార్కెట్లు సంక్షోభాలను ఎదుర్కొనే సమయాల్లో బంగారం పనితీరు మెరుగ్గా ఉండడాన్ని గమనించొచ్చు. ఆ సమయాల్లో ఇన్వెస్టర్ పోర్ట్‌ఫోలియో విలువను కాపాడడంలో బంగారం పాత్ర కీలకం అవుతుంది. అందుకనే ఈక్విటీల్లో ఎక్కువ ఎక్స్‌పోజర్ ఉన్న ప్రతీ ఇన్వెస్టర్ కొంత మేర హెడ్జింగ్ కోణంలో బంగారానికి కేటాయించుకోవాలని నిపుణులు సూచిస్తుంటారు. డాలర్ తదితర కరెన్సీలతో రూపాయి మారకం విలువ క్షీణత రిస్క్‌ను హెడ్జ్ చేసుకునే సాధనంగానూ బంగారం అక్కరకు వస్తుంది. "దూకుడుగా ఉండే ఇన్వెస్టర్లు తమ పోర్ట్‌ఫోలియోలో బంగారాన్ని ఏ మాత్రం ఉంచుకోకపోవచ్చు. ఇటువంటి వారు కరెన్సీ రిస్క్‌ను ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ ఫండ్స్‌ను ఎంచుకోవచ్చు. సంప్రదాయ ఇన్వెస్టర్లు మాత్రం బంగారానికి 10-15 శాతం మేర పెట్టుబడులను కేటాయించుకోవచ్చు" అని ఆర్థిక సలహాదారులు విశాల్ ధావన్ సూచించారు.

### డిజిటల్‌ను ఆశ్రయిస్తే...

బంగారానికి సంబంధించి డిజిటల్ సాధనాలు ఎన్నో అందుబాటులో ఉన్నాయి. ఒకవేళ డిజిటల్ రూపంలో బంగారాన్ని కొనుగోలు చేసే వారు అంతే పరిమాణంలో భౌతిక బంగారాన్ని ఆయా సంస్థలు నిల్వ చేస్తున్నాయా? అన్నది తప్పకుండా పరిశీలించుకోవాలి. ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్), డిజిటల్ గోల్డ్ సాధనాల్లో భౌతిక రూపంలోనూ అంతే మొత్తంలో బంగారాన్ని స్టోర్ చేస్తారు. సార్వభౌమ బంగారం బాండ్లకు మాత్రం భౌతిక బంగారాన్ని నిల్వ చేయడం జరగదు. దీనికి కేంద్ర ప్రభుత్వమే హామీగా ఉంటుంది. ఇక ఆభరణాల సంస్థలు ఆఫర్ చేసే పథకాల్లో ఇన్వెస్టర్ చేసే వారికి సమస్యలు ఎదురయ్యే అవకాశాలు లేకపోలేదు. "జ్యూయలర్ దివాలాతీస్తే మీకు తిరిగి ఇచ్చేందుకు కస్టోడియన్ వాల్టుల్లో ఎటువంటి బంగారం ఉండదు. రుణాలిచ్చిన ఇతర సంస్థల మాదిరిగా మీరు కూడా క్యూలో నించోక తప్పదు" అని ప్రపంచ స్వర్ణ మండలి భారత ఎండీ పీఆర్ సోమసుందరం హెచ్చరించారు.

### బంగారం కాయిన్లు

బంగారం కాయిన్ల ధర సహజంగా బంగారం ధర కంటే 6-7 శాతం ఎక్కువ ఉంటుంది. చాలా వరకు మార్కెట్లో విక్రయించే బంగారం కాయిన్లు హాల్ మార్క్ సర్టిఫికేషన్‌తో బ్రాండెడ్‌వే ఉంటున్నాయి. కొన్ని బ్యాంకు శాఖలతోపాటు ఆభరణాల సంస్థలు వీటిని విక్రయిస్తున్నాయి. ఆయా సంస్థలు కాయిన్లపై తమ బ్రాండ్లను ముద్రించుకోవడం సహజం. "ఎంఎంటీసీ-పీఏఎంపీ తరహా బ్రాండెడ్ రిఫైనరీ ద్వారా విక్రయించే కాయిన్లను కొనుగోలు చేసుకోవడం మంచిది. ఎందుకంటే లండన్ బులియన్ మర్చంట్ అసోసియేషన్ సర్టిఫైడ్ కాయిన్లు అవి" అని కిషోర్‌నార్నే సూచించారు. ఆభరణాల సంస్థలు విక్రయించే కాయిన్లు అన్నీ హాల్‌మార్క్‌వని అనుకోవద్దు. బైబ్యాక్ పాలసీ ఉన్న బ్రాండెడ్ జ్యూయలరీ సంస్థలు విక్రయించే కాయిన్లను పరిశీలించొచ్చు. "పేరొందిన సంస్థకు చెందిన కాయిన్ కాకపోతే, విక్రయించే సమయంలో దానిపై తక్కువ ధరే వస్తుంది" అన్నారు కిషోర్.



### ఆభరణాలు

ఆభరణాలపై తయారీ చార్జీలు సహజంగా 10-15 శాతం ఉంటాయి. డిజైన్లు లేని ఆభరణాలపై 3-5 శాతం వరకు తయారీ చార్జీలను సంస్థలు వసూలు చేస్తుంటాయి. చేతితో చేసిన ఆభరణాలపై 30 శాతం వరకూ తయారీ చార్జీలున్నాయి. తమ పాత ఆభరణాలను మార్పిడి చేసుకున్న సమయంలో వినియోగదారులు సగటున మొత్తం విలువలో 20-25 శాతం నష్టపోతున్నారని కిషోర్‌నార్నే తెలిపారు. అందుకే కొనుగోలు సమయంలో హాల్ మార్క్ సర్టిఫికేషన్ అడగడం మరిచిపోవద్దన్నారు. కొన్ని సందర్భాల్లో హాల్‌మార్క్ సర్టిఫికేషన్ కూడా నకిలీదై ఉండొచ్చంటున్నారు నిపుణులు. సంబంధిత ఆభరణానికి ఏ కేంద్రం హాల్‌మార్క్ ధ్రువీకరణ ఇచ్చిందో కనుక్కుని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ జాబితాలో సంబంధిత కేంద్రం ఉన్నదీ, లేనిదీ పరిశీలించుకోవాలని సూచిస్తున్నారు.

### సార్వభౌమ బంగారం బాండ్లు

ఇవి ప్రభుత్వ హామీతో జారీ చేసే బాండ్లు. ఏటా బంగారం విలువపై 2.5 శాతం వడ్డీ కూడా చెల్లిస్తుండడంతో వీటికి ఆదరణ ఉంది. కాల వ్యవధి ముగిసే సమయంలో ఉన్న బంగారం ధరనే చెల్లించడం జరుగుతుంది. ఈ బాండ్ల కాల వ్యవధి ఎనిమిదేళ్లు. ఐదో ఏట నుంచి కావాలనుకుంటే తప్పుకోవచ్చు.

## పసిడి పరుగే..!

పసిడి ధరల ధోరణి పటిష్టంగానే కనబడుతోంది. శుక్రవారంతో ముగిసిన వారంలో న్యూయార్క్ ఫ్యూచర్స్ మార్కెట్- నైమెక్స్‌లో ఔన్స్ (31.1గ్రా) ధర ఒక దశలో 1359.50 డాలర్లను కూడా తాకింది. అయితే చివరకు వారం ప్రారంభం స్థాయిలోనే 1,345 డాలర్ల వద్ద ముగిసింది. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి ధోరణులు, కొనసాగుతున్న వాణిజ్య యుద్ధ సవాళ్లు, అమెరికా ఆర్థిక రంగం భారీగా పరుగులు తీసే పరిస్థితిలేకపోవడం వంటి అంశాలు ముమ్మందు పసిడికి సానుకూల అంశాలేనని నిపుణులు విశ్లేషిస్తున్నారు. పసిడి కీలక 1360 డాలర్లను దాటితే, 1400 డాలర్ల దాపులకు చేరడం ఖాయమని నిపుణుల భావన. ఇక దేశంలోనూ డాలర్ మారకంలో రూపాయి బలహీనపడే (శుక్రవారం ముగింపు 69.80)ధోరణే ఉందని ఇది పసిడికి సానుకూల అంశమని విశ్లేషణ. దేశీయ ఫ్యూచర్స్ మార్కెట్‌లో ఎంసీఎక్స్‌లో శుక్రవారం పసిడి 10 గ్రాముల ధర రూ. 33,045 వద్ద ముగిసింది.

### బంగారంపై రాబడులు

| సంవత్సరం | స్టాండర్డ్ | ఇంటర్నేషనల్ |
|---|---|---|
| 2009 | 24.2 | 24.4 |
| 2010 | 23.3 | 29.5 |
| 2011 | 32.1 | 10.1 |
| 2012 | 12.1 | 7.1 |
| 2013 | -4.1 | -28 |
| 2014 | -8.6 | -1.7 |
| 2015 | -6.5 | -10.4 |
| 2016 | 11.7 | 8.6 |
| 2017 | 4.8 | 13.1 |
| 2018 | 8 | -1.6 |





### డిజిటల్ గోల్డ్

బంగారం సాధనాల్లో ఆధునికమైనది ఇది. కస్టమర్లు కొనే బంగారానికి సరిపడా భౌతిక బంగారాన్ని ఆయా సంస్థలు ఇతర సంస్థలో టైఅప్ అయి వోల్టుల్లో నిల్వ చేస్తుంటాయి. రేట్లలోనూ పారదర్శకత ఉంటుంది. ఆన్‌లైన్లో, యాప్స్ ద్వారా పేటీఎం, ఫోన్‌పే, మోతీలాల్ ఓస్వాల్, ఆగ్మంట్ తదితర వేదికల ద్వారా డిజిటల్ గోల్డ్‌ను చాలా తక్కువ మొత్తం (రూపాయి నుంచి) నుంచే కొనుగోలు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నాయి. మీరు కోరుకున్నంత మేర సులభంగా కొనుగోలు చేసుకోవచ్చు. అదే బంగారం కాయిన్లు, భౌతిక బంగారానికి కనీస మొత్తం ఉంటే తప్ప కొనుగోలు చేయలేని పరిస్థితి. సార్వభౌమ బంగారం బాండ్లు అయినా సరే కనీసం గ్రాము బంగారం కొనుగోలు చేయక తప్పదు. "చిన్న మొత్తాల్లో కొనుగోలు చేస్తూ, మీకు కావల్సినంత సమకూరిన తర్వాత ఇంటి వద్దకే భౌతిక బంగారాన్ని డెలివరీ తీసుకోవచ్చు" అని ఆగ్మంట్ డైరెక్టర్ సచిన్ కొఠారి తెలిపారు. కొన్ని సంస్థలు కస్టమర్లు పోగు చేసుకున్న డిజిటల్ బంగారాన్ని ఆభరణాల సంస్థలకు బదిలీ చేసుకునే ఆప్షన్‌ను ఇస్తున్నాయి. తద్వారా ఆయా ఆభరణాల సంస్థల నుంచి ఆభరణాలను కొనుగోలు చేసుకోవచ్చు.

### బంగారం ఈటీఎఫ్‌లు/ఫండ్స్

గోల్డ్ ఈటీఎఫ్‌లు అన్నవి షేర్ల మాదిరే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో క్రయ, విక్రయాలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే సాధనాలు. సార్వభౌమ బంగారం బాండ్లతో పోలిస్తే ఈటీఎఫ్‌లను అవసరమైనప్పుడు విక్రయించి నగదు చేసుకునే సౌలభ్యం ఉంటుంది. కాకపోతే బ్రోకింగ్, డీమ్యాట్ ఖాతాలు అవసరం అవుతాయి. ఏటా ఒక శాతం ఎక్స్‌పెన్స్‌రేషియో కూడా చెల్లించుకోవాల్సి వస్తుంది. ఇవి రాబడులపై ప్రభావం చూపిస్తాయని మరిచిపోవద్దు. డీమ్యాట్ ఖాతా లేని వారు బంగారంలో ఇన్వెస్ట్ చేసే మ్యూచువల్ ఫండ్స్‌ను ఎంచుకోవచ్చు.

# ప్రీమియం బైక్‌కు బీమా అప్‌గ్రేడ్

**గుర్నీష్ ఖురానా**
బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ మోటార్ కంట్రీ హెడ్

*దేశంలో వాహనాల వినియోగం పెరిగిపోతోంది. ఏ ఇతర దేశంతో పోల్చి చూసినా ఎక్కువ వృద్ధి మనదేశంలోనే. దేశీయ ఆటో పరిశ్రమ అమ్మకాల్లో 80 శాతం ద్విచక్ర వాహనాలదే ఆధిపత్యం. రవాణా పరంగా అత్యంత సౌకర్యమైనది కావడం వల్లే. అయితే, ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే అధిక ఇంజన్ సామర్థ్యంతో కూడిన మోటారు సైకిళ్లకు డిమాండ్ పెరుగుతుండడం. ఈ విభాగంలో 300 నుంచి 500సీసీ ఇంజన్ సామర్థ్యాల బైకుల ఆధిపత్యం కొనసాగుతోంది. ఇక 500సీసీ కంటే అధిక సామర్థ్యం కలిగిన బైకుల మార్కెట్ కూడా వేడెక్కుతోంది. మెట్రోలు, టైర్-1 పట్టణాల్లో ఈ బైకులకు ఆదరణ పెరుగుతోంది. ఈ బైకుల ఖరీదు ఎక్కువే అయినప్పటికీ, రుణం లభించే వెసులుబాటు ఉండడం సానుకూలం. అయితే, దురదృష్టవశాత్తూ ఈ బైకులు ప్రమాదం బారిన పడితే విడి భాగాలకు జరిగే నష్టం పెద్దగానే ఉంటుంది. ఇది పాకెట్‌కు చిల్లు పెడుతుంది. కనుక కాంప్రెన్సివ్ కవరేజీతో కూడిన మోటారు ఇన్సూరెన్స్ ఒక్కటీ ఉండే సరిపోదు. తగిన యాడ్‌ఆన్ కవర్లను కూడా తీసుకోవడం అవసరం. అప్పుడే పూర్తి రక్షణ లభిస్తుంది.*

### జీరో లేదా నిల్ డిప్రిసియేషన్ కవర్, ఇంజన్ ప్రొటెక్టర్

సున్నా లేదా తరుగుదల లేని కవరేజీ అన్నది మీ బైక్‌కు తప్పనిసరి. ఎందుకంటే చిన్న విడిభాగం రిపేర్ చేయాల్సి వచ్చినా ఖర్చు ఎక్కువే అవుతుంది. మన దేశంలోకి దిగుమతి అయ్యే బైకుల్లో అధిక శాతం పూర్తిగా నిర్మించిన యూనిట్లే (సీబీయూ). వీటికి ఏదైనా నష్టం జరిగితే ఈ కవరేజీతో తగినంత పరిహారాన్ని ఏ మినహాయింపు లేకుండా పొందొచ్చు. ఇంజన్ ప్రొటెక్టర్ కూడా తప్పనిసరి. దీని కింద ఇంజన్‌లో చిన్న విడిభాగాలను మార్చాల్సి వచ్చినా లేదా రిపేర్ చేయాల్సి ఉన్నా కవరేజీ పొందొచ్చు. అలాగే, గేర్‌బాక్స్‌లో విడిభాగాలను మార్చాల్సి ఉన్నా కవరేజీ ఇస్తుంది. దెబ్బతిన్న ఇంజన్ ఓవర్‌హాల్, గేర్‌బాక్స్ ఓవర్‌హాల్, లేబర్ ఖర్చులను సైతం చెల్లిస్తుంది. వర్షపు నీరు నిలిచే ప్రాంతాల్లో బైకుల ఇంజన్లలోకి నీరు వెళితే అంతర్గత భాగాలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. అప్పుడు ఈ కవరేజీ ఉపయోగపడుతుంది.



### కన్స్యూమబుల్ కవర్

చిన్నవి కూడా మొత్తం ఖర్చుల్లో చేరి పెద్దవవుతాయి. వాహనంలో కన్స్యూమబుల్స్ అంటే ఇంజన్ ఆయిల్, గేర్‌బాక్స్ ఆయిల్, పవర్ స్టీరింగ్ ఆయిల్, బైక్ ఆయిల్, బ్యాటరీ ఎలక్ట్రోలైట్, ఫ్లూయిడ్, రేడియేటర్ కూలంట్, నట్లు, బోల్టులు ఈ తరహా విడిభాగాలు. కన్స్యూమబుల్ కవర్ అన్నది కన్స్యూమబుల్స్‌కు కవరేజీనిచ్చే యాడ్‌ఆన్. ఇది సాధారణ మోటార్ బీమాలో భాగంగా ఉండదు. కానీ, ఇది తప్పనిసరిగా తీసుకోవాల్సిన యాడ్ ఆన్ కవర్. ఎందుకంటే ఒకవేళ ప్రమాదం జరిగితే ఆయిల్‌తోపాటు ఇతర కన్స్యూమబుల్స్ మార్చాల్సి వస్తే ఖర్చులు ఎక్కువే అవుతాయి. జీరో డిప్రిసియేషన్, ఇంజన్ ప్రొటెక్టర్‌కు టాపప్‌గా దీన్ని తీసుకోవచ్చు.



### పిలియన్ కవర్ లేదా ఎక్స్‌ట్రా యాక్సిడెంటల్ కవర్

సూపర్ బైకులన్నవి అధిక ఇంజన్ సామర్థ్యం, అధిక పవర్‌తో ఉంటాయి. వీటిని నడపడంలో, ముఖ్యంగా వెనుక ఎవరైనా కూర్చున్న సమయాల్లో నడపడంలో శిక్షణ, సాధన అవసరం. ఈ బైకులకు యాక్సిడెంట్ జరిగితే చాలా ప్రమాదకరంగా ఉంటుంది. చాలా కేసుల్లో బైక్ నడిపే వ్యక్తితోపాటు వెనుక కూర్చున్న వారు కూడా మరణించే అవకాశాలు ఉంటాయి. బండిని నడిపే వ్యక్తి యజమాని కాకపోయినా, వెనుక కూర్చున్న వారికీ రూ.15 లక్షల కవరేజీ లభిస్తుంది.

## ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

రూ. కోటి వరకు డిపాజిట్లు, (జూన్-14-2019 అంకెలు శాతాల్లో)

| బ్యాంకులు | 6 నెలలు- ఏడాది | 1-2 ఏళ్లు | 3-5 ఏళ్లు |
|---|---|---|---|
| ఆంధ్రా బ్యాంక్ | 6.6 | 6.8 | 6.75 |
| యాక్సిస్ బ్యాంక్ | 7.1 | 7.3 | 7.25 |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 6.5 | 7 | 6.7 |
| బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6.25 | 6.75 | 6.5 |
| కెనరా బ్యాంక్ | 6.2 | 6.75 | 6 |
| సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6.55 | 6.65 | 6.55 |
| కార్పొరేషన్ బ్యాంక్ | 6.35 | 7 | 6.5 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | 7.1 | 7.3 | 7.25 |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 6.75 | 7.1 | 7.25 |
| ఐడీబీఐ బ్యాంక్ | 6.5 | 7.25 | 7.4 |
| ఇండస్‌ఇండ్ బ్యాంక్ | 7.25 | 7.75 | 7.5 |
| కోటక్ మహీంద్రా బ్యాంక్ | 7 | 7.2 | 7 |
| ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ | 6.5 | 6.85 | 6.75 |
| ఎస్‌బీఐ | 6.4 | 7 | 6.7 |
| సిండికేట్ బ్యాంక్ | 6.35 | 7.05 | 7.15 |
| పీఎన్‌బీ | 6.95 | 7 | 6.25 |
| యస్ బ్యాంక్ | 7.15 | 7.65 | 7.25 |

బ్యాంక్ బజార్.కామ్ అందించిన వివరాల ఆధారంగా...

# మోస్తరు రిస్క్... రాబడులు ఎక్కువ!

### ఎస్‌బీఐ ఈక్విటీ హైబ్రిడ్ ఫండ్




ఫండ్ రివ్యూ

కాస్త అధిక రాబడుల కోసం మోస్తరు రిస్క్ తీసుకునే ఇన్వెస్టర్ల ముందున్న ఎంపికల్లో ఎస్‌బీఐ ఈక్విటీ హైబ్రిడ్ ఫండ్ కూడా ఒకటి. తమవద్దనున్న మిగులు నిల్వలను ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవడం ద్వారా మెరుగైన రాబడులు సొంతం చేసుకునేందుకు అవకాశం ఉంది. ఇది అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఈక్విటీ పథకం. అంటే 65 శాతం పెట్టుబడులను ఈక్విటీలకు కేటాయించి, మిగిలిన 35 శాతాన్ని డెట్‌లో ఇన్వెస్ట్ చేస్తుంది. తద్వారా ఈక్విటీ పెట్టుబడులతో అధిక రాబడులు, డెట్ పెట్టుబడులతో రిస్క్‌ను తగ్గించే విధంగా ఈ పథకం పనితీరు ఉంటుంది. గతంలో ఈ పథకం ఎస్‌బీఐ మ్యాగ్నం బ్యాలెన్స్‌డ్ ఫండ్ పేరుతో కొనసాగిందన్నది గుర్తుంచుకోవాలి.

**రాబడులు**

ఈ పథకం రాబడులు అన్ని సమయాల్లోనూ ఈక్విటీ హైబ్రిడ్ విభాగం సగటు రాబడుల కంటే అధికంగానే ఉన్నాయి. పదేళ్ల కాలంలో వార్షికంగా 13 శాతం రాబడులను ఇచ్చింది. ఇక ఐదేళ్లలో వార్షిక సగటు రాబడులు 16.7 శాతం కాగా, ఈక్విటీ హైబ్రిడ్ విభాగం సగటు రాబడులు 13.8 శాతంగానే ఉన్నాయి. ఐదేళ్లలో ఈ పథకం రాబడులు 14 శాతం, మూడేళ్లలో 12.6 శాతం చొప్పున ఉండగా, ఈ విభాగం సగటు రాబడులు ఇదే కాలంలో 11.2 శాతం, 11.1 శాతం చొప్పున ఉన్నాయి. ఈక్విటీల్లోనూ రిస్క్ తక్కువగా ఉండేందుకు లార్జ్‌క్యాప్ స్టాక్స్‌ను ఎంపిక చేసుకుంటుంది. ముఖ్యంగా కొత్తగా ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలనుకునే వారు, రిస్క్ మధ్యస్థంగా ఉండాలని భావించే వారికి ఈ పథకం అనుకూలంగా ఉంటుంది.

**పోర్ట్‌ఫోలియో**

ఈక్విటీ, డెట్ కలబోత కనుక భిన్న మార్కెట్ పరిస్థితులకు తగ్గట్టు పోర్ట్‌ఫోలియోను మార్చుకోవడం ఈ పథకం పనితీరులో భాగంగా గమనించొచ్చు. గత ఐదేళ్ల కాలాన్ని పరిశీలిస్తే ఈ పథకం మేనేజర్లు ఈక్విటీల కేటాయింపులను కనిష్టంగా 64 శాతం, గరిష్టంగా 72 శాతం మధ్య నిర్వహించారు. అస్థిరతల సమయాల్లో ఈక్విటీల్లో పెట్టుబడులను తగ్గించుకుని 10 శాతం వరకు నగదు నిల్వలను ఉంచుకునే వ్యూహాన్ని ఈ పథకం పాటిస్తుంది. 2017 మార్కెట్ ర్యాలీ సమయంలో ఈ పథకంలోని మొత్తం ఈక్విటీ పెట్టుబడులు 72 శాతంగా ఉండగా, 2018 కరెక్షన్ సమయానికి 64 శాతానికి పరిమితం అయ్యాయి. దీంతో బెంచ్‌మార్క్ సూచీలతో పోలిస్తే ఈ పథకం నష్టాలను తగ్గించుకుంది. ఈక్విటీ పెట్టుబడుల విషయంలో మల్టీక్యాప్ విధానాన్ని అనుసరిస్తుంది. ప్రస్తుతానికి ఈక్విటీ పెట్టుబడుల్లో 72 శాతాన్ని లార్జ్‌క్యాప్‌లోనే ఇన్వెస్ట్ చేసింది. మిగిలిన మొత్తం మిడ్, స్మాల్‌క్యాప్ కంపెనీలకు కేటాయించింది. అలాగే, పోర్ట్‌ఫోలియోలో 54 స్టాక్స్ ఉన్నాయి. ప్రస్తుతం ఈక్విటీల్లో 72 శాతం, డెట్‌లో 24.58 శాతం పెట్టుబడులు ఉండగా, మిగిలిన మొత్తం నగదు రూపంలో ఉంచుకుంది. ఇక ఈక్విటీ పెట్టుబడుల్లో 31.58 శాతం ఫైనాన్షియల్, బ్యాంకింగ్ రంగ స్టాక్స్‌లోనే ఉన్నాయి. ఆ తర్వాత సేవల రంగంలో 9 శాతం, ఎనర్జీ, ఎఫ్‌ఎంసీజీ రంగాలకు ఒక్కోదానికీ 5 శాతానికి పైగా కేటాయింపులు చేసింది.

### ఈక్విటీ టాప్ హోల్డింగ్స్

| కంపెనీ | పెట్టుబడుల శాతం |
|---|---|
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు | 7.27 |
| ఎస్‌బీఐ | 5.17 |
| కోటక్ బ్యాంకు | 4.56 |
| ఇన్ఫోసిస్ | 3.27 |
| భారతీ ఎయిర్‌టెల్ | 3.13 |
| రిలయన్స్ ఇండస్ట్రీస్ | 3.11 |
| ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ | 3.07 |
| బజాజ్ ఫైనాన్స్ | 2.89 |
| ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ | 2.58 |
| దివిస్‌ల్యాబ్స్ | 2.49 |



తక్షణ విజయాల్లా అనిపించేవన్నీ...
సుదీర్ఘకాల కృషి ఫలితాలే..!
- స్టీవ్ జాబ్స్, యాపిల్ సహవ్యవస్థాపకులు

## బొమ్మ-బొరుసు



# పెద్ద టీవీలకు క్రికెట్ జోష్!

- ప్రపంచ కప్‌తో 100 శాతం పెరిగిన అమ్మకాలు
- మెట్రోలతో పాటు చిన్న పట్టణాల్లోనూ భారీ విక్రయాలు
- ధర రూ. 50 వేల పైనే..



**న్యూఢిల్లీ:** క్రికెట్ వరల్డ్ కప్ మ్యాచ్‌లు వర్షాల దెబ్బతో అభిమానులను నిరాశపరుస్తున్నా.. టీవీల అమ్మకాలకు మాత్రం బాగానే ఉపయోగపడుతున్నాయి. క్రికెట్ వరల్డ్ కప్ పుణ్యమాని పెద్ద టీవీల అమ్మకాలు మాత్రం భారీగా పెరుగుతున్నాయి. క్రికెట్ అభిమానులు భారీ స్క్రీన్‌లపై మ్యాచ్‌లను చూసేందుకు ఆసక్తి కనపరుస్తుండటమే ఇందుకు కారణం. గతేడాది ఇదే వ్యవధితో పోలిస్తే సోనీ, శామ్‌సంగ్, ఎల్‌జీ, పానాసోనిక్ తదితర కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ తయారీ కంపెనీల పెద్ద టీవీల (55 అంగుళాలు, ఆ పైన) అమ్మకాలు 100 శాతం దాకా పెరగడం దీనికి నిదర్శనం. కేవలం మెట్రో నగరాలకు మాత్రమే పరిమితం కాకుండా హుబ్లి, జబల్‌పూర్, రాయ్‌పూర్, రాంచీ, కొచి, నాగ్‌పూర్ వంటి చిన్న పట్టణాల్లో కూడా ఈ ధోరణి కనిపిస్తోంది. మ్యాచ్‌లు నాకవుట్ రౌండ్స్ స్థాయికి వచ్చే సరికి పెద్ద టీవీల అమ్మకాలు మరింతగా పుంజుకోగలవని కంపెనీలు ఆశిస్తున్నాయి. ఆకర్షణీయ ఆఫర్లు, సులభతరమైన ఫైనాన్సింగ్, క్యాష్ బ్యాక్‌లు మొదలైనవి ఇందుకు ఊతంగా ఉండగలవని భావిస్తున్నాయి. ఎన్ని యూనిట్స్ అమ్ముడైనదీ ఇదమిత్థంగా ఏ సంస్థా వెల్లడించకపోయినప్పటికీ.. విక్రయాల వృద్ధి రెట్టింపైనట్లు మాత్రం చెబుతున్నాయి. ఇంగ్లాండ్‌లో మే 30న ప్రారంభమైన ఐసీసీ వరల్డ్ కప్ జూలై 14 దాకా కొనసాగనుంది.

**లక్ష్యం పెంపు..**

'ప్రపంచ కప్ ప్రారంభమైనప్పట్నుంచీ పెద్ద స్క్రీన్స్.. ముఖ్యంగా 55 అంగుళాల కన్నా పెద్దవి, 4కే టీవీల అమ్మకాలు 100 శాతం ఎగిశాయి. గతేడాది ఇదే వ్యవధితో పోలిస్తే రెట్టింపు స్థాయికి చేరాయి' అని సోనీ ఇండియా బ్రావియా బిజినెస్ విభాగం హెడ్ సచిన్ రాయ్ తెలిపారు. వరల్డ్ కప్‌లో భారత్ టీమ్ ముందుకెళ్లే కొద్దీ టీవీల విక్రయాలూ పెరగగలవని శాంసంగ్ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ వ్యాపార విభాగం) రాజీవ్ భుటాని చెప్పారు. 'మే నెలలో 55 అంగుళాలకు పైబడిన టీవీల (క్యూఎల్ఈడీలు సహా) అమ్మకాలు రెట్టింపయ్యాయి. 75 అంగుళాలు అంతకు మించిన టీవీల విక్రయాలు 5 రెట్లు పెరిగాయి. ఈ ప్రపంచ కప్ సీజన్‌లో పెద్ద స్క్రీన్స్‌కు పెరుగుతున్న డిమాండ్‌ను ఇది సూచిస్తోంది' అని ఆయన తెలిపారు. మరోవైపు కస్టమర్లకు మరింత చేరువయ్యేందుకు ఇలాంటి క్రీడా సంరంభాలు అనువైన సమయంగా ఉంటాయని పానాసోనిక్ ఇండియా బిజినెస్ హెడ్ (కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ విభాగం) శరత్ నాయర్ తెలిపారు. '55 అంగుళాలు, అంతకు మించిన పెద్ద టీవీల విక్రయాల ఊతంతో వరల్డ్ కప్ 2019 సీజన్‌లో మా అమ్మకాలు 25 శాతం పెంచుకోవాలని నిర్దేశించుకున్నాం' అని ఆయన పేర్కొన్నారు. ఎల్‌జీ కూడా తమ ప్రీమియం టీవీల విభాగంలో ఇలాంటి ధోరణే ఉన్నట్లు తెలిపింది. 'థింక్ ఏఐ ఫీచర్ గల స్మార్ట్ టీవీల అమ్మకాల్లో 35 శాతం వృద్ధి అంచనా వేస్తున్నాం. ఓఎల్ఈడీ, నానోసెల్ టీవీల విక్రయాల్లోనైతే 200 శాతం వృద్ధి అంచనాలు ఉన్నాయి' అని ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ప్రతినిధి తెలిపారు.

**రూ. 60 లక్షల దాకా రేటున్న టీవీలు..**

పేరొందిన బ్రాండ్స్ పెద్ద టీవీల ధర రూ. 50,000 నుంచి రూ. 1.75 లక్షల మధ్య ఉంటున్నాయి. ఇక కొన్ని మోడల్స్ రేట్లు మరింత ఎక్కువగా కూడా ఉంటున్నాయి. ఇటీవలే శాంసంగ్ సంస్థ 8కే యూహెచ్‌డీ టీవీని ప్రవేశపెట్టింది. దీని ధర ఏకంగా రూ. 10.99 లక్షల నుంచి రూ. 59.99 లక్షల దాకా ఉంది. గణాంకాల ప్రకారం దేశీ టీవీ మార్కెట్‌లో ఏటా 1.25 కోట్ల టీవీలు అమ్ముడవుతున్నాయి. వీటిలో 15 శాతం వాటా పెద్ద టీవీలది ఉంటోంది.

**ఆఫర్ల జోరు..**

ఈ సెగ్మెంట్‌లో ఆఫ్‌లైన్ స్టోర్స్ అమ్మకాల వాటానే ఎక్కువగా ఉంటున్నా, ఆన్‌లైన్ సేల్స్ కూడా పుంజుకుంటున్నాయని టీవీ కంపెనీలు వెల్లడించాయి. విక్రయాలను పెంచుకునేందుకు బ్రాండింగ్, ప్రమోషన్స్ కార్యకలాపాలపై కూడా సంస్థలు భారీగా ఖర్చు చేస్తున్నాయి. 'టోర్నమెంట్‌లో భారత్ ముందుకు వెళ్లే కొద్దీ.. మరింత మంది వీక్షకులు పెద్ద టీవీల వైపు మళ్లే అవకాశం ఉందని అంచనాలు ఉన్నాయి. అందుకే మేం జీరో డౌన్ పేమెంట్ ఫైనాన్స్‌తో పాటు క్యూఎల్ఈడీ టీవీలపై పదేళ్ల నో స్క్రీన్ బర్న్-ఇన్, ప్యానెల్స్‌పై రెండేళ్ల వారంటీ, 15% దాకా క్యాష్‌బ్యాక్ ఆఫర్లు ఇస్తున్నాం. అలాగే ప్రీమియం క్యూఎల్ఈడీ టీవీల కొనుగోలుదారులకు ఉచితంగా అమెజాన్ ఎకో ప్లస్, 4కే యూహెచ్‌డీ టీవీతో అమెజాన్ ఎకో డాట్ ఫ్రీగా ఇస్తున్నాం' అని భుటాని తెలిపారు. తాము అకర్షణీయమైన ఫైనాన్స్ ఆఫర్లు అందిస్తున్నట్లు రాయ్ వివరించారు.

# ఫెడ్, వాణిజ్య చర్చలే కీలకం

- బుధవారం వెల్లడికానున్న ఫెడ్ వడ్డీరేట్ల నిర్ణయం
- ఈవారంలోనే జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశం
- వాణిజ్య యుద్ధం, ముడిచమురుపై ఇన్వెస్టర్ల దృష్టి



**ముంబై:** ఎన్నికల ర్యాలీ అనంతరం పరిమిత శ్రేణిలో కదలాడుతున్న దేశీయ స్టాక్ సూచీలు.. ఇక్కడ నుంచి ఏదిశగా ప్రయాణించనున్నాయనే అంశానికి అంతర్జాతీయ పరిణామాలే కీలకమని దలాల్ స్ట్రీట్ వర్గాలు భావిస్తున్నాయి. ఈవారంలో అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమావేశంకానుండగా.. వడ్డీరేట్ల కోతకు సంబంధించి ఎటువంటి నిర్ణయాలు ఉంటాయనే అంశంపైనే ప్రధానంగా మార్కెట్ గమనం ఆధారపడిఉందని అంచనావేస్తున్నాయి. మంగళ, బుధవారాల్లో సమావేశంకానున్న ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ (ఎఫ్ఓఎంసీ).. బుధవారం తన నిర్ణయాన్ని ప్రకటించనుంది. ఉద్యోగాల వృద్ధి, రిటైల్ అమ్మకాల వంటి గణాంకాల ఆధారంగా ఈసారి వడ్డీరేట్లు తగ్గేందుకు ఆస్కారం లేదని మార్కెట్ వర్గాలు అంచనాకడుతున్నాయి. అయితే, ఇందుకు భిన్నంగా ఎఫ్ఓఎంసీ మెతక వైఖరితో 25 బేసిస్ పాయింట్లు తగ్గించేందుకు 33 శాతం అవకాశం ఉందని సీఎంఈ గ్రూప్ ఫెడ్ వాచ్‌టూల్ ఆధారంగా తెలుస్తోంది. 'భవిష్యత్ అంచనాలకంటే తక్కువ ఆర్థిక వృద్ధి నమోదుకావడం.. పెరుగుతున్న నిరుద్యోగ ప్రయోజనాలు, బడ్జెట్ లోటు వంటి అంశాల నేపథ్యంలో ఫెడ్ వడ్డీరేట్ల కోత నిర్ణయం తీసుకోవాలనే సూచనలు పెరిగాయి' అని ఆనంద్ రాఠీ రీసెర్చ్ అనలిస్ట్ జిగర్ త్రివేది అన్నారు. ఈనెల్లో వడ్డీ రేట్లు తగ్గించపోయినప్పటికీ.. మెతక వైఖరిని ప్రదర్శిస్తే జూలైలో రేట్ల కోతకు సంకేతంగా ఉండనుందని ఐసీఐసీఐ డైరెక్ట్ విశ్లేషకులు అమిత్ గుప్తా అన్నారు.

**అమెరికాపై సుంకాలు పెంచిన భారత్..**

భారత్ నుంచి దిగుమతయ్యే స్టీల్, అల్యూమినియం ఉత్పత్తులపై ఇటీవలే అమెరికా ప్రభుత్వం పన్నులు విధించిన విషయం తెలిసిందే. కాగా, ఇందుకు ప్రతిగా అమెరికా నుంచి దిగుమతయ్యే 28 వస్తువులపై భారత్ భారీగా సుంకాలు పెంచింది. పలు వస్తువులపై సుంకాన్ని 30 శాతం ఏకంగా 120 శాతానికి పెంచి.. ఆదివారం నుంచే ఈ పెంపు అమల్లోకి వస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. అంతర్జాతీయంగా కొనసాగుతున్న వాణిజ్య యుద్ధం మరింత ముదిరితే ఇది మార్కెట్ పతనానికి దారితీసేందుకు ఆస్కారం ఉందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధనా విభాగం చీఫ్ వినోద్ నాయర్ విశ్లేషించారు.

**జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశం ఈవారంలోనే..**

గురువారం జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశంకానుంది. బిజినెస్ టూ బిజినెస్ (బీ2బీ) అమ్మకాలకు సంబంధించి ఈ-ఇన్వాయిస్ టర్నోవర్ పరిమితిని ఈ సమావేశంలో ప్రకటించనుంది. ఇన్వాయిస్ దుర్వినియోగం, పన్ను ఎగవేతలను అరికట్టడం వంటి చర్యల్లో భాగంగా ఈ పరిమితి రూ.50 కోట్లుగా ఉండేందుకు అవకాశం ఉందని అంచనాలు వెలువడుతున్నాయి. కౌన్సిల్ నిర్ణయాలు పలు రంగాల షేర్లపై ప్రభావం చూపనున్నాయని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

**స్థూల ఆర్థిక అంశాలపై దృష్టి..**

మార్చితో ముగిసిన త్రైమాసికానికి కరెంట్ అకౌంట్ బ్యాలెన్స్ సోమవారం.. జూన్ 14 తో ముగిసిన వారానికి విదేశీ మారక నిల్వల డేటా, జూన్ 7నాటికి డిపాజిట్ - బ్యాంక్ రుణాల వృద్ధి సమాచారం శుక్రవారం వెల్లడికానున్నాయి.

**ముడిచమురు ధరల ప్రభావం..**

గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో చమురు ట్యాంకర్లపై దాడుల నేపథ్యంలో బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్ వారాంతాన 1% పెరిగి 62.01 వద్ద ముగిసింది. అయితే, వారం మొత్తం మీద చూస్తే.. 2 శాతం పతనమైంది. ఇక ఈ నెల చివరి వారంలో వియన్నాలో ఒపెక్ భేటీ నేపథ్యంలో ఈవారం భారీ ఒడిదుడుకులకు ఆస్కారం ఉందని జిగర్ త్రివేది విశ్లేషించారు. అమెరికా-చైనాల మధ్య వాణిజ్య యుద్ధం సెంటిమెంట్‌ను దెబ్బతీసే అంశంగా ఉందన్నారు.

**జూన్‌లో 11,132 కోట్ల విదేశీ నిధులు**

భారత్ క్యాపిటల్ మార్కెట్లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పీఐ) పెట్టుబడుల పరంపర కొనసాగుతోంది. జూన్‌లో ఇప్పటివరకు వీరు రూ.11,132 కోట్లను పెట్టుబడి పెట్టినట్లు డిపాజిటరీ డేటా ద్వారా వెల్లడయింది. ఈనెల 3-14 కాలంలో ఈక్విటీ మార్కెట్లో రూ.1,517 కోట్లు.. డెట్ మార్కెట్లో రూ.9,616 కోట్లను ఇన్వెస్ట్‌చేశారు. ఈ ఏడాది మేలో రూ.9,031 కోట్లు, ఏప్రిల్‌లో రూ.16,093 కోట్లు పెట్టుబడిపెట్టారు.

## పెరగనున్న హోండా కార్ల ధరలు

**న్యూఢిల్లీ:** వచ్చే నెల నుంచి కార్ల ధరలను పెంచాలని యోచిస్తున్నట్లు హోండా కార్స్ ఇండియా వెల్లడించింది. పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు, నూతన భద్రతా ప్రమాణాల అమలుకు సంబంధించిన ధరల భారాన్ని వినియోగదారులపై మోపాలని భావిస్తున్నట్లు తెలిపింది. ఈ అంశంపై కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, డైరెక్టర్ (సేల్స్ అండ్ మార్కెటింగ్) రాజేష్ గోయల్ మాట్లాడుతూ..



'జూలై నుంచి కార్ల ధరలను పెంచే దిశగా నిర్ణయాలు తీసుకుంటున్నాం. గత కొంతకాలంగా ముడి పదార్థాల ధరలు పెరుగుతుండడం, భద్రతా ప్రమాణాల అంశాలే ఇందుకు ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో ధరలు 1.2 శాతం మేర పెరిగేందుకు అవకాశం ఉంది' అని అన్నారు. పెంపు అమలైతే ఈ ఏడాదిలో రెండవ సారి హోండా కార్ల ధరలు పెరిగినట్లు అవుతుంది. ఫిబ్రవరిలో రూ.10,000 మేర ధరలు పెరిగాయి. మరోవైపు ఇతర సంస్థలు కూడా ఈఏడాది జనవరిలో ధరలను పెంచాయి.

## పీఎస్‌యూ బ్యాంకులకు 30,000 కోట్లు!

**బడ్జెట్‌లో ప్రకటించే అవకాశం**



**న్యూఢిల్లీ:** ప్రభుత్వరంగ (పీఎస్‌యూ) బ్యాంకుల అవసరాలు ఏ మేరకు అన్న విషయంపై కేంద్ర ఆర్థిక శాఖ కసరత్తు చేస్తోంది. జూలై 5న ప్రకటించే పూర్తి స్థాయి బడ్జెట్‌లో పీఎస్‌యూ బ్యాంకులకు రూ.30,000 కోట్ల నిధుల సాయాన్ని ప్రకటించే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపిన సమాచారం. దీనివల్ల ఆయా బ్యాంకుల కనీస మూలధన అవసరాలు తీరతాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2019-20 ఆర్థిక సంవత్సరానికి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఒకవేళ బ్యాంకుల మధ్య మరో విలీన నిర్ణయం కనుక ఉంటే అదనపు నిధులు అవసరమవుతాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దేనా, విజయాబ్యాంకులను బీవోబీ విలీనం చేసుకోవడం వల్ల చేరుకోవాల్సిన అదనపు మూలధన అవసరాల కోసం కేంద్రం రూ.5,042 కోట్లను ఇచ్చిన విషయం తెలిసిందే. 2018-19 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వరంగ బ్యాంకులకు కేంద్రం భారీగా రూ.1,06,000 కోట్ల నిధుల సాయాన్ని అందించడం గమనార్హం. ఎన్‌పీఏలకు కేటాయింపులు అధికంగా చేయడం కారణంగా సమస్యలను ఎదుర్కొంటున్న బ్యాంకులు ప్రభుత్వ నిధులతో ఊపిరిపీల్చుకున్నాయి.

**డెవలపర్లకు నిధులందించాలి: క్రెడాయ్**

అందుబాటు ధరల గృహ ప్రాజెక్టులకు భూమిని కొనుగోలు చేసేందుకు బ్యాంకులు రియల్టర్లకు నిధుల సాయాన్ని అందించాలని క్రెడాయ్ డిమాండ్ చేసింది. అన్ని చట్టాల్లోనూ అందుబాటు ధరల గృహాలకు ఒకటే నిర్వచనం ఉండేలా చూడాలని బడ్జెట్ ముందస్తు ప్రతిపాదనల్లో భాగంగా సూచించింది.

## స్విస్ ఖాతాదారులకు సెగ

**బెర్న్/న్యూఢిల్లీ:** సందేహాస్పద లావాదేవీలు జరిపిన స్విస్ బ్యాంకుల ఖాతాదారుల చుట్టూ ఉచ్చు బిగుసుకుంటోంది. ఇలాంటి 50 మంది దాకా భారతీయ ఖాతాదారుల వివరాలను భారత ప్రభుత్వానికి అందించే దిశగా స్విట్జర్లాండ్ ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. వీరిలో చాలా మందికి రియల్ ఎస్టేట్, ఆర్థిక సేవలు, టెక్నాలజీ, టెలికం, పెయింట్స్, హోమ్ డెకరేషన్, వజ్రాభరణాలు తదితర రంగాల్లో కార్యకలాపాలు ఉన్నాయి. స్విస్ ప్రభుత్వ గెజిట్‌లో ఇటీవలి కాలంలో ప్రకటించిన పూర్తి పేర్లలో కృష్ణ భగవాన్ రామ్‌చంద్, పొట్లూరి రాజమోహన్ రావు, కుల్‌దీప్ సింగ్ ధింగ్రా, అనిల్ భరద్వాజ్, దినేష్ కుమార్ హిమత్‌సింకా వంటి వారు ఉన్నారు.

# ఈ ఏడాది క్యాపెక్స్ రూ.1,400 కోట్లు: అరబిందో



హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మూలధన వ్యయం సుమారు రూ.1,400 కోట్లు ఉంటుందని ఔషధ సంస్థ అరబిందో ఫార్మా వెల్లడించింది. అలాగే టర్నోవర్‌లో పరిశోధన, అభివృద్ధికి చేసే వ్యయం 5-6 శాతం ఉండొచ్చని కంపెనీ ఎండీ ఎన్.గోవిందరాజన్ తెలిపారు. మూలధన వ్యయంలో ఎక్కువ మొత్తం ఫినిష్డ్ డోసేజెస్, ఏపీఐల తయారీ సామర్థ్యం పెంపు కోసం వినియోగిస్తామన్నారు. బయోసిమిలర్లకు సంబంధించి రెండు మూడింటికి ఫేజ్-1, ఒకదానికి ఫేజ్-3 ప్రారంభిస్తామని చెప్పారు. అరబిందో ఫార్మా 2018 సెప్టెంబరులో నోవార్టిస్ విభాగమైన శాండోజ్‌కు చెందిన యూఎస్‌లోని మూడు ప్లాంట్ల కొనుగోలుకై ఆ సంస్థతో ఒప్పందం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ డీల్ విషయమై యూఎస్ ఫెడరల్ ట్రేడ్ కమిషన్ నుంచి 8-12 వారాల్లో అనుమతులు లభించే అవకాశం ఉందని అరబిందో ఫార్మా (యూఎస్ఏ) సీఎఫ్‌వో స్వామి అయ్యర్ వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆర్అండ్‌డీకి టర్నోవరులో 4.5 శాతం అంటే రూ.872 కోట్లు వెచ్చించింది. రూ.1,500 కోట్లకుపైగా మూలధన వ్యయం చేసింది.

## బజాజ్ ఫైనాన్స్ | బ్రోకరేజ్ సంస్థ: ఇండియాబుల్స్ వెంచర్స్ | కొనొచ్చు

**సాక్షి స్టాక్స్**



**ప్రస్తుత ధర:** రూ.3,520 **టార్గెట్ ధర:** రూ.4,000

**ఎందుకంటే:** బజాజ్ గ్రూప్‌నకు చెందిన బజాజ్ ఫిన్‌సర్వ్‌కు ఇది అనుబంధ సంస్థ. బజాజ్ ఫిన్‌సర్వ్‌లో బజాజ్ ఫైనాన్స్‌కు 55 శాతం మేర వాటా ఉంది. బజాజ్ ఆటో కంపెనీ వాహన కొనుగోళ్లకు రుణాలిచ్చే కంపెనీ నుంచి విభిన్న వినియోగ రుణాలిచ్చే డైవర్సిఫైడ్ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ(ఎన్‌బీఎఫ్‌సీగా) బజాజ్ ఫైనాన్స్ ఎదిగింది. ప్రస్తుతం కన్సూమర్ డ్యూరబుల్ సెగ్మెంట్‌లో అగ్రస్థానంలో ఉంది. మొత్తం 3.44 కోట్ల మంది వినియోగదారులతో అత్యధిక వినియోగదారులున్న ఎన్‌బీఎఫ్‌సీ కంపెనీ ఇదే. గత ఆర్థిక సంవత్సరం(2018-19) నాలుగో త్రైమాసిక కాలంలో వినియోగం పరంగా మందగమనం చోటు చేసుకున్నా, ఈ కంపెనీ ఆర్థిక ఫలితాలు అంచనాలను మించాయి. నికర వడ్డీ ఆదాయం 50 శాతం ఎగసి రూ.3,395 కోట్లకు, మొత్తం ఆదాయం 52 శాతం వృద్ధితో రూ.5,308 కోట్లకు పెరిగాయి. నికర లాభం 50 శాతం ఎగసి రూ.1,176 కోట్లకు పెరిగింది. వినియోగం మందగమనంగా ఉన్నప్పటికీ ఈ కంపెనీ రుణనాణ్యత నిలకడగానే ఉంది. మొండి బకాయిలు చాలా స్వల్పంగానే పెరిగాయి. స్థూల మొండి బకాయిలు 1.54 శాతం, నికర మొండి బకాయిలు 0.63 శాతంగా ఉన్నాయి. ఐఎల్అండ్‌ఎఫ్ఎస్‌కు ఇచ్చిన రుణాలను పరిగణనలోకి తీసుకోకుంటే మొండి బకాయిలు వాస్తవానికి తగ్గాయి. సమస్యాత్మక సమయాల్లోనూ ఈ కంపెనీ తన మార్కెట్ వాటాను పెంచుకుంటోంది. రాబడి నిష్పత్తులు పటిష్టంగా ఉన్నాయి. రెండేళ్లలో నికర లాభం 40 శాతం చొప్పున చక్రగతిన వృద్ధి చెందగలదని భావిస్తున్నాం. ఆరు నెలల్లోనే ఈ షేర్ రూ.4,000 చేరగలదని అంచనా వేస్తున్నాం.

## హిందుస్తాన్ యూనిలీవర్ | బ్రోకరేజ్ సంస్థ: మోతిలాల్ ఓస్వాల్ | కొనొచ్చు



**ప్రస్తుత ధర:** రూ.1,825 **టార్గెట్ ధర:** రూ.2,070

**ఎందుకంటే:** ఈ కంపెనీ డిటర్జెంట్ అమ్మకాలు పెరుగుతున్నాయి. ఈ సెగ్మెంట్లో ప్రాక్టర్ అండ్ గ్యాంబుల్ (పీ అండ్ జీ) కంపెనీ నుంచి తీవ్రమైన పోటీనే ఎదురవుతోంది. గత కొన్నేళ్లుగా అంతంతమాత్రంగానే ఉన్న సబ్బుల విక్రయాలు గత ఆర్థిక సంవత్సరంలో పుంజుకున్నాయి. అలాగే కాస్మొటిక్స్ అండ్ టాయిలెటరీస్ (సీ అండ్ టీ) సెగ్మెంట్ అమ్మకాలు కూడా మెరుగుపడ్డాయి. ఇటీవల కాలంలో ఈ కంపెనీ ఆయుర్వేద ఉత్పత్తుల కంపెనీ ఇందులేఖను, ఆదిత్య ఐస్‌క్రీమ్‌ను, గ్లాక్సో స్మిత్ లైన్ కన్సూమర్ అండ్ హెల్త్(జీఎస్‌కేసీహెచ్)లను కొనుగోలు చేసింది. ఈ కొనుగోళ్ల కంపెనీకి ప్రయోజనం చేకూర్చాయి. ఈ వ్యాపారాల్లో తర్వాతి స్థాయి వృద్ధిని అందుకోవడానికి ప్రణాళికలు రూపొందిస్తోంది. మార్కెట్ అవసరాలకు తగ్గట్టుగా వేగంగా స్పందిస్తూ, తగిన ఉత్పత్తులను అందుబాటులోకి తెస్తోంది. భారత మార్కెట్లో పెరుగుతున్న ప్రీమియమ్ ఉత్పత్తుల వినియోగాన్ని అందిపుచ్చుకోవడానికి ఖరీదైన ఉత్పత్తులను కూడా అందిస్తోంది. వస్తువుల తయారీ, మార్కెటింగ్, ప్రమోషన్లలో టెక్నాలజీని విస్తృతంగా వినియోగించుకుంటోంది. ఈ కంపెనీ షేర్ విలువ అధికంగా ఉన్నప్పటికీ, నికర లాభ వృద్ధి ఆరోగ్యకరంగా ఉండటం, రాబడి నిష్పత్తులు కూడా అధికంగా ఉండటం సానుకూలాంశాలు. ఈ షేర్ ఏడాది కాలంలో రూ.2,070కు చేరుతుందని భావిస్తున్నాం.

**గమనిక:** ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

## కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 17-6-2019

| | |
|---|---|
| విశాఖ | 414-00 |
| చిత్తూరు | 443-00 |
| వరంగల్ | 393-00 |
| చెన్నై | 450-00 |
| ముంబై | 445-00 |
| విజయవాడ | 404-00 |
| నమక్కల్ | 430-00 |
| గోదావరి | 404-00 |
| **16-6-2019 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 390-00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 4.50 |
| బెంగళూరు | 440-00 |
| ఢిల్లీ | 367-00 |
| కోల్‌కతా | 443-00 |

# అమ్మకానికి పీఎన్‌బీ మొండిబాకీలు

**6 ఎన్‌పీఏల విక్రయానికి నోటీసులు**



**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) దాదాపు రూ. 1,000 కోట్ల మేర విలువ చేసే ఆరు మొండిబాకీలను (ఎన్‌పీఏ) విక్రయానికి ఉంచింది. వీటిలో వందన విద్యుత్, వీసా స్టీల్, టెంప్టేషన్ ఫుడ్స్, హీలియోస్ ఫొటోవోల్టెయిక్, క్యాబ్‌కామ్ కేబుల్స్, జూమ్ వల్లభ్ స్టీల్ ఉన్నాయి. అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీలు (ఏఆర్‌సీ), ఎన్‌బీఎఫ్‌సీలు, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు జూన్ 26లోగా బిడ్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఆ మరుసటి రోజున బిడ్లు తెరుస్తారని పీఎన్‌బీ ఒక నోటీసులో తెలిపింది. ఆరు ఎన్‌పీఏలకు రిజర్వ్ ధరను రూ. 342 కోట్లుగా నిర్ణయించినట్లు వివరించింది. అత్యధికంగా భోపాల్‌కు చెందిన వందన విద్యుత్ స్టీల్ రూ. 454 కోట్లు, కోల్‌కతా సంస్థ వీసా స్టీల్ రూ. 444 కోట్లు బాకీ పడ్డాయి. రూ. 14,000 కోట్ల నీరవ్ మోదీ స్కామ్ దెబ్బ నుంచి ఇంకా పూర్తిగా కోలుకోని పీఎన్‌బీ.. ప్రాధాన్యేతర అసెట్స్ విక్రయం, రైట్స్ ఇష్యూ మొదలైన మార్గాల్లో 2019-20లో రూ. 10,000 కోట్లు సమీకరించాలని యోచిస్తోంది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు నికరంగా రూ. 9,570 కోట్లు నష్టం ప్రకటించింది.

# రిలయన్స్ ఔట్.. ఫండ్స్‌పై ప్రభావం ఉంటుందా?

**Q & A**



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



**నేను, నా భార్య సీనియర్ సిటిజన్‌లం. మేం గత కొన్నేళ్లుగా నాలుగు మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నాం. అవి యాక్సిస్ లాంగ్‌టెర్మ్ ఈక్విటీ, ఫ్రాంక్లిన్ ఇండియా ట్యాక్స్‌షీల్డ్, ఐసీఐసీఐ ప్రు ఈక్విటీ అండ్ డెట్, సుందరమ్ మిడ్‌క్యాప్ ఫండ్. ఈ ఫండ్స్ ప్రస్తుతం మంచి పనితీరే కనబరుస్తున్నాయి. ఈ ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్స్‌ను కొనసాగించమంటారా ? వేరే ఫండ్స్‌లోకి మళ్లించమంటారా ? పన్ను ప్రయోజనాల కోసం ఇన్వెస్ట్ చేయాల్సిన అవసరం లేదు.**

*-సుందర్, విజయవాడ*

మీరు చెప్పిన వాటిల్లో మొదటి రెండు ఫండ్స్- యాక్సిస్ లాంగ్‌టెర్మ్ ఈక్విటీ, ఫ్రాంక్లిన్ ఇండియా ట్యాక్స్ షీల్డ్ ఫండ్స్... పన్ను ఆదా ఫండ్స్. వీటికి మూడేళ్ల లాక్-ఇన్ పీరియడ్ ఉంటుంది. మీకు పన్ను ఆదా కోసం ఇన్వెస్ట్ చేయాల్సిన అవసరం లేనప్పుడు ఈ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాల్సిన అవసరం లేదు. ఒక సీనియర్ సిటిజన్‌గా మీకు ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు డబ్బులు అవసరమవుతాయి. అందుకని మూడేళ్ల పాటు ఇన్వెస్ట్‌మెంట్స్‌ను తీసుకోకుండా ఉండే ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం అనవసరం కదా ! రిటైరైన వాళ్లకు, పన్ను ప్రయోజనాలు అవసరం లేనివాళ్లకు ఇన్వెస్ట్ చేయడానికి ఈ ఫండ్స్ సరైనవి కాదు. సాధారణంగా పెద్ద వయస్సు ఇన్వెస్టర్లు మార్కెట్లో భారీ పతనాలను తట్టుకోలేరు. కానీ మార్కెట్ నష్టపోతే, ఆ రిస్కును భరించడానికి మీరు మానసికంగా సిద్ధంగా ఉండాలి. బ్యాలన్స్‌డ్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేస్తే, మార్కెట్ పడిపోయినా, తగిన రక్షణ లభిస్తుంది. అందుకని మీ పోర్ట్‌ఫోలియోలో ఒకటి లేదా రెండు బ్యాలన్స్‌డ్ ఫండ్స్‌ను జత చేయండి.

**గత నాలుగేళ్లుగా రిలయన్స్ ట్యాక్స్ సేవర్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నాను. ఇప్పటివరకూ రూ. ఆరు లక్షల మేర ఇన్వెస్ట్ చేశాను. దీని విలువ ఇప్పుడు రూ.5.70 లక్షలుగా ఉంది. ఈ ఫండ్ రాబడులు సంతృప్తికరంగా లేకపోవడంతో దీంట్లో సిప్‌లను ఆపేసి మిరా ఫండ్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నాను. రిలయన్స్ కంపెనీ మ్యూచువల్ ఫండ్ వ్యాపారం నుంచి వైదొలగిందని వార్తలు వచ్చాయి. రిలయన్స్ సంస్థ మ్యూచువల్ ఫండ్ నుంచి వైదొలగడం సదరు ఫండ్‌పై ఏమైనా ప్రభావం ఉంటుందా ?**

*-జాహ్నవి, హైదరాబాద్*

జపాన్‌కు చెందిన నిప్పన్ సంస్థ ప్రవేశంతో కొన్నేళ్ల క్రితం రిలయన్స్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీగా ఉన్న కంపెనీ రిలయన్స్ నిప్పన్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీగా మారింది. ఆ తర్వాత ఈ కంపెనీ స్టాక్ మార్కెట్లో లిస్టయింది. ఇప్పుడు రిలయన్స్ సంస్థ, తన వాటాను నిప్పన్‌కు విక్రయించి మ్యూచువల్ ఫండ్ వ్యాపారం నుంచి వైదొలుగుతోంది. దీనికి సంబంధించిన ఒప్పందం ఇటీవలే కుదిరింది. ఇక ఈ వ్యాపారంలో పూర్తి నియంత్రణ నిప్పన్ కంపెనీకే ఉంటుంది. అయితే యాజమాన్యంలో మార్పు, చేర్పులు ఫండ్స్‌పనితీరుపై పెద్దగా ఉండకపోవచ్చు. అయితే రిలయన్స్ ట్యాక్స్ సేవర్ ఫండ్ పనితీరు ఏమంత సంతృప్తికరంగా లేదు. కేవలం పన్ను ఆదా ప్రయోజనాలే పరమావధిగా ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేస్తోంది. పన్ను ఆదా ఫండ్ అయినప్పటికీ, ఈ ఫండ్ పోర్ట్‌ఫోలియోలో అధికంగా స్మాల్, మిడ్ క్యాప్ కంపెనీల షేర్లే ఉన్నాయి. సాధారణంగా ఇలాంటి ఫండ్స్ కొంత కాలం తర్వాత మంచి రాబడులే ఇస్తాయి. అంతకు ముందటి కాలంలో మాత్రం పనితీరు అంతంతమాత్రంగానే ఉంటుంది. ఇక మీ విషయానికొస్తే, మీరు ఇప్పుడు చెయ్యగలిగిందేమీ లేదు. ఇది ట్యాక్స్ సేవింగ్ ఫండ్ కాబట్టి... మూడేళ్ల లాక్-ఇన్ పీరియడ్ ఉంటుంది. మీరు నాలుగేళ్లుగా ఈ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నారు. కాబట్టి మీరు మొదటి ఏడాది ఇన్వెస్ట్ చేసిన మొత్తాన్ని మాత్రమే వెనక్కి తీసుకోగలరు. మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను మొత్తాన్ని వెనక్కి తీసుకోవాలంటే మీరు మరో మూడేళ్లు ఆగాల్సి ఉంటుంది. అయితే అప్పటికల్లా ఈ ఫండ్ రాబడులు మరింతగా పెరిగే అవకాశాలే అధికంగా ఉన్నాయి.

**నేను సీనియర్ సిటిజన్‌ను. రెండు నుంచి మూడేళ్ల పాటు ఇన్వెస్ట్ చేయడానికి ఫ్రాంక్లిన్ ఇండియా షార్ట్-టెర్మ్ ఫండ్‌ను ఎంచుకున్నాను. రెండు నుంచి మూడేళ్ల కాలం పాటు ఇన్వెస్ట్ చేయడానికి ఈ ఫండ్‌ను ఎంచుకోవడం సరైనదేనా ?**

*-రియాజ్, విశాఖపట్టణం*

మీ ఎంపిక సరైనదే. ఈ ఫండ్ పనితీరు బాగానే ఉంది. ఫిక్స్‌డ్-ఇన్‌కమ్ సాధనాలకు సంబంధించిన ఫండ్స్ నిర్వహణలో ఫ్రాంక్లిన్ ఇండియా మ్యూచువల్ ఫండ్ సంస్థకు మంచి పేరే ఉంది. అయితే మీరు ఈ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్న మొత్తాన్ని రెండు భాగాలుగా చేయండి. కనీసం 60 శాతాన్ని ఈ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసి, మిగిలిన 40శాతాన్ని వేరే ఫండ్‌లో లేదా పోస్ట్ ఆఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్(పీఎమ్ఐఎస్), సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్(ఎస్‌సీఎస్ఎస్)లో ఇన్వెస్ట్ చేయవచ్చు. ఈ స్కీమ్‌ల్లో ఇన్వెస్ట్ చేయడం వల్ల మీరు భారత ప్రభుత్వానికే రుణం ఇచ్చినట్లవుతుంది. ఈ సాధనాల్లో ఇన్వెస్ట్ చేయడం వల్ల ఎలాంటి రిస్క్ ఉండదు. ఇవి పూర్తిగా సురక్షితం. ఒక వేళ వీటిల్లో ఇన్వెస్ట్‌మెంట్స్ పరిమితి మేరకు మీ ఇన్వెస్ట్‌మెంట్స్ పూర్తయితే, మీరు ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్న మొత్తాన్ని ఫిక్స్‌డ్-ఇన్‌కమ్ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయవచ్చు. మీరు ఎంచుకున్న ఫ్రాంక్లిన్ ఇండియా షార్ట్-టెర్మ్ ఇన్‌కమ్ ప్లాన్ మంచి నిర్ణయమేనని చెప్పవచ్చు.

# సెన్సెక్స్ కీలక మద్దతు 39,200 పాయింట్లు

**మార్కెట్ పంచాంగం**

అమెరికా....వివిధ దేశాలతో జరుపుతున్న వాణిజ్య యుద్ధాలతో అంతర్జాతీయ మార్కెట్లు ఒడిదుడుకులకు లోనవుతూ ఉండగా, ఈ అంశానికి తోడు ఎన్‌బీఎఫ్‌సీల లిక్విడిటీ సంక్షోభం, కార్పొరేట్ డిఫాల్ట్‌లు, కార్పొరేట్ దుర్వినియోగాలతో దేశీయ సూచీలు గరిష్ట స్థాయిల వద్ద అమ్మకాల ఒత్తిడికి లోనవుతున్నాయి. కానీ, మరో రెండు వారాల్లో కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలు పార్లమెంట్ ముందుకు రానున్న నేపథ్యంలో బడ్జెట్ ర్యాలీకి బీజం పడుతుందో ? లేక అంతర్జాతీయ, దేశీయ ప్రతికూలాంశాలకు మార్కెట్ తలొగ్గుతుందో ?... చూడాల్సి ఉంది. ఇక సూచీల సాంకేతికాంశాల విషయానికొస్తే...,

**సెన్సెక్స్ సాంకేతికాంశాలు...**




జూన్ 14తో ముగిసిన వారంలో 700 పాయింట్ల శ్రేణిలో హెచ్చుతగ్గులకు లోనైన బీఎస్ఈ సెన్సెక్స్ చివరకు అంత క్రితం వారంతో పోల్చితే, 164 పాయింట్ల నష్టంతో 39,452 పాయింట్ల వద్ద ముగిసింది. 14 ట్రేడింగ్ సెషన్ల నుంచి కేవలం 3 శాతం శ్రేణిలో ఒడిదుడుకులకు లోనవుతున్న సెన్సెక్స్ త్వరలో ఈ శ్రేణి నుంచి బయటపడే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఈ వారం సెన్సెక్స్‌కు తొలుత లభించబోయే 39,280 పాయింట్ల మద్దతు స్థాయి కీలకం. ఈ స్థాయిని కోల్పోతే, డౌన్ ట్రెండ్ మొదలై 38,825 పాయింట్ల వద్దకు తగ్గవచ్చు. ఈ లోపున 38,570 పాయింట్లకు పతనం కావచ్చు. ఈ వారం తొలుత మద్దతు స్థాయిని పరిరక్షించుకుంటే, 39,800 పాయింట్ల వద్దకు చేరవచ్చు. అటుపై 40,060 పాయింట్ల స్థాయిని అందుకోవచ్చు. ఆపైన 40.320 పాయింట్ల వరకూ పెరగవచ్చు.

**నిఫ్టీ కీలక మద్దతు 11,760 పాయింట్లు**




గత వారం 11,962-11,797 పాయింట్ల శ్రేణిలో గరిష్ట, కనిష్ట స్థాయిల మధ్య హెచ్చుతగ్గులకు లోనైన ఎన్ఎస్ఈ నిఫ్టీ చివరకు అంత క్రితం వారంతో పోల్చితే 48 పాయింట్ల నష్టంతో 11,823 పాయింట్ల వద్ద ముగిసింది. గత 14 ట్రేడింగ్ సెషన్ల నుంచి 12,040-11,760 పాయింట్ల మధ్య ఊగిసలాడుతున్న నిఫ్టీ.... ఈ శ్రేణిని ఎటువైపు ఛేదిస్తే అటు వైపు ప్రయాణించవచ్చు. ఈ వారం నిఫ్టీకి 11,760 పాయింట్ల వద్ద లభించబోయే తొలి మద్దతు స్థాయి కీలకం. ఈ స్థాయిని వదులుకుంటే, వేగంగా 11,655 పాయింట్ల స్థాయికి పడిపోవచ్చు. ఈ స్థాయిని కూడా కోల్పోతే, 11,615 వద్దకు పతనం కావచ్చు. ఈ వారం తొలి మద్దతు స్థాయిని పరిరక్షించుకుంటే, 11,910 వద్దకు పెరగవచ్చు. అటుపైన 11,960 పాయింట్ల స్థాయిని అందుకోవచ్చు. ఈ స్థాయి పైన ముగిస్తే, 12,100 పాయింట్లకు పెరగవచ్చు.

– పి. సత్యప్రసాద్

# ‘షేర్’ ఖాన్‌లు జాగ్రత్త!

ఒడిశా, బిహార్, జార్ఖండ్ నుంచి 500 మంది బిచ్చగాళ్ల వేషంలో బయల్దేరారు. వీరు చిన్నారులను చంపి వారి అవయవాలను మెడికల్ కాలేజీలకు విక్రయిస్తున్నారు అంటూ కొన్ని పోస్టులు, ఫొటోలు కొంతకాలంగా వాట్సాప్ గ్రూపుల్లో కలకలం రేపుతున్నాయి.

మీ ప్రాంతంలో నరమాంస భక్షకులు యాచకుల రూపంలో సంచరిస్తున్నారంటూ, మనిషి మాంసం కాల్చి తింటున్నారంటూ మరోపోస్టు కూడా వైరల్‌గా మారుతోంది.

## కిడ్నాప్ ముఠాలు సంచరిస్తున్నాయంటూ తప్పుడు ప్రచారం

**ఎడాపెడా ఫేక్ న్యూస్ వైరల్ చేస్తే జైలే**

**యాచకులు, చిల్లర వ్యాపారులకు ప్రాణాంతకంగా మారిన పోస్టులు**

**ఇప్పటికే పలువురిపై కేసులు నమోదు**

**ఫేక్ న్యూస్‌పై అప్రమత్తంగా ఉండాలని డీజీపీ వినతి**

సాక్షి, హైదరాబాద్

వాస్తవానికి ఈ పోస్టుల్లోని ఫొటోలేవీ మనదేశానికి సంబంధించినవి కావు. కేవలం ప్రజల్లో భయాందోళనలు కలిగించడానికి కొందరు ఆకతాయిలు వాటికి స్థానికత రంగు పులిమి సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. వీటిపై అవగాహన లేక చాలామంది ఎడాపెడా వాటిని వైరల్ చేస్తున్నారు. ఫలితంగా ప్రజల్లో అభద్రతాభావం పెరిగిపోతోంది. ముఖ్యంగా గ్రామాల్లో ఎవరు కొత్తవారు కనబడినా.. ఈ పోస్టుల పుణ్యమాని వారిని అనుమానించాల్సిన పరిస్థితి. అదీ చీకటి పడ్డాక ఎవరు చిన్నారులను పలకరించినా.. వారిని కిడ్నాపర్లుగా భ్రమించి ఎడాపెడా చితకబాదే ప్రమాదాలు పుష్కలంగా ఉన్నాయి. రెండేళ్ల క్రితం ఇలాగే మూకహత్యలు దేశవ్యాప్తంగా కలకలం రేపాయి.

**ఎక్కడి ఫొటోలతోనో.. ఇక్కడ దుష్ప్రచారం**

వాస్తవానికి ఆ పోస్టులకు మనదేశానికి ఎలాంటి సంబంధం లేదు. బిచ్చగాళ్ల ఫొటో కర్ణాటకలో కొందరు దొంగలను ప్రజలు పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఫొటోలు. మరికొన్ని 2017లో బ్రెజిల్ జైల్లో జరిగిన అల్లర్లకు సంబంధించినవి. ఇంకొన్ని థాయ్‌లాండ్, ఫిలిప్పీన్స్ లాంటి ఆగ్నేయాసియా దేశాల్లో జరిగిన సామూహిక హత్యలకు సంబంధించిన పాత చిత్రాలు. ఇలాంటి పోస్టుల ఫలితంగా బిచ్చగాళ్లకు భద్రత లేకుండా పోతోంది. ఊరూరా తిరిగి వస్తువులు అమ్ముకుని బతికే చిల్లర వ్యాపారులను కిడ్నాపర్లుగా భావించి జనాలు కొట్టి చంపే ప్రమాదముంది. మరోవైపు మనదేశానికి ఐరోపా, అమెరికా తదితర దేశాల నుంచి వచ్చే యాత్రికుల ప్రాణాలకూ ముప్పు పొంచి ఉంది. ఎక్కడో ఎవరో మహిళ గాయపడితే.. పాతబస్తీలో ఫలానా వర్గంపై దాడి చేశారంటూ కూడా ఫొటోలు వైరల్ చేస్తూ కొన్ని వర్గాల మధ్య చిచ్చుపెట్టి, శాంతి భద్రతల సమస్యలు సృష్టించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను పోలీసులు ఎప్పటికప్పుడు గుర్తిస్తూనే ఉన్నారు. ఇప్పుడు మళ్లీ అలాంటి పోస్టులే తెలంగాణలో కనిపించే సరికి పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇలాంటి పోస్టులు వైరల్ చేస్తున్నవారిపై ఇప్పటికే కేసులు నమోదయ్యాయి. ఇలాంటి పోస్టులు పెట్టే గ్రూప్ అడ్మిన్లపై చర్యలు తీసుకుంటామని తెలంగాణ డీజీపీ కార్యాలయం ఇప్పటికే స్పష్టం చేసింది.



### ఈ జాగ్రత్తలు పాటించండి..

1. గ్రూపులో ఇలాంటి పోస్టులు పెట్టవద్దని హెచ్చరించండి. అయినా పోస్టులు పెడితే.. వారిపై మీరే పోలీసులకు సమాచారం ఇవ్వండి.
2. ఫేక్‌న్యూస్‌ను గుర్తించేందుకు గూగుల్‌లో ఆప్షన్ ఉంది. మనకు వచ్చిన పోస్టు లేదా ఫొటోను గూగుల్‌లో అప్‌లోడ్ చేసి సెర్చ్‌చేస్తే.. దాన్ని తొలుత ఎవరు.. ఎక్కడ నుంచి పోస్టు చేశారు? తదితర విషయాలన్నీ ఇట్టే తెలిసిపోతాయి.
3. ఓ మతాన్ని లేదా వర్గాన్ని కించపరిచేలా, అగౌరవ పరిచేలా వచ్చే పోస్టులను చూసిన వెంటనే షేర్ చేయవద్దు. అది పోలీసులు నేరంగా పరిగణిస్తారు.
4. వచ్చిన పోస్టు, ఫొటో కొత్తదా పాతదా అన్నది కచ్చితంగా నిర్ధారించుకోవాలి. ఎందుకంటే 24 గంటల న్యూస్‌చానళ్లు, వెబ్‌చానళ్లు, న్యూస్‌యాప్స్ వచ్చిన ఈ రోజుల్లో అందులో కాకుండా పోస్టుల రూపంలో ఎలాంటి కొత్త వార్తలూ రావని తెలుసుకోవాలి.
5. పోస్టుల్లో ఉండే విదేశీయుల్ని కూడా సులభంగా గుర్తు పట్టవచ్చు. ఆగ్నేయాసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా ప్రజలు మనదేశంలోకి రావడం, హత్యలకు పాల్పడటం అంత సులువు కాదు. కాబట్టి వారిని గుర్తించగానే ఇలాంటి పోస్టులను షేర్ చేయకుండా వదిలేయడమే మంచిది.

## హీరో శర్వానంద్‌కు గాయాలు

**హైదరాబాద్‌లోని సన్‌షైన్ ఆస్పత్రిలో చికిత్స**



హైదరాబాద్: టాలీవుడ్ హీరో శర్వానంద్ షూటింగ్‌లో తీవ్రంగా గాయపడ్డారు. 96 పేరుతో తెరకెక్కుతున్న సినిమాకు సంబంధించిన షూటింగ్ థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో జరుగుతోంది. ఈ షూటింగ్‌లో శర్వానంద్ ఓ రిస్కీ షాట్‌లో డూప్ లేకుండా నటిస్తుండగా అదుపుతప్పి కిందపడిపోయారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం ఆయనను ఆదివారం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స నిమిత్తం నగరంలోని సన్‌షైన్ ఆస్పత్రిలో చేర్పించగా ఆయనకు భుజం జారిపోయిందని ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఆయనకు మంగళవారం శస్త్రచికిత్స చేయనున్నట్లు చెప్పారు.

## కార్పొరేట్ ఆస్పత్రులు సేవా దృక్పథంతో ముందుకెళ్లాలి: కిషన్‌రెడ్డి

హైదరాబాద్: కార్పొరేట్ ఆస్పత్రులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం దోమలగూడలోని సాధురాం కంటి ఆస్పత్రి 45వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో నాణ్యమైన వైద్యం లభిస్తుండటంతో చికిత్స కోసం విదేశాల నుంచి సైతం రోగులు వస్తున్నారని చెప్పారు. అయితే వైద్యం ఖరీదైపోయిందనే విమర్శలు రాకుండా చూడాలని కార్పొరేట్ ఆస్పత్రులకు విజ్ఞప్తి చేశారు. సాధురాం ఆస్పత్రి విస్తరణకు నగరంలో భూమిని కేటాయించాలని సీఎం కేసీఆర్‌కు లేఖ రాస్తానని చెప్పారు. గుండెలో రంధ్రంతో బాధపడుతున్న పిల్లల కోసం తాను చేసిన పోరాటాన్ని చూసి, దివంగత సీఎం వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. సేవాభావంతో పేదలకు కంటి చూపును అందిస్తున్న ఆస్పత్రిని విస్తరించేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలంగాణ ప్రభుత్వ హోం శాఖ కార్యదర్శి రాజీవ్ త్రివేది చెప్పారు. లయన్స్ క్లబ్ సహకారంతో సాధురాం ఆస్పత్రి నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆస్పత్రి చైర్మన్ వెంకటాచలం తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు సురేశ్ కుమార్, ప్రీతీశ్ జైన్ అగర్వాల్, ఆస్పత్రి నిర్వాహకులు గురుచరణ్, జగదీశ్ సత్ దాసానీ పాల్గొన్నారు.

**‘ఏకీకృతం’పై టీపీయూఎస్ విజ్ఞప్తి**

ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్ అమలు కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి కిషన్‌రెడ్డికి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు టీపీయూఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి హన్మంతరావు నేతృత్వంలోని ప్రతినిధుల బృందం ఆదివారం హైదరాబాద్‌లో కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రం తరపున సుప్రీంకోర్టులో సర్వీసు నిబంధనల పట్ల అవగాహన కలిగిన సీనియర్ న్యాయవాదిని నియమించి మెజారిటీ ఉపాధ్యాయులకు అనుకూలంగా చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రపతి చేసిన సవరణకు సార్థకత చేకూర్చేలా చూడాలని విన్నవించారు. అలాగే ఉపాధ్యాయుల పదోన్నతులపై తెలంగాణ ప్రభుత్వానికి తగిన సూచనలు చేయాలని విన్నవించారు.

## అవసరాలకు అనుగుణంగా విద్యా విధానంలో మార్పులుండాలి

**విద్యావేత్త చుక్కా రామయ్య**

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేలా నూతన విద్యా విధానంలో అవసరమైన మార్పులు తీసుకురావాలని ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య అన్నారు. కేంద్రం ప్రకటించిన నూతన విద్యా విధానం ముసాయిదాపై ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల సంఘం (ట్రస్మా) ఆధ్వర్యంలో చర్చా కార్యక్రమం నిర్వహించారు. రామయ్య మాట్లాడుతూ.. ప్రస్తుత విద్యా విధానంలోని లోపాలను సవరించి, సమాజ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేలా నూతన విద్యా విధానం ఉండాలన్నారు. కస్తూరి రంగన్ కమిటీ ప్రతిపాదించిన విద్యా విధానంలో ప్రాంతీయ అవసరాలకు అనుగుణంగా మార్పులు తీసుకురావాలని పాఠశాల విద్య కమిషనర్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు.

## ఆ తేదీని ‘విద్యార్థుల దినోత్సవం’గా పరిగణించాలి: రాపోలు

సాక్షి, న్యూఢిల్లీ: భారత మాజీ రాష్ట్రపతి, మిసైల్ మ్యాన్ డా.ఏపీజే అబ్దుల్ కలాం జన్మదినమైన అక్టోబర్ 15ను జాతీయ విద్యార్థుల దినోత్సవంగా గుర్తించాలని మాజీ ఎంపీ రాపోలు ఆనందభాస్కర్ కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి రమేశ్ పొఖ్రియల్‌కు లేఖ రాశారు. యూఎన్‌ఓ ఇప్పటికే కలాం జన్మదినాన్ని ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా గుర్తించిందని గుర్తు చేశారు.

## వృద్ధ దంపతుల దారుణ హత్య

అనంతగిరి: వికారాబాద్ జిల్లా కేంద్రం సమీపంలోని అనంతగిరిగుట్ట అడవుల్లో వృద్ధ దంపతుల మృతదేహాలు కలకలం రేపాయి. ధారూరు సీఐ దాసు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు సమీపంలో ఉన్న నందిగామ గ్రామానికి చెందిన నవరతన్‌రెడ్డి (76), భార్య స్నేహలతారెడ్డి (72)కి కర్ణాటకలోని హుమ్నాబాద్‌లో 60 ఎకరాల వ్యవసాయ పొలం ఉంది. వీరు అప్పుడప్పుడూ అక్కడకు వెళ్లి వస్తుంటారు. ఇదిలా ఉండగా ఈనెల 14న వీరు అదృశ్యమైనట్లు హుమ్నాబాద్ పీఎస్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. ఆదివారం మధ్యాహ్నం సమయంలో అనంతగిరి గుట్ట కెరెల్లి ఘాట్ రోడ్డు పక్కన పొదల్లో ఓ శవం ఉండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న క్రమంలో మరో శవం కనిపించింది. అయితే అప్పటికే మిస్సింగ్ కేసుపై దృష్టి సారించిన హుమ్నాబాద్ పోలీసులు అదృశ్యమైన వృద్ధ దంపతుల టెంపరరీ కారు డ్రైవర్ సతీశ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ నేపథ్యంలో అసలు విషయం బయటపడింది. మృతుల నగలు, డబ్బుపై కన్నేసిన కారు డ్రైవర్ సతీశ్.. వీరిని హతమార్చాలని పథకం వేశాడు. ఈ క్రమంలో గత 12వ తేదీన హైదరాబాద్ నుంచి హుమ్నాబాద్ వెళ్తున్న క్రమంలో తన స్నేహితుడు రాహుల్ సహాయంతో కారులోనే ఇద్దరినీ హతమార్చారు. శవాలను అనంతగిరి అడవుల్లో పడేశారు.

# ఆదివాసీలకు అండగా హైకోర్టు

- పునరావాస చర్యలు తీసుకునే వరకూ వసతి కల్పించాలి
- ఆరు నెలల్లోగా వారికి భూమి కేటాయించాలి
- సౌకర్యాలు కల్పించకుండా తరలింపుపై ఆగ్రహం
- ప్రభుత్వ హామీలను నమోదు చేసుకున్న హైకోర్టు



హైకోర్టు ఎదుట హాజరుపర్చేందుకు గిరిజనులను తీసుకువస్తున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్: కొమురం భీమ్ జిల్లా కాగజ్‌నగర్ మండలం కొలంగొండి గ్రామానికి చెందిన 67 మంది ఆదివాసీలను పునరావాస చర్యలు తీసుకోకుండానే అటవీ ప్రాంతం నుంచి బలవంతంగా తరలించడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. హైకోర్టు ఆదేశాల మేరకు 67 మందికి చెందిన 16 కుటుంబాల పెద్దలను అటవీ అధికారులు ధర్మాసనం ఎదుట ఆదివారం సాయంత్రం 5 గంటలకు ప్రవేశపెట్టారు. ప్రభుత్వం పునరావాసం కల్పిస్తామన్న హామీల్ని నమోదు చేసిన ధర్మాసనం వాటి అమలుకు ఉత్తర్వులు జారీ చేసింది. వాకెండిలోని ప్రభుత్వ వసతి గృహంలో 67 మంది ఆదివాసీలకు వసతి కల్పించేందుకు జిల్లా కలెక్టర్ ఏర్పాట్లు చేయాలి. ఏడాదిలోగా వారందరికీ శాశ్వత వసతి గృహాల్ని నిర్మించి ఇవ్వాలి. ప్రభుత్వం గుర్తించిన 91 ఎకరాల్ని ఆరు నెలల్లోగా బాధితులు 67 మందికి కేటాయించాలి. భూములు సాగు చేసుకునేందుకు వీలుగా ఇరిగేషన్ శాఖ బోర్లు ఇతర వసతులు కల్పించాలి. బాధితుల పశువుల్ని తిరిగి ఇచ్చేందుకు ఐటీడీఏ అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇవన్నీ అమలుచేసే వరకూ బాధితులకు ఆహారం, తాగునీరు, విద్య, వైద్యం, గర్భిణీలకు ప్రత్యేక వసతులు కల్పించాలి. అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలి.. అని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

**గోడు వెళ్లబోసుకున్న ఆదివాసీలు**

ఆదివాసీలను అక్రమంగా నిర్బంధించారంటూ తెలంగాణ పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ శనివారం హౌస్ మోషన్ పిటిషన్‌ను దాఖలు చేసిన విషయం విదితమే. హైకోర్టు ఆదేశాల మేరకు 16 మంది కుటుంబ పెద్దలను ఆదివారం సాయంత్రం 5 గంటలకు పర్యాటక శాఖ బస్సుల్లో తీసుకువచ్చి న్యాయమూర్తుల ఎదుట హాజరుపర్చారు. ఆదివాసీయులు చెప్పే సాక్ష్యాలను అనువాదం చేసేందుకు ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు, ప్రొఫెసర్ జి.మనోజ కూడా విచారణకు హాజరయ్యారు. పిటిషనర్ల తరపున న్యాయవాది వి.రఘునాథ్ వాదించారు. ధర్మాసనం ఎదుట.. ఆదివాసీ పెద్దల్లోని ఆత్రం భీము, సిడెం పువా అనే ఇద్దరు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. ‘ఈనెల 12న తాము పూజ చేసేందుకు వెళ్లినప్పుడు అటవీ అధికారులు వచ్చి గూడెంలోని మా గుడిసెల్ని కూల్చేశారు. పశువుల పాకల్ని కూడా పీకేశారు. మమ్మల్ని వేంపల్లి ఫారెస్ట్ డిపోలో పెట్టారు. అక్కడేమీ వసతులు లేవు. తాగేందుకు నీరు, తిండికి కూడా ఇబ్బంది పడ్డాం’అని చెప్పారు. జస్టిస్ షమీమ్ అక్తర్ వాటిని ఇంగ్లిష్‌లోకి అనువదించి ఏసీజేకు తెలిపారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. వారిని మనుషులను కుంటున్నారా.. పశువుల్ని చూసినట్టు చూస్తారా.. అని వ్యాఖ్యానించింది.

దీనిపై ప్రభుత్వ న్యాయవాదులు శ్రీకాంత్, మనోజ్ మాట్లాడుతూ, వారు మహారాష్ట్ర నుంచి వచ్చి రిజర్వ్‌డ్ ఫారెస్ట్‌ను ఆక్రమించుకున్నారని, వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా అటవీ ప్రాంతం నుంచి అందరినీ ఖాళీ చేయించామని చెప్పారు. పునరావాస చర్యలు ప్రారంభించామని, హైకోర్టు ఆదేశాల మేరకు పునరావాసం కల్పించే వరకూ వారందరికీ వసతి, ఇతర ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. ఆక్రమణదారులను తొలగించాలన్నా చట్ట ప్రకారం చేయాలని, పునరావాసం కల్పించకుండానే వారందరినీ అక్కడి నుంచి తరలించడం సబబు కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. ఫారెస్ట్ డిపోలో వారిని పెడితే ఎలాగని, మానవహక్కుల ఉల్లంఘన అవుతుందని, బాధితులకు అన్ని పునరావాస చర్యలు తీసుకునే వరకూ ప్రభుత్వం వసతి, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. తాము జారీ చేసిన ఉత్తర్వులను ప్రభుత్వం అమలు చేయకపోతే బాధితులు 67 మందిలో ఎవరైనాగానీ లేదా పిటిషనర్లుగానీ, వారి న్యాయవాదిగానీ కోర్టు ధిక్కార వ్యాజ్యాన్ని దాఖలు చేసుకోవచ్చుననే వెసులుబాటు కల్పిస్తున్నామని ప్రకటించిన ధర్మాసనం, వ్యాజ్యంపై విచారణ ముగిసినట్లు తెలిపింది.

TVS
అన్నిటికన్నా సన్మానితమైన మోటర్ సైకిల్ స్వంతం చేసుకోండి
J.D. పవర్* విజేతా అన్నటికిన్నా ప్రతిష్ఠాత్మకమైన ఆటోమొబైల్ పురస్కారం!



TVS Radeon | StaR City+ | TVS Sport | TVS Victor

₹4,999/-** తక్కువ డౌన్ పేమెంట్ | 3.99%** వడ్డీ రేటు | పరిశ్రమలో మొదటిసారి, ₹6,360/-** వరకు ఆదా | Paytm Cashback వరకూ లాభం ₹7,000^ | ₹42,572/-# నుండి ప్రారంభం

**Finance at the sole discretion of the financier. Schemes cannot be clubbed. #Ex-showroom price Telangana of TVS Sport KS Spoke BS IV variant. *JD Power APEAL Award 2019 for Economy Motorcycle- TVS Victor, TVS Sport and TVS StaR City+. For more details on the award, please visit https://indiajdpower.com. ^ Paytm offer valid till 30th June 2019. Terms & conditions apply.

FOR ALL INSTITUTIONAL/BULK REQUIREMENTS PLEASE MAIL corporate.customersupport@tvsmotor.com తెలంగాణ అథరైజ్డ్ మెయిన్ డీలర్స్: ఆదర్శ టీవీఎస్, కరీంనగర్: 9870261378, ఆదర్శ టీవీఎస్, జగిత్యాల్ రోడ్: 8106505757, తిరుమల టీవీఎస్, గోదావరిఖని: 9870261768, వినయ్ టీవీఎస్, నిర్మల్: 9870261738, వినయ్ టీవీఎస్, మంచిర్యాల: 9870262747, విజయ్ టీవీఎస్, ఆదిలాబాద్: 9870260647, రాజా టీవీఎస్, వరంగల్: 9870262717, రంగరాయ టీవీఎస్, వరంగల్: 9870262499, ఆదర్శ టీవీఎస్, హానంకొండ: 9870262575, లక్ష్మీ టీవీఎస్, నిజామాబాదు: 9870260660, లక్ష్మీ టీవీఎస్, ఆర్మూర్ రోడ్, నిజామాబాదు: 9870261880, లక్ష్మీ టీవీఎస్, బోధన్: 9821592327, శ్రీ సాయి శ్రీనివాస టీవీఎస్, కామారెడ్డి: 9870260524, శ్రీ సాయి శ్రీనివాస టీవీఎస్, ఆర్మూర్: 9870261351, రంగ రాయ టీవీఎస్, ఖమ్మం: 9870262375, రంగ రాయ టీవీఎస్, కొత్తగూడం: 9870262731, ఇందుబాల టీవీఎస్, కోదాడ: 9870263043, ఎల్ సిజిని టీవీఎస్, మిర్యాలగూడ: 9870263051, శ్రీ ఎల్ వి టీవీఎస్, నల్గొండ: 9870262988, శ్రీ ఎల్ వి టీవీఎస్, డీవీకె రోడ్: 9870262307, శ్రీ ఎల్ వి టీవీఎస్, భువనగిరి: 9069139151, శ్రీ రామ టీవీఎస్, మహబూబ్ నగర్: 9069138235, శ్రీ రామ టీవీఎస్, బూత్‌పూర్ రోడ్: 9821597045, శ్రీ రామ టీవీఎస్ జడ్చర్ల: 9069138250, వెంకటేష్ టీవీఎస్, గద్వాల్: 9069138240, అంజలి టీవీఎస్, వనపర్తి: 9870259780.

McCann/Blr/Tvs/625/06/19

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792